సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 282

శుక్రవారం 2-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

బాలికలు, మహిళల కోసం 'స్టాండ్‌ఫర్‌షీ' సంస్థను చిన్న వయసులోనే స్థాపించిన అర్చన కర్నాటక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి బాలికల మరుగుదొడ్లు, మంచినీటి కోసం 100 కోట్లు విడుదల చేయించింది. 2025లో గిరిజనుల విద్య, సంస్కృతి కోసం విశేషంగా పని చేసింది. 'మార్పు రావాలి. మార్పు మొదలవ్వాలి' అనే అర్చన... దారి చూపాలే గానీ యువత, స్త్రీలు మార్పు కోసం గొప్ప ఉద్యమాలు నిర్మించగలరని అంటోంది.

● ఛేంజ్ మేకర్

మొదటి అడుగు మార్పుకే

'ప్రభుత్వాలు సర్కారు బడులలో పారిశుద్ధ్యానికి నిధులు విడుదల చేస్తాయి. అవి ఎలా ఖర్చవుతున్నాయో ఎవరు చెక్ చేస్తారు? ప్రజలో, తల్లిదండ్రులో పూనుకుని చెక్ చేస్తే ఒక భయం ఉంటుంది. లేకుంటే ప్రభుత్వ బడులలో టాయిలెట్ల పరిస్థితి ఎప్పటికీ మారదు' అంటుంది అర్చన కెఆర్.

2020 నుంచి కర్నాటక ప్రభుత్వ బడుల్లో ఆడపిల్లల కోసం రావలసిన మార్పుకై పోరాడుతున్న అర్చన చాలా సాధించింది గానీ బదులుగా సవాళ్లు ఎదుర్కొంది. 'నేను ఎంతసేపటికీ టాయిలెట్ల కోసం పని చేస్తున్నానని పెళ్లి సంబంధాలు వెనకడుగు వేశాయి' అంటుందీ 35 ఏళ్ల సామాజిక కార్యకర్త.

అయినా ఆమె పోరాటం ఏమీ ఆపలేదు. అసలు పోరాటం చేయాల్సిన విషయాలు చాలా ఉన్నాయని ఆమె మాటల వల్ల తెలుస్తూనే ఉంటుంది. 'పిల్లలంటే ఎందుకు మనందరికీ చిన్న చూపు. ప్రభుత్వ బడులలో, హాస్టళ్లలో వాళ్లు కనీస సౌకర్యాలు లేకుండా ఉంటే మనకు ఎలా మనసొప్పుతుంది' అడుగుతోంది అర్చన. నిజమే. ఎంతో సంపద ఉన్న రాష్ట్రాలలో కూడా చలికాలం చన్నీటి స్నానాలు చేసే పిల్లలు ఎందరో ఉన్నారు ప్రభుత్వ హాస్టళ్లలో. 'వెచ్చని దుప్పటి... వేడినీళ్లు ఈ పిల్లల హక్కు' అని నినదించే వారు అర్చనలా ఎంతమంది.

'జీవితంలో ఆ బాధ అనుభవిస్తేనే తెలుస్తుంది' అంటుంది అర్చన.

■ చెట్టే చాటుగా...

అర్చనది కర్నాటక హసన్ జిల్లాలోని సకలేష్‌పూర్. ఈ ప్రాంతం పశ్చిమ కనుమల్లోకి వస్తుంది. ఇక్కడంతా గిరిజన జీవితం. మరుగుదొడ్లు అనేవే వారికి తెలియవు. తెలియనివ్వలేదు. 'మరుగుదొడ్డి ఎలా ఉంటుందో నేను నా పద్నాలుగో ఏట చూశాను. మా నాన్న సకలేష్‌పూర్ వెటర్నరీ ఆస్పత్రిలో అసిస్టెంట్‌గా చేసేవాడు. ఆయనతోపాటు వెళ్లినప్పుడు అక్కడ టాయిలెట్ మొదటిసారి చూశాను' అంటుంది అర్చన. చెప్పుల్లేని నడక, కొబ్బరి చిప్పలో టీపోసి ఇస్తే తాగక తప్పని వివక్ష... ఇవన్నీ చూసిన అర్చన సోషల్‌వర్క్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలని నిశ్చయించుకుంది. బెంగళూరులో ఆ చదువు ముగించాక ఒక ఎన్‌జీఓ స్టడీ కోసం ప్రభుత్వ బడులను చూస్తున్నప్పుడు అక్కడి అమ్మాయిలు ఒక్క టాయిలెట్ కూడా లేకుండా అవస్థలు పడటం ఆమెకు తెలిసి వచ్చింది. 'వారిలో నన్ను నేను చూసుకున్నాను. వారంతా నీళ్లు తాగడమే మానేశారు' అని చెప్పిందామె. కొంత కాలం ఈ స్టడీ చేసి ఇక యాక్టివిస్ట్‌గా మారక తప్పదని రంగంలోకి దిగింది అర్చన.

■ స్టాండ్ ఫర్ షీ

అర్చన స్టాండ్‌ఫర్‌షీ అనే ఎన్‌జీఓను స్థాపించి 2000 సంవత్సరం నుంచి హసన్ జిల్లాలో ప్రభుత్వ బడులలో టాయిలెట్లు ఎలా ఉన్నాయో ప్రచారంలో పెట్టింది. ఒక్కో టాయిలెట్ పరిస్థితి సోషల్ మీడియాలో చూసి జనం కూడా ఆశ్చర్యపోవడం మొదలుపెట్టారు. ప్రభుత్వం బెంబేలెత్తింది. చివరకు 2021లో అర్చన ఒత్తిడి వల్ల ఏకంగా 100 కోట్లు కేవలం టాయిలెట్ల పునరుద్ధరణకు ప్రభుత్వం విడుదల చేసింది. ఇది అర్చన విజయం.

■ శానిటరీ వేస్ట్

గ్రామీణ, గిరిజన బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ ఎలా వాడాలి, వాడవలసిన అవసరం ఏమిటి, వాడాక వాటిని ఎలా డిస్పోజ్ చేయాలి... ఇవన్నీ ఏమీ తెలియకపోవడం వల్ల స్వీయ శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత ఉండటం లేదు. 'దీని గురించి ప్రచారం చేయడానికి శానిటరీ స్క్వాడ్స్‌ను తయారు చేశాము. వీళ్లు బడులకు తిరిగి బాలికలకు అవగాహన కలిగిస్తారు' అని చెప్పింది అర్చన. 2025లో వేల మంది బాలికలకు తగిన చైతన్యం అర్చన స్క్వాడ్స్ వల్ల దొరికింది.

■ ఉద్యమిస్తేనే మార్పు

'మన దేశంలో స్త్రీలు, యువత గొప్ప ప్రతిఘటన శక్తి కలిగిన వారు. వారిని సరిగ్గా ఆర్గనైజ్ చేస్తే ప్రజా సమస్యల మీద గొప్ప ఉద్యమాలు లేవనెత్తగలరు. కోర్టుల్లో పిటిషన్ వేసినా గొప్ప మార్పు రాగలదని చాలామందికి తెలియదు. పదిమంది సంతకాలకు కూడా విలువ ఉంటుంది. సామాజిక కార్యకర్తలుగా ప్రజలకు మనం దిశను ఇవ్వాలి. ప్రజల కోసం పని చేయాలి. మనలో మార్పు వస్తేనే వారిలో మార్పు తేగలం' అంటుంది అర్చన. ఏ సమస్య మీదైతే పోరాడాలో ముందు దాని డేటాను తెలుసుకుని, దాని ఆధారంగా పరిశోధన జరిపి, సమస్యను ప్రజలకు వివరిస్తే ఉద్యమం అదే మొదలవుతుందని అంటుందామె. ●

పాల నురగ తెల్లదనం
వెండి వెన్నెల చక్కదనం
మెరిసే మేఘమాలల మృదుత్వంతో
అందరి మనసులను దోచుకునేలా
సరికొత్తగా కనువిందు చేస్తోంది
తెల్లని తెలుపుతో...
వింటేజ్ వైబ్స్‌తో
ఈ కొత్త సంవత్సరంలో
దివి నుండి దిగివచ్చిన
దేవకన్యలా మెరిసిపోవచ్చు.

ఫ్యాషన్

వైట్... బ్రైట్

వింటర్ వార్డ్‌రోబ్‌లు సాధారణంగా బ్లాక్, బ్రౌన్, బూడిద రంగులతో నిండి ఉంటాయి. ఇక నేటినుంచి తెల్లని కాంతి నిండే డ్రెస్సులతో నింపచ్చు. చాలాకాలంగా ఫెయిర్‌నెస్‌కి వైట్ కలర్ ఎంపిక కరెక్ట్ కాదు అనేవారి మాటలను ఇక పట్టించుకోవద్దు. ఎందుకంటే క్యాజువల్ నుంచి వేడుకలలో ధరించే డ్రెస్సుల వరకు వైట్ కాంబినేషన్ బ్రైట్‌గా వెలిగిపోతుంది.

90ల కాలం నాటి చక్కదనం

ఇప్పటికే క్లౌడ్ డ్యాన్సర్ ఫ్యాషన్‌ని మన వెండితెర తారలు ప్రియాంక చోప్రా, దీపికా పదుకొనే, జాన్వి కపూర్ వంటివారు షీర్ చీరలు, మినిమలిస్ట్ గౌన్లు, వైబ్రెంట్ లెహంగాల నుంచిట చిక్ ఎయిర్‌పోర్ట్ లుక్‌ల వరకు హాఫ్ వైట్‌లా ఉండే పాల నురగ రంగు దుస్తులను ధరించడాన్ని మనం చూస్తుంటాం. ఇక ఈ ఏడాది 90ల కాలం నాటి చక్కదనం, ప్రశాంతత, ఎవర్‌గ్రీన్‌గా నిలిచే అలనాటి సౌందర్యాన్ని చాటే ఫ్యాషన్‌ని ఇప్పుడు అనుసరించవచ్చు. అంటే వింటేజ్ వైబ్స్‌ను మరింత బాగా వంటపట్టించుకోవచ్చు. అందుకు జార్జెట్, షిఫాన్ వంటి తెల్లని శారీస్ కూడా మరిన్ని హంగులతో సొగసుగా రూపొందనున్నాయి. లేదు అంటే, సింపుల్‌గా వెండి మేఘం లాంటి తెల్లటి చీరను, బంగారు రంగు బ్లౌజ్‌తో స్టైల్ చేసి క్లాసిక్ లుక్‌తో మెరిసిపోవచ్చు.

జత కలిసే.. కాంబినేషన్స్

ఈ ఏడాది పెళ్లి చేసుకోబోయేవారికి ఎవర్‌గ్రీన్ ఇయర్‌గా చెప్పుకోవచ్చు. ఇప్పటికే డిజైనర్లు క్రీమీ వైట్‌తో జతకలిసే రంగుల కాంబినేషన్‌ని మరింత ముచ్చటపడి తీర్చిదిద్దుతున్నారు. ఎప్పటికీ నిలిచి ఉండే సంప్రదాయ దుస్తులను గోల్డ్ ఎంబ్రాయిడరీ మిక్సింగ్‌తో డిజైన్ చేయించుకోవచ్చు. ఈ కాలంలో ప్రతిదీ చాలా స్పీడ్‌గా వెళుతున్నట్టుగా కనిపిస్తోంది. అందుకే, ప్రజలు ప్రశాంతతను కోరుకుంటారు. ఈ క్లౌడ్ డాన్సర్ ఆ ప్రకాశవంతమైన గుణాన్ని కలిగి ఉంటుంది, అంతేకాదు, మన మనసులపై మాటల్లో చెప్పలేని ప్రభావవంతంగా పనిచేస్తుంది.

వివాహ వేడుకలోనూ బ్రైట్‌గా!

విదేశీ వివాహ వేడుకలలో వధువును తెల్లని డ్రెస్సుల్లోనే చూస్తాం. ఈ సంప్రదాయం ఇక భారతీయ వేడుకలలోనూ కనువిందు చేస్తోంది. దుస్తులు, ఇతర అలంకారాలలో తెలుపు అనగానే మనకు ఐవరీ, ముత్యం రంగు.. మనకు వెంటనే గుర్తుకువస్తాయి. ఇది ఒక స్టేట్‌మెంట్ కలర్ కాకపోవచ్చు. కానీ, టోనల్ డ్రెస్సింగ్, సాఫ్ట్ టైలరింగ్, పొరలుగా ఉండే సిల్హౌట్‌ల వంటి ప్రస్తుత ట్రెండ్‌తో అందంగా కనిచేస్తుంది. దీనికి మెటాలిక్ యాక్సెసరీస్, డిజిటల్ ప్రింట్లు, మిక్స్ అండ్ మ్యాచ్ ప్యాచ్ వర్క్, ఎంబ్రాయిడరీ వంటివి బాగా నప్పుతాయి. దీనివల్ల తెలుపు కూడా మరింత క్లాసిక్‌గా మారిపోతుంది. బంగారు, మెరూన్ ఎంబ్రాయిడరీతో జత చేసినప్పుడు బ్రైట్‌గా కనిపిస్తుంది. బంగారు ఆభరణాలు, బోల్డ్ లిప్ కలర్స్, రిచ్ ఫుట్‌వేర్, ప్రత్యేకత ఉండే ఇయర్ హ్యాంగింగ్స్.. ఇవన్నీ వైట్‌కలర్ డ్రెస్‌కి మరిన్ని హంగులను అద్దుతాయి.' అంటారు సెలబ్రిటీ డిజైనర్ రుక్మిణీ నితిన్.

రుక్మిణీ నితిన్
ఫ్యాషన్ డిజైనర్

సాక్షి సినిమా

నీలకంఠ విజయం సాధించాలి

- ఆది సాయికుమార్

● ఆకాష్, మహేంద్రన్, యష్న, ఆది

''నేను, మహేంద్రన్ చెన్నైలో పాండియన్ మాస్టర్ దగ్గర ఫైట్స్ నేర్చుకున్నాం. తను మంచి యాక్టర్. 'నీలకంఠ' సినిమా తనకు, యూనిట్‌కి పేరు తీసుకురావాలి. ఈ చిత్రానికి ప్రేక్షకులు మంచి విజయం అందించాలి'' అని హీరో ఆది సాయికుమార్ కోరారు. మహేంద్రన్ హీరోగా, నేహ పఠాన్, యష్న ముతులూరి, స్నేహ ఉల్లాల్ హీరోయిన్లుగా రాకేష్ మాధవన్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీలకంఠ'. ఎం.మమత, ఎం. రాజరాజేశ్వరి సమర్పణలో మర్లపల్లి శ్రీనివాసులు, వేణుగోపాల్ దీవి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరోలు ఆది సాయికుమార్, ఆకాష్ జగన్నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ–''నీలకంఠ' మహేంద్రన్‌కి, టీమ్‌కి మంచి సక్సెస్ ఇవ్వాలి'' అని చెప్పారు. ''నీలకంఠ' ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది'' అని మర్లపల్లి శ్రీనివాసులు, వేణుగోపాల్ దీవి, రాకేష్ మాధవన్, మహేంద్రన్, యష్న ముతులూరి'' పేర్కొన్నారు.

ఫిబ్రవరిలో దీక్ష

● ప్రతాని రామకృష్ణ, ఆక్సా ఖాన్

కిరణ్ హీరోగా, అలేఖ్య రెడ్డి, ఆక్సా ఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఆర్‌కే దీక్ష'. డీఎస్ రెడ్డి సమర్పణలో ఆర్ కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్‌పై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్, సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాతలు చదలవాడ శ్రీనివాస రావు, తుమ్మల ప్రసన్నకుమార్ అతిథులుగా పాల్గొని, మాట్లాడుతూ–''ఆర్‌కే దీక్ష' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అని ఆకాంక్షించారు. ''మా సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేయాలనుకుంటున్నాను'' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్. ''మా చిత్రానికి మీ అందరి ఆశీస్సులు ఉండాలి'' అని ఆక్సా ఖాన్ పేర్కొన్నారు. ''మా మూవీలో జవాన్‌ల గురించి చూపించాం'' అన్నారు డీఎస్ రెడ్డి.

సిద్ధుగాడి ప్రేమకథ

● మోహన సిద్ధి, మహాన్, శృతి

మహాన్ హీరోగా, శృతి, మోహన సిద్ధి హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'సిద్ధు గాడి లవ్ స్టోరీ'. రమేష్.సి. దర్శకత్వంలో బాలబ్రహ్మాచారి సమర్పణలో శివ బ్రహ్మేంద్ర క్రియేషన్స్‌పై సావిత్రమ్మ.సి. నిర్మిస్తున్నారు. వేణుగోపాలచారి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరై ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''డైరెక్టర్ కావాలనే తన కొడుకు రమేష్ కలను ఈ సినిమాతో సావిత్రమ్మగారు నిజం చేశారు'' అని తెలిపారు. ''ఈ చిత్రంలో ప్రేమ కథతో పాటు మంచి సందేశం కూడా ఉంటుంది'' అని మహాన్ చెప్పారు. ''ఒక మంచి ప్రేమ కథా చిత్రంగా మా సినిమా అలరిస్తుంది'' అని మోహన సిద్ధి, శృతి, మ్యూజిక్ డైరెక్టర్ అధిరవ్ కృష్ణ పేర్కొన్నారు.

కొత్త జోష్ అదిరింది

తెలుగు చిత్ర పరిశ్రమలో 2026 ఆరంభం కొత్త జోష్‌ను తీసుకొచ్చింది. నూతన సంవత్సరం సందర్భంగా తమ సినిమాల ప్రకటనలు, కొత్త అప్‌డేట్స్‌ను పంచుకున్నారు మేకర్స్. ఆ విశేషాలేంటో ఓ సారి చూద్దాం.

● చిరంజీవి

● 'స్పిరిట్'లో ప్రభాస్, త్రిప్తి

● డింపుల్, రవితేజ, ఆషిక

● పవన్ కల్యాణ్

● నాని



● శర్వానంద్

● అఖిల్

● సుమంత్

● కిరణ్, గౌరి

● నవీన్, మీనాక్షి

● విశ్వక్ సేన్

● గన్ పట్టుకుని మాస్ లుక్‌తో కనిపించారు చిరంజీవి. ఆయన నటించిన తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ మూవీ నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

● రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న రిలీజ్ కానుంది. ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్.

● ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'స్పిరిట్'. భూషణ్ కుమార్, క్రిషణ్‌కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ప్రభాస్ హీరోగా నటించిన మరో సినిమా 'ది రాజాసాబ్'. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

● పవన్ కల్యాణ్ హీరోగా నటించిన సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లు. ఎస్. హరీష్ శంకర్ దర్శకత్వంలో మైత్రీమూవీమేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా కొత్త స్టిల్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే పవన్ కల్యాణ్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించనున్న మూవీని ప్రకటించారు.

● 'దసరా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 26న రిలీజ్ కానుంది. ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

● శర్వానంద్ హీరోగా, సంయుక్త– సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించిన సినిమా 'నారీ నారీ నడుమ మురారి'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సినిమా కొత్త స్టిల్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

● సంయుక్త

● సుమంత్ హీరోగా నటించిన సినిమా 'మహేంద్రగిరి వారాహి'. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్‌పై జాగర్లపూడి సంతోష్ దర్శకత్వం వహించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానున్నట్లు మేకర్స్ తెలిపారు.

● మానస, అంకిత్

● అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని తొలి పాటని ఈ నెల 5న, మూవీని వేసవిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

● నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా నటించిన సినిమా 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సినిమా కొత్త స్టిల్‌ను రిలీజ్ చేసింది యూనిట్.

● నవీన్ చంద్ర

● విశ్వక్‌సేన్ హీరోగా సాయి కిరణ్ రెడ్డి దైదా దర్శకత్వం వహిస్తున్న పొలిటికల్ డ్రామాకి 'లెగసీ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఏక్తా రాథోడ్ హీరోయిన్. యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ రెడ్డి దైదా నిర్మిస్తున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ టీజర్‌ను గురువారం విడుదల చేశారు.

● కిరణ్ అబ్బవరం, శ్రీగౌరి ప్రియ జంటగా నటిస్తున్న సినిమా 'చెన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి దర్శకత్వంలో సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ నిర్మిస్తున్న ఈ సినిమాని వేసవిలో రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించింది చిత్రయూనిట్.

● సుహాస్

● నవీన్ చంద్ర, దివ్య పిళ్లై జోడీగా నటిస్తున్న చిత్రం 'హనీ'. కరుణ కుమార్ దర్శకత్వంలో ఓవీఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించారు. నిజ జీవిత ఘటనల ఆధారంగా మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకాలజీ వంటి అంశాలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాని ఫిబ్రవరి 6న రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు మేకర్స్.

● హీరోయిన్ సంయుక్త నటిస్తున్న సినిమా 'ది బ్లాక్ గోల్డ్'. కేఎమ్‌సీ యోగేష్ దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ 75శాతం పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించి, సంయుక్త లుక్‌ని విడుదల చేశారు.

● నిరంజన్, రాజేంద్ర ప్రసాద్, గ్రీష్మ

● సుహాస్, శివానీ నాగారం జోడీగా నటించిన సినిమా 'హే భగవాన్'. గోపీ అచ్చర దర్శకత్వంలో బి. నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు మేకర్స్ తెలిపారు.

● నిరంజన్, గ్రీష్మ నేత్రికా, ప్రియాంక, దీప్తి శ్రీరంగం ముఖ్య తారలుగా సింహాచలం గుడుపూరి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'రుక్మిణి'. నేలబల్లి కుమారి సమర్పణలో జి సినిమా బ్యానర్‌పై నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్నారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు.

● అంకిత్ కొయ్య, మానసా చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ జాతర'. 'సమ్మతమే' మూవీ ఫేమ్ గోపీనాథ్ రెడ్డి దర్శకుడు. యూజీ క్రియేషన్స్‌పై కంకణాల ప్రవీణ నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్.

పైన పేర్కొన్న చిత్రాలతో పాటుగా మరికొన్ని సినిమాల అప్‌డేట్స్‌ని న్యూ ఇయర్ సందర్భంగా ఆయా చిత్రాల మేకర్స్ వెల్లడించారు.

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 282
శుక్రవారం 2-1-2026

పొగాకు మీద పన్నుల దాడి
హెల్తు సెస్సుతో ప్రభుత్వ కొరడా ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ –బిజినెస్‌లో

'టాప్స్'లో జ్యోతి సురేఖ
ఏపీ ఆర్చర్ రాటుదేలేందుకు పథకం తోడ్పాటు – స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


త్వరలో వందేభారత్ స్లీపర్
ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న గౌహతి-కోల్‌కతా వందే భారత్ స్లీపర్ రైలు త్వరలోనే పట్టాలపైకి ఎక్కనుంది.
వివరాలు 6లో ▸

అణు వసతులు..ఖైదీల జాబితా..
నూతన ఏడాదిలో భారత్, పాకిస్తాన్‌లు తమ అణు వసతులు, ఖైదీల వివరాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకున్నాయి.
వివరాలు 6లో ▸

డ్రోన్ దాడిలో 24 మంది మృతి
ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత ఖెర్సన్ ప్రాంతంలో భారీ డ్రోన్ దాడి జరిగి 24 మంది మృతి చెందారు.
వివరాలు 6లో ▸


సంబరాల వేళ స్విట్జర్లాండ్‌లో పేలుడు
స్విట్జర్లాండ్‌లోని క్రాన్స్-మోంటానాలోని ఓ ప్రముఖ బార్‌లో భారీ పేలుడు జరిగి 40 మంది సజీవదహనం అయ్యారు.
వివరాలు 6లో ▸

సాక్షి టెన్త్‌క్లాస్ స్పెషల్..
సోషల్ స్టడీస్ ప్రిపరేషన్ ప్లాన్, ముఖ్యమైన ప్రశ్నలు- సమాధానాలు, క్విజ్

వివరాలు భవితలో▸

చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యపు జబ్బునకు నిదర్శనం నెల్లూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో చెట్లు మొలిచి శిథిలమైన ఈ 108 అంబులెన్స్‌లు

ప్రాణాలు పోతున్నాయ్!

రాష్ట్రంలో అత్యంత దారుణంగా 108 సేవలు, నెట్‌వర్క్ నిర్వహణ
టైర్లు, బ్యాటరీల సమస్యలతో వాహనాలు షెడ్డులకే పరిమితం
మరమ్మతులతో ఎక్కడికక్కడ ఆగిపోతున్న అంబులెన్స్‌లు

- ఆపద్బాంధవి సేవలు అందక ప్రాణాలు విడుస్తున్న బాధితులు
- అంబులెన్స్ కోసం ఫోన్ చేస్తే 40 నిమిషాలు ఎదురు చూపులు
- శ్రీకాకుళం జిల్లాలో నడిరోడ్డుపై కన్నుమూసిన క్షతగాత్రుడు
- ప్రజారోగ్యంపై చంద్రబాబు సర్కారు అలసత్వం.. 104, 108 సేవల నిర్వహణను స్కామ్‌గా మార్చేయడంపై అలజడి
- 108 అంబులెన్స్‌ల దుస్థితిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగులోకి

2లో

ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చే 108 సర్వీసులకు చంద్రబాబు సర్కారు ఉరి వేస్తోంది! కుయ్ కుయ్ మూగబోతోంది..! నిమిషాల వ్యవధిలో చేరుకోవాల్సిన అంబులెన్సుల జాడ లేక ప్రజల ప్రాణాలు పోతున్నాయ్! 108 సేవల నిర్వహణలో తీవ్ర అలక్ష్యం, ప్రభుత్వ అసమర్థతతో రోడ్డు ప్రమాదాల క్షతగాత్రుల నుంచి అనారోగ్య బాధితులు, నిండు గర్భిణులు దాకా బలైపోతున్నారు! 108 రాకపోవడంతో గర్భిణులు ఆటోలను ఆశ్రయిస్తుండటం.. సకాలంలో వైద్యం అందక ఆటోలోనే పసిగుడ్డు ప్రాణాలు విడవడం.. రోడ్డుపై రయ్ రయ్‌మంటూ పరుగులు తీయాల్సిన ఆపద్బాంధవి నిస్సహాయంగా షెడ్‌లకే పరిమితం కావడం.. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో ఓ క్షతగాత్రుడు నడి రోడ్డుపైనే ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సర్వత్రా అలజడి రేగుతోంది. ఈ నేపథ్యంలో 108 సేవల తీరును 'సాక్షి' బృందం రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించగా దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

– సాక్షి నెట్‌వర్క్

దోపిడీ 'అంచనా'!

రాజధాని జోన్-8 ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ టెండర్లలో అక్రమాలు

లేఅవుట్ అభివృద్ధికి ఎకరానికి సగటున రూ.2 కోట్లు వ్యయం!

- దేశ చరిత్రలో ఇంత పెద్దఎత్తున ఖర్చు చేసిన దాఖలాలు లేవు..
- రూ.1,305.39 కోట్లతో టెండర్లు పిలిచిన ఏడీసీఎల్
- 4.03% అధిక ధర... రూ.1,358 కోట్లకు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ
- ఖజానాకు రూ.52.61 కోట్ల నష్టం... ఆ మేర కాంట్రాక్టర్‌కు ప్రయోజనం
- జీఎస్టీ వంటి పన్నుల రూపంలో మరో రూ.277.85 కోట్లు రీయింబర్స్‌మెంట్
- దీంతో రూ.1635.85 కోట్లకు చేరనున్న మొత్తం కాంట్రాక్టు విలువ
- రూ.135.80 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సులో నీకింత నాకింత
- కాంట్రాక్టర్‌కు దోచిపెట్టి పంచుకుతినడాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్న ముఖ్య నేత

రివర్స్ టెండరింగ్ ఉండి ఉంటే ఖజానాకు కనీసం రూ.100 కోట్లకు పైగా ఆదా

10లో

కొండవీటి వాగు ఎత్తిపోతల్లో
రూ.150 కోట్ల అవినీతి వరద

- రూ.423.64 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచిన ఏడీసీఎల్
- రూ.443.76 కోట్లకు కోట్ చేసి పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ
- 4.75% అధిక ధరకు కట్టబెట్టడంతో ఖజానాపై రూ.20.12 కోట్ల భారం
- జీఎస్టీ వంటి పన్నుల రూపంలో రూ.79.42 కోట్లు రీయింబర్స్ చేస్తామన్న ఏడీసీఎల్.. దీంతో కాంట్రాక్టు విలువ రూ.523.18 కోట్లకు చేరుతుందంటున్న అధికార వర్గాలు

10లో

ఆర్టీసీలో 'విధి' వంచన

కొత్త సంవత్సరం నేపథ్యంలో తిరుపతిలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు డ్యూటీకి డుమ్మా కొట్టారు. అధికార పార్టీ నేతల సేవలో తరించారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
వివరాలు 5లో ▸

రూ.1.23 కోట్ల సైబర్ దోపిడీ

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని ప్రకాశం జిల్లా అద్దంకిలో ఓ వ్యక్తి రూ.కోటికి పైగా నగదు పోగొట్టుకున్నాడు. బాధితుడి నుంచి వివరాలు సేకరించిన సైబర్ క్రైం పోలీసులు నగదు జమ చేసిన 13 బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారు.
వివరాలు 3లో ▸

ఒక్క రోజే 5.13 లక్షల లడ్డూల విక్రయాలు

గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా 2025 డిసెంబర్ 27న అత్యధికంగా 5.13 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేసినట్లు టీటీడీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.
వివరాలు 5లో ▸

పిల్లలకు తాగునీరు ఎప్పుడిస్తారు?

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి

- 453 హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు లేవన్న విషయాన్ని ప్రభుత్వం కూడా ఖండించడం లేదు
- హాస్టళ్లలో విద్యార్థుల సమస్యల పరిష్కారంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని గతేడాది జూలైలో సీఎస్‌ను ఆదేశిస్తే స్పందన ఏది?
- కలెక్టర్లు 15 రోజులకొకసారి హాస్టళ్లలో రాత్రి పూట బస చేయాలని గత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది
- హాస్టళ్ల పనితీరు, విద్యా నాణ్యతను మెరుగుపరిచేందుకే ఆ ఉత్తర్వులు..
- హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కమిటీని ఏర్పాటు చేయండి
- పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యత సీఎస్‌దే.. నెలకొకసారి సమీక్షించాలని ఆదేశం

3లో

సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న పిల్లలకు ఎప్పటిలోగా తాగు నీరు అందిస్తారో కూడా స్పష్టంగా చెప్పలేరా? హాస్టళ్లకు ఎన్ని ఆర్వో ప్లాంట్లు అవసరం? దానికి సంబంధించిన లోపాలను ఎలా అధిగమిస్తారనే వివరాలను ప్రభుత్వం సమర్పించడం లేదు. హాస్టళ్ల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయంటూ ప్రభుత్వం చేసిన ప్రకటన కూడా చాలా సాధారణంగా ఉంది.

– రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ హైకోర్టు వ్యాఖ్యలు

జేఈఈ మెయిన్స్‌కు భారీగా దరఖాస్తులు

- జనవరి సెషన్‌కే 14.50 లక్షలకు పైగా నమోదు
- గత ఏడాది కంటే లక్షకు పైగా అధికం
- ఏప్రిల్ సెషన్‌తో కూడా కలిపితే 17లక్షలు వచ్చే అవకాశం
- 21 నుంచి తొలి సెషన్ పరీక్షలు

వివరాలు 2లో

నాడు రూ.16
నేడు రూ.20

వైఎస్సార్‌సీపీ హయాంలో ఫోర్టిఫైడ్ గోధుమ పిండి కిలో రూ.16

- అధికారంలోకి రాగానే పంపిణీనే నిలిపేసిన చంద్రబాబు సర్కార్
- ఇప్పుడు రూ.4 పెంచేసి కొత్తగా ప్రారంభిస్తున్నట్టు కలరింగ్
- చంద్రబాబు బినామీ మంత్రి కుటుంబాల కంపెనీలకే ప్యాకింగ్ కాంట్రాక్టు

10లో

'కిక్కు'రేగ్గొట్టింది

తెగ తాగించిన బాబు సర్కారు

- కొత్త సంవత్సర వేడుకల్లో ఏరులై పారిన మద్యం
- 4 రోజుల్లోనే రూ.585.70 కోట్ల విలువైన మద్యం విక్రయం

2లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	152 కిలో	డ్రస్డ్ స్కిన్‌తో	260 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	179 కిలో	స్కిన్ లెస్	295 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ బాత్



సంపద సృష్టి లేదాయే..
ఉన్నదీ ఆవిరాయే

జీఎస్టీ గణాంకాల్లో వెల్లడైన చేదు నిజం

- 9 నెలల్లో రూ.1,785 కోట్ల రాబడి ఫట్
- గతేడాదితో పోలిస్తే 5.34 శాతం పడిపోయిన జీఎస్టీ ఆదాయం
- 2024-25 ఆర్థిక ఏడాది 9 నెలల్లో రూ.33,371 కోట్ల ఆదాయం

- ఈ ఏడాది ఏప్రిల్–డిసెంబర్ ఆదాయం రూ.31,586 కోట్లకే పరిమితం
- డిసెంబర్‌లో రూ.2,652 కోట్లకే పరిమితమైన జీఎస్టీ
- నవంబర్ నెలలో జీఎస్టీ ఆదాయం రూ.2,697 కోట్లు
- బాబు సంపద సృష్టి నేలచూపులే

5లో

వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుడు
ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం

అనంతపురం జిల్లా యల్లనూరులో రెచ్చిపోయిన టీడీపీ మూకలు

- రాళ్లు, కర్రలతో దాడి
- జెడ్పీటీసీ ప్రతాప్‌తోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు
- ఎస్‌ఐ రామాంజనేయరెడ్డికీ గాయాలు
- రివాల్వర్‌తో గాలిలోకి కాల్పులు జరిపేందుకు యత్నించిన ఎస్‌ఐ
- తోకముడిచిన టీడీపీ రౌడీ మూకలు

3లో

చెంపపై గాయాలైన భోగతి ప్రతాప్‌రెడ్డి

దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రసాద్

అనంతపురం జిల్లాలో టీడీపీ వర్గీయుల దౌర్జన్యాలు శ్రుతిమించుతున్నాయి. వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. తాజాగా శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండల కేంద్రంలో టీడీపీ వర్గీయులు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి విజయ ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నానికి ఒడిగట్టారు. రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో భోగతి ప్రతాప్‌రెడ్డితోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు.

కలిసి జీవిస్తేనే 'గ్రీన్ కార్డు'

అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ బ్రాడ్ బెర్న్‌స్టీన్

6లో

ఒక్క రోజులో జస్ట్ లక్ష కోట్లు!

నానాటికీ పెరుగుతున్న యూపీఐ పేమెంట్స్

2లో

ఒక్క రోజులో జస్ట్ లక్ష కోట్లు!

నానాటికీ పెరుగుతున్న యూపీఐ పేమెంట్స్

డిసెంబర్ 1న రూ.1,15,450 కోట్ల లావాదేవీలు

ఇదే నెలలో 8 రోజులు రూ.1 లక్ష కోట్లు దాటిన వైనం

గ్రాసరీస్, సూపర్ మార్కెట్లలో ఎక్కువ వినియోగం

కొనసాగుతున్న ఫోన్‌పే జోరు

స్కానర్ ఉందా? క్యాబ్, దుకాణం, తోపుడు బండి.. ఎవరికి డబ్బులు చెల్లించాలన్నా చాలావరకు కస్టమర్లు అడిగే ప్రశ్న ఇది. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వినియోగ విస్తృతి చూస్తుంటే భవిష్యత్తులో నగదు చెల్లింపులు అసలే ఉండవా అని అనిపిస్తుంది. దేశవ్యాప్తంగా యూపీఐ ఆధారిత పేమెంట్స్ ఒక్క రోజులో రూ.1 లక్ష కోట్లకు పైగానే జరుగుతున్నాయంటే పరిస్థితి అర్థమవుతోంది. దేశంలో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం అధికం అవుతోంది. జనం డిజిటల్ చెల్లింపులకు అలవాటు పడ్డారు. వ్యక్తుల నుంచి వ్యక్తులకు, వ్యక్తుల నుంచి వర్తకులకు క్యూఆర్ కోడ్, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతాకు క్షణాల్లో డబ్బులు పంపగలిగే అవకాశం ఉండడంతో యూపీఐ మన దేశంలో దూసుకుపోతోంది. సరుకుల కొనుగోళ్లకు ఈ తరహా చెల్లింపులు ఎక్కువగా ఉంటుండగా, సూపర్ మార్కెట్లు అత్యధిక లావాదేవీలకు వేదిక అవుతున్నాయి. లావాదేవీలు, విలువలో 'ఫోన్‌పే'తన హవా కొనసాగిస్తూనే ఉంది. రాష్ట్రాల వారీగా చూస్తే యూపీఐ వినియోగంలో మహారాష్ట్ర ముందుంది. టాప్–6 రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉండటం గమనార్హం.

సాక్షి, స్పెషల్ డెస్క్

నవంబర్‌లో వివిధ విభాగాల్లోని లావాదేవీలు..

సరుకులు, సూపర్ మార్కెట్లు రూ.322 కోట్లు	ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు రూ.140 కోట్లు	హోటళ్లు, రెస్టారెంట్లు రూ.120 కోట్లు	
టెలికం సేవలు రూ.81.7 కోట్లు	సర్వీస్ స్టేషన్స్ రూ.65.7 కోట్లు	పాన్ షాపులు రూ.35.4 కోట్లు	
ఫార్మసీలు రూ.32.2 కోట్లు	బేకరీలు రూ.27.2 కోట్లు	పాల కేంద్రాలు రూ.17 కోట్లు	లిక్కర్ షాపులు రూ.16.5 కోట్లు

ఈ ఏడాది మార్చిలో తొలిసారిగా..

యూపీఐ ప్లాట్‌ఫామ్‌పై రోజువారీ చెల్లింపులు 2025 మార్చి 1న తొలిసారిగా రూ.1 లక్ష కోట్ల మార్కు దాటింది. ఆ రోజు రూ.1,01,628 కోట్ల పేమెంట్స్ జరిగాయి. ఇక డిసెంబర్ 1న ఏకంగా రూ.1,15,450 కోట్లు నమోదు చేసి సరికొత్త గరిష్టాలను తాకింది. 2024 డిసెంబర్‌లో సగటున రోజుకు రూ.75,800 కోట్ల విలువైన చెల్లింపులు జరిగాయి. కాగా 2025 డిసెంబర్‌లో (1–30 మధ్య) ఇది రూ.89,481 కోట్లకు చేరింది. డిసెంబర్‌లో మొత్తం రూ.26,84,446 కోట్ల విలువైన 2,086 కోట్ల లావాదేవీలు జరిగాయి. యూపీఐ ప్లాట్‌ఫామ్‌పై 2025 డిసెంబర్‌లో 8 రోజులు రూ.1 లక్ష కోట్లకు పైగా చెల్లింపులు జరగడం విశేషం.

లావాదేవీల్లో ముందు వరుసలో ఉన్న రాష్ట్రాలు..	మహారాష్ట్ర	ఉత్తరప్రదేశ్	కర్ణాటక	తెలంగాణ	తమిళనాడు	ఆంధ్రప్రదేశ్
	రూ.215 కోట్లు	రూ.111 కోట్లు	రూ.110 కోట్లు	రూ.85 కోట్లు	రూ.81 కోట్లు	రూ.56 కోట్లు

ఎవరి మధ్య	పరిమాణం (కోట్లలో)	విలువ (రూ.కోట్లలో)
వ్యక్తుల నుంచి వ్యక్తులకు	762	18,67,080
వ్యక్తుల నుంచి వర్తకులకు	1,284	7,64,552

లావాదేవీల్లో టాప్	ఫోన్‌పే	గూగుల్ పే	పేటీఎం	నవీ	సూపర్.మనీ
లావాదేవీల సంఖ్య (కోట్లలో)	933	702	154	60	26
విలువ (రూ.కోట్లలో)	12,75,350	9,05,934	1,64,155	32,290	10,581

(గణాంకాలకు ఆధారం: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)

ఏలూరు జీజీహెచ్‌లో మూలపడి ఉన్న 108 వాహనాలు

108 వెహికిల్స్

చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిరుపయోగంగా మారిన 108వాహనాలు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

కృష్ణాజిల్లా బందరు జీజీహెచ్ ఆవరణలో ఉన్న పూర్తిగా పనికిరాని ఒక 108 వాహనం

శ్రీకాకుళం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న 108 వాహనం

షెడ్లలో 108 కుయ్యో.. ప్రాణాలు పోతున్నాయ్!

రాష్ట్రంలో అత్యంత దారుణంగా 108 సేవలు, నెట్‌వర్క్ నిర్వహణ | టైర్లు, బ్యాటరీల సమస్యలతో వాహనాలు షెడ్డులకే పరిమితం

శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురైన ఓ ద్విచక్రవాహనదారుడి ప్రాణాలను కాపాడేందుకు 108 కోసం కాల్ చేస్తే ఎంతసేపైనా రాలేదు. చివరకు అంబులెన్స్ కోసం ఎదురు చూస్తూ.. విలవిల్లాడుతూ క్షతగాత్రుడు నడిరోడ్డుపైనే ప్రాణాలు విడిచాడు. రణస్థలం జాతీయ రహదారి-16పై బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన రాష్ట్రంలో 108 సేవల నెట్‌వర్క్ నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో చెప్పేందుకు నిదర్శనం.

'ఊపిరి' ఆగుతోంది..!

పల్నాడు జిల్లా నకరికల్లుకు చెందిన అబ్బూరి శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా త్రిపురాపురం వద్ద టిప్పర్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. 108 కోసం ఫోన్ చేయగా 20 నిమిషాలు గడిచినా రాకపోవడంతో ప్రైవేట్ వాహనంలో వైద్యశాలకు తరలించారు. ఇక్కడ రెండు మండలాలకు ఒకే వాహనం ఉంది. పల్నాడు జిల్లాలోనే జలాల్‌పురంలో మరియమ్మ అనే మహిళకు ఊపిరి అందకపోవటంతో మెరుగైన వైద్యం కోసం సీహెచ్‌సీ నుంచి 108లో గుంటూరు తరలించారు. తిరుగు ప్రయాణంలో బ్యాటరీ చార్జింగ్ లేక వాహనం మొరాయించడంతో రోగి కుటుంబ సభ్యులు, సెక్యూరిటీ గార్డులు తోయాల్సి వచ్చింది. ఏలూరు జిల్లాలో పాత అంబులెన్స్‌లకు రంగులేసి నడిపిస్తున్నారు. కానీ అవి ఎప్పుడు, ఎక్కడ మొరాయిస్తాయో చెప్పలేని దుస్థితి ఉంది.

ప్రమాదానికి గురై కిందపడి గాయపడిన అబ్బూరి శ్రీనివాసరావు

108 రాకపోవటంతో శ్రీనివాసరావును ప్రైవేటు వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

పయ్యావుల ఇలాకాలో 'హ్యాండ్సప్'..

అనంతపురం జిల్లాలో 108 సేవలు అస్తవ్యస్తంగా మారాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండలో ఇతర ప్రాంతాలకు చెందిన వాటిని బ్యాకప్‌గా వినియోగిస్తున్నారు. ఉరవకొండ వాహనం పాడవడంతో గుంటూరులో షెడ్డుకు పరిమితమైంది. రాయదుర్గం, డి.హీరేహాళ్, కణేకల్లు బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. నేషనల్ హైవే కనెక్టివిటీ ఉన్న అనంతపురం జిల్లాలో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ వాహనాలు అత్యంత కీలకం.

బెడ్డు వద్దకు కాదు.. షెడ్డుకే!

వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్న మండలంలో స్పృహ కోల్పోయిన ఓ వ్యక్తిని కాపాడాలని కాల్ సెంటర్‌కు సమాచారం ఇవ్వగా 108 వాహనం మరో చోటకు వెళ్లింది. కడపలో వాహనాలు అందుబాటులో లేవు. మరమ్మతులకు గురైన వాహనాలను పాత రిమ్స్‌లో షెడ్డుకు తరలించారు. చెన్నూరు మండలం నుంచి 108 రావడానికి దాదాపు గంట పడుతోంది. వచ్చే వరకు వేచి చూడాలని, లేదంటే ఆటో తీసుకొని కడపలో ఆస్పత్రికి వెళ్లాలని సిబ్బంది సలహా ఇచ్చారు.

రోగిని తరలిస్తుండగా పేలిన టైరు..

నంద్యాల జిల్లాలో కొద్ది రోజుల క్రితం బిల్లా బక్కన్న అనే వృద్ధుడిని 108లో తరలిస్తుండగా బండి ఆత్మకూరు వద్దకు చేరుకోగానే వాహనం టైర్ పేలి రోడ్డు మీద ఆగిపోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో టైర్లు, బ్యాటరీల సమస్యలతో పలు వాహనాలు షెడ్డుకు పరిమితమయ్యాయి.

దయచేసి వేచి ఉండండి...!

విజయవాడ సిటీ పరిధిలో కాల్ చేసిన 18 నిమిషాల్లో రావాల్సిన 108 వాహనం దాదాపు అరగంటకుగానీ చేరుకోవడం లేదు. నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు లాంటి దూర ప్రాంతాల నుంచి రిఫర్ కేసులను విజయవాడకు తీసుకొస్తుంటారు. అలాంటి సమయంలో ఫోన్ చేస్తే రావడానికి మరో వాహనం అందుబాటులో ఉండటం లేదు. కృష్ణా జిల్లాలో పూర్తిగా పనికిరాని (కండెమ్) 108 వాహనాన్ని జీజీహెచ్ ఆవరణలో ఉంచారు.

ప్రైవేట్ సేవలకు వేలకు వేలు..

చిత్తూరు జిల్లాలో 108 వాహనాలు మొరాయిస్తున్నాయి. అరిగిన టైర్లతో దర్శనమిస్తున్నాయి. కొన్నింటి సైరన్ కూడా పని చేయడం లేదు. ఆపదలో పది మందికి సాయపడాల్సిన 108.. నలుగురు తోస్తేగానీ కదలని దుస్థితి. పల్లెల్లో 108 సేవలు అరుదుగా మారాయి. ప్రసవం కోసం ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. చిత్తూరు నుంచి తమిళనాడులోని వేలూరుకు (30 కి.మీ) ప్రైవేటు అంబులెన్స్‌లో వెళ్లాలంటే కనీసం రూ.5 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతి జిల్లాలో తరచూ 18 వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. రోజూ 8 నుంచి 10 వాహనాలు షెడ్‌లకే చేరుతున్నాయి.

- సాక్షి నెట్‌వర్క్

ఊరూ పేరు లేని సంస్థకు 108, 104 కాంట్రాక్టు

వేల కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన, అంతర్జాతీయంగా పేరుగాంచిన, వైద్య రంగంలో అపార అనుభవం ఉన్న విఖ్యాత సంస్థలను కాదని అతి చిన్న, ఓ అనామక సంస్థకు రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అడ్డగోలుగా 108, 104 నిర్వహణ కాంట్రాక్టు కట్టబెట్టడమే ఈ దుస్థితికి కారణమని స్పష్టమవుతోంది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో ముందుకొస్తున్న, స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన సంస్థలను పక్కనపెట్టి.. టీడీపీ డాక్టర్స్ విభాగంలోని పవన్‌కు చెందిన 'భవ్య' అనే ఎలాంటి అనుభవం లేని సంస్థకు ఈ కాంట్రాక్టును అప్పగించింది. ప్రజల ప్రాణ, ఆరోగ్య రక్షణ కోసం తీసుకొచ్చిన వీటి నిర్వహణపై ఇంత నిర్లక్ష్యం క్షమార్హం కాదని ప్రజలు మండిపడుతున్నారు. గతేడాది చంద్రబాబు ప్రభుత్వం రాగానే తస్మదీయ కాంట్రాక్టర్లకు పొగపెట్టారు. గడువు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లే పనులు వదులుకుని వెళ్లిపోయేలా వేధింపులకు దిగారు. దీంతో 104 మొబైల్ మెడికల్ యూనిట్స్ (ఎంఎంయూ), 108 నిర్వహణ కాలపరిమితి 2027 వరకూ ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ ఎంవోయూను రద్దు చేసుకున్నారు. అనంతరం భవ్య హెల్త్ సర్వీసెస్‌కు ఈ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టడం కోసం పక్కా ప్రణాళికతో నిబంధనలు రూపొందించి టెండర్ పిలిచారు. ఈ సంస్థకు అత్యవసర వైద్య సేవల నిర్వహణలో అనుభవం లేకపోవడంతో ఏకంగా నిబంధనలే మార్చేయడం గమనార్హం.

'కిక్కు'రేగ్గొట్టింది

తెగ తాగించిన బాబు సర్కారు

కొత్త సంవత్సర వేడుకల్లో ఏరులైపారిన మద్యం

34.4 శాతం	నాలుగురోజుల్లోనే పెరిగిన బీర్ల అమ్మకాలు
11 శాతం	నాలుగు రోజుల్లోనే పెరిగిన లిక్కర్ విక్రయాలు
రూ. 178.6 కోట్లు	డిసెంబర్‌లో ఒక్క విశాఖ జిల్లాలో మొత్తం మద్యం అమ్మకాల విలువ
రూ. 169.4 కోట్లు	డిసెంబర్‌లో మద్యం అమ్మకాల్లో రెండో స్థానంలో నిలిచిన తిరుపతి జిల్లా

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు మందుబాబుల తుక్కురేగ్గొట్టింది. జేబులకు భారీగా చిల్లుపెట్టింది. 'ఫుల్లుగా తాగండి...తాగి ఊగండి..' అన్నదే తమ అధికారిక విధానమని మరోసారి స్పష్టం చేసింది. ఎందుకంటే ఎంతగా తాగితే టీడీపీ మద్యం సిండికేట్ ఖజానా అంతగా కాసులతో గలగల లాడుతుంది. అందుకే కొత్త సంవత్సరం వేడుకలను అవకాశంగా మలుచుకుని మద్యం ఏరులై పారించింది. అర్ధరాత్రి ఒంటిగంట వరకు అనుమతులిచ్చి మరీ మందుబాబుల జేబులు గుల్ల చేసింది. చివరి నాలుగు రోజుల్లోనే భారీగా రూ.585.70 కోట్ల విలువైన మద్యాన్ని తాగించేసింది. 2024లో చివరి నాలుగు రోజులతోపోలిస్తే 2025లో చివరి నాలుగు రోజుల్లోనే ఐఎంఎల్ లిక్కర్ అమ్మకాలు ఏకంగా 11 శాతం, బీరు అమ్మకాలు 34.4 శాతం పెరగడం విభ్రాంతి కలిగిస్తోంది.

సిండికేట్‌కు ఫుల్ జోష్..

కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలో మద్యం విక్రయాల్లో పాత రికార్డులను తిరగరాయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ శాఖకు తేల్చి చెప్పింది. అందుకే మద్యం విక్రయ వేళలను ఉదయం 6గంటల నుంచి అర్ధరాత్రి 1గంట వరకు అధికారికంగా పొడిగించింది. తెల్లవారే వరకు మద్యం విక్రయించినా పట్టించుకోవద్దని ఎక్సైజ్, పోలీసు అధికారులను అనధికారికంగా ఆదేశించింది. ఫలితంగా 2024తో పోలిస్తే 2025 చివరి నాలుగు రోజుల్లో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి.

ఇవిగో గణాంకాలు..

- 2024 డిసెంబర్ 28 నుంచి 31 వరకు 5,18,844 ఐఎంఎల్ లిక్కర్ కేసులు, 2,42,351 బీరు కేసులను విక్రయించారు. వాటి విలువ రూ.445.22 కోట్లు.
- 2025 డిసెంబర్ 28 నుంచి 31 వరకు 7,32,658 ఐఎంఎల్ లిక్కర్ కేసులు, 3,91,082 బీరు కేసులను విక్రయించారు. వాటి విలువ రూ.585.70 కోట్లు.
- అంటే 2024లో చివరి నాలుగు రోజుల కంటే 2025లో చివరి నాలుగు రోజుల్లో ఐఎంఎల్ లిక్కర్ అమ్మకాలు 11.5శాతం, బీరు విక్రయాలు 34.4 శాతం పెరిగాయి. తద్వారా రూ.140.48 కోట్ల అధిక రాబడి వచ్చింది.
- ఇక 2024 డిసెంబర్‌తో పోలిస్తే 2025 డిసెంబర్‌లో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. 2024 డిసెంబర్‌లో మొత్తం 33,88,275 ఐఎంఎల్ లిక్కర్ కేసులు, 11,25,050 బీరు కేసులు విక్రయించారు. వాటి విలువ రూ.2,568.18 కోట్లు.
- కాగా 2025 డిసెంబర్‌లో మొత్తం 37,79,446 ఐఎంఎల్ లిక్కర్ కేసులు, 15,11,633 బీరు కేసులు విక్రయించారు. వాటి విలువ రూ.2,767.08కోట్లు. ఈ గణాంకాలన్నీ ఎక్సైజ్‌శాఖ అధికారికంగా వెల్లడించినవి.

ఎమ్మార్పీ కంటే అధిక బాదుడు అదనం

కాగా టీడీపీ మద్యం సిండికేట్ ఎమ్మార్పీ కంటే అదనంగా మందుబాబుల నుంచి దండుకుంది ప్రతి క్వార్టర్ మద్యం సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.50, బీరు సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.30 అదనంగా వసూలు చేసింది. తద్వారా అనధికారికంగా మరో రూ.100 కోట్లకుపైగా కొల్లగొట్టినట్టు తెలుస్తోంది.

టాప్‌లో విశాఖ

డిసెంబర్‌లో మొత్తం 178.6 కోట్ల మద్యం అమ్మకాల్లో విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచింది. రూ.169.4కోట్ల మద్యం అమ్మకాలతో తిరుపతి జిల్లా రెండోస్థానంలో, రూ.155.4కోట్ల మద్యం అమ్మకాలతో ఎన్టీఆర్ జిల్లా మూడో స్థానంలో ఉన్నాయి. రూ.30.7 కోట్ల మద్యం అమ్మకాలతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో ఉంది.

జేఈఈ మెయిన్స్‌కు భారీగా దరఖాస్తులు

- జనవరి సెషన్‌కే 14.50 లక్షలకు పైగా నమోదు
- గత ఏడాది కంటే లక్షకుపైగా అధికం

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా జాతీయ విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలకు రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్–2026 జనవరి ఒక్క సెషన్‌కు మాత్రమే 14.50 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. ఇది గత ఏడాది జనవరి సెషన్ కంటే లక్షకుపైగా ఎక్కువ. ఏటా జనవరి, ఏప్రిల్ సెషన్లలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తుంది. ఈసారి రెండు సెషన్లు కలిపి 17లక్షల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది జాతీయ సంస్థల్లో ఇంజినీరింగ్ ప్రవేశాలకు పెరుగుతున్న డిమాండ్‌ను సూచిస్తోందని చెబుతున్నారు. గత మూడేళ్లతో పోలిస్తే ఈసారి జనవరి మెయిన్ పరీక్షలకు దరఖాస్తులు భారీగా పెరిగాయి. 2025 తొలి సెషన్‌కు 13.80 లక్షలు దరఖాస్తులు వచ్చాయి. ఇది 2024 కంటే అధికం. అదేవిధంగా 95 నుంచి 96 శాతం మంది పరీక్షలకు హాజరవుతున్నారు. అంటే, ఈసారి రెండు సెషన్లలోనూ భారీగా పోటీ ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. జనవరిలో 21 నుంచి 30 వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎన్టీఏ షెడ్యూల్ ఇచ్చింది. ఈ వారంలో విద్యార్థి సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లను విడుదల చేయనుంది. మూడో వారంలో అడ్మిట్ కార్డులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది.

గత నాలుగేళ్లుగా జేఈఈ మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తులు, హాజరు సంఖ్య ఇలా..

సంవత్సరం	నమోదు (రెండు సెషన్లు)	హాజరు
2023	11,62,398	11,13,325
2024	14,76,557	14,15,110
2025	15,39,848	14,75,103
2026(జనవరి మాత్రమే)	14,50,000	-

కొత్త ఏడాదిలో ప్రజలకు సుఖసంతోషాలు కలగాలి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: తెలుగు ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2026లో ప్రజలకు సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2026 సంవత్సరం.. ప్రతీ ఒక్కరి జీవితాలలో ఆరోగ్యం, ఆనందం, సంతృప్తి నింపే సంవత్సరం కావాలి. మీరు, మీ కుటుంబ సభ్యులు వెలుగుతో, నవ్వులతో నిండిన ఏడాది గడపాలని కోరుకుంటున్నా' అని గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

7న గ్రూప్‌-1 స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 మెయిన్స్‌లో అర్హత సాధించిన స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ఈ నెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సర్వీస్ కమిషన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచామని, ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత తేదీలో విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొంది. గ్రూప్‌–1, 2023 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేయగా, మెయిన్స్ గతేడాది మే నెలలో జరిగింది. రెగ్యులర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు పూర్తయినా స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు పలు కారణాలతో ఈ ప్రక్రియ పూర్తికాలేదు.

పిల్లలకు తాగునీరు ఎప్పుడిస్తారు?

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి

- 453 హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు లేవన్న విషయాన్ని ప్రభుత్వం కూడా ఖండించడం లేదు
- హాస్టళ్లలో విద్యార్థుల సమస్యల పరిష్కారంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని గతేడాది జూలైలో సీఎస్‌ను ఆదేశిస్తే స్పందన ఏది?

సాక్షి, అమరావతి: సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న పిల్లలకు తాగునీరు ఎప్పటిలోగా అందిస్తారో కూడా స్పష్టంగా చెప్పలేరా? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. సుమారు 453 హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు లేవన్న విషయాన్ని ప్రభుత్వం ఖండించడం లేదని ప్రస్తావించింది. హాస్టళ్లకు ఎన్ని ఆర్వో ప్లాంట్లు అవసరం? అందుకు సంబంధించిన లోపాలను ఎలా అధిగమిస్తారు? అనే వివరాలను ప్రభుత్వం సమర్పించడం లేదని ఆక్షేపించింది. హాస్టళ్ల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయంటూ ప్రభుత్వం చేసిన ప్రకటన చాలా సాధారణంగా ఉందని ధర్మాసనం తప్పుబట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 3 వేలకు పైగా హాస్టళ్లు ఉన్నందున ప్రతి చోటా తాము స్వయంగా పరిశీలించడం సాధ్యం కాదని, అందువల్ల, తాలూకా/ జిల్లా/ రాష్ట్ర స్థాయిల్లో మౌలిక సదుపాయాలను క్రమం తప్పకుండా పరిశీలించే వ్యవస్థను ఏర్పాటు చేయడం అవసరమని తేల్చి చెప్పింది. రాష్ట్రంలోని అన్ని హాస్టళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిర్దిష్ట కాల పరిమితితో సమగ్ర ప్రణాళికను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులే లేవు

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం హాస్టల్‌లో 86 మంది విద్యార్థులు కామెర్లకు గురికావడం, విద్యార్థి మరణించడం, 150 మంది విద్యార్థులు ఇతర సమస్యలతో ఆసుపత్రుల్లో చేరిన ఘటనపై సీజే ధర్మాసనం విజయనగరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిని విచారణకు ఆదేశించింది. ధర్మాసనం ఆదేశాల మేరకు న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆ హాస్టల్‌ను తనిఖీ చేసి నివేదికను హైకోర్టుకు సమర్పించారు. బావి నుంచి నేరుగా ట్యాంక్‌లోకి పంపిన నీటినే విద్యార్థులు తాగుతున్నారని తన నివేదికలో పేర్కొన్నారు. 611 మంది విద్యార్థులు ఉంటే కేవలం 58 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, ఇందులో 40 దొడ్లను వ్యాధి ప్రబలిన తరువాతే నిర్మించారని కార్యదర్శి హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 11 మరుగుదొడ్లకు, 2 సాన్నపు గదులకు అసలు తలుపులే లేవని నివేదించారు. ఈ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి స్పందిస్తూ ఆ హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చేపడుతోందన్నారు. ప్రణతి నివేదించిన వివరాలపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

గత ప్రభుత్వం ఇచ్చిన జీవో అమలు ఎక్కడ?

రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాల కల్పనను రాష్ట్ర ప్రభుత్వం కేవలం మాటలకు, కాగితాలకే పరిమితం చేయడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆయా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులు ప్రతి 15 రోజులకు ఒకసారి సంక్షేమ హాస్టళ్లను సందర్శించి రాత్రి అక్కడ బస చేయాలంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 46 అమలు కాకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తూ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గత ప్రభుత్వం ఇచ్చిన ఈ ఉత్తర్వులు హాస్టళ్ల పనితీరును మెరుగుపరిచేందుకు, విద్య నాణ్యతను పెంపొందించటానికి ఉద్దేశించినవని గుర్తు చేసింది. హాస్టళ్లలో పిల్లలకు శుభ్రమైన తాగునీరు ఎప్పటిలోపు అందిస్తారో కూడా ఈ ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదని ఆక్షేపించింది. 320 కొత్త ఆర్వో వాటర్ ప్లాంట్లు మంజూరయ్యాయని ప్రభుత్వం చెబుతున్నా, వాస్తవానికి అవి ప్రస్తుతం ఉన్న హాస్టళ్ల సంఖ్యకు ఏమాత్రం సరిపోవని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 46 ప్రకారం ప్రతి 15 రోజులకొకసారి పరిస్థితిని పర్యవేక్షించే యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం ఓ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కమిటీ పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యత మొత్తం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిదేనని తేల్చి చెప్పింది. సంక్షేమ శాఖల అధికారులకు ఈ కమిటీలో స్థానం కల్పించాలని సూచించింది. నెలకు ఒకసారి ఈ కమిటీ సమావేశమై హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనను పర్యవేక్షించాలని పేర్కొంది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. హాస్టళ్లలో ప్రస్తుతం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించింది.

2025లో హైకోర్టు అడిగినా సీఎస్ ఇంతవరకూ నివేదిక ఇవ్వలేదు

హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆహారం, వస్త్రాలు, ఆశ్రయం ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను అధిగమించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని 2025 జూలైలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించినా ఇంతవరకు తమకు సమర్పించలేదని ధర్మాసనం తెలిపింది. హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు క్షేత్రస్థాయి సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించకపోవడం, ఆ సమస్యలను ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం జరుగుతోందని ధర్మాసనం పేర్కొంది. నెలకొకసారి తనిఖీలు జరుగుతున్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సమస్యను అధిగమించేందుకు పరిష్కార చర్యలు చేపట్టకుంటే ఎన్ని తనిఖీలు చేసినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేసింది.

మౌలిక సదుపాయాల కల్పనకు పిల్

సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాకినాడ జిల్లాకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన సీజే ధర్మాసనం ఇటీవల మరోసారి విచారణ జరిపింది.

ముగ్గురు పిల్లలకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్య

- నంద్యాల జిల్లా ఉయ్యాలవాడలో ఘోరం
- ఐదు నెలల క్రితం చిన్నారుల తల్లి బలవన్మరణం

తండ్రి, చిన్నారుల మృతదేహాలు

ఉయ్యాలవాడ: ఓ తండ్రి తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో విషం తాగించి చంపడంతో పాటు తానూ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువుల కథనం మేరకు.. తుడుమలదిన్నెకి చెందిన వేములపాటి సురేంద్ర(35), మహేశ్వరి దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు. మహేశ్వరి తీవ్ర అనారోగ్యంపాలై ఆ బాధతో గతేడాది ఆగస్టులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భార్య చనిపోయినప్పటి నుంచి తీవ్ర మనోవేదనను అనుభవిస్తున్న సురేంద్ర.. కూలి పనులకు వెళ్తూ, పిల్లలు కావ్యశ్రీ(7), జ్ఞానేశ్వరి(5), సూర్య గగన్(1)తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, బుధవారం రాత్రి తన ముగ్గురు పిల్లలకు కూల్ డ్రింక్‌లో విషం కలిపి తాగించి, చంపాడు. ఆపై తానూ ఉరేసుకుని తనువు చాలించాడు. గురువారం ఉదయం 8 గంటలైనా ఇంటి తలుపులు తెరవకపోవడంతో సురేంద్ర తల్లి కృష్ణమ్మ అక్కడికి వెళ్లి చూడగా కుమారుడు, మనవరాళ్లు, మనవడు విగత జీవులుగా కనిపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు.

బాబు విదేశీ పర్యటనపై గోప్యత దేనికి?

- నా జీవితం తెరిచిన పుస్తకం అంటూనే రహస్య పర్యటనలు ఎందుకు?
- గతంలో తమ పర్యటనలను ప్రజలకు ముందే చెప్పిన ముఖ్యమంత్రులు
- ప్రత్యేక విమానాల్లో లోకేశ్, పవన్‌కళ్యాణ్ కూడా జల్సాలు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

సాక్షి, అమరావతి: తన జీవితం తెరిచిన పుస్తకమని చెప్పుకునే సీఎం చంద్రబాబు రహస్యంగా విదేశాలకు ఎందుకు వెళ్లారని, ఎందుకంత గోప్యత పాటిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ప్రశ్నించారు. గతంలో సీఎంలుగా పనిచేసిన వారంతా తమ పర్యటన వివరాలను మీడియా ద్వారా ప్రజలకు చెప్పేవారని, కానీ చంద్రబాబు మాత్రం అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుధాకర్‌బాబు ఏమన్నారంటే.. 'చంద్రబాబు, ఎక్కడికి వెళ్తున్నదీ, ఎవరితో వెళ్తున్నదీ.. అధికార పర్యటనా.. వ్యక్తిగత పర్యటనా అనేది ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఇదేనా ఆయనలో ఉన్న పారదర్శకత? సాధారణ పరిపాలన శాఖ వద్ద కూడా సీఎం చంద్రబాబు పర్యటన వివరాలు లేకపోవడం ఏమిటి? చంద్రబాబు తన పర్యటన వివరాలను రహస్యంగా ఉంచడంవల్ల ఆయన ప్రయాణంపై రకరకాల ఊహాగానాలు వచ్చాయి. కొంతమంది సింగపూర్ వెళ్లారని, ఇంకొంత మంది బాలి వెళ్లారని ప్రచారం చేస్తున్నారు. కానీ, లండన్ వెళ్తున్నట్లు పచ్చ మీడియా ద్వారా ప్రజలను నమ్మించి చివరికి సింగపూర్ వెళ్లారని మరికొందరు చర్చించుకుంటున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేశ్ సహా చాలామంది మంత్రులు, ఎంపీలు అమరావతిలో అందుబాటులో లేకుండా అదృశ్యమైపోయారు.

అవినీతి సంపదను పంచుకోవడానికి వెళ్లారా?

కొన్నినెలల కిందట మాజీ సీఎం వైఎస్ జగన్ తన కుమార్తె గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం కోసం ముందుగా వెల్లడించి లండన్ వెళ్తే.. దాన్ని ఎల్లో మీడియా వక్రీకరించింది. తన సొంత ఖర్చుతో ప్రత్యేక విమానంలో వెళ్లినా నానా యాగీ చేశారు. కానీ, సీఎంగా చంద్రబాబు మాత్రం తన పర్యటన గురించి రహస్యంగా ఉంచడంలో ఆంతర్యం ఏమిటి? రాష్ట్ర ప్రయోజనాల కోసం వెళ్లి ఉంటే ఆ వివరాలను జీఏడీ ఎందుకు చెప్పడంలేదు? రహస్యంగా ఉంచడం చూస్తుంటే ఏడాదిన్నర కాలంగా దోచుకున్న అవినీతి సంపదను పంచుకోవడానికి వెళ్లారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ప్రజల సొమ్ముతో చంద్రబాబు, లోకేశ్, పవన్ మూడు ప్రత్యేక విమానాల్లో జల్సాలు చేస్తున్నారా లేదా? జర్నలిస్టులు విచారణ చేసి నిర్ధారించాలి. మరోవైపు.. నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలకు మేలుచేసే నిర్ణయం తీసుకోకుండా రూ.4,500 కోట్ల మేర కరెంట్ బిల్లుల భారం మోపడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైంది.

మావోయిస్టు అగ్రనేత బర్సె దేవా లొంగుబాటు

40 మంది సహచరులతో కలిసి..

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ అగ్రనేత బర్సె దేవా అలియాస్ సుక్కా 40 మంది సహచరులతో కలిసి పోలీసులకు లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణ పోలీసులు అధికారికంగా నేడో రేపో వీరి లొంగుబాటును ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కొత్తగూడెం జిల్లా పోలీసుల ద్వారా రాయబారం నడిపి లొంగిపోయినట్లు సమాచారం. హిడ్మా ఎన్‌కౌంటర్ కంటే ముందే ఆయన లొంగిపోవాలనే నిర్ణయానికి వచ్చారని, హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఆ ప్రక్రియ వేగవంతమైందని ఛత్తీస్‌గఢ్ పోలీసు వర్గాలు తెలిపాయి. ఆయనపై రూ. 50 లక్షల రివార్డు ఉంది.

అనేక కీలక ఆపరేషన్లలో...

బర్సె దేవా నాలుగు రాష్ట్రాల పోలీసులతో, మధ్యవర్తులతో చర్చించి చివరకు తెలంగాణలో లొంగిపోయారని సమాచారం. ఒడిశాలోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన బర్సె దేవా ఇటీవల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన హిడ్మాతో కలిసి ఒకటిన్నర దశాబ్దంపాటు పనిచేశారు. పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) 1వ నంబర్ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న హిడ్మా పదోన్నతిపై కేంద్ర కమిటీలోకి వెళ్లిన తర్వాత పార్టీ ఆ బాధ్యతలను బర్సె దేవాకు అప్పగించింది. ఆ తర్వాత స్టేట్ మిలిటరీ కమిషన్ బాధ్యతలనూ ఆయన చూసుకున్నారు.

వ్యవసాయ స్పెషల్ సీఎస్ పదవీ కాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్‌ను మరో ఏడాదిపాటు కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్‌గా 2024 డిసెంబర్‌లో పదవీ విరమణ పొందిన రాజశేఖర్‌ను అదే పోస్టులో తిరిగి పునర్నియమించారు. ఆయన పునర్నియామక గడువు డిసెంబర్ 2025తో ముగియగా, మరో ఏడాది పాటు అదే పోస్టులో కొనసాగుతారు.

వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం

- యల్లనూరులో రెచ్చిపోయిన టీడీపీ మూకలు
- రాళ్లు, కర్రలతో దాడి
- జెడ్పీటీసీ ప్రతాప్‌తోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు
- ఎస్‌ఐ రామాంజనేయరెడ్డికీ గాయాలు
- రివాల్వర్‌తో గాలిలోకి కాల్పులు జరిపేందుకు యత్నించిన ఎస్‌ఐ

సాక్షి టాస్క్‌ఫోర్సు: అనంతపురం జిల్లాలో టీడీపీ వర్గీయుల దౌర్జన్యాలు శ్రుతిమించుతున్నాయి. వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. తాజాగా శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండల కేంద్రంలో టీడీపీ వర్గీయులు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి విజయ ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నానికి ఒడిగట్టారు. రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో భోగతి ప్రతాప్‌రెడ్డితోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి యల్లనూరు మండలం వెన్నపూసపల్లిలో యల్లనూరు మండల జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు యల్లనూరుకు చెందిన టీడీపీ కార్యకర్త కుమ్మనమల శరత్ కూడా హాజరయ్యారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ వర్గీయులు గురువారం ఉదయం కుమ్మనమల శరత్ ఇంటికి వెళ్లి అతనిపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయం యల్లనూరు మీదుగా అనంతపురం వెళుతున్న జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డికి తెలియడంతో ఆయన వెంటనే ఎస్‌ఐ రామాంజనేయరెడ్డికి సమాచారం ఇచ్చారు. అలాగే శరత్‌పై దాడిని ఖండిస్తూ యల్లనూరులోని తేరు వద్ద నిరసనకు దిగారు. అక్కడే కాపు కాచిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ప్రతాప్‌రెడ్డిని కర్రతో కొట్టడంతో ముఖానికి, చేతికి బలమైన గాయాలయ్యాయి. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాసరి రాము, దాసరి శివ, ప్రసాద్, జాఫర్ తదితరులకు తీవ్ర స్థాయిలో దెబ్బలు తగిలాయి. టీడీపీ గూండాలు విసిరిన రాయి తగలడంతో ఎస్‌ఐ రామాంజనేయ రెడ్డి కూడా గాయపడ్డారు. పోలీసుల సమక్షంలోనే టీడీపీ కార్యకర్తలు వీరంగం చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో ఎస్‌ఐ రివాల్వర్ బయటకు తీసి గాల్లోకి కాల్పులు జరిపేందుకు సిద్ధం కాగా.. టీడీపీ రౌడీ మూకలు తోక ముడిచాయి. గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పులివెందుల ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.

గాయపడిన రాము, దాసరి శివ

భోగతి ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న శైలజనాథ్

భోగతిని పరామర్శించిన ఆలూరు, సాకే, రమేష్‌రెడ్డి

టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన భోగతి ప్రతాప్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్‌ఆర్‌ఐ విభాగం కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల సమన్వయకర్త సాకే శైలజానాథ్, రాష్ట్ర కార్యదర్శి కోనుదుల రమేష్‌రెడ్డి వెన్నపూసపల్లిలో పరామర్శించారు. జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి శైలజనాథ్ యల్లనూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పుట్లూరు సీఐ సత్యబాబు, బుక్కరాయ సముద్రం సీఐ లక్ష్మయ్య, యల్లనూరు ఎస్‌ఐ రామాంజనేయ రెడ్డితో మాట్లాడారు. యల్లనూరు ఘటన ఓ సినిమా సీన్‌లాగా ఉందని, ఆ వీడియో చూస్తుంటే తనకే భయమేస్తోందని పేర్కొన్నారు. పోలీసులు ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుని పల్లెలు ప్రశాంతంగా ఉండేలా చూడాలన్నారు.

ఫిర్యాదు చేశాడనే అక్కసుతోనేనా?

యల్లనూరు మండల పరిధిలోని చిత్రావతి నది పక్కన ఉన్న వ్యవసాయ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వ్యవసాయ భూములతోపాటు నదీ పరీవాహక ప్రాంతాల నుంచి టిప్పర్లలో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనివల్ల యల్లనూరు–తాడిపత్రి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చిత్రావతి నుంచి ఇసుకను అడ్డగోలుగా తరలిస్తే భూగర్భ జలాలు తగ్గిపోయి వ్యవసాయ బోరుబావులు ఎండిపోయే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి 20 రోజుల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు అదును చూసి యల్లనూరులో ఆయనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

రూ.1.23 కోట్ల సైబర్ దోపిడీ

అద్దంకి: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని కోటికి పైగా నగదు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అద్దంకికి చెందిన ఎస్.నాగేశ్వరరావు బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పని చేసి రిటైరయ్యారు. ప్రస్తుతం అద్దంకి పట్టణంలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. నవంబర్‌లో నాగేశ్వరరావుకు అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. 'మీ ఆధార్ కార్డు ప్రముఖ నేరగాడి వద్ద దొరికింది. మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం. డబ్బు ఇవ్వకుంటే భార్యాభర్తలిద్దరినీ ముంబై తీసుకొచ్చి జైల్లో పెడతాం' అంటూ బెదిరించాడు. భయపడిన నాగేశ్వరరావు డిసెంబర్ 3న రూ.53 లక్షలు సైబర్ నేరగాడి ఖాతాకు జమ చేశారు. ఇలా మొత్తం రూ.1.23 కోట్లు బదిలీ చేశారు. ఇంకా నగదు ఇవ్వాలంటూ ఆ వ్యక్తి పదే పదే ఫోన్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన నాగేశ్వరరావు స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ క్రైం పోలీసులు నగదు జమ చేసిన 13 బ్యాంకు ఖాతాలను సీజ్ చేసి దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబు ప్రభుత్వంలోనే డెంగీ మరణాలు

- గత ప్రభుత్వంలో మరణాలే లేవని అధికారికంగా ప్రకటించిన వైద్యశాఖ
- 2024లో ఇద్దరు, 2025లో ఐదుగురు డెంగీతో మృతి
- డెంగీ మరణాల్లో దేశంలో నాలుగోస్థానం మనదే
- సాక్షి కథనంపై వైద్యశాఖ వివరణ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో ఒక్క డెంగీ మరణం కూడా లేదు. చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో అమాయకులు డెంగీకి బలయ్యారని వైద్య, ఆరోగ్యశాఖ అంగీకరించింది. గత ప్రభుత్వంలో 2021 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో ఒక్క డెంగీ మరణం కూడా లేదని గురువారం అధికారికంగా ప్రకటించింది. 2024లో ఇద్దరు, 2025లో ఐదుగురు చొప్పున రెండేళ్లలో ఏడుగురు డెంగీతో మరణించారని తెలిపింది. 'డెంగీ మరణాల్లో ఏపీకి 4వ స్థానం' శీర్షికతో సాక్షిలో గురువారం కథనం ప్రచురితమైంది. 2024, 2025ల్లో దేశంలో డెంగీ వ్యాప్తి, నమోదైన మరణాలపై ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటన చేసింది. అందులో పేర్కొన్న మేరకే రాష్ట్రం నాలుగోస్థానంలో ఉందని సాక్షి పేర్కొంది. దీనికి గురువారం రాష్ట్ర వైద్యశాఖ ఇచ్చిన వివరణలో 2021 నుంచి దేశంలో డెంగీ వ్యాప్తి, మరణాల నివేదికను వెల్లడించింది. దీనిని గమనిస్తే 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఒక్క డెంగీ మరణం కూడా నమోదు కాలేదు. ఇదే సందర్భంలో దేశవ్యాప్తంగా 2021లో 346 మంది, 2022లో 303 మంది, 2023లో 485 మంది డెంగీతో మరణించారు. రాష్ట్రంలో డెంగీ బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించడం ద్వారా ప్రజల ప్రాణాలు పోకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. మరోవైపు దేశంలో 2024లో 297, గతేడాది 95 మరణాలు నమోదయ్యాయి. కాగా.. 2025లో దేశం మొత్తం మరణాలు భారీగా తగ్గాయి. కానీ దేశంలో నమోదైన మరణాల్లో 5 శాతానికి పైగా మన రాష్ట్రంలోనే ఉన్నాయి. దీన్నిబట్టి పరిశీలిస్తే ప్రజారోగ్య పరిరక్షణలో బాబు ప్రభుత్వం ఏ మేరకు విఫలమైందో తెలుస్తోంది.



> కోపం వచ్చిన క్షణంలో పట్టిన ఓపిక,
> వేల క్షణాల విచారాన్ని నివారిస్తుంది.
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 2 జనవరి 2026

ట్రంప్ అడుగుజాడల్లో చైనా

మంచేదైనా జరిగితే తమ ఖాతాలో వేసుకోవటానికి సిద్ధపడేవాళ్లు కోకొల్లలు. ఇది లోకోత్తర సత్యం. ఒకరకంగా అదొక వ్యాధి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆ సమస్య ఉంది. తన ప్రమేయం లేకుండా ముగిసిన యుద్ధాలనూ, ఇంకా ముగియని యుద్ధాలనూ తానే ఆపానని చెప్పుకోవడంతోపాటు ఉనికిలో లేనివాటికి కూడా అడ్డుచక్రం వేశాననటం ఆయనకే చెల్లింది. ఆ బాణీ ఇంకా ఆపలేదు. ఇప్పుడు చైనా వంతు వచ్చినట్టుంది. 2025లో భారత్–పాక్ ఘర్షణలు నివారించటంతోపాటు అనేక ఇతర యుద్ధాలను ఆపిన ఘనత తమదంటూ తాజాగా వాంగ్–యీ ప్రకటించుకున్నారు. ఆ రెండు దేశాలూ అనేక రంగాల్లో పోటీపడుతున్నాయి. ఆర్థికంగా ఇప్పటికీ అమెరికాదే పైచేయి అయినా, రేపో మాపో దాన్ని చైనా అధిగమిస్తుందని ఎవరో కాదు... ఆర్థిక నిపుణులే దండోరా వేస్తున్నారు. ఆ విషయంలో చైనాను ప్రశంసించాల్సిందే! అమెరికాతో పోలిస్తే ఎక్కడో అట్టడుగునుండే దేశాన్ని 75 ఏళ్లలోనే ఈ స్థాయికి తీసుకురావటం మాటలు కాదు మరి. అంతమాత్రాన అమెరికా చెప్పే అబద్ధాలను కూడా వల్లెవేయటం వంటి చౌకబారు అనుకరణలు బెడిసికొడతాయని చైనా గ్రహించకపోవటం క్షమార్హం కానిది.

కశ్మీర్‌లోని పెహల్గాంలో పాక్ నుంచి చొరబడిన ఉగ్రవాదులు అనేకమంది అమాయకులను పొట్టనబెట్టుకున్న వైనం తర్వాత గత ఏడాది మే మొదటివారంలో మన దేశం ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో అక్కడి ఉగ్ర స్థావరాలపై దాడులు చేయటం, దానికి ప్రతిగా పాకిస్తాన్ సైన్యం మనపై దాడి చేసే ప్రయత్నం, మనం తిప్పికొట్టడం, ఎదురుదాడి చేయడం వంటివి జరిగాయి. చివరకు కుదిరిన కాల్పుల విరమణ వెనక రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్లు (డీజీఎంలు) ఉన్నారని మన దేశం చెబుతోంది. ఇలాంటి విషయాల్లో మూడో పక్షం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అప్పట్లోనే స్పష్టం చేసింది. నిజానికి ‘ఆపరేషన్ సిందూర్’ సందర్భంగా పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవి కూడా ఉన్నాయని అప్పుడే బయటపడింది. ఆ సామగ్రి 81 శాతం అని కూడా తేలింది. పాకిస్తాన్ మనపై ప్రయోగించిన ఆయుధ సామగ్రి చూశాక, ఈ ఘర్షణను ‘సజీవ ప్రయోగశాల’గా చైనా ఉపయోగించుకున్నట్టు కనబడుతోందని కూడా మన దేశం విమర్శించింది. అలాంటి దేశం ‘తగుదునమ్మా...’ అంటూ ఇరుపక్షాల మధ్యా రాజీకీ దౌత్యం నెరపానని ఇప్పుడు గప్పాలు కొడుతోంది.

లోపాయకారీగా ఘర్షణలను ఎగదోయటం, పైకి శాంతి వచనాలు వల్లించటం ఇటీవలి ధోరణేం కాదు. ఇలాంటి జిత్తులమారి ఎత్తుగడల్లో అమెరికా ఆరితేరింది. ఇజ్రాయెల్ సాగించే అన్ని దాడుల వెనకా ఆ దేశం ఉంటుంది. అవే దాడుల్ని ఆపినట్టు కనబడటంలో ముందుంటుంది. శాంతి సాధన కోసం ‘ఏ సమస్యనైనా వస్తునిష్ఠతో చూడటం, న్యాయమైన వైఖరి తీసుకోవటం’ తమ విధానమని... లక్షణాలనూ, మూల కారణాలనూ తొలగించటమే తమ ధ్యేయమని వాంగ్–యీ చెప్పుకున్నారు. డాలర్ ఇంకా శాసిస్తూనే ఉంది కనుక అమెరికా ఇలాంటి అబద్ధాలు చెప్పినా ఏదోమేరకు చెల్లుబాటవుతాయి. సుంకాలు పెంచుతామని బెదిరించానంటే ‘అవును కాబోలు...’ అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ చైనా సైతం ‘అన్నీ నేనే... అంతా నేనే’ అని అనటం ఎబ్బెట్టుగా ఉంటుంది.

అదను చూసుకుని పక్కనున్న తైవాన్‌ను కబళించాలని ప్రయత్నిస్తూ, మనతో సరిహద్దుల్లో అకారణ వైరానికి దిగుతూ, అరుణాచల్ ప్రదేశ్‌లో గ్రామాల పేర్లు మార్చుకుని మురిసిపోతూ ఇలా తటస్థత నటించటం అనైతికత. చైనాకూ, తైవాన్‌కూ మధ్య రాజీ కుదర్చటానికి ప్రయత్నిస్తానని మన దేశం ముందుకొస్తే చైనా అంగీకరిస్తుందా? అధికారంలోకొచ్చిన నాటి నుంచీ నోబెల్ బహుమతి కోసం వెంపర్లాడటం ట్రంప్‌కు ఎక్కువైంది. బహుశా ఆయనకు మోకాలడ్డాలని చైనా ఏమైనా ప్రయత్నిస్తోందేమో! అలా చేయదల్చుకుంటే ట్రంప్ తప్ప వేరెవరూ చైనాను ఆటంకపరచరు. తామిచ్చే శాంతి బహుమతి సైతం ప్రతిష్ఠాత్మకమైనదిగా ఉండేలా చూసుకొనే బాధ్యత నోబెల్ కమిటీది. ఈలోగా లేని పెద్దరికాన్ని ప్రదర్శించటం వల్ల నవ్వులపాలు కావటం ఖాయమని అటు ట్రంప్, ఇటు చైనా తెలుసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.6.31 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** మృగశిర రా.8.17 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** తె.4.10 నుండి 5.40 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.35 వరకు, తదుపరి ప.12.32 నుండి 1.16 వరకు, **అమృత ఘడియలు:** ప.12.04 నుండి 1.33 వరకు.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.33
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

మెసేజ్

నేను కనుక, నా 18 ఏళ్ల నాకు ఒక మెసేజ్ పంపగలిగితే అది 3 భాగాలుగా ఉంటుంది. 1. ‘ప్రిస్టేజ్’ అనే తప్పుడు భావనను ఒంట పట్టించుకోకు. 2. హార్డ్‌వర్క్‌ను మించింది లేదు, కానీ అదొకటే సరిపోదు. 3. నీ తల్లితండ్రులను ఎప్పుడూ చులకనగా చూడకు.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

ప్రభావం

మీరు హార్వర్డ్ లేదా ప్రిన్స్‌టన్‌లో ఉంటే మీరు ఆరాధించే వ్యక్తులు, వారి ఆలోచనలతో మీరు ప్రభావితం అవుతారు. కానీ భారతదేశంలో అలా ఉండదు. ఎవరి ప్రభావానికీ లోను కాకపోవటం వల్ల మీ సొంత ఆలోచనలతో మీరు ఎదుగుతారు.

– షిరాజ్ మిన్వాలా, థియరిటికల్ ఫిజిసిస్ట్

సమయం

రాత్రికి రాత్రి వరించిన విజయం, ఏదో ఒక రోజు – రాత్రికి రాత్రే మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. ఏళ్ల తరబడి శ్రమించి, పట్టుదలగా సాధించిన విజయం ఎప్పటికీ మీతోనే ఉండిపోతుంది. అందుకు పట్టే సమయం గురించి ఆలోచించి, నిస్పృహ చెందకండి.

– కరంజిత్ అన్మోల్, కమెడియన్

ప్రారంభం

కలలు కనటానికి ధైర్యం చేసి, ముందుకు సాగితే చాలా సాధారణమైన ప్రారంభాలు కూడా అసాధారణమైన విజయాలకు దారి తీస్తాయి. పరిమితులను దాటి చూడగలిగితే, మీరు పాఠశాల చదువు మానేసిన వ్యక్తి అయినా, బిలియనీర్‌గా మారి పోవచ్చు.

– రాజేందర్ గుప్తా, రాజ్యసభ సభ్యుడు

స్వేచ్ఛ

మహిళలు, బాలికలకు క్రీడలు అవసరం. ఎందుకంటే, క్రీడా మైదానం వారి వ్యక్తిత్వాన్ని ప్రతిఫలించే ఒకే ఒక రంగం. అక్కడ వారు స్వేచ్ఛగా కదులుతారు. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటారు. అక్కడే వారి ఆత్మవిశ్వాసానికి అంకురార్పణ జరుగుతుంది.

– జగ్మతీ సంగ్వాన్, మహిళా హక్కుల కార్యకర్త

వ్యూహం

భవిష్యత్తు ఎక్కడో ఉండదు. వర్తమానంలోనే ఉంటుంది. 2030లో మీరు బిజినెస్ మేగ్నెట్‌గా ఉండాలనుకుంటే, 2030లో మీరేం చేయబోతారనేది కాదు, ఈ రోజు మీరు ఏం చేస్తున్నారన్నదే ముఖ్యం. ఇప్పటి మీ ప్రతి వ్యూహం, అప్పటి మీ స్థానం కోసమే అయ్యుండాలి.

– విజయ్ గోవిందరాజన్, బిజినెస్ లీడర్

మెరుగయ్యామా?

సందర్భం

టంకశాల అశోక్

ఒక దేశం గడిచిపోయిన సంవత్సరాన్ని వెనుకకు తిరిగి సమీక్షించుకోవటమంటే, ఆ సంవత్సరంలోని పరిణామాలను తారీఖులు, దస్తావేజుల పద్ధతిలో నెమరు వేసుకోవటం కాదు. అంతకుముందటి సంవత్సరంతో పోల్చినప్పుడు ఏమైనా మెరుగుపడిందా అని సరిచూసుకోవటం. రాజకీయంగా, పరిపాలనాపరంగా, ఆర్థికంగా, సామాజికంగా, వాటితో పాటు బయటి దేశాలతో సంబంధాల రీత్యా! వీటికి సంబంధించిన అంశాలు అన్నింటికి అన్నీ మెరుగుపడి ఉండకపోవచ్చు. అది సాధ్యం కూడా కాదు. కొన్ని ఒడుదొడుకులు తప్పవు. కానీ, మొత్తం మీద సారాంశం ఏమిటన్న దానిని బట్టే ఒక దేశం ముందుకు పోవటం ఆధారపడి ఉంటుంది.

పైన పేర్కొన్న అయిదు ప్రధాన రంగాలకు సంబంధించి, గడిచిపోయిన 2025వ సంవత్సరంలో అనేకానేకం జరిగాయి. వాటిలో ముఖ్యమైన వాటిని మాత్రం పేర్కొని ఆ ప్రభావాలను అంచనా వేసే ప్రయత్నం చేద్దాము. ముఖ్యమైనవి అనే మాటను ముందు నిర్వచించుకోవాలి. కొన్నింటికి తక్షణ ప్రాముఖ్యం ఉండి క్రమంగా తేలిపోతాయి. కొన్నింటికి తదనంతర కాలంలోనూ ప్రభావాలు కొనసాగుతాయి. ఇక్కడ చూసేందుకు ప్రయత్నిస్తున్నది ఈ రెండో తరహా వాటి గురించి.

బలపడిన బీజేపీ

ముందుగా రాజకీయాలను గమనిస్తే, 2025వ సంవత్సరం వచ్చే వేళకు దేశం ముందుండిన ప్రధానమైన ప్రశ్న, 2024లో వరుసగా కేంద్రంలో, రాష్ట్రాలలో పరాజయాల పాలైన ప్రతిపక్షాలు ఇప్పటికైనా కూడదీసుకోగలవా అన్నది. కాంగ్రెస్‌ను, దాని నాయకత్వాన గల యూపీఏను 2014లో వెనుకకు తోసిన బీజేపీ, క్రమంగా ప్రాంతీయ పార్టీలను కూడా బలహీనపరుస్తున్న క్రమం 2025లో, ఆ తర్వాత 2026లో ఆగగలదా? కాంగ్రెస్, దాని కూటమి పార్టీలు కలిసి 2027 కల్లా పుంజుకుని బీజేపీకి నిజమైన సవాలుగా నిలవగలవా అన్నది పెద్ద ప్రశ్న అయింది. అసెంబ్లీ ఎన్నికలు 2025లో జరిగిన ఢిల్లీ, బిహార్, 2026లో జరగనున్న అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ కలిపి మొత్తం ఆరు రాష్ట్రాలు. వీటిలో ప్రతిపక్ష రాష్ట్రం ఢిల్లీని బీజేపీ ఇప్పటికే గెలుచుకోగా, ప్రతిపక్షం ఎన్నో ఆశలు పెట్టుకున్న బిహార్, అంతకుముందటి కన్న భారీ ఆధిక్యతతో బీజేపీ వశమైంది. 2026లో జరిగే అస్సాంపై ప్రతిపక్షాలకు, కేరళపై బీజేపీకి అంచనాలు లేకపోవచ్చు గానీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు కోసం ఆ పార్టీ శతవిధాల ప్రయత్నిస్తున్నది. 2025 చివరన నికరంగా కనిపిస్తున్నదేమంటే, బీజేపీ 2024 కన్న ఇప్పుడు మరింత బలపడి, 2026లో ఇంకా బలపడే సూచనలు కనిపిస్తుండగా, ప్రతిపక్షాల పరిస్థితి అందుకు విరుద్ధ దిశలో సాగుతున్నది.

> కొన్ని ఒడుదొడుకులు తప్పవు. కానీ, సారాంశం ఏమిటన్న దానిని బట్టే ఒక దేశం ముందుకు పోవటం అనేది ఆధార పడి ఉంటుంది.

ఆర్థికం యథాతథం

దేశం ఆర్థికంగా 2025లో మెరుగుపడిందా, క్షీణించిందా అన్న ప్రశ్నపై తీవ్రమైన చర్చలు సాగుతున్నాయి. అవి స్థూలంగా చూసినపుడు ఉత్తర – దక్షిణ ధ్రువాలన్నంత భిన్నంగా ఉన్నాయి. వాస్తవానికి ఆర్థిక రంగం 2024తో పోల్చినప్పుడు కొద్దిపాటి తేడాలతో యథావిధిగానే సాగుతున్నది తప్ప భారీ మార్పులంటూ కనిపించవు. ఉత్పాదక రంగం, వాణిజ్యం, ఆదాయాలు, ధనిక పేద తారతమ్యాల పెరుగుదల, అదే సమయంలో మధ్యతరగతి పెరుగుదల, అభివృద్ధి చెందిన దేశాల నుంచి ఆర్థిక – వాణిజ్య సవాళ్లు, రూపాయి విలువ ఆగకుండా పతనమవుతుండటం, వాణిజ్య లోటు పెరుగుతూనే ఉండటం, నిరుద్యోగ సమస్య, ధరల పెరుగుదల, వ్యవసాయ రంగ సమస్యలు అన్నింటిదీ 2024 నాటి పరిస్థితే. అదే సమయంలో మరొకవైపు, పలు విధాలైన సక్రమ, అక్రమ రాయితీలతో కొందరి సంపదలు కొండలవలె పెరగటం కూడా 2025లో కొనసాగింది. మరొకవైపు వివిధ అంతర్జాతీయ సూచీలలో ఎందులోనూ భారతదేశపు ర్యాంకింగులు మెరుగుపడలేదు.

ఆర్థిక రంగానికి సంబంధించి 2025వ సంవత్సరపు రెండు గమనార్హమైన విషయాలున్నాయి. ఒకటి – అమెరికా విధించిన భారీ సుంకాలు, ఇండియాను లొంగదీసేందుకు ప్రయత్నిస్తున్న కొత్త వాణిజ్య ఒప్పందం. రెండవది – అమెరికా ఒత్తిడిని సరకు చేయకుండా భారత ప్రభుత్వం ‘బ్రిక్స్’లో కొనసాగుతూ ఆ వ్యవస్థను శక్తిమంతం చేస్తుండటం. ఇవిగాక, అమెరికా కూటమి నుంచి వైవిధ్యం కోసం పలు ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాల కోసం ప్రధాని మోదీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విధమైన పరిస్థితులు, పరిణామాలు 1991 నాటి ఆర్థిక సంస్కరణల సమయం నుంచి ఇదే మొదటిసారి. 2025లో ఎదురైన ఈ సవాళ్ల వంటివి లోగడ లేవు. వీటిని సానుకూలంగా ఎదుర్కొనగలగటంపై వర్తమానంతోపాటు దీర్ఘకాలిక భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుంది.

దెబ్బతిన్న సంబంధాలు

బయటి ప్రపంచంతో ఆర్థిక సంబంధాల పరిస్థితి ఇది కాగా, రాజకీయ సంబంధాలు మాత్రం సంతోషకరంగా సాగలేదు. పాకిస్తాన్‌తో యుద్ధం, బంగ్లాదేశ్‌తో సంబంధాల క్షీణత, శ్రీలంకతో సత్సంబంధాల కోసం పడుతున్న శ్రమ ఇందుకు తార్కాణం. చైనా, రష్యాలకు, ఇండియాకు మధ్య సంబంధాల అభివృద్ధి ముఖ్యంగా అమెరికా తీరు కారణంగా ముగ్గురికీ అవసరమనే గుర్తింపు గతంలో కన్న ఎక్కువగా ఏర్పడటం, అందుకు తగిన వ్యవహరణ అన్నది 2025లో కనిపించిన కొత్త విశేషం. చివరగా సమాజం విషయానికి వస్తే, యథాతథంగానే పెరుగుతున్న ఆర్థిక అసంతృప్తికి తోడు, ఒకవైపు అల్పసంఖ్యాక వర్గాలు, మరొకవైపు దళితుల భద్రత 2024 కన్న స్పష్టమైన రీతిలో మరింత క్షీణించింది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

ఇలా మారగలం!

సందర్భం



జనమేజయ సిన్హా

ప్రపంచ గతిని మలుపు తిప్పిన ఏడాదిగా 2025ని చెప్పుకోవచ్చు. వాణిజ్యం, యుద్ధం, పొత్తులు, విధాన నిర్ణయాలకు సంబంధించి ఒక నియమ ఆధారిత వ్యవస్థ బలహీనపడింది. దాని స్థానంలో శుద్ధ సైనిక, ఆర్థిక శక్తియుక్తులు ప్రపంచాన్ని నడిపించేవిగా తయారయ్యాయి. ఇవి దేశాల వ్యూహాలను పునః సమీక్షించుకోక తప్పని పరిస్థితిని కల్పించాయి. 2–26 కోసం... పాతవే అయినా నాలుగు శక్తిమంతమైన ఆలోచనలను మనం తిరిగి అమలులోకి తెచ్చుకోవాలని నేను సూచిస్తున్నాను.

సబ్సిడీ మొత్తాల బదిలీ

భారత్ అనేక రకాల సబ్సిడీలను ఇస్తోంది. ఎరువుల సబ్సిడీలు, కనీస మద్దతు ధరలు, ఉచిత విద్యుత్తు, ఉచిత నీరు, వివిధ రూపాల్లో ఉన్న జాబ్ గ్యారంటీలు వీటిల్లోకి వస్తాయి. వీటిల్లో కొన్ని పక్కదోవ కూడా పడుతున్నాయి. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో ఇవి దాదాపు 3.5 శాతం. నిజాయతీగా లెక్కగడితే అవి జీడీపీలో 7 శాతం వరకు చేరవచ్చు. అయితే, ఉదాహరణకు ఎరువుల సబ్సిడీ వల్ల యూరియాను అపరిమితంగా వినియోగిస్తున్నారు. భూసారం దెబ్బతినిపోతోంది. వ్యవసాయానికి విద్యుత్తు, నీరు ఉచితంగా ఇవ్వడం భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ సబ్సిడీలు కోశాగారానికి భారమే కాదు, పర్యావరణానికి విధ్వంసకరం కూడా!

దేశ 4.1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థలో జీడీపీలో సబ్సిడీలు సుమారుగా 7 శాతం అనుకుంటే, ఏటా అవి దాదాపు 300 బిలియన్ డాలర్ల మేరకు లెక్కకు వస్తాయి. అంత నగదును అసమర్థంగా వెచ్చించే బదులు, దాన్ని కుటుంబాలకు నేరుగా బదిలీ చేస్తే ఎలా ఉంటుందో ఊహించండి. మొత్తం కుటుంబాలలో సుమారు సగ భాగానికి లెక్కకు వచ్చే 15 కోట్ల భారతీయ కుటుంబాలకు ఏటా సుమారుగా 2,000 డాలర్లను లేదా సుమారుగా రూ. 1.8 లక్షలను అందించడం కుదురుతుంది. దీనివల్ల లీకేజీ తగ్గిపోతుంది. కుటుంబాలు ఆ ఆదాయాన్ని వాటికి నచ్చినట్టు వినియోగించుకుంటాయి.

ఒకే గొడుగు కింద ప్రభుత్వ రంగం

పారిశ్రామిక విధానంలో సింగపూర్ పంథాను మనం ఆదర్శంగా తీసుకోవచ్చు. సింగపూర్‌లో టెమసెక్ అనే ప్రభుత్వ యాజమాన్యంలోని హోల్డింగ్ కంపెనీ రాజకీయ మంత్రిత్వ శాఖలను ఆమడ దూరంలో ఉంచి, ప్రభుత్వానికి చెందిన వాణిజ్య ఆస్తులన్నింటినీ స్వతంత్రంగా, వృత్తి నైపుణ్యంతో నిర్వహిస్తుంది. భారత్ కూడా అటువంటి హోల్డింగ్ కంపెనీ ఏర్పాటును పరిశీలించాలి. రెగ్యులేషన్ నుంచి యాజమాన్యాన్ని వేరు చేయడం వల్ల పాలన మెరుగుపడుతుంది. ప్రస్తుతం వివిధ మంత్రిత్వ శాఖలు తమ ఆధ్వర్యంలో కొన్ని సంస్థలను అట్టే పెట్టుకుని, వాటి రెగ్యులేషన్ అధికారాలను కూడా కలిగి ఉన్నాయి. ఇది ప్రయోజనాల మధ్య ఘర్షణకు దారితీస్తుంది. ఉక్కు, బొగ్గు, పెట్రోలియం మంత్రిత్వ శాఖల లాంటివి అలానే ఉన్నాయి. దానివల్ల పోటీ, జవాబుదారీతనం, సమర్థత దెబ్బతింటాయి. హోల్డింగ్ కంపెనీ వల్ల వ్యూహాత్మక రంగాలపై జాతీయ స్థాయిలో నిష్కర్షగా చర్చ జరుగుతుంది. ఇతర దేశాలపై ఆధారపడటాన్ని నివారించేందుకు దేశీయ వస్తూత్పత్తి సామర్థ్యం ఏయే పరిశ్రమల్లో అవసరం ఉందో నిగ్గు తేలుతుంది. ప్రైవేటు వ్యక్తులు పెట్టుబడులకు సంశయిస్తున్నచోట, ప్రభుత్వం సంస్థలను నెలకొల్పి, ప్రారంభంలో రిస్కులకు సిద్ధపడి, సామర్థ్యాలను నిర్మించడం సాధ్యపడుతుంది.

> పాతవే అయినా నాలుగు శక్తిమంతమైన ఆలోచనలను మనం తిరిగి అమలులోకి తెచ్చుకుంటే దేశం మరింత పటిష్ఠమవుతుంది.

డిస్కంల పరిష్కారం

భవిష్యత్తును నిర్వచించగల టెక్నాలజీ ఏఐ అనుకుంటే, విద్యుత్తు, గణన శక్తి దానికి నిజమైన పునాదులవుతాయి. కానీ, ఏ పని చక్కబెట్టడానికైనా మూలాధారం విద్యుచ్ఛక్తే. భారత్ విద్యుదుత్పాదన సంస్థాపక సామర్థ్యం సుమారుగా 462 గిగావాట్ల మేరకు ఉంది. ఇతర దేశాల్లో మాదిరిగానే భారత్‌లో కూడా డేటా సెంటర్లకు అవసరమయ్యే విద్యుచ్ఛక్తి వాటా పెరగనుంది. ఈ నేపథ్యంలో, భారతదేశపు పంపిణీ కంపెనీలు, మనల్ని కుంగదీసే బలహీనతగా పరిణమిస్తాయి. వాటన్నింటి నష్టం కలిపి సుమారు 7 లక్షల కోట్ల మేరకు ఉంది. డిస్కంల సమస్యలు పరిష్కరించకుండా, భారత్ తన ఏఐ ఆకాంక్షలను నెరవేర్చుకోలేదు. అమెరికా, చైనా మాదిరిగా మనం కూడా అణు ‘సంలీనం’ ద్వారా విద్యుదుత్పాదన ప్రయోగాలకు దిగాలి. అణు ‘విచ్ఛిత్తి’ మార్గం కంటే అది తక్కువ వ్యయదాయకమైంది. పైగా, అణుధార్మిక వ్యర్థ పదార్థాలు తగ్గుతాయి.

సత్వర న్యాయం

న్యాయం చేకూరడంలో జాప్యమైతే న్యాయం దక్కనట్లే లెక్క. దేశంలో సుమారుగా 5,73,000 మంది ఖైదీలున్నారు. వారిలో 70 శాతం పైగా (దాదాపు 4,30,000 మంది) విచారణలో ఉన్న ఖైదీలు. వారిలో కొందరు, దోషిగా తేలినా అనుభవించవలసి వచ్చే గరిష్ఠ శిక్ష కన్నా ఎక్కువ అనుభవించారు. ఇంతకన్నా నైతిక వైఫల్యం మరొకటి ఉండదు. వేగంగా పనిచేసే న్యాయ వ్యవస్థ ఆధునిక భారతదేశానికి మూలస్తంభం కావాలి.

ఈ నాలుగు ఆలోచనలూ కొత్తవేమీ కావు. కానీ అస్థిర ప్రపంచంలో భారతదేశాన్ని పటిష్ఠమైనదిగా, మరింత స్థితిస్థాపక శక్తి కలిగినదిగా తీర్చిదిద్దుకునే ఆచరణాత్మక మార్గానికి దారి చూపగలవు.

వ్యాసకర్త ఆర్థికవేత్త – బీసీజీ ఇండియా చైర్మన్
(‘ద హిందుస్థాన్ టైమ్స్’ సౌజన్యంతో)

‘కృత్రిమ’ ఆఫర్ల వల

ఇన్ బాక్స్

ఆధునిక సాంకేతిక విప్లవంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఒక సరికొత్త శకానికి పునాది వేసింది. ఛాట్‌జీపీటీ రాకతో మొదలైన ఈ ప్రయాణం ప్రస్తుతం గూగుల్ జెమిని, మెటా, పర్‌ప్లెక్సిటీ, డీప్‌సీక్ వంటి దిగ్గజాల మధ్య తీవ్ర పోటీకి కేంద్రబిందువుగా మారింది. ఈ జనరేటివ్ ఏఐ రంగంలో తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి కంపెనీలు కళ్లు చెదిరే రీతిలో పెట్టుబడులు కుమ్మరిస్తున్నాయి. అధికారిక నివేదికల ప్రకారం, ఓపెన్ ఏఐ గత ఏడాది కేవలం ఒక్క నెలలోనే 6.6 బిలియన్ డాలర్ల నిధులు సేకరించింది. మెటా సంస్థ ఏఐ మౌలిక సదుపాయాల కోసం తన మూలధన వ్యయాన్ని భారీగా పెంచుతూ, 2025 చివరి నాటికి 65 బిలియన్ డాలర్ల మార్కును అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. గూగుల్ సైతం ఏఐ అభివృద్ధి కోసం ప్రతి మూడు నెలలకు సగటున 12 నుంచి 13 బిలియన్ డాలర్ల వరకు ఖర్చు చేస్తోంది. పర్‌ప్లెక్సిటీ స్టార్టప్ 2025 జూన్ నాటికి సుమారు 500 మిలియన్ డాలర్ల నిధులు సేకరించింది. ఈ భారీ పెట్టుబడుల వెనుక లాభాలు రాబట్టే గట్టి వ్యూహాలు దాగి ఉన్నాయి.

భారతీయ మార్కెట్‌ను తమ గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ఈ ఏఐ కంపెనీలు దేశీ టెలికాం దిగ్గజాలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. రిలయన్స్ జియో, గూగుల్ చేతులు కలిపి తమ 5జీ వినియోగదారులకు 18 నెలల పాటు ‘గూగుల్ జెమిని ప్రో’ సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందిస్తున్నాయి. ఎయిర్‌టెల్ తన యాప్ ద్వారా ఏడాది పాటు ‘పర్‌ప్లెక్సిటీ ప్రో’ సేవలను ఉచితంగా ఆఫర్ చేస్తోంది. విద్యార్థుల కోసం గూగుల్ ‘జెమిని ఫర్ స్టూడెంట్స్’ ప్రోగ్రామ్ ద్వారా నోట్‌బుక్ ఎల్‌ఎం, డీప్ రీసెర్చ్ వంటి టూల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది.

గతంలో భారత టెలికాం రంగంలో కొన్ని కంపెనీలు డేటాను ఉచితంగా ఇచ్చి ప్రజలకు ఇంటర్నెట్ వాడకాన్ని వ్యసనంగా మార్చాయి. ఆ వేగానికి, సౌకర్యానికి జనం అలవాటు పడ్డాక నెమ్మదిగా ధరలు పెంచాయి. ప్రస్తుతం ఏఐ కంపెనీలు కూడా ఇదే బాటలో నడుస్తున్నాయి. కొంతకాలం పాటు ఏఐ ప్రీమియం ఫీచర్లను వాడుతూ ప్రాజెక్టులు, రీసెర్చ్ చేసిన వినియోగదారులు సహజంగానే వాటిపై ఆధారపడతారు. ఉచిత గడువు ముగిసిన తర్వాత కంపెనీలు కొన్ని ఫీచర్లను నిలిపివేస్తాయి. అప్పుడు వేగం, కచ్చితత్వం, అడ్వాన్స్‌డ్ టూల్స్ కోసం కంపెనీలు నిర్ణయించిన నెలవారీ చందాలు కట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. వినియోగదారులు ఈ సౌకర్యాలను వాడుకుంటూనే, డిజిటల్ వ్యసనానికి లోనుకాకుండా జాగ్రత్త పడాలి.

– అల్లపురపు పవన్ కుమార్ | జర్నలిస్ట్

నష్టాల విమానయానం

డేటా సాయింట్

దేశీయ విమానయాన సంస్థల్లో ఇండిగో, స్టార్ ఎయిర్ తప్ప మిగతా పెద్ద ఎయిర్‌లైన్లన్నీ 2024–25లో నష్టాలనే మూటగట్టుకున్నాయి. ఇండిగో అంతకుముందు ఏడాది రూ.8,167 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

అంకెలు లాభం / నష్టం (రూ.కోట్లలో)



సంస్థ	లాభం / నష్టం (రూ.కోట్లలో)
ఇండిగో	7,253.30
స్టార్ ఎయిర్	68.75
ఎయిర్ ఇండియా	–3,977.5
ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్	–5,832.3
ఆకాశ ఎయిర్	–1,986.2

ఆధారం: కేంద్ర పౌర విమానయాన శాఖ

కాలాతీతుడు

జ్యోతిర్మయం

కాలం ఒక కనిపించని ప్రవాహం. పట్టుకుని ఆపడానికి వీలయ్యేది కాదు. కనిపించే ప్రవాహాన్ని పట్టుకుని ఆనకట్టవేసి ఆపొచ్చు. కాలంతో అలాంటి ఆటలు సాగవు. కదిలిపోకుండా ఒక్కటంటే ఒక్క క్షణాన్ని పట్టుకోగలిగితే చాలు, బ్రహ్మ చేతిలోంచి విశ్వనిర్మాణం మనిషి చేతిలోకి వచ్చేసినట్లే! అమరత్వం సిద్ధించినట్లే!

మహాభారతంలో ధృతరాష్ట్రుడిది నోరులేని ఇంటిపెద్ద పాత్ర. దుర్యోధనుడు చేసే అకృత్యాలను ఆపలేడు. అలా అని దుర్యోధనుడి కోసం దిగులుపడకుండా ఉండలేడు. వనవాసంలో పాండవులు పడుతున్న కష్టాలను గురించి విని ‘ఎంత కష్టం వచ్చింది వాళ్ళకి? అంతా నా కొడుకు వల్లనే కదా జరిగింది! ఎవరు చెప్పినా వినడు. ఏం చేయగలం? జరగకూడనిది జరిగిపోయింది. కాలం ఊరికే ఉండదు కదా! జరగాల్సింది జరగకుండా మానదు కదా!’ అని వేదాంతం మాట్లాడుతాడు. అయితే, కష్టాల మధ్య కాలం గడుస్తున్నప్పటికీ, కాలానికి ఎదురీది అన్నట్లుగా, అర్జునుడు దేవతలను మెప్పించి దివ్యాస్త్రాలను సంపాదించాడని తెలిసినప్పుడు, పాండవుల సౌభాగ్యానికి ఈర్ష్య కనబరచకుండా ఉండలేకపోయాడు.

చ. సిరికి దొలంగి కానల వసించి కృశించిన పార్థు డట్టి ని / ర్జరుల వరంబునం బరమ సమ్మద లీల మహాస్త్ర లాభ వి / స్ఫురణము బొంది యద్దివికి బోయి శరీరముతోన క్రమ్మఱన్ / ధరణికి వచ్చె; నిట్టివి గాదా! వివిధాద్భుత కర్మపాకముల్. రాజ్యాన్ని పోగొట్టుకుని, అడవులలో కందమూలాలు తింటూ కృశించి జీవితాన్ని గడుపుతున్న అర్జునుడు, ప్రాణంతో దివ్య లోకాలకు వెళ్ళి, ఇంద్రాది దేవతల నుండి అద్భుతమైన శక్తి కలిగిన అస్త్రాలను సంపాదించి, మళ్ళీ ప్రాణంతో భూమికి తిరిగి వచ్చాడు. కాలమూ, కర్మమూ కలిసిరావడం అంటే అదే కదా! – అని ధృత రాష్ట్రుడు ఈర్ష్యపడటం పై పద్యం భావం. కష్టపడే లక్షణం కలిగిన వ్యక్తిని చెడగొట్టగలవారు ఎవరూ ఉండరు. కాలం అతడికొక సమస్యగా కనపడదు. భూత భవిష్యద్వర్తమానాలన్నీ కలిసిపోయి కాలాతీతుడు అన్నట్లుగా ఉంటాడు... నిశ్చలంగా తన పని తాను చేసుకుపోతూ!

– భట్టు వెంకటరావు

సంపద సృష్టి లేదాయే ..

ఉన్నదీ ఆవిరాయే

జీఎస్టీ గణాంకాల్లో వెల్లడైన చేదు నిజం | 9 నెలల్లో రూ.1,785 కోట్ల రాబడి ఫట్

సాక్షి, అమరావతి: సంపద సృష్టించి.. రెట్టింపు సంక్షేమ పథకాలు అమలు చేస్తానంటూ ప్రగల్భాలు పలికి అధికారం చేపట్టిన చంద్రబాబు.. కొత్తగా సంపద సృష్టించగా పోగా ఉన్నదాన్ని కూడా ఆవిరి చేస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన జీఎస్టీ గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల కాలానికి జీఎస్టీ ఆదాయం అంతకుముందు ఏడాదితో పోలిస్తే రూ.1,785 కోట్లు పడిపోయింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లో రూ.33,371 కోట్లుగా ఉన్న జీఎస్టీ ఆదాయం ఈ ఏడాది 5.34 శాతం తగ్గి రూ.31,586 కోట్లకు పడిపోయింది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జీఎస్టీ ఆదాయం 6.8 శాతం పెరగడం గమనార్హం. ఈ 9 నెలల కాలంలో దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక 13.1 శాతం, తమిళనాడు 8.1 శాతం, కేరళ 8.4 శాతం, తెలంగాణ 5.1 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

రాష్ట్ర జీఎస్టీ ఆదాయం ప్రతినెలా తగ్గుతూ వస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం ఏప్రిల్ నెలలో రూ.4,686 కోట్లుగా ఉన్న జీఎస్టీ ఆదాయం క్రమంగా తగ్గుతూ డిసెంబర్ నాటికి రూ.3,137 కోట్లకు పడిపోయింది. గతేడాది డిసెంబర్ నెలలో జీఎస్టీ ఆదాయం భారీగా తగ్గిపోవడం.. ఈ ఏడాది డిసెంబర్ నెలలో 6 శాతం వృద్ధి నమోదు కావడానికి కారణంగా అధికారులు వెల్లడిస్తున్నారు. చంద్రబాబు సర్కారు అధికారం చేపట్టినప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. డిసెంబర్ 2023 డిసెంబర్‌లో రూ.3,545 కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ ఆదాయం డిసెంబర్ 2025 నాటికి రూ.3,137 కోట్లకు పడిపోయింది. రెడ్‌బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించిన ప్రభుత్వం అభివృద్ధికి తిలోదకాలు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలను అటకెక్కించింది. ఫలితంగా ప్రజల ఆదాయం క్షీణించి కొనుగోలు శక్తి పడిపోయింది. జీఎస్టీ రాబడి తగ్గడానికి ఇదే ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు.

నెలనెలా తగ్గుతున్న ఆదాయం



కొండంత భక్తి

అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద బారులు తీరిన వాహనాలు

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులతో తిరుపతిలో రద్దీ పెరుగుతోంది. నూతన సంవత్సరం కావడం, మరోవైపు వైకుంఠ ద్వార దర్శనాలు ఈనెల 8 వరకు ఉండటంతో ముందస్తుగా టికెట్లు పొందిన వివిధ ప్రాంతాల భక్తులు తరలి వస్తున్నారు. దీంతో గురువారం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాలు బారులు తీరాయి. గరుడ సర్కిల్ వరకు నిలిచిపోయాయి. తిరుమల వెళ్లే ఆర్టీసీ బస్సులు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఒక్క రోజే 5.13 లక్షల లడ్డూల విక్రయం

తిరుమల: గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా గత నెల 27న అత్యధికంగా 5.13 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేసినట్లు టీటీడీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. టీటీడీ గతేడాదిగా ప్రతిరోజూ 4 లక్షల వరకూ లడ్డూలను తయారు చేస్తోంది. ముఖ్యమైన రోజుల్లో 8 లక్షల నుంచి 10 లక్షల లడ్డూల వరకు (బఫర్) భక్తులకు అందుబాటులో ఉంచుతోంది. అలాగే, 2024తో పోల్చితే 10% అధికంగా లడ్డూలను విక్రయించినట్లు పేర్కొంది. 2024లో 12.15 కోట్ల లడ్డూలను విక్రయించగా 2025లో 13.52 కోట్ల లడ్డూలను టీటీడీ విక్రయించినట్లు తెలిపింది.

దుర్గమ్మ సేవలో జస్టిస్ టీసీడీ శేఖర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయాధికారి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ శుభేందు సామంత

భవానీపురం (విజయవాడ పశ్చిమ) : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మ వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శుభేందు సామంత కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గురువారం శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల / శ్రీకాళహస్తి / చంద్రగిరి: తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో జమ్మూ కశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అతుల్ శరత్‌చంద్ర చందూర్కర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.గోపాల కృష్ణారావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తదితరులున్నారు. అలాగే, జమ్మూ కశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని, జస్టిస్ గోపాలకృష్ణా రావు కుటుంబసమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మ వారిని దర్శించుకున్నారు.

ఆలయం వెలుపల జమ్మూ కశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా


జస్టిస్ అతుల్ శరత్‌చంద్ర చందూర్కర్

జస్టిస్ వి.గోపాల కృష్ణా రావు

జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

సత్యదేవుని సన్నిధిలో గుజరాత్ సీజే

అన్నవరం: కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారిని గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ సునీత అగర్వాల్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి పూజలు చేశారు. దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు, డిప్యూటీ కమిషనర్ బాబూరావు స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

గోవిందమాల భక్తులకు టీటీడీ శాపం

తిరుపతిలోని అలిపిరి వద్ద రోడ్డు పక్కన నిరీక్షిస్తున్న తమిళ భక్తులు

వందలాది కిలోమీటర్లు నడిచొచ్చిన భక్తులకు దక్కని శ్రీవారి దర్శనం

మాలధారులకు అలిపిరి వద్ద తప్పని నిరీక్షణ

తిరుపతి కల్చరల్: ధనుర్మాసంలో అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి నాడు పాదయాత్ర చేసుకుంటూ తిరుమల వచ్చిన భక్తులకు టీటీడీ నిర్ణయం శాపంలా పరిణమించింది. తమిళనాడులో తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వందలాది మంది భక్తులు, శ్రీవారిపై భక్తితో గోవింద మాలధారణ చేసిన భక్తులు పసుపు వస్త్రాలతో కాళ్లకు చెప్పులు లేకుండా నడిచి తిరుమల చేరుకుంటారు. పవిత్రమైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి నాడు స్వామివారిని దర్శించుకుంటారు. ఇలా ఏటా సుమారు 400 మంది భక్తులు సుమారు 400 కిలోమీటర్ల మేర కాలినడకన గోవింద నామస్మరణ చేస్తూ అలిపిరికి చేరుకుంటారు. అక్కడ టీటీడీ ప్రత్యేక కౌంటర్లలో టికెట్లు తీసుకుని తిరుమల కొండపైకి వచ్చి శ్రీవారిని దర్శించుకుంటారు. ఇందులో భాగంగా గత నెల 30, 31 తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో మాలధారణ చేసిన తమిళ భక్తులు అలిపిరికి చేరుకున్నారు. అలిపిరి వద్ద వైకుంఠ ఏకాదశి పది రోజుల దర్శనానికి టికెట్లు ఇవ్వరని తెలియడంతో వారంతా నివ్వెరపోయారు. స్వామిని దర్శించుకోవాలని చెబితే.. ముందుగానే ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని అలిపిరి వద్ద టీటీడీ సిబ్బంది చెప్పడంతో అవాక్కయ్యారు. దర్శన టికెట్లు లేకపోతే కష్టమని చెప్పడంతో ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా తాము గోవింద మాలధారణతో కాలినడకన ముందుగా తిరుపతికి చేరుకుని అక్కడ క్యూలైన్‌లో వేచి ఉండి అందరూ టికెట్లు తీసుకొని స్వామిని దర్శించుకుంటున్నామని భక్తులు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా టికెట్లన్నీ ఆన్‌లైన్ ద్వారా ఇవ్వాలని టీటీడీ తీసుకున్న నిర్ణయం తమకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల విషయంలో ఇలాంటి నిర్ణయాలు సరికాదంటూ టీటీడీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నూతన సంవత్సర సంబరాల్లో విషాదం

సాగర సంగమం వద్ద నీళ్లలోకి దూసుకుపోయిన కారు.. ఒకరి మృతి

సెల్ఫీ మోజులో మిద్దెపై నుంచి పడి ఓ మైనర్ దుర్మరణం

మద్యం మత్తులో బీరు సీసాలతో యువకుల దాడులు

అనంతపురం సెంట్రల్, సఖినేటిపల్లి, పుట్టపర్తి అర్బన్: నూతన సంవత్సర సంబరాలు పలువురి కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. రాష్ట్రంలో పలుచోట్ల అపశ్రుతులు చోటు చేసుకోవడంతో కొందరు ప్రాణాలు విడిచారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది సాగర సంగమం వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన దుర్ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. కాకినాడ నుంచి నిమ్మకాయల శ్రీధర్(35), నందమూరి వెంకట సాయినాథ్ గోపీకృష్ణ, బొండాడ సూర్యకిరణ్ అంతర్వేదికి బుధవారం రాత్రి చేరుకున్నారు. బీచ్‌కు సమీపంలో రూమ్ తీసుకున్నారు. అర్ధరాత్రి దాటాక రూంలో సూర్యకిరణ్ ఉండిపోగా, శ్రీధర్, గోపీకృష్ణ కారులో బయలుదేరి బీచ్ వెంబడి డ్రైవ్ చేస్తూ సాగరసంగమం వైపుకు వెళ్లారు. లైట్‌హౌస్ సమీపానికి వెళ్లే సరికి అక్కడున్న ఒడుపును వారు గుర్తించలేకపోయారు. అదే సమయంలో కారు అదుపు తప్పడంతో సంగమం వద్ద వేగంగా నీళ్లలోకి దూసుకుపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన గోపీకృష్ణ కారులోంచి దూకేయడంతో ప్రాణాలు దక్కించుకున్నాడు. డ్రైవర్ సీటులో ఉన్న శ్రీధర్ కారుతో సహా గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం శ్రీధర్ మృతదేహం లభ్యమైంది.

సాగర సంగమం వద్ద లభ్యమైన శ్రీధర్ మృతదేహం

తరుణ్ కుమార్‌రెడ్డి (ఫైల్)

సెల్ఫీ తీసుకుంటూ..

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం చెర్లోపల్లిలో సెల్ఫీ తీసుకుంటూ మిద్దెపై నుంచి కింద పడి యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన కాడాల తరుణ్‌కుమార్ రెడ్డి(17) మిత్రుడితో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి 12 గంటల అనంతరం మిద్దెపైకి వెళ్లారు. అక్కడ సెల్ఫీ తీసుకుంటుండగా తరుణ్‌కుమార్ రెడ్డి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతన్ని పుట్టపర్తిలోని సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. తరుణ్‌కుమార్ రెడ్డి ఇంటర్ పూర్తి చేశాడు. కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

బీరు సీసాలతో దాడులు

బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అనంతపురంలో మద్యం మత్తులో యువకులు చెలరేగి బీరు సీసాలతో దాడి చేయడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని ముత్యాలమ్మ గుడి వద్ద నివాసముంటున్న దినేష్, కళ్యాణ్.. అక్కడికి సమీపంలోని ఓ బేకరీలో పనిచేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో వీరిపై గుర్తు తెలియని యువకులు మద్యం మత్తులో బీరు సీసాలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన యువకులను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంయుక్తంగా కేసును విచారిస్తున్నారు.

బ్యాంకు దోపిడీ కేసులో మరో నిందితుడు అరెస్ట్

రూ.5.50 కోట్ల బంగారు నగలు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

హిందూపురం : శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామిక వాడలో గత ఏడాది జూలై 27న జరిగిన స్టేట్ బ్యాంక్ దోపిడీ కేసులో మరో కీలక నిందితుడు రాజస్థాన్‌లోని సలంపూర్‌కు చెందిన మహమ్మద్ ఇక్బాల్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద రూ.3.50 కోట్ల విలువ గల 3.50 కేజీల బంగారు నగలు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ సతీష్ కుమార్ గురువారం హిందూపురం అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. గత ఏడాది జూలై 27న తూమకుంట పారిశ్రామికవాడలోని ఎస్‌బీఐ లాకర్లను గ్యాస్ కట్టర్‌తో తెరిచి 11 కేజీల బంగారు నగలు, రూ.35 లక్షల నగదు దోచుకెళ్లారు. ఈ కేసులో గత ఏడాది ఆగస్టులో హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్ పన్వర్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద రూ.2 కోట్ల విలువ చేసే బంగారు నగలు, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. తాజాగా అరెస్టు చేసిన మహమ్మద్ ఇక్బాల్ ఖాన్ నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తుతో కలిపితే మొత్తం రూ.5.50 కోట్ల విలువైన బంగారు నగలు రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అరెస్టయిన అనిల్ పన్వర్, మహమ్మద్ ఇక్బాల్ ఖాన్ వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బ్యాంకు దోపిడీలు చేస్తున్నారని ఎస్పీ వెల్లడించారు.

ఆర్టీసీలో ‘విధి’ వంచన

చాలా సేపటికి ఒక్క బస్సు రావడంతో ఎక్కేందుకు చుట్టుముట్టిన ప్రయాణికులు

డ్రైవర్లు, కండక్టర్లు లేకపోవడంతో ఆగిపోయిన అద్దె బస్సులు

- **డ్యూటీకి డ్రైవర్లు, కండక్టర్లు డుమ్మా**
- **కాణిపాకం బస్సుల నిలిపివేత**
- **కొత్త సంవత్సరంలో అధికార పార్టీ నేతలను కలవాలంటూ ఎగ్గొట్టిన వైనం**
- **డ్యూటీకి రాని ఉద్యోగిని ప్రశ్నిస్తే.. నాయకుల నుంచి ఫోన్లు**

తిరుపతి అర్బన్: కొత్త సంవత్సరం నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు డ్యూటీకి డుమ్మా కొట్టారు. అధికారపార్టీనేతల సేవలో తరించారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిరుపతి బస్టాండ్‌లో కొత్త సంవత్సరం వేళ రద్దీ అధికంగా ఉంటుంది. సాధారణ సమయంలోనే తిరుపతికి రోజుకు 1.50లక్షల మందికి పైగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు 30వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులు తిరుగుపయనం నేపథ్యంలో రద్దీ మరింత పెరిగింది. జనవరి 1 సందర్భంగా గురువారం పలువురు కండక్టర్లు, డ్రైవర్లు అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులను కలవాలంటూ డ్యూటీలకు డుమ్మా కొట్టారు. దీంతో అధికారులు పలు బస్సులను నిలిపివేశారు. ప్రధానంగా కాణిపాకం మార్గంలో నడుస్తున్న 8 బస్సులను రద్దుచేశారు. ఇంకా పలుమార్గాల్లోని బస్సులను నిలిపివేశారు. ఇప్పటికే బస్సుల కొరతతో ఇబ్బంది పడుతుండడంతో ఉన్న బస్సులూ సిబ్బంది సెలవులతో రద్దు కావడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. 10 నుంచి 15శాతం మంది ఉద్యోగులు డ్యూటీకి గైర్హాజరైనట్టు సమాచారం. కొందరు ఉద్యోగ సంఘం నేతలు పదేపదే అధికార పార్టీ నేతల అండదండలతో డ్యూటీలకు డుమ్మాలు కొడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధికారులు ప్రశ్నిస్తే వెంటనే అధికార పార్టీ నేతల నుంచి ఫోన్లు చేయిస్తున్నారంటూ ఆర్టీసీ అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. సిబ్బంది కొరత సమాచారాన్ని తెలుసుకున్న జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ నిర్మల గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బస్టాండ్‌లోనే ఉండి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపడానికి పడరానిపాట్లు పడ్డారు. కొంతమందికి ఫోన్లు చేసి డ్యూటీకి రావాలని బతిమాలి మరీ పిలిపించినట్టు తెలిసింది. కొందరు ఉద్యోగులు రాజకీయ నేతలతో అధికారులకు ఫోన్లు చేయించినట్టు సమాచారం. దీంతో ఏం చేయాలో పాలుపోక అధికారులు ఇబ్బంది పడినట్టు తెలుస్తోంది. ఉదయం నుంచి చాలా బస్సు సర్వీసులను నిలిపివేశారని, అడిగినా బస్టాండ్‌లో పట్టించుకునేవారే లేరని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే కేవలం కాణిపాకం మార్గంలో నడుస్తున్న 8 బస్సులను మాత్రమే నిలిపివేసినట్టు తిరుపతి డిపో మేనేజర్ సురేంద్రకుమార్ తెలిపారు. ఇదిలాఉంటే సెలవు ఇవ్వకపోయినా విధులు ఎగ్గొట్టిన సిబ్బందిపై విచారణ చేపట్టినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ తెలిపారు.

680 కిలోల భారీ కేక్ కటింగ్

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మార్కాపురం జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం 680 కిలోల భారీ కేక్ కట్ చేశారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఈ భారీ కేక్‌ను వైఎస్సార్‌సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కట్ చేశారు. ఆయన కుమారుడు కృష్ణచైతన్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షల విరాళం

తిరుమల: టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు చెన్నైకి చెందిన పొన్నయ నాగేశ్వరన్ రూ.50 లక్షలు విరాళమిచ్చారు. తిరుమలలోని క్యాంప్ కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఈ డీడీని గురువారం అందజేశారు.

టీటీడీకి రూ.78 లక్షల విలువైన ఔషధాలు విరాళం

హైదరాబాద్‌కు చెందిన త్రిశూల్ ఎంటర్‌ప్రైజర్స్ సంస్థ అధినేతలు చక్రధర్, శివరంజని గురువారం టీటీడీకి రూ.78 లక్షలు విలువైన ఔషధాలను విరాళంగా అందించారు. దాతల తరఫున టీటీడీ బోర్డు సభ్యులు సదాశివరావు తిరుమలలోని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఔషధాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ పాల్గొన్నారు.

కలిసి జీవిస్తేనే 'గ్రీన్‌కార్డు'

- అమెరికా సిటిజన్‌ను పెళ్లి చేసుకొని దూరంగా ఉంటే కార్డు రానట్లే
- దరఖాస్తును తిరస్కరించే ప్రమాదం అధికంగా ఉంది
- ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నట్లు అధికారులకు నమ్మకం కలిగించాలి
- అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ బ్రాడ్ బెర్న్‌స్టీన్ వెల్లడి

వాషింగ్టన్: అమెరికాలో శాశ్వత నివాసానికి, తద్వారా పౌరసత్వం పొందడానికి దగ్గరి దారి అమెరికా పౌరసత్వం ఉన్న వారిని పెళ్లాడటం. గ్రీన్‌కార్డు అని పిలిచే శాశ్వత నివాస కార్డు(పర్మినెంట్ రెసిడెంట్ కార్డు) కోసం విదేశీయులు ముఖ్యంగా భారతీయులు అమెరికా పౌరుడు/పౌరురాలిని వివాహం చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తుంటారు. అమెరికాలో నివసిస్తున్న వలసదారుల అంతిమ లక్ష్యం గ్రీన్‌కార్డు సాధించడమే. అయితే, గ్రీన్‌కార్డు కలిగినవారు అమెరికా గడ్డపై జన్మించిన పౌరులతో సమానం కాదు. అయినప్పటికీ పౌరులతో సమానంగా చాలావరకు హక్కులు లభిస్తాయి. తర్వాత అమెరికా పౌరసత్వం పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ కార్డుకు డిమాండ్ పెరగడానికి ఇదే అసలైన కారణం. అమెరికా పౌరసత్వం కలిగినవారిని పెళ్లి చేసుకుని గ్రీన్‌కార్డు కొట్టేద్దామంటే ఇకపై కుదరదని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ బ్రాడ్ బెర్న్‌స్టీన్ తేల్చిచెప్పారు. ఇలాంటి పెళ్లితో గ్రీన్‌కార్డు రావడానికి గ్యారంటీ ఉండదని వెల్లడించారు.

- యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం అమెరికా సిటిజెన్‌ను వివాహం చేసుకొని జీవిత భాగస్వామిగా మారిన విదేశీ వ్యక్తిని ''అమెరికా సిటిజెన్ తక్షణ బంధువు'గా పరిగణిస్తారు. అమెరికా పౌరుడు/పౌరురాలి భార్య/భర్తకు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే అర్హత చట్ట ప్రకారం లభిస్తుంది.
- అమెరికా సిటిజెన్‌ను వివాహం చేసుకుంటే గ్రీన్‌కార్డు వచ్చేసినట్లేనని భావించవద్దని, ఆ అవకాశం ఉండదని బెర్న్‌స్టీన్ తెలియజేశారు. గ్రీన్‌కార్డు పొందాలంటే అమెరికా సిటిజెన్‌తో పెళ్లి ఒక్కటే సరిపోదని చెప్పారు. వివాహం చేసుకున్న స్త్రీ పురుషులు చాలా ఏళ్లుగా కలిసి జీవిస్తున్నట్లుగా నిర్ధారణ అయితేనే ఈ కార్డు పొందే వీలుంటుందని పేర్కొన్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాలపై బెర్న్‌స్టీన్‌కు 30 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. దంపతులు వేర్వేరుగా జీవిస్తున్నట్లు తెలిస్తే గ్రీన్‌కార్డు దరఖాస్తును ప్రభుత్వం పక్కనపడేసే ప్రమాదం అధికంగా ఉందని ఆయన చెప్పారు. ఒకే ఇంట్లో కలిసికట్టుగా ఉంటేనే అవకాశాలు మెరుగు పడతాయని ఆయన సూచించారు.
- ఉద్యోగం, పిల్లల చదువులు వంటి కారణాలతో వేర్వేరుగా ఉంటున్నామని దంపతులు చెప్పినా అధికారులు వినిపించుకునే పరిస్థితి ఉండదని బెర్న్‌స్టీన్ స్పష్టంచేశారు. కలిసి ఉంటున్నట్లు వారికి విశ్వాసం కలిగించాలని పేర్కొన్నారు. దంపతులు నిత్యం ఒకే ఇంటిని పంచుకోవడం అనేది వివాహనికి నమ్మకమైన గుర్తింపుగా ఇమ్మిగ్రేషన్ చట్టాలు భావిస్తాయని తెలిపారు.
- పెళ్లి చేసుకుని దూరంగా ఉంటూ గ్రీన్‌కార్డు కోసం ప్రయత్నించేవారు తొలుత న్యాయ సహాయం తీసుకోవాలని స్పష్టంచేశారు. అమెరికా వీసాలు, గ్రీన్‌కార్డుల కోసమే అమెరికా సిటిజెన్‌ను పెళ్లి చేసుకున్నట్లు తేలితే కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు.
- డొనాల్డ్ ట్రంప్ పాలనలో వివాహం ఆధారిత గ్రీన్‌కార్డు దరఖాస్తులను మరింత నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆ వివాహం అసలైనదేనా? దురుద్దేశం ఏదైనా ఉందా? అనే తనిఖీ చేస్తున్నారు. కేవలం కాగితాలపై జరిగిన పెళ్లి అని తేలితే దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు.
- అమెరికా వీసాల జారీ కార్యక్రమాన్ని ట్రంప్ కట్టడి చేస్తున్న సంగతి తెలిసిందే. డైవర్సిటీ వీసా(డీవీ) లాటరీని రద్దు చేశారు. ఈ లాటరీ ద్వారా విదేశీయులకు ఏటా 50 వేల దాకా వీసాలు ఇచ్చేవారు. ప్రస్తుతం అవన్నీ ఆగిపోయినట్లే.
- గ్రీన్‌కార్డుల కార్యక్రమంపై ట్రంప్ ప్రభుత్వం ప్రత్యేకంగా గురిపెట్టింది. నిబంధనలు కఠినతరం చేసింది. ఇప్పటికే గ్రీన్‌కార్డు పొందిన 19 దేశాల ప్రజల నేపథ్యాన్ని క్షుణ్నంగా పరిశీలించాలని ట్రంప్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సంబరాల వేళ స్విట్జర్లాండ్‌లో పేలుడు

బార్‌లో భారీ పేలుడుతో 40 మంది సజీవదహనం

- 115 మందికి గాయాలు
- మృతుల్లో పలు దేశాల పౌరులు
- మంచుమయ ఆల్ప్స్ పర్వతశ్రేణుల్లోని క్రాన్స్–మోంటానా సిటీలో విషాదం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- రంగంలోకి 10 హెలికాప్టర్లు, 40 అంబులెన్సులు, 150 మంది అగ్నిమాపక సిబ్బంది
- బాణసంచాకు నిప్పంటుకోవడంతో చెలరేగిన మంటలు
- అసలు కారణం ఇంకా తెలీదని ప్రకటించిన ప్రభుత్వం
- ఉగ్రదాడి కోణాన్ని కొట్టిపారేసిన సర్కార్

ప్రమాదం జరిగిన బార్

బార్ నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు

క్రాన్స్–మోంటానా(స్విట్జర్లాండ్): ఎప్పుడు దట్టంగా కమ్ముకున్న మంచుతో దవళవర్ణంతో ధగధగా మెరిసిపోయే స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతశ్రేణుల్లో ఒక్కసారిగా నిప్పుకణికలు ఎగిసిపడ్డాయి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రఖ్యాత క్రాన్స్–మోంటానాలోని ప్రముఖ బార్‌లో జనం వేడుకల్లో మునిగిపోయిన వేళ భారీ పేలుడు రూపంలో మృత్యుదేవత అక్కడివారిని కబళించివేసింది. డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి దాటాక 1.30 గంటలప్పుడు హఠాత్తుగా లీ కాన్‌స్టలేషన్ బార్, లాంజ్‌లో చెలరేగిన మంటలకు 40 మంది బలయ్యారు. 115 మంది గాయపడ్డారు. మంటలకు తాళలేక పలువురు పర్యాటకులు బార్ అద్దాల కిటికీలు బద్దలుకొట్టి బయటకు దూకారు. కాలిన గాయాలతో పలువురు రక్తమోడుతూ రోడ్డుపై పరుగులు పెట్టారు. ఇదంతా ఒక హారర్ మూవీని తలపించిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు ఫ్రెంచ్ 'బీఎఫ్‌ఎం' టీవీకి చెప్పారు. తొలుత భారీ శబ్దం వినిపించి తర్వాత బార్ నుంచి దట్టమైన పొగలు వెలువడ్డాయని మరో ప్రత్యక్షసాక్షి చెప్పారు. అనూహ్య ఘటనలో క్రాన్స్–మోంటానా సిటీ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే 10 హెలికాప్టర్లలో రంగంలోకి దిగి వెంటనే మంటల్ని ఆర్పే పనిలో పడ్డారు. క్షతగాత్రులను సమీప వలేస్ ఆస్పత్రిలో చేర్పించారు. క్షతగాత్రులతో ఆ ఆస్పత్రి ఐసీయూ యూనిట్ పూర్తిగా నిండిపోయింది. తీవ్రగాయాలైన వారిని మిలాన్ నగర ఆస్పత్రులకు తరలించారు. బార్‌లో గాయపడిన అతిథులను తరలించేందుకు 40 అంబులెన్సులను రప్పించారు. 150కిపైగా అగ్నిమాపక సిబ్బంది బార్‌లో మంటల్ని ఆర్పేందుకు శ్రమించారు. కాలిపోయిన మృతదేహాలను ఇంకా గుర్తించాల్సి ఉంది. ''పదుల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో స్థానికులు, ఇటాలియన్లు సహా పలు దేశాల పౌరులు ఉన్నారు. నూతన ఏడాది వేడుకలు కావడంతో వేర్వేరు దేశాల సందర్శకులు హాజరయ్యారు. మృతుల బంధువుల డీఎన్‌ఏ శాంపిళ్లు తెప్పించి సరిపోల్చి మృతదేహాలను అప్పగించేందుకు కొన్ని వారాల సమయం పడుతుంది'' అని వలేస్ సబ్‌డివిజన్ పోలీస్ కమాండర్ ఫ్రెడెరిక్ గిస్లెర్ స్పష్టంచేశారు. ఘటనను ఉగ్రదాడిగా భావించట్లేమని ఈ ప్రాంత అటార్నీ జనరల్ బేట్రిస్ పిలౌడ్ చెప్పారు.

ఇరుకైన మెట్లే ఇరికించాయా?

మంటలు అంటుకోవడానికి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. కొత్త ఏడాది మొదలవగా పేల్చిన బాణసంచా నుంచి వెలువడిన నిప్పుకణికల కారణంగా మంటలు అంటుకున్నాయని పలువురు చెప్పారు. ''అతిథుల కోసం నిలువుగా పేర్చిన షాంపేన్ బాటిళ్లపై ఉంచిన ఒక బర్త్‌డే కొవ్వొత్తి మంటలు పై కప్పుకు అంటుకున్నాయి. దాంతో రెప్పపాటులో మంటలు చెక్క సీలింగ్ అంతటా చుట్టుముట్టాయి. మొదటి ఫ్లోర్ మొత్తం మంటల్లో చిక్కుకుంది. పైన దాదాపు 200 మంది ఉన్నారు. 30 సెకన్ల వ్యవధిలో అంత మంది ఇంత చిన్న ఇరుకు మెట్ల మార్గం గుండా కిందకు దిగిరావడం సాధ్యంకాలేదు. మేం అదృష్టంకొద్దీ ఎలాగోలా బయటపడ్డాం. బాధితుల్లో చాలా మంది 16–26 ఏళ్ల వయసు వారే'' అని బార్‌లో సంబరాల్లో పాల్గొన్న ఫ్రాన్స్ జంట ఎమ్మా, అల్బనీలు చెప్పారు. ''వాస్తవిక కారణాలను ఇప్పుడే వెల్లడించలేం. సమగ్ర దర్యాప్తు తర్వాత అగ్నిప్రమాదానికి కారణాలు వెల్లడిస్తాం'' అని స్థానిక ప్రభుత్వ సారథి మ్యాథియస్ రెనార్డ్ చెప్పారు. అధ్యక్షుడిగా బాధ్యతలు మొదలెట్టిన తొలిరోజే భారీ అగ్నిప్రమాదం జరగడంతో స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గే పార్మెలిన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

4 దశాబ్దాలుగా ప్రముఖ స్కీ రిసార్ట్ బార్‌గా పేరు..

క్రాన్స్–మోంటానాలోని స్విస్ స్కీ రిసార్ట్‌లోని అతిపెద్ద బార్‌గా లీ కాన్‌స్టెలేషన్‌కు పేరుంది. దీనిని గత 40 ఏళ్లుగా నడుపుతున్నారు. ఇది రెండంతస్తుల భవంతి. కింది ఫ్లోర్‌లో అతిపెద్ద బార్ ఉంది. అక్కడ జనం మద్యం సేవిస్తూ నృత్యం చేసే ఏర్పాటు ఉంది. పై ఫ్లోర్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్‌లు చూసేందుకు భారీ ఎల్‌ఈడీ టీవీలున్నాయి. ఇందులో ఒకేసారి 300 మంది ఆతిథ్యం స్వీకరించవచ్చు. ఘటన జరిగినప్పుడు బార్‌లో ఎంత మంది ఉన్నారనేది తెలియాల్సి ఉంది.

బలగాల ప్రయోగంపై కేపీ ఓలీకి సమన్లు!

కాఠ్మండు: గత ఏడాది సెప్టెంబర్‌లో నేపాల్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంలో యువత పైకి సాయుధబలగాలను ప్రయోగించి నాటి ప్రధాని కేపీ శర్మ ఓలీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ కమిషన్ త్వరలో ఆయనను విచారించనుంది. జనవరి 21వ తేదీలోగా నివేదిక సమర్పించాల్సి ఉండటంతో ఆలోపు నిర్ణయాత్మకమైన నేతలు, అధికారుల నుంచి కమిషన్ సభ్యులు వివరణ తీసుకోనున్నారు. సెప్టెంబర్ 8వ తేదీన కాఠ్మండులో ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీ చేపట్టిన యువతపై పోలీసులు జరిపిన కాల్పుల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. నేపాల్‌లో అవినీతి, వారసత్వ రాజకీయాలు, అస్తవ్యస్త పాలనతో విసిగిపోయిన జనం జెన్–జెడ్ యువతరం సారథ్యంలో ఉద్యమించడంతో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో దేశవ్యాప్తంగా ఆనాడు 77 మంది చనిపోయిన విషయం తెల్సిందే. దీంతో నేపాల్ తాత్కాలిక ప్రభుత్వం నియమించిన గౌరీ బహదూర్ కర్కీ సారథ్యంలోని విచారణ కమిషన్ దర్యాప్తు మొదలెట్టింది. కర్కీ గురువారం మీడియాతో మాట్లాడారు. ఘటనలో స్పష్టత కోసం ఓలీకి సమన్లు జారీచేసి ప్రశ్నించే అవకాశముందని చెప్పారు. అయితే కమిషన్ ఎదుట తాను హాజరయ్యే ప్రసక్తే లేదని కేపీ శర్మ ఓలీ కరాఖండీగా చెప్పేశారు. కమిషన్ చట్టబద్ధతను, విచారణలో పారదర్శకతను ఆయన ప్రశ్నించారు.

బంగ్లాలో విద్వేషదాడుల పరంపర

ఢాకా: షేక్ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టాక మొహమ్మద్ యూనుస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏలుబడిలోకి వచ్చాక హైనారిటీవర్గంపై దారుణ దాడుల పర్వం కొనసాగుతోంది. గత రెండు వారాల్లో ఇప్పటికే ముగ్గురిపై దాడులు చేసి అంతమొందించగా తాజాగా మరో మైనారిటీ వ్యక్తిని దుండగులు విచక్షణారహితంగా కొట్టారు. తర్వాత నిప్పుపెట్టారు. ఈ విద్వేష దాడి ఘటన షరియత్‌పూర్ జిల్లాలోని ఖీర్‌బంగా బజార్‌లో జరిగింది. 50 ఏళ్ల ఆ వ్యక్తికి సొంతంగా ఫార్మసీ ఉంది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 8 గంటలప్పుడు దుకాణం మూసేసి తోలోయా ప్రాంతానికి చేరుకున్నారు. దాదాపు 9 గంటల సమయంలో అక్కడే ఉన్న మూక సభ్యులు ఈ వ్యక్తిని అడ్డగించి విచక్షణారహితంగా కొట్టారు. పదునైన ఆయుధాలతో దాడి చేశారు. పొత్తికడుపులో పొడిచారు. తర్వాత ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అయినాసరే బలం కూడదీసుకుని ఆ వ్యక్తి పరుగెత్తి సమీపంలోని చెరువులో దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

ఎయిర్ ఫోర్స్ వైస్ చీఫ్‌గా నగేశ్ కపూర్

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం వైస్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈయన సౌత్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్(ఎస్‌డబ్ల్యూఏసీ) కమాండింగ్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించారు. ఢిల్లీలోని వాయుభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈయన బాధ్యతలు చేపట్టారు. వైమానిక దళంలో దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సేవలందించిన ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ బుధవారం రిటైరవడంతో వైస్ చీఫ్ పదవి ఖాళీ అయ్యింది. 1986 ఐఏఎఫ్ బ్యాచ్‌కి చెందిన ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్‌కు వివిధ యుద్ధ విమానాలు, శిక్షణ విమానాలు నడిపిన అనుభవముందని భారత వైమానిక దళం(ఐఏఎఫ్) తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది.

కొత్త ఏడాదిలో పొలిటికల్ హీట్

2026లో ఎవరిది పైచేయి?..

- ఐదు రాష్ట్రాల్లో అగ్ని పరీక్ష!
- బెంగాల్, తమిళనాట నువ్వా–నేనా?
- దీదీకి 'యాంటీ'గండం.. స్టాలిన్‌కు 'విజయ్'భయం!
- పెద్దల సభలో పట్టు కోసం పావులు
- మారనున్న దేశ రాజకీయ ముఖచిత్రం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో మరో మహా సంగ్రామానికి తెరలేచింది. 2025లో ఢిల్లీ, బిహార్ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన కిక్ నుంచి రాజకీయ పార్టీలు తేరుకోకముందే 2026 రూపంలో మరో సవాల్ ముందుకొచ్చింది. కొత్త సంవత్సరం సాక్షిగా ఐదు రాష్ట్రాల్లో మోగనున్న ఎన్నికల నగారా జాతీయ రాజకీయాల్లో పెను మార్పులకు తెర తీయనుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలతోపాటు పార్లమెంటులో కీలకమైన రాజ్యసభ సీట్ల భర్తీ ఈ ఏడాదే జరగనుండటంతో ఢిల్లీ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికలు కేవలం అధికార మార్పిడి కోసమే కాదు 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు హెచ్చరికలుగా, సెమీఫైనల్స్‌గా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

బెంగాల్ రణరంగం: మమత కోటలో కమలం వికసించేనా?

దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్న పోరు పశ్చిమ బెంగాల్‌లోనే జరగనుంది. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. వరుసగా హ్యాట్రిక్ విజయాలతో తిరుగులేని నేతగా ఎదిగిన మమకు ఈసారి సొంతగూటి నుంచే అసమ్మతి సెగలు తగులుతున్నాయి. సందేశ్‌ఖాలీ ఘటనలు, రేషన్, విద్యాశాఖ కుంభకోణాలు తృణమూల్ కాంగ్రెస్ ప్రతిష్టను మసకబారేలా చేశాయి. అయితే'లక్ష్మీర్ భండార్' వంటి పథకాలతో మహిళా ఓటు బ్యాంకును మమత పదిలపరుచుకున్నారు. గత ఎన్నికల్లో 77 సీట్లతో సత్తా చాటిన బీజేపీ ఈసారి ఎలాగైనా మమతను గద్దె దించి కాషాయ జెండా ఎగురవేయాలని ఉవ్విళ్లూరుతోంది. ముక్కోణపు పోటీలో కాంగ్రెస్–లెఫ్ట్ కూటమి ఓట్లు చీలితే అది అంతిమంగా ఎవరికి లాభం చేకూరుస్తుందన్నదే ఇక్కడ ఆసక్తికరమైన అంశం.

ద్రవిడ గడ్డపై 'సినిమా' చూపించేదెవరు?

తమిళనాట రాజకీయాలు ఎప్పుడూ డీఎంకే, అన్నాడీఎంకే చుట్టూనే తిరిగేవి. కానీ, ఈసారి తమిళగ వెట్రి కజగం(టీవీకే) అధినేత, నటుడు విజయ్ రూపంలో సరికొత్త శక్తి దూసుకొచ్చింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని నమ్ముతుంటే అన్నాడీఎంకే పూర్వ వైభవం కోసం పాకులాడుతోంది. యువతలో పిచ్చ క్రేజ్ ఉన్న విజయ్ ఎవరి ఓట్లకు గండి కొడతారన్నదే అసలు సిసలు ట్విస్ట్. విజయ్ చీల్చే ప్రతి ఓటు అధికార డీఎంకేకు నష్టమా? లేక ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడం వల్ల స్టాలిన్‌కే లాభమా? అన్నది ఆసక్తి రేపుతోంది. అన్నామలై సారథ్యంలో బీజేపీ తమిళనాట పాగా వేయాలని వ్యూహాలు రచిస్తోంది.

కేరళలో సంప్రదాయం.. అస్సాంలో హిందుత్వ అజెండా

సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారే ఆనవాయితీ ఉంది. దాన్ని 2021లో బ్రేక్ చేసిన పినరయి విజయన్ ఈసారి ఆర్థిక సంక్షోభం, సహకార బ్యాంకుల కుంభకోణాల రూపంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ కూటమి (యూడీఎఫ్) అధికారం చేపట్టాలని చూస్తుండగా బీజేపీ క్రైస్తవ వర్గాలను ఆకట్టుకునే పనిలో పడింది. అటు ఈశాన్య రాష్ట్రం అస్సాంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 'హిందుత్వ' అజెండా, నియోజకవర్గాల పునర్విభజన బీజేపీకి కలిసొచ్చే అంశాలుగా మారే అవకాశాలున్నాయి. ఇక్కడ మతపరమైన ఓట్ల చీలికే గెలుపోటములను శాసించనుంది.

ఢిల్లీలో పైచేయి కోసం రాజ్యసభ ఫైట్

కేవలం అసెంబ్లీలే కాదు దేశ చట్టసభల్లో ఎగువ సభ అయిన రాజ్యసభలోనూ ఈ ఏడాది భారీ మార్పులు జరగనున్నాయి. ఏకంగా 73 మంది ఎంపీల పదవీకాలం ముగియనుంది. ఈ సీట్లను దక్కించుకోవడం కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌కు అనివార్యంగా మారింది. వక్ఫ్ సవరణ బిల్లు, ఉమ్మడి పౌరస్మృతి వంటి కీలక బిల్లులు రాజ్యసభలో గట్టెక్కాలంటే బీజేపీకి మెజారిటీ అత్యవసరం. అందుకే, ఈ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజ్యసభ గణితాన్ని, తద్వారా దేశ పరిపాలనా విధానాన్ని ప్రభావితం చేయనున్నాయి.

ఫలితాలను తారుమారు చేసే పంచ సూత్రాలు

ఈ ఎన్నికల్లో ప్రధానంగా ఐదు అంశాలు గెలుపోటములను ప్రభావితం చేయనున్నాయి. మొదటిది మహిళా ఓటర్లు; బెంగాల్, తమిళనాడులో మహిళలే నిర్ణయాత్మక శక్తి. రెండోది యువత; ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆగ్రహం ప్రభుత్వాలను మార్చే శక్తి కలిగి ఉంది. మూడోది కుల, మత సమీకరణాలు; ముఖ్యంగా అస్సాం, బెంగాల్‌లో ఇది కీలకం. నాలుగోది అధికార వ్యతిరేకత; ఏళ్ల తరబడి అధికారంలో ఉన్న పార్టీలపై ప్రజల్లో ఉండే అసహనం. ఐదోది పొత్తులు; విపక్షాల అనైక్యత అధికార పార్టీలకు వరంగా మారుతోంది. మొత్తానికి 2026 ఎన్నికలు 2029 సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా నిలువనున్నాయనడంలో సందేహం లేదు. మరి ఓటరు ప్రాంతీయ అస్తిత్వానికి పట్టం కడతారా? జాతీయ భావజాలానికి జై కొడతారా? అనేది కాలమే నిర్ణయించాలి.

ఖురాన్ ప్రతిపై ప్రమాణం చేస్తున్న జోహ్రాన్ మమ్దానీ

జోహ్రాన్ మమ్దానీ అనే నేను..

- న్యూయార్క్ మేయర్‌గా ప్రమాణ స్వీకారం
- రెండు ఖురాన్ ప్రతుల సాక్షిగా..

న్యూయార్క్: అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ నగర 112వ మేయర్‌గా భారతీయ మూలాలున్న జోహ్రాన్ మమ్దానీ(34) ప్రమాణ స్వీకారం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తెల్లవారుజామున న్యూయార్క్ ఓల్డ్ సిటీ హాల్ సబ్‌వే స్టేషన్ వద్ద నిరాడంబరంగా ఈ కార్యక్రమం జరిగింది. మమ్దానీ కుటుంబ సభ్యులు, సలహాదారులు, సన్నిహితులు హాజరయ్యారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన తొలి దక్షిణాసియా వాసిగా, తొలి ముస్లింగా, రెండో పిన్న వయస్కుడిగా మమ్దానీ రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే. ఆయనతో స్టేట్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ ప్రమాణం చేయించారు. మమ్దానీ రెండు ఖురాన్ ప్రతులపై ప్రమాణం చేయడం గమనార్హం. ఈ సందర్భంగా భార్య రమా దువాజీ పక్కనే ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తా..

ప్రఖ్యాత బాలీవుడ్ దర్శకురాలు మీరా నాయర్, కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మహమూద్ మమ్దానీల కుమారుడైన జోహ్రాన్ ఉగాండా రాజధాని కంపాలాలో జన్మించారు. ఏడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి అమెరికా చేరుకున్నారు. 2018లో అమెరికా పౌరసత్వం పొందారు. మేయర్‌గా న్యూయార్క్ నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని మమ్దానీ ప్రకటించారు. తన ప్రమాణ స్వీకారం నూతన అధ్యాయానికి ప్రారంభంగా అభివర్ణించారు. ప్రమాణ స్వీకారానికి వేదికగా పాత సబ్‌వే స్టేషన్‌ను ఎంచుకోవడానికి గల కారణాన్ని వివరించారు. ఇది 1904లో ప్రారంభమైందని, ఘన చరిత్ర కలిగి ఉందని పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చేలా తెలివైన, సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడానికి ఇదొక ప్రతీక అని చెప్పారు. ప్రమాణం కోసం మమ్దానీ ఉపయోగించిన ఖురాన్ ప్రతులకు కూడా ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. ఇందులో ఒకటి మమ్దానీ తాత నుంచి వారసత్వంగా వచ్చింది. మరొకటి న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీ నుంచి తీసుకొచ్చారు. దీనికి 200 ఏళ్ల చరిత్ర ఉంది. నల్ల జాతీయుల సంస్కృతిపై స్కోమ్‌బర్గ్ సెంటర్ ఫర్ రీసెర్చ్ సంస్థ అధ్యయనం చేసింది. ఈ క్రమంలోనే పలు ఖురాన్ ప్రతులను, పుస్తకాలను సేకరించింది. వీటిని న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీలో భద్రపర్చారు. అందులో ఒకటి మమ్దానీ ఉపయోగించిన ఖురాన్ కావడం విశేషం. తమ లైబ్రరీ నుంచి తీసుకెళ్లిన ఖురాన్‌పై మేయర్ ప్రమాణం చేయడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నామని లైబ్రరీ సీఈఓ ఆంథోనీ డబ్ల్యూ మార్క్స్ చెప్పారు. ఖురాన్‌పై ప్రమాణం చేసిన తొలి న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మరో రికార్డు సృష్టించారు.

అణు వసతులు.. ఖైదీల జాబితా

పరస్పరం మార్చుకున్న భారత్–పాకిస్తాన్

న్యూఢిల్లీ: నూతన సంవత్సరం మొదటి రోజైన గురువారం భారత్, పాకిస్తాన్‌లు తమ అణు వసతులు, ఖైదీల వివరాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకున్నాయి. 35 ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని ఇరు దేశాలు కొనసాగిస్తున్నాయి. భారత్–పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినప్పటికీ అణు వసతులపై పరస్పరం దాడులకు పాల్పడరాదన్న ఒప్పందం 1988లో కుదిరింది. 1991 జనవరి 27వ తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం మొదటిసారిగా 1992 జనవరి ఒకటో తేదీన అణు వసతులు వివరాలు మార్చుకున్నాయి. ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యాధికారికి పాక్, ఢిల్లీలోని పాక్ దౌత్యాధికారికి భారత్ ఈ మేరకు సమాచారం అందించాల్సి ఉంటుంది. అలా, వరుసగా 35వ సారి గురువారం ఈ మేరకు వివరాలను అందజేసుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఈ ఏడాది మేలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం తెల్సిందే. ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా క్షీణించినప్పటికీ రెండు దేశాలు ఈ ఒప్పందాన్ని ఏళ్ల తరబడి నిరాటంకంగా కొనసాగించడం విశేషం.

వారికి వెంటనే విముక్తి కల్పించాలి: భారత్

భారత్–పాక్‌లు గురువారం తమ దేశాల్లో ఉంటున్న ఖైదీల జాబితాను మార్పిడి చేసుకున్నాయి. పాక్ జైళ్లలో శిక్షాకాలాన్ని ముగించుకున్న 167 మంది భారతీయ మత్స్యకారులు, పౌర ఖైదీల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా భారత్ కోరింది. అదే విధంగా, పాక్ కస్టడీలో ఉన్న 35 పౌర ఖైదీలు, మత్స్యకారులను కాన్సులేట్ అధికారులు కలుసుకునేలా వెసులుబాటు కల్పించాలని అడిగింది. ప్రస్తుతం భారత్ జైళ్లలో పాక్ పౌరులు 391 మంది, మత్స్యకారులు 33 మంది ఉండగా, పాక్ జైళ్లలో 58 మంది భారత పౌరులు, 199 మంది మత్స్యకారులు మగ్గుతున్నారు.

దుప్పట్ల పంపిణీలో కారు బీభత్సం

ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు

మీర్జాపూర్: దుప్పట్ల పంపిణీ కార్యక్రమం వద్ద గుమికూడిన వారిపై ఓ వ్యక్తి వేగంగా కారు నడపడంతో ఒకరు చనిపోయారు. ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం యూపీలోని మీర్జాపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. భుయిఇఖ్వాస్ గ్రామంలో సామాజిక కార్యకర్త ఒకరు దుప్పట్లను పంచిపెడుతున్నారు. అదే సమయంలో వేగంగా వచ్చిన ఓ కారు అక్కడ గుమికూడిన జనంపైకి దూసుకెళ్లింది. కారుకు ఓ స్కూటర్ చిక్కుకోగా కొంతదూరం అలాగే ముందుకెళ్లింది. ఘటనలో స్కూటర్‌పై ఉన్న ధర్మేంద్ర అక్కడికక్కడే చనిపోయారు. గాయాలపాలైన ఆరుగురిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు వెంబడించి, బీభత్సానికి కారణమైన కారును అడ్డుకున్నారు. అందులోని డ్రైవర్ పారిపోయాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పరారీలో ఉన్న అతడి కోసం గాలింపు చేపట్టారు.

డ్రోన్ దాడిలో 24 మంది మృతి

50 మందికి గాయాలు

- కొత్త ఏడాది వేడుకలపై దారుణం
- రష్యా ఆక్రమిత ఖెర్సన్‌లో ఘటన
- ఉక్రెయిన్ పనేనంటున్న క్రెమ్లిన్

మాస్కో: ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత ఖెర్సన్ ప్రాంతంలో భారీ డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో కనీసం 24 మంది చనిపోయారు. 50 మంది గాయాలపాలయ్యారు. నల్ల సముద్ర తీర పట్టణం ఖోర్లీలో బుధవారం రాత్రి నూతన సంవత్సరం వేడుకలు జరుగుతున్న హోటల్, కేఫ్‌పై ఈ దాడులు జరిగాయని రష్యా తెలిపింది. ఇది ఉక్రెయిన్ పనే అంటూ ఆరోపించింది. ఈ దాడిపై ఉక్రెయిన్ స్పందించలేదు. వేడుకలు జరుపుకునే ప్రజలపై దాడి దారుణమని రష్యా పార్లమెంట్ ఎగువ సభ చైరపర్సన్ వలెంటినా మట్వియెంకో పేర్కొన్నారు. నాలుగేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో లక్ష్య సాధన చర్యలను రష్యా మరింత వేగవంతం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన చాటిచెప్పిందన్నారు. రష్యా ప్రాథమికంగా చేస్తున్న డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని తాజా పరిణామం నిరూపించిందని పేర్కొన్నారు. మంగళవారం నొవోగొరోడ్‌లోని అధ్యక్షుడు పుతిన్ అధికార నివాసంపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడికి తెగబడిందని రష్యా ఆరోపించడం తెల్సిందే. అదంతా అబద్ధమని ఉక్రెయిన్ ఖండించింది.

త్వరలో గౌహతి–కోల్‌కతా వందేభారత్ స్లీపర్

- జెండా ఊపనున్న ప్రధాని మోదీ
- టికెట్ ధర రూ.2,300– రూ.3,600
- వెల్లడించిన రైల్వే మంత్రి వైష్ణవ్

న్యూఢిల్లీ: ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న గౌహతి–కోల్‌కతా వందే భారత్ స్లీపర్ రైలు త్వరలోనే పట్టాలపైకి ఎక్కనుంది. ఈ రైలును మరో 15–20 రోజుల్లో, అంటే జనవరి 18 లేక 19వ తేదీల్లో ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో కచ్చితమైన షెడ్యూల్ ఖరారవుతుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం వెల్లడించారు. మొత్తం 16 బోగీలుండే ఈ రైలులో 823 మంది ప్రయాణించవచ్చన్నారు. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ఇది నడుస్తుందని ఆయన వివరించారు. అయితే, ప్రస్తుతానికి 120–130 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించనుందన్నారు. విమాన ఛార్జీలతో పోలిస్తే వందే భారత్ స్లీపర్ రైలు టికెట్ ధరలు చాలా చౌక అని చెప్పారు. గౌహతి–కోల్‌కతా విమాన ప్రయాణ ఖర్చు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఉంటుందని గుర్తు చేసిన ఆయన.. వందే భారత్ థర్డ్ క్లాస్ ఏసీ టికెట్ ధర సుమారు రూ.2,300, సెకండ్ క్లాస్ ఏసీ రూ.3 వేలు, ఫస్ట్ క్లాస్ ఏసీ టికెట్ ధర రూ.3,600 వరకు ఉంటాయన్నారు. ఆహారం ధర కూడా ఇందులోనే కలిపి ఉంటుందని మంత్రి చెప్పారు. గౌహతి నుంచి మొదలయ్యే రైలులో అస్సామీల ఆహారం, కోల్‌కతా నుంచి మొదలయ్యే రైలులో బెంగాలీ భోజనం అందుబాటులో ఉంటాయని చెప్పారు. మధ్య తరగతి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని టికెట్ ధరలను నిర్ణయించామన్నారు. ఫస్ట్‌క్లాస్ ఏసీ అయితే కిలోమీటరుకు రూ.3.8, సెకండ్ క్లాస్‌కు రూ.3.1, థర్డ్ క్లాస్ ఏసీ కిలోమీటరు ప్రయాణానికి రూ.2.4 వరకు ఛార్జీ ఉంటుందని చెప్పారు. గౌహతి–కోల్‌కతా వందేభారత్ స్లీపర్ రైలులోని 16 కోచ్‌లకు గాను 11 థర్డ్ ఏసీ కోచ్‌లు, నాలుగు సెకండ్ క్లాస్ ఏసీ కోచ్‌లు, ఒక ఫస్ట్‌క్లాస్ ఏసీ ఉంటాయని తెలిపారు. అత్యంత భద్రతా ప్రమాణాలు, శుభ్రత, సుఖంగా ఉండే సీటింగ్, ఆటోమేటిక్ డోర్లు, ఆటోమేటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్ కవచ్ దీని ఇతర ప్రత్యేకతలని వివరించారు.

చెన్నకేశవ ఆలయంలో విశేష పూజలు



వేమూరు: జంపని లోని శ్రీ భూ సహిత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

మరకత లింగానికి పూజలు

ఫిరంగిపురం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేమవరంలోని కోటి ఒక్క లింగాల క్షేత్రంలో మహాకాళేశ్వరుడికి గురువారం విశేష పూజలు నిర్వహించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1600, మోడల్ ధర రూ.1400 వరకు పలికింది.

న్యూస్‌రీల్

రేపు మల్లేశ్వరుని సన్నిధిలో శివముక్కోటి పూజలు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం ఆరుద్రోత్సవంశాస్త్రోక్తంగా జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆరుద్రోత్సవం విశిష్టతను దేవస్థాన స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు వివరిస్తూ ధనుర్మాసంలో వచ్చే ఆరుద్రా నక్షత్రాన ఈశ్వరునికి అరుద్రోత్సవం, తెల్లవారుజామున ఉత్తరద్వార దర్శనం జరుగుతుందన్నారు. దీనినే ఆరుద్రోత్సవం లేదా శివముక్కోటి అని కూడా అంటారని తెలిపారు. తెల్లవారుజామున స్వామి వారికి విఘ్నేశ్వరపూజ, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్ర పంచామృత అన్నాభిషేకం నిర్వహించబడుతుందన్నారు. అనంతరం పూలతో శోభాయమానంగా అలంకరించిన నంది వాహనంపై భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

జెడ్పీలో నూతన సంవత్సర వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు నూతన సంవత్సర కేక్ కట్ చేసి, అధికారులతో పాటు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, పలువురు ఎంపీడీవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

4న తెనాలిలో హిందూ సమ్మేళనం

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి కొత్తపేట, షరాఫ్‌బజార్ బస్తీలకు సంబంధించి ఈనెల 4న జరగనున్న హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్ఎస్, హిందూ చైతన్యవేదిక నాయకులు కోరారు. కార్యక్రమ ఆహ్వానపత్రికను గురువారం ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 4వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి హిందూ సమ్మేళనం జరగనుందని రాష్ట్ర ఆర్‌ఎస్ఎస్ మీడియా ప్రముఖ్ అవ్వారు శ్రీనివాసరావు, హిందూ చైతన్య వేదిక జిల్లా సంయోజక్ పొట్టి మూర్తి తెలియజేశారు. హిందూ చైతన్యవేదిక రాష్ట్ర సంయోజక్ పిన్నం వెంగళరావు ప్రధాన వక్తగా, తెనాలికి చెందిన పెండేల వెంకట్రావు, డబుల్‌హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. హిందూ సమ్మేళన నిర్వహణ కమిటీ శ్రీరాం రాజేష్‌బాబు, తాతా శ్రీనివాసరావు పర్యవేక్షించే ఈ సమ్మేళనంలో హిందువులందరూ కుటుంబాలతో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ సంయోజక్ కోట రాజేష్, సహ సంయోజక్ విజయ్, తెనాలి పట్టణ ఐక్యవేదిక నుంచి వెచ్చా శ్యామ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నృసింహ ఆలయంలో భక్తుల కోలాహలం

మంగళగిరి టౌన్: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం మంగళగిరి పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచి దిగువ, ఎగువ సన్నిధి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, నూతన సంవత్సరంలో మంచి జరగాలని కోరుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ సునీల్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రైతుల భూములపై కన్ను?

- కార్పొరేషన్‌లో పంచాయతీల విలీనం వెనుక కథ ఇదేనా..
- 14 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంకు వస్తుందంటూ ఎమ్మెల్యే బూర్ల లెక్కలు..
- అసలు ప్రభుత్వ భూములు లేకుండా ల్యాండ్ బ్యాంకు ఎలా వస్తుంది?
- రైతుల భూములు లాక్కుంటారా.. ఆందోళనలో రైతాంగం
- విలీనం ప్రక్రియను వ్యతిరేకిస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు
- ఇప్పటికే విలీనం అయిన పంచాయతీలు అభివృద్ధికి ఆమడ దూరంలో...

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతుల భూమిపై కన్ను పడిందా? వాటిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు పావులు కదుపుతున్నారా? గుంటూరు కార్పొరేషన్‌లో 18 గ్రామాలను విలీనం చేయాలన్న ప్రక్రియపై ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్న భయాందోళనలు ఇవి. ఇటీవల విజయవాడ, తిరుపతి గ్రేటర్ చేయాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాయిదా వేశారు. కొత్తగా జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో 2011 జనాభా లెక్కల ప్రకారం విలీనం సబబు కాదని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. అయినా గుంటూరులో మాత్రం సొంత పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నా కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. మొదట 11 గ్రామాల విలీనం కోసం తీర్మానం పెట్టగా, దీని ద్వారా సుమారు 14 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ కార్పొరేషన్‌కు అందుబాటులోకి వస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చెప్పుకొచ్చారు.

ప్రభుత్వ భూమి లేని గ్రామాలు..

నగరానికి ఆనుకుని ఉన్న తక్కెళ్లపాడు, అగతవరప్పాడు, పెదకాకాని లేకుండా మిగిలిన దూరంలో ఉన్న గ్రామాలను కలపడం ఏంటని అభ్యంతరాలు సొంత పార్టీ సభ్యుల నుంచే రావడంతో మళ్లీ తాజాగా జరిగిన సమావేశంలో మరో ఏడు గ్రామాలను కలిపి మొత్తం 18 గ్రామాలను అజెండాలో పెట్టారు. దీనివల్ల 20 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ కార్పొరేషన్‌కు వస్తుందని బూర్ల రామాంజనేయులు చెబుతున్నారు. అసలు ప్రభుత్వ భూమి లేని ఈ గ్రామాలను కలపడం వల్ల ఇంత పెద్ద ఎత్తున ల్యాండ్ బ్యాంక్ ఎలా వస్తుంది? మా భూములు తీసేసుకుంటారా అన్ని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతుందని బూర్ల తన ప్రతిపాదనలో పేర్కొనడం చూస్తుంటే ఈ గ్రామాలను కార్పొరేషన్‌లో కలిపి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు కనపడుతోంది.



గ్రేటర్ గుంటూరు మ్యాప్

వ్యతిరేకిస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు...

2012లో మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపిన గ్రామాలకే ఇప్పటి వరకు మంచినీటి సదుపాయాన్ని కల్పించడంలో కార్పొరేషన్ విఫలమైంది. అటువంటప్పుడు మరో 18 గ్రామాలను కలపడం ఉపయోగం లేదన్నది ప్రజా ప్రతినిధుల వాదన. ఈ ప్రతిపాదనను గుంటూరు తూర్పు, పశ్చిమ, పొన్నూరు ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, ధూళిపాళ్ల నరేంద్ర వ్యతిరేకిస్తున్నారు. అలాగే గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయడం ద్వారా పరిపాలనా పరమైన సమస్యలు వస్తాయని తూర్పు ఎమ్మెల్యే నసీర్ వ్యతిరేకించారు.

విలీనం అయ్యే గ్రామాలివే....

లాల్‌పురం, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, మల్లవరం, చినపలకలూరు, దాసుపాలెం, తురకపాలెం, తోకవారి పాలెం, గొల్లవారిపాలెం, ఓబులునాయుడుపాలెం, జొన్నలగడ్డ, ఆగతవరప్పాడు, వెనిగండ్ల, కొర్నెపాడు, పుల్లడిగుంట, తక్కెళ్లపాడు, లాం, పెదకాకాని గ్రామాల విలీనానికి ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వ ఆమోదం కోసం తీసుకోనున్నారు. 18 గ్రామాలను విలీనం చేయాలనుకున్నప్పుడు అక్కడ గ్రామ సభలు నిర్వహించి ప్రజామోదంతో పాటు పంచాయతీ తీర్మానాలు చేయాల్సి ఉంది. అయితే కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి, సర్పంచ్‌లకు తెలియకుండానే తీర్మానాలను చేసి పంపించారు. దీన్ని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట

అధికారం చేతిలో ఉంది కదా అని గ్రామాలను విలీనం చేస్తున్నాం. పంచాయతీలు తీర్మానాలు చేసి పంపండి అంటూ హుకుం జారీ చేశారు. పంచాయతీ సెక్రటరీలు తప్పని పరిస్థితిలో కనీసం సర్పంచ్‌లకు సమాచారం కూడా లేకుండా తీర్మానాలు చేశారు.

– ఇంటూరి పద్మావతి, ఎంపీపీ చల్లావారిపాలెం, రూరల్ మండలం

ప్రజల అభిప్రాయాలు తీసుకోరా.?

విలీనం చేసే సమయంలో కనీసం గ్రామాల్లో ప్రజల అభిప్రాయం తీసుకోవాలి. కానీ అటువంటి సంఘటనలు ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు. ప్రజల అభిప్రాయం తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు ఎలా తీసుకుంటారు.

– వంగా నవీన్‌రెడ్డి, జొన్నలగడ్డ

విలీనం చేసిన గ్రామాల్లోనే సమస్యలు

20 ఏళ్ల కిందట విలీనం చేసిన గ్రామాల్లోనే లక్షల కొద్ది సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. నేటికీ పట్టించుకునే నాథుడు లేడు.

– దారం అశోక్‌కుమార్, బొంతపాడు

కలెక్టరేట్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

కేక్ కట్ చేసిన జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: నూతన సంవత్సరం 2026 వేడుకలు స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో షేక్ ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దేవాది దేవుడు ఏసుక్రీస్తు

మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

దివ్యపూజాబలిలో పాల్గొన్న కథోలిక క్రైస్తవులు

వాక్యోపదేశం చేస్తున్న మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం: దేవాది దేవుడు ఏసుక్రీస్తు అని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు కథెడ్రల్ దేవాలయంలో మరియమాత దివ్య మాతృత్వదినోత్సవం, 2026 నూతన సంవత్సర ఆశీర్వాద దివ్యపూజాబలి బుధవారం అర్ధరాత్రి నిర్వహించారు. ఆయన వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ దేవుడిని నిత్యం ప్రార్థన చేయాలని చెప్పారు. దాని ద్వారా ఆయన ఆశీర్వాదం మనకు లభిస్తుందన్నారు. నూతన సంవత్సరంలో పాడి పంటలు బాగా పండాలని, ప్రజల కష్టాలు తొలగిపోవాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమామర్రెడ్డి, సహాయ విచారణ గురువు కె.సాగర్, మఠ కన్య స్త్రీలు, సోడాలిటి సభ్యులు, ప్యారిష్ కౌన్సిల్, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు ఎన్నికలు

ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి జగదీశ్వరరావు

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో గుంటూరు జిల్లా శాఖకు ఎన్నికలు నిర్వహించేందుకు అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి జగదీశ్వరరావును ఎన్నికల అధికారిగా నియమించారు. ఏపీ ఎన్జీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణలు ఎన్నికల అధికారిని నియమించారు. ఎన్నికల అధికారిగా నియమితులైన కిలారీ జగదీశ్వరరావు గుంటూరు జిల్లా ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. ఈ నెల 4న నామినేషన్‌ల స్వీకరణ, లీ నెల 19న ఓటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో అధ్యక్ష, కార్యదర్శుల సహా 17 పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు సిటీ, ప్రత్తిపాడు, దుగ్గిరాల, అమరావతి, మంగళగిరి, తెనాలి, పొన్నూరు తాలూకా యూనిట్లకు చెందిన 256 ఏపీ ఎన్జీజీవో సభ్యులు తమ ఓటు హక్కును జిల్లాలో వినియోగించుకుంటారని వెల్లడించారు.

హాయి.. హాయిగా ఆరోగ్యంగా జీవిద్దాం..

కొత్త ఏడాది..కొత్త ప్లాన్ బాస్..

- కొద్దిపాటి జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం
- వైద్యుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు
- నూతన సంవత్సరంలో ఆరోగ్యంగా జీవించడానికి వైద్యుల సలహాలు

జీజీహెచ్‌లో ఓపీ విభాగంలో చికిత్స కోసం వచ్చిన రోగులు (ఫైల్)

గుంటూరు మెడికల్: నూతన ఏడాది ప్రారంభంలో ప్రతి ఒక్కరు ఏదో ఒక మంచి నిర్ణయం తీసుకుని జీవితంలో ఎదిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఎంత డబ్బు సంపాదించినా, ఎంత ఉన్నత ఉద్యోగాలు పొందినా ఆరోగ్యం సక్రమంగా లేకపోతే ప్రయోజనం సున్నా. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఉన్న ఆరోగ్యం పోగొట్టుకుని దానికోసం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ఆస్పత్రులు చుట్టూ తిరుగుతూ నానా అవస్థలు పడటం కంటే వ్యాధుల రాకుండా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుని, వైద్యుల సలహాలు పాటిస్తే నిశ్చింతంగా జీవించవచ్చు. మారిన ఆధునిక జీవనశైలి, పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో పాటు పోటీ ప్రపంచంలో కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే ఆరోగ్యం పాడయ్యే ప్రమాదం ఉంది. రోగాలు వచ్చిన తర్వాత వైద్యుల వద్దకు పరుగులు తీయటం కంటే ముందస్తుగా వైద్యుల చెప్పే సూచనలు, సలహాలు పాటించటం మంచిది. కొద్దిపాటి సూచనలు, సలహాలతో 2026లో ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకుని హాయిగా జీవించేందుకు వైద్యుల సలహాలతో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

గుండె కోసం ఇవి పాటించాలి...



శరీరంలోని అన్ని అవయవాల్లో గుండె ప్రధానమైంది. గుండె కోసం తప్పని సరిగా ప్రతిరోజు వ్యాయామం చేయాలి. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి.నూనె అధికంగా ఉండే పదార్థాలు, చికెన్, మాంసం వంటి కొవ్వు అధికంగా ఉండే పదార్థాలను తినకూడదు. ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలి. బీపీ, షుగర్‌లను నియంత్రణలో పెట్టుకోవాలి. 35 సంవత్సరాలు దాటిన వారు ఏడాదికోసారి రక్తంలో కొవ్వు శాతం పరీక్షలు చేయించుకోవాలి. ధూమపానం, మద్యపానం జోలికి వెళ్ళకూడదు. ఒత్తిడి లేకుండా ఉండాలి.

– డాక్టర్ పోలవరపు అనురాగ్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు.

బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టుకోవాలి...



అనేక శారీరక రుగ్మతలకు రక్తపోటు, మధుమేహం ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఇవి అదుపులో లేకపోతే మూత్రపిండాలు, గుండె ఫెయిల్ కావడం, దృష్టి లోపాలు రావటం, పక్షవాతం వస్తుంటాయి. బీపీ, షుగర్ ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించి అదుపులో పెట్టుకోవాలి. రోజువారీ ఉప్పు వాడకం ఐదు గ్రాముల కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలి. బీపీని అదుపులో పెట్టేందుకు రోజు యోగా చేయాలి. పొటాషియం, క్యాల్షియం ఉండే పాలు, పండ్లు వంటి ఆహారాన్ని తీసుకోవాలి.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు

కిడ్నీలు పాడవకుండా ఉండాలంటే...



శరీరంలో స్వచ్ఛమైన రక్తం ఉండేలా చేసే కిడ్నీలు చాలా కీలక పాత్రనే పోషిస్తుంటాయి. కాళ్ల వాపులు, మూత్రం ఎక్కువ సార్లు రావటం, మూత్రంలో మంట, మూత్రంలో రక్తం కారటం, ఆకలి లేకపోవటం, వాంతులు కావటం తదితర లక్షణాలు కనిపిస్తే మూత్ర పిండాలకు సంబంధించిన వ్యాధిగా అర్థం చేసుకోవాలి. నొప్పుల మాత్రలు, నాటు మందులు వాడటం, బీపీ, షుగర్‌లు అదుపులో లేకపోతే మూత్రపిండాలు పాడవుతాయి. బీపీ, షుగర్ ఉన్నవారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు.

కిక్కెక్కించారు..!

- 31వ తేదీ రాత్రి కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం
- ఉమ్మడి జిల్లాలో 17వేలకు పైగా లిక్కర్ బాక్స్‌లు, 4,966 కేసుల బీర్లు అమ్మకాలు
- ఎక్సైజ్ శాఖకు సుమారు రూ.13 కోట్ల ఆదాయం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి ఉమ్మడి గుంటూరు జిల్లాలో మద్యం ఏరులై పారింది. వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, క్లబ్‌లు, ఈవెంట్స్‌లలో లిక్కర్ భారీ కిక్కునిచ్చింది. మందేసి, చిందేస్తూ కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మద్యం విక్రయాలు మరింత జరిగాయి. ఇక యువత రోడ్లపై వేడుకలు చేసుకున్నారు. గుంటూరులోని లక్ష్మీపురం, బృందావన్‌గార్డెన్స్‌లో, యువత బైకులపై స్టంట్స్ చేసుకుంటూ, బైక్ సైలెన్సర్స్ పీకేసి రోడ్లు మీద విపరీతమైన శబ్దంతో తిరుగుతూ ఫుల్ జోష్‌లో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు.

ఏరులై పారిన మద్యం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17359 కేసుల (బాక్స్‌లు) లిక్కర్, 4966 కేసుల బీర్లు విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.12.96కోట్ల విక్రయాలు జరిగాయని చెప్పుకోవచ్చు. గత సంవత్సరం వేడుకల్లో 11వేలకు పైగా కేసుల లిక్కర్, 3500 కేసుల బీర్ల విక్రయాలతో రూ.10 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సంవత్సరం రూ.3 కోట్లు వరకు అదనంగా ఆదాయం సమకూరిందనే చెప్పుకోవచ్చు.

దుర్గమ్మ ఆర్జిత సేవలకు డిమాండ్

భక్తులతో కిటకిటలాడుతున్న క్యూ లైన్లు

అంతరాలయంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గురువారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి నిర్వహించే ఆర్జిత సేవలకు డిమాండ్ ఏర్పడింది. భక్తుల ఉదయం రద్దీ సాదారణంగా ఉండగా, 11 గంటల తర్వాత క్రమంగా పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులతో అన్ని క్యూలైన్లు కిటకిటలాడుతూ కనిపించాయి. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు డిమాండ్ కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, ఛండీహోమం, శాంతి కల్యాణం, నవగ్రహ హోమం, గణపతి హోమాల్లో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకీ సేవలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయం వెలుపుల ఉన్న వేద ఆశీర్వచనాన్ని గురువారం నుంచి ఆలయం లోపల మండపంలోకి మార్పు చేస్తూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 11 గంటల తర్వాత ఒక సారిగా భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. సర్వ దర్శనానికి రెండు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు రూ.100 టికెట్ క్యూలైన్‌లోకి ఉచితంగా మళ్లించి రద్దీని నియంత్రించారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. పలువురు పుర ప్రముఖులు, వీఐపీలు సైతం మహా నివేదన అనంతరం అమ్మవారి దర్శనానికి విచ్చేయడంతో సాధారణ భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. రద్దీ నేపథ్యంలో ఏఈఓలతో పాటు పలువురు సూపరింటెండెంట్లకు, ఇతర సిబ్బందికి ఆలయంలో ప్రత్యేక విధులు కేటాయించారు. మరోవైపు ఆలయానికి చేరుకునే క్యూలైన్లతో పాటు గాలిగోపురం, వీఐపీ మార్గం, సింహద్వారాల వద్దకు భక్తులు చేరుకుని తమను అలయంలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు.

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	31,392
అమ్మకాలు	34,992
నిల్వ	11,276

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,000
నంబరు–5	12,000–15,500
341	11,000–17,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16,600
నంబరు–5	11,000–15,000
341	11,000–16,500
4884	12,000–14,300

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 16,500
బాడిగ–355	11,000 – 17,000
దేవనూరు డీలక్స్	11,000 – 17,800
ఆర్మూర్	10,000 – 13,000
తాలుకాయలు	5,000 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,800
బాడిగ – 355	10,000–16,500
తాలు	5,200 – 7,300

–కొరిటెపాడు (గుంటూరు)

ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం

- పశ్చిమ ఎమ్మెల్యే ఫ్లెక్సీలు తొలిగించిన నగర పాలక సంస్థ సిబ్బంది
- ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ మహిళా నాయకులు
- కమిషనర్ పులి శ్రీనివాస్ ఆదేశాలతోనే తొలగించారంటూ ఆరోపణ

ఫ్లెక్సీలు తొలిగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లాం నవమి, డివిజన్ నాయకులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఎమ్మెల్యే గళ్లా మాధవి అనుచరులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను నగర పాలక సంస్థ సిబ్బంది గురువారం తొలగించడంపై వివాదం రాజుకుంది. గుంటూరు టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మధ్య కొంత కాలంగా విభేదాలు నెలకొన్నాయి. ఫ్లెక్సీల తొలగింపుతో ఇది తారాస్థాయికి చేరుకుంది. పశ్చిమ నియోజకవర్గంలో అధికార పార్టీ అభిమానులు, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వేడుకలు ముగియకుండానే నగరపాలక సంస్థ సిబ్బంది గురువారం తొలిగించారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆక్రమణల నిర్మూలన దళం సిబ్బందిని నిలదీశారు. అయితే సిబ్బంది 'మీకు చేతనైంది చేసుకోండి' అంటూ బెదిరించినట్లు మహిళా నాయకురాలు లాం నవమి ఆరోపించారు. ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ కమిషనర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని నియోజకవర్గ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేను పట్టించుకోని కమిషనర్

పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవిని ఆది నుంచి కమిషనర్ పులి శ్రీనివాసులు బేఖాతరు చేస్తూ వస్తున్నారు. కమిషనర్ తీరుపై ఎమ్మెల్యే పలుమార్లు బహిరంగంగానే విమర్శలు చేసిన విషయం విదితమే.

■ నియోజకవర్గ పరిధిలో రోడ్లు గుంతమయంగా ఉన్నాయని మరమ్మతులు చేయించాలని కోరినప్పటికీ కమిషనర్, పట్టించుకోకపోవడంతో ఏకంగా ఎమ్మెల్యే ఆమె అనుచరులతో స్వయంగా గుంతలలో మట్టి పోసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.

■ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే కోరారు. నగర పాలక సంస్థ సిబ్బంది కొన్ని వీధుల్లో తిరిగి ఫొటోలు దిగి వెళ్లిపోయారు.

■ తుపాను బాధితులకు నష్ట పరిహారం పంపిణీ విషయంలోనూ ఎమ్మెల్యేకి సమాచారం లేకుండా మేయర్, కమిషనర్ కార్యక్రమాలు నిర్వహించారు.

పెమ్మసానికి ఎమ్మెల్యే ఫిర్యాదు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి గురువారం కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. ఫ్లెక్సీల తొలగింపు విషయాన్ని పెమ్మసాని దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. నగర పాలక సంస్థ కమిషనర్ తన మాటను బేఖతారు చేస్తున్నారని, కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. పెమ్మసాని నుంచి ఎలాంటి సమాధానం రాలేదని ఎమ్మెల్యే వర్గీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు సిద్ధార్థ గార్డెన్స్‌లో జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

బృందావన్‌గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి

రెడ్డిపాలెంలోని తన కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్ సీపీ పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి

క్లుప్తంగా

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.పెదబాబు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాజీ, యామర్తి శ్యాంబాబుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఐదుగురికి తీవ్ర గాయాలు

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన యడ్లపాడు మండలంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న కారు తిమ్మాపురంలోని తిరుమల ఆయిల్ మిల్లు సమీపంలో వేగం అదుపుకాక డివైడర్‌ను ఢీకొంది. కారు గాల్లోకి డైవ్ చేస్తూ సర్వీసు రోడ్డు పక్కనే ఉన్న మురుగు కాల్వలోకి పల్టీ కొట్టి పడింది. ఈ ప్రమాదంలో చిలకలూరిపేటకు చెందిన మేకపోతుల నాగ పవన్, నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన రాజు, షేక్ నాగూరువలీ, టి.కిరణ్, నూతలపాటి అఖిల్, హేమంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి తీవ్ర గాయాలపాలైన వారిని చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి, గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో టి. కిరణ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిధుల దుర్వినియోగం కేసులో మరొకరు అరెస్ట్

మాట్లాడుతున్న గుంటూరు సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : మంగళగిరి మండలం కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నిధుల దుర్వినియోగం కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్లు గుంటూరు సీసీఎస్ డీఎస్పీ బి.వి.మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) రాయల రమేష్‌బాబు, కొంత మంది ఉద్యోగులతో ఏకమై మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డారని అన్నారు. సొసైటీ డిపాజిటర్ల నుంచి డిపాజిట్లు సేకరించారని చెప్పారు. డిపాజిటర్లకు నకిలీ బాండ్లను జారీ చేసి తామే నేరుగా వడ్డీ చెల్లిస్తూ, డబ్బును బ్యాంక్‌లో జమ చేయలేదన్నారు. ఆ విధంగా 72 మంది డిపాజిటర్ల నుంచి రూ.8,50,93,947లు స్వాహా చేశారని పేర్కొన్నారు. కురగల్లు పీఏసీఎస్‌లో 112 నకిలీ డిపాజిట్ బాండ్లను జారీ చేసి రైతులను మోసగించినట్లు పీఏసీఎస్ చైర్మన్ శీలం గోపయ్య మంగళగిరి రూరల్ పీఎస్‌లో అప్పట్లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టామని అన్నారు. నిధుల దుర్వినియోగం వ్యవహారంలో కురగల్లు సీఈవో రాయల రమేష్‌బాబుతోపాటు యర్రబాలెం పీఏసీఎస్ సీఈవో తాడిబోయిన శ్రీకాంత్ పాత్ర ఉన్నట్లు బయటపడిందని పేర్కొన్నారు. ఈ మేరకు అతని కదలికలపై నిఘా ఉంచామని అన్నారు. బుధవారం అతనిని మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు.

తీగలాగితే డొంక కదిలింది..

యర్రబాలెంకు చెందిన తాడిబోయిన శ్రీకాంత్ 2012 జులైలో కురగల్లు పీఏసీఎస్‌లో తాత్కాలిక గుమస్తాగా నెలకు రూ.3 వేల జీతంపై చేరాడని డీఎస్పీ అన్నారు. సీఈవో రాయల రమేష్‌బాబుతో పాటు మరి కొందరితో కుమ్మక్కై దొంగ లెక్కలు రాశారని చెప్పారు. డిపాజిట్‌దారులు డబ్బు జమ చేసినప్పుడు వారికిచ్చే బాండ్లపై అతను, సీఈవో సంతకాలు చేసి ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ శ్రీకాంత్ ఎప్పుడూ బాండ్లపై సంతకాలు చేయలేదని చెప్పారు. డిపాజిట్‌దారులు డిపాజిట్ చేసేందుకు వచ్చినప్పుడు వారి నుంచి డబ్బులు తీసుకునే వాడని అన్నారు. ఆ డబ్బులను సీఈఓకు అప్పగించి ఆ వివరాలు క్యాష్ బుక్‌లో నమోదు చేయకుండా సాధారణ డైరీలో నమోదు చేశాడని చెప్పారు. ఇది మోసం అని తెలిసి కూడా సొసైటీని అడ్డుపెట్టుకుని ఈ మొత్తం వ్యవహారంలో నిందితులు ఒక పథకం ప్రకారం కుమ్మక్కయ్యారని అన్నారు. తద్వారా రైతులకు నకిలీ బాండ్లు అందజేసి, వసూలు చేసిన సొమ్మును దారి మళ్లించారని చెప్పారు. ఇప్పటికే ఈ కేసులో కురగల్లు సీఈవో రాయల రమేష్ బాబును అరెస్టు చేసిన విషయం విదితమే.

సివిల్ డ్రెస్‌లో వచ్చి ల్యాప్‌టాప్ తీసుకెళతారా?

- పెదనందిపాడు పోలీస్ స్టేషన్ ఎదుట దళితుల ఆందోళన
- ఎస్ఐ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎస్సీ కాలనీ వాసులు

పెదనందిపాడు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళ

ప్రత్తిపాడు: జీపు కూడా లేకుండా సివిల్ డ్రెస్‌లో వచ్చిన పోలీసులు ల్యాప్‌టాప్ తీసుకువెళ్లాల్సిన అవసరం ఏముందని దళితవాడ ప్రజలు పెదనందిపాడు పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్ఐ తీరును నిరసిస్తూ తెల్లవారుజామున పోలీస్ స్టేషను ఎదుట ఆందోళన చేశారు. ఈ ఘటన గుంటూరు జిల్లా పెదనందిపాడులో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. పెదనందిపాడు ఎస్సీ కాలనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత స్థానిక కాలనీవాసులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నారు. అనుమతుల్లేకుండా పెద్ద పెద్ద శబ్దాలతో అక్కడ డీజేలు ఏర్పాటు చేయడంతో వాటిని నిలుపుదల చేయించేందుకు పోలీసులు అక్కడకు వెళ్లారు. సివిల్ డ్రెస్‌లో అక్కడకు వచ్చిన ఎస్ఐ సత్యనారాయణ దురుసుగా వ్యవహరించి, లాప్‌టాప్ తీసుకువెళ్లిపోవడమే కాకుండా మాపై చేయి చేసుకున్నారని ఆరోపిస్తూ స్థానిక దళితవాడ వాసులు గురువారం తెల్లవారు జామున పోలీస్ స్టేషను ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి నేరం లేని వారిపై చేయి చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చేయిచేసుకోలేదని అక్కడున్న సిబ్బంది స్థానికులతో వాదించడంతో 'కొట్టలేదని గుండెలపై చెయ్యి వేసుకుని ఎస్ఐను చెప్పమను' అంటూ మహిళలు, ప్రజలు మండిపడ్డారు. అనంతరం ఎస్ఐ కాలనీవాసులతో మాట్లాడి, పొరబాటు జరిగిందని సర్దిచెప్పడంతో కాలనీవాసులు శాంతించారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ ప్రారంభం

నెహ్రూనగర్: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) జనవరి 1 నుంచి 31 వరకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించినట్లు బీఎస్ఎన్ఎల్ బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ సప్పరపు శ్రీధర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌సీ–1 ఫ్రీడమ్ ప్లాన్‌ను ప్రారభించారు. కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ఈ ప్లాన్‌లో అపరిమిత కాలింగ్, రోజుకు 2 జీబీ డేటా, 100 మెసేజీలు, ఉచిత సిమ్ కార్డు అందించడం జరుగుతోందన్నారు. ఈ ఆఫర్ ఎంఎస్‌పీ వినియోగదారులకు కూడా వర్తిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సిమ్ కార్డు కావలసిన వారు తమ దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: నూతన సంవత్సరంలో ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. గురువారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పలువురు పోలీస్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఐజీకి మొక్కలు, పూలబొకేలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలను జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అదేవిధంగా గుంటూరు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను పలువురు జిల్లా ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికార సిబ్బంది మర్యాద పూర్వకంగా కల్సి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం కేక్‌ను జిల్లా ఎస్పీ కట్ చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ విధులు నిర్వహిస్తోందని అన్నారు. ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), ఏటీవీ రవికుమార్ (ఎల్/ఓ), కె.సుప్రజ (క్రైం), ఏ.హనుమంతు (ఏఆర్), డీపీఓ ఏఓ వెంకటేశ్వర రావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

కేఎల్‌యూలో సౌత్‌జోన్ పురుషుల బాడ్మింటన్ టోర్నమెంట్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఈనెల 3వ తేదీ నుంచి 5వరకు సౌత్‌జోన్ ఆలిండియా అంతర యూనివర్సిటీల పురుషుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు కేఎల్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం టోర్నమెంట్ పోస్టర్‌ను ప్రో.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, క్రీడల డైరెక్టర్ డాక్టర్ హరికిషోర్, ఐక్యు ఏసీ డీన్ డాక్టర్ రామకృష్ణలతో కలసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం వీసీ డాక్టర్ పార్థసారధి వర్మ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 128 విశ్వవిద్యాలయాల నుండి సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ డైరెక్టర్ అనిమిని రవినాయుడు, గౌరవ అతిథిగా పున్నయ్య చౌదరిలు హాజరు కానున్నారని తెలిపారు.అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో న్యూ ఇయర్ జోష్

చేబ్రోలు: వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా, విజ్ఞాన్ ఫార్మసీ, విజ్ఞాన్ జూనియర్ కాలేజీల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కోటి ఆశలు, కొత్త సంకల్పాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య కేక్‌ను కట్ చేసి విద్యార్థులతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో 2026 సంవత్సరానికి గాను సంకల్ప ప్రతిజ్ఞ చేయించి, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. విద్యార్థుల్లో దయ, కృతజ్ఞత, మానవత్వం, ఇతరులకు సహాయం చేసే మనస్తత్వం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకే భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వేడుకల్లో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, లారా, ఫార్మసీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఫణీంద్ర కుమార్, శ్రీనివాసబాబు, మోహన్ రావు, డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో రంగనాథస్వామి

చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలులో ఖ్యాతి గాంచిన శ్రీ భూ సమేత రంగనాథస్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా రంగనాథ స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున తిరుప్పావై, సహస్ర విష్ణునామపారాయణం, తులసీదళార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో కనీస సౌకర్యాలు కరువు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు, సహాయకులు
- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్లు

3వ అంతస్తులో కవర్లు, డబ్బాలతో కప్పివేసిన కమోడ్స్

4, 5 అంతస్తుల్లో టాయ్‌లెట్స్‌లో పనిచేయని వాష్‌బేసిన్లు, ట్యాపులు

మంగళగిరి టౌన్ : వైద్యసేవలు అంటేనే గుర్తుకు వచ్చేది ఎయిమ్స్ వైద్యశాల. మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యశాలలో వైద్యసేవల కోసం రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రతిరోజు వేల సంఖ్యలో అనారోగ్య బాధితులు, సహాయకులు వస్తుంటారు. అయితే వారికి అందించే కనీస సౌకర్యాలు కరువయ్యాయి. రోగులు, సహాయకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. ఓ పక్క గంటల తరబడి ఓపీ దగ్గర నిలబడడమే కాకుండా, వైద్యులు రాసిన పరీక్షల కోసం వేచి ఉండాల్సి వస్తుంది. రోగులు, రోగి సహాయకులు టాయిలెట్స్ వినియోగించుకోవాలంటే మాత్రం చుక్కలు కనబడుతున్నాయి. ఎయిమ్స్‌లో టాయిలెట్స్ సౌకర్యాలు మూతబడడంతో మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ వైపు అధికారులు సైతం కన్నెత్తి చూడడం లేదు. ఎయిమ్స్ వైద్యశాలలో ప్రతి ఫ్లోర్‌లో టాయిలెట్స్ ఉన్నాయి. ఏ ఫ్లోర్‌లో చూసినా యూరినల్స్ కమోడ్స్ పని చేయకపోవడంతో కొందరు లెట్రిన్ కమోడ్స్‌ను వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అవి కూడా అరకొరగా ఉండడంతో పదుల సంఖ్యలో రోగులు, సహాయకులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. యూరినల్స్ తరువాత ఉపయోగించే వాష్ బేసిన్లు, ట్యాప్‌లు పనిచేయడం లేదు. అయితే కొందరు రోగులు అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని సమస్యను తెలుపగా, కొన్ని రోజుల క్రితం కాంట్రాక్ట్ కాలం పూర్తి అయ్యిందని, ప్లంబర్లు లేక అలాగే వదిలివేశారని తెలిపినట్లు సమాచారం. కాంట్రాక్ట్ కోసం టెండర్లు పిలిచారని కొత్తగా కాంట్రాక్టర్ వచ్చేవరకు ఈ పరిస్థితి తప్పదని చెప్పడం రోగులను విస్మయానికి గురిచేసింది. యూరినల్స్ పనిచేయకపోవడం, రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని రోగులు విమర్శిస్తున్నారు. త్వరితగతిన కనీస సౌకర్యాలు కల్పించాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ గుంటూరు: సిటీ పరిధిలో 1250, 1360, 3000 చ।। గజాల తూర్పు ఫేస్ ప్లాట్స్ సేల్, గోరంట్ల, ఆదిత్రి యెల్లోరా ప్రక్కన రేట్ గజం 14,000. సంప్ర।। 8790894569

■ గుంటూరు నుండి 6కి.మీ బుడంపాడు మెయిన్ రోడ్డు దగ్గర్లో వెంచర్స్. 40అ।।33అ. రోడ్లు, కరెంట్ సౌకర్యం.. స్పాట్ రిజిస్ట్రేషన్. గజం9వేలు,15వేలు మాత్రమే. 8317528192

SERVICES

BUSINESS OFFER

■ వ్యాపార భాగస్వాములు కావాలి. తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. సంప్రదించండి. RSJ Inspection Service Ltd. సెల్ : 85959 24917.

GOLD FINANCE

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

■ బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41166

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

WANTED

■ డ్యూటీ డాక్టర్స్, రిసెప్షనిస్ట్స్, నర్సెస్ (MPHW) వాచ్‌మెన్స్ కావలెను. కొత్తవారికి కూడా ప్రాధాన్యత.అహల్యా నర్సింగ్‌హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 92464 27459

■ Wanted Computer Hardware & Printer Engineers for Guntur For VLMS IT Solutions, Vja-12. www.vlms.in 9032908558,9701227778

■ పల్నాడు జిల్లా మాచర్లలో గల మండాడి, నాగార్జున సాగర్ దగ్గర పైపు లైన్ స్టాక్ యార్డ్ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 13 వేలు, డ్యూటీ: 12 గంటలు. అర్హత: 10th to Inter, మిగతా వివరాలకు కొరకు సంప్రదించండి. సెల్ నెంబర్ : 96180 87999, 95817 76823.

■ ప్రముఖబ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSOక్లర్క్ క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను (M/F): 9032590579

■ తుమ్మల పాలెం ప్రముఖ కంపెనీలోకి మేల్ సెక్యూరిటీ గార్డ్స్&ASO కావలెను .మంచి జీతం PF/ESI Q:10th, ఇంటర్ 26రో8గం।। వ.48లోపు 9441853786

ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి

గుంటూరు

7075167663
7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని వ్యక్తిగతంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సంక్రాంతి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

దుగ్గిరాల: సంక్రాంతి సంబరాలను దోస్త్–దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ తెలిపారు. గురువారం దుగ్గిరాలలోని జంపాల వారి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ముందుగా నూతన సంవత్సరం సందర్భంగా దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ కుషీ నాయక్, దోస్త్ కమిటీ సభ్యులు కలిసి కేక్ కటింగ్ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు, పెద్దలు కలిసి కరపత్రం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు గద్దె వాసు మాట్లాడుతూ.. ఈ ఏడాది కూడా సంక్రాంతి సంబరాలను ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడా, రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు క్యాష్ ప్రైజ్, షీల్డ్ అందించనున్నట్లు వివరించారు. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈనెల 11వ తేదీ ఆదివారం జంపాల వారి కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జంపాల సింహాద్రి, జంపాల సుబ్బారావు, కొంగర జోగేంద్ర ప్రసాద్, నన్నపనేని నాగేశ్వరరావు, జి.అనసూయర్యావతి తదితరులు పాల్గొన్నారు.

108 కలశాలతో ప్రత్యేక పూజలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గేటు సెంటర్ అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి చిరంజీవి ఆధ్వర్యంలో మధు నంబూద్రి 108 కలశాలతో పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం పూజ, గణపతి హోమం, సాయంత్రం పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రమణతో పాటు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు పండ్లు పంపిణీ

మంగళగిరి టౌన్: నూతన సంవత్సరం సందర్భంగా మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో బాధితులకు గురువారం ఎయిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేస్తామని అన్నారు. సహకరించిన ఎయిమ్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, శివశంకర్, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగ సాధనతో జీవన సాఫల్యం

తెనాలి: నిత్యజీవితంలో యోగను సాధన చేస్తూ జీవితాన్ని సాఫల్యం చేసుకోవాలని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి బాల స్వామీజీ అన్నారు.స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు 17వ రోజున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పూజ్యశ్రీ ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ స్వయం పర్యవేక్షణలో ఈ పూజలు జరిగాయి. ఇదే వేడుకలో నూతన సంవత్సర యోగ క్యాలెండర్‌ను బాలస్వామీజీ ఆవిష్కరించారు. యోగ గురించి, దాని విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ, రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, తన్నీరు శ్రీనివాసబాబు, మానేపల్లి శివ, వెంకట శివరామకృష్ణ, కాశీ విశ్వనాథం, భక్తులు పాల్గొన్నారు. భక్తులు గోదాదేవి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పశువైద్యశాలకు కుర్చీల బహూకరణ

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పినపాడులోని పశువైద్యశాలకు అయిదు కుర్చీలను బహూకరించారు. రొటేరియన్ మల్లాది అర్జున సహకారంతో గురువారం పశువైద్యశాల డాక్టర్ ఆజాద్‌కు ఆ కుర్చీలను అందించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, రొటేరియల్ కన్నెగంటి మురళీకృష్ణ, గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- సమన్వయకర్త దొంతిరెడ్డి పిలుపు
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో వేమారెడ్డి న్యూ ఇయర్ కేక్ కటింగ్ చేశారు. అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే అండ అని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో నూతన కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చంద్రబాబు సర్కార్ ఇచ్చిన హామీలు నెరవేర్చక పోయినా, ప్రజా సమస్యలు విస్మరించినా రాజీలేని పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గత వైఎస్సార్ సీపీలో ప్రజలకు జరిగిన మేలును వివరించి చంద్రబాబు సర్కార్ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య, రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వేమారెడ్డి

అందరికీ శుభాలు కలగాలి..

పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేస్తున్న వజ్రబాబు

తాడికొండ: నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తాడికొండ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ సకల శుభాలు కలగాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గుంటూరు మల్లిఖార్జునపేట 5వ లైన్‌లోని తాడికొండ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కటింగ్ చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఆయన నూతన సంవత్సర పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వజ్రబాబు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రజలందరికీ సుపరిపాలన అందాలనే ధ్యేయంతో కొనసాగుతున్న యుద్ధంలో సైనికులుగా పనిచేస్తూ అండగా నిలుస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతర పోరాట ఫలితమే నేడు రాష్ట్రంలో పాలక పక్షం గుండెల్లో వణుకుకు కారణం అన్నారు.

కూటమి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలి..

స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా బాబు, ఆయన పార్టీ తట్టాబుట్ట సర్దుకొని పారిపోయేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 4 మండలాల నాయకులు కార్యకర్తలు వనమాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 4 మండలాల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, తాళ్లూరి వంశీ, మైనేని నాగ మల్లేశ్వరరావు, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, వివిధ విభాగాల నాయకులు ముప్పాళ్ల మనోహర్, చుండు వెంకటరెడ్డి, నంబూరు రఘునాథరావు, అక్కల లక్ష్మీ నారాయణ రెడ్డి, బొంతా శ్రీకాంత్, కొప్పుల శేషగిరిరావు, షేక్ అజీస్, ఆరేపల్లి జోజి, కొయ్యగూర వినోద్, తుమ్మూరు వర ప్రసాద్ రెడ్డి, కాకి శ్రీకాంత్, గుమ్మా శ్రీనివాసరావు, గుమ్మా పూర్ణ, సుంకర శ్రీనివాసరావు, జానీ, సాంబిరెడ్డి, రాఘవరెడ్డి, గుంటి రఘువరన్, నల్లిబోయిన శ్రీనివాసరావు, ఫిరోజ్ ఖాన్, ఉడతా శ్రీనివాసరావు, షేక్ రసూల్, తమ్మనంపల్లి శాంతయ్య, గొంది రవి, ఉడుముల పిచ్చిరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, దాసరి సురేష్, సైదులు, అప్పిరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మద్యం తాగి అర్ధరాత్రి రోడ్డుపై హల్‌చల్!

మద్యం మత్తులో రోడ్డుపై పడుకున్న వ్యక్తి

తాడేపల్లి రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన వైన్ షాపులను అర్ధరాత్రి 12 గంటలకు, బార్‌లను 1 గంట వరకు ప్రభుత్వం తెరిచి ఉంచడంతో యువకులు తమ స్థాయికి మించి మద్యం తాగారు. ఆ మత్తులో గురువారం తెల్లవారుజామున రోడ్లపై ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ సైలెన్సర్లు విప్పదీసి హడావుడి సృష్టించారు. ఈ క్రమంలో పాత జాతీయ రహదారి పోలకంపాడు శివాలయం వద్ద ఇద్దరు యువకుల మధ్య ఏర్పడిన వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. రెండు వర్గాలుగా విడిపోయి రోడ్లపై పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి తగువు చేరుకుంది. పుష్కర కాలనీలో నివాసం ఉండే ఓ యువకుడు గంజాయి, మద్యం మత్తులో ఒక మహిళపై చేయి చేసుకున్నాడని సమాచారం. దీంతో రెండో వర్గానికి చెందిన యువకులు అతనిని చితకబాదడంతో పాత జాతీయ రహదారిపై రోడ్డుకు అడ్డంగా పడుకొని హల్‌చల్ చేశారు. అతని కుటుంబ సభ్యులు రోడ్డుపై నుంచి లేపేందుకు ప్రయత్నం చేయగా, వారిని సైతం దుర్భాషలాడుతూ కొట్టేందుకు ప్రయత్నించాడు. ఇదే సమయంలో పోలీస్ జీపు సైరన్ వేసుకుంటూ రావడంతో అక్కడ ఉన్న రెండు వర్గాలకు చెందిన వారు పరారయ్యారు. అనంతరం సదరు యువకుడు ఉండవల్లి పల్లెలోకి వెళ్లే మార్గంలో గుంటూరు చానల్ వద్ద మద్యం సీసాలు పగలగొట్టి అర్ధగంట సేపు హడావుడి చేశాడు. దీంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. అధిక మద్యం తాగడం వల్లే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి సరికాదని, కార్మికులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. గురువారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికులు 394 రోజులకు దీక్షలు చేస్తున్నారని, యాజమాన్యం లేదా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నష్టపరిహార సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విశాఖలో జరుగనున్న సీఐటీయూ మహాసభలకు కార్మికులు తరలి రావాలని కోరారు. దీక్షల్లో శారద, వేముల లక్ష్మి, రమణ, సువర్ణ కుమారి, రిబ్కా కూర్చొన్నారు. కార్యక్రమంలో నాయకులు కూరపాటి స్టీవెన్, సాంబశివరావు, సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, సుభాని, దానయ్య, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ఆక్టోపస్ కీలక పాత్ర

మాట్లాడుతున్న ఆక్టోపస్ ఐజీపీ శ్రీకాంత్

మంగళగిరి టౌన్: రాష్ట్ర శాంతి భద్రతల పరిరక్షణలో ఆక్టోపస్ బృందం కీలక పాత్ర పోషిస్తోందని ఆక్టోపస్ ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్ ప్రశంసించారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం ఆక్టోపస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 సంవత్సరంలో ఆక్టోపస్ విభాగంలో గణనీయమైన మార్పులో చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. బృందం పనితీరు మరింత మెరుగుపడిందని అన్నారు. ఇదే ఉత్సాహంతో నూతన సంవత్సరంలో మరింత క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వివిధ విభాగాల్లో మెడల్స్ సాధించిన కమాండోలు, అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐజీపీ ఎస్.సెంథిల్ కుమార్, ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ కె.రామచంద్రమూర్తి, డీఎస్పీలు, ఆర్ఐఎస్‌లు, ఆర్ఎస్ఐలు, ఆక్టోపస్ కమాండోలు, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

కోరుకున్న లక్ష్యాలను చేరుకోవాలి

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు

యూపీహెచ్‌సీ వేడుకల్లో పాల్గొన్న వైద్యులు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో గురువారం నూతన సంవత్సర సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన అమెరికా ఇల్లినాయిస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్ కేక్ కట్‌చేసి ఉద్యోగులు, ప్రొఫెసర్లకు శుభాకాంక్షలు తెలిపారు. వైస్ చాన్సలర్ సీహెచ్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. అందరూ కోరుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ వినాయక్, డైరెక్టర్లు ఐజాక్ సామల జిరార్డ్, పంకజ్ బల్వేరియా, మేనేజర్ జనరల్ గుర్‌సింగ్ నారంగ్, విరాజి కౌల్, శ్రీనివాసన్ తిరుమలై, డాక్టర్ యలంపల్లి శివశంకర్, వెంకటేశ్వరన్ రామమూర్తి, శివరంగన్, అరుంధతి పాల్గొన్నారు. పాత బస్టాండ్ వద్ద గల గుడ్‌విల్ ముస్లిం సంక్షేమ కార్యాలయంలో వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇబ్రహీం, మైనార్టీ నాయకులు సుభాని, మస్తాన్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

గణపతినగర్ యూపీహెచ్‌సీలో గురువారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అనూష కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. యూపీహెచ్‌సీ అభివృద్ధికి పలు అవార్డులు రావడానికి సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు కిషోర్, ప్రవీణ్, లిఖిత్, జతారామ్, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలోని సంఘ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చింతిక్రింది కనకయ్య, కుబేర స్వామి, పూర్ణచంద్రరావు, రవీంద్ర నాథ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

తాడేపల్లి పార్టీ కార్యాలయం వేడుకల్లో నాయకులు

తాడికొండ మండల పరిషత్ కార్యాలయం వేడుకల్లో ఎంపీడీవో సమతావాణి

దుగ్గిరాలలో కేక్ కట్ చేస్తున్న మండల స్థాయి నాయకులు

కార్మికులకు స్వీట్‌బాక్స్‌లు పంపిణీ చేస్తున్న అమరా నాగయ్య

తాడేపల్లి రూరల్: తాడేపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేక వెంకటరామిరెడ్డి, షేక్ జావీద్, జిల్లా మైనార్టీ విభాగ కార్యవర్గ సభ్యులు సయ్యద్ సలాం, తాడేపల్లి పట్టణ ఎస్సీ, ఎస్టీ, సోషల్ మీడియా, ప్రచార విభాగాల అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, బాలసాని అనిల్, తొట్టెంపూడి వికాస్, షేక్ ఖలీల్, పట్టణ సోషల్ మడియా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కంచర్ల విక్కి, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శులు బోయలపల్లి రాజు, వెంకట కృష్ణ, బీసీ నాయకులు బత్తుల దాసు, అనుమల శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ: ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.సమతావాణి కేక్ కటింగ్ చేసి సంబరాలు జరిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను కలిసి స్వీట్లు, పుష్ప గుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తాడేపల్లి రూరల్: కుంచనపల్లిలో పారిశుద్ధ్య కార్మికుల సమక్షంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుంచనపల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మిరియాల రాంబాబు ఆధ్వర్యంలో కుంచనపల్లిలో జరిగిన వేడుకల్లో మండల అధ్యక్షులు అమరా నాగయ్య పాల్గొని కేక్ కటింగ్ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివనాగేశ్వరరావు, రాంబాబు, కూరపాటి సాంబిరెడ్డి, గడ్డం తాతయ్య, బిరుదుగడ్డ విజయేంద్రరావు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. గురువారం దుగ్గిరాల మండల పరిషత్ సమావేశ మందిరంలో నూతన సంవత్సరం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ షేక్ జబీన్, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.జె.నెహ్రూ, మండల స్థాయి నాయకులు కలిసి ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుపులేటి సాయి చైతన్య, మాజీ ఎంపీపీ వెనిగెళ్ల కృష్ణప్రసాద్, పరిపాలన అధికారి వి.చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా యేసు నామకరణ దేవాలయ వార్షికోత్సవం

పూజాబలి నిర్వహిస్తున్న గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు చిన్నా బత్తిని భాగ్యయ్య

విద్యుత్ దీపాలతో అలంకరించిన యేసు నామకరణ దేవాలయం

మేడికొండూరు: సిరిపురం గ్రామంలోని యేసు నామకరణ దేవాలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పండుగ జరిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్య పూజాబలిని ఆలయంలో గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు డాక్టర్ చిన్నా బత్తిని భాగ్యయ్య నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మానవాళి పాప పరిహారార్థము క్రీస్తు ఈ లోకంలో జన్మించారన్నారు. ఏసు రక్తము ద్వారా మనిషి పాపాలు కడుగబడునని వివరించారు. ప్రతి మానవాళి క్రీస్తు వద్ద పాప క్షమాపణ పొందిన తర్వాత పరలోక రాజ్యము పొందుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలు దైవభక్తి గీతాలు ఆలపించారు. విశ్వాసులు కొవ్వొత్తుల సమర్పణ, రాత్రి గ్రామ పురవీధుల్లో మేళతాళాల నడుమ, బాణసంచా కాల్చుతూ ప్రత్యేక ఊరేగింపు జరిపారు. సమీప గ్రామాల విశ్వాసులు వేలాదిగా తరలివచ్చి ప్రార్థనలు చేశారు. ఆలయ విచారణ గురువులు, ఫాదర్ థామస్, పలువురు విచారణ గురువులు, ఫాదర్‌లు, మఠకన్యలు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మెన్‌లకు నియామక ఉత్తర్వులు

తెనాలి: విద్యుత్‌శాఖ తెనాలి డివిజన్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్‌గా నియమితులైన ఎనర్జీ అసిస్టెంట్ జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2లకు గురువారం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ ఉత్తర్వులు అందజేశారు. స్థానిక విద్యుత్ ఈఈ కార్యాలయంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో సహకరించిన ఏపీసీపీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్ ప్రాజెక్ట్, హెచ్‌ఆర్‌డీ, సీజీఎం హెచ్‌ఆర్‌డీ, జీఎం హెచ్‌ఆర్‌డీకి, గుంటూరు సర్కిల్ ఎస్ఈకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఏఆర్‌పీఈ యూనియన్ డిస్కమ్ కార్యదర్శి ఎస్.గురుబ్రహ్మం, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పట్టించుకోండి

తెనాలి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పట్టించుకోవాలని ది తెనాలి తాలూకా పట్టణ భవన నిర్మాణ తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక కొత్తపేటలోని ది తెనాలి తాలూకా పట్టణ భవన నిర్మాణ తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల ఇబ్బందులను పరిష్కరించాలని నాయకులు కోరారు. కార్మికులకు పనులు లేక పస్తులు ఉంటున్నారని వారు వాపోయారు.

మోదీ పాలనలో తీవ్ర సంక్షోభం

మంగళగిరి టౌన్: దేశ ఆర్థిక పరిస్థితుల్లో తీవ్ర సంక్షోభం నెలకొందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. మంగళగిరి పట్టణం సీపీఐ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశ ఆర్థిక పరిస్థితి కుంటుపడిందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని.. ఆధునిక పరిశ్రమలు దేశంలోనికి రావడంలేదని.. రైతుల కష్టాలు మరింత అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోట మాల్యాద్రి, కంచర్లకాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్ బాబు, సయ్యద్ కరిముల్లా, పిల్లలమర్రి నాగేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంకల్పం డ్రాప్ బాక్సుల ఏర్పాటు

తెనాలిరూరల్: మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలను నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 'సంకల్పం' పేరిట జిల్లా పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మాదక ద్రవ్యాల వినియోగం, క్రయ విక్రయాల గురించిన సమాచారాన్ని అందించాలని విద్యార్థులకు పోలీసులు సూచించారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థల్లో డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని నాలుగు కళాశాలలు, ఆరు జెడ్పీ హైస్కూళ్లలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రాప్ బాక్సులను పోలీసులు గురువారం ఏర్పాటు చేశా రు. మాదకద్రవ్యాలకు సంబంధించి సమాచారాన్ని విద్యార్థులు కాగితంపై రాసి ఈ బాక్సుల్లో వేయవచ్చని, ఖచ్చితమైన సమాచారాన్ని అందించాల్సి ఉంటుందన్నారు. సమాచారం రాసిన విద్యార్థుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు. విద్యార్థుల్లో మార్పు తీసుకురావడం కోసమే సంకల్పం పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

నాడు రూ.16.. నేడు రూ.20

వైఎస్సార్‌సీపీ హయాంలో ఫోర్టిఫైడ్ గోధుమ పిండి కిలో రూ.16

అధికారంలోకి రాగానే పంపిణీనే నిలిపేసిన చంద్రబాబు సర్కార్

ఇప్పుడు రూ.4 పెంచేసి కొత్తగా ప్రారంభిస్తున్నట్టు కలరింగ్

చంద్రబాబు బినామీ మంత్రి కుటుంబాల కంపెనీలకే ప్యాకింగ్ కాంట్రాక్టు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ వినియోగదారులను నిలువునా దోచుకుంటోంది. ఒకవైపు మార్కెట్‌లో నిత్యావసర సరకుల రేట్లు ఆకాశాన్ని తాకుతుంటే చోద్యం చూస్తూ... మరో వైపు రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే సరకుల రేట్లు మాత్రం అమాంతం పెంచేస్తోంది. జాతీయ ఆహార భద్రత చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ పేద ప్రజలపై భారం మోపుతోంది. వాస్తవానికి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థ గాడితప్పింది. రాగులు, జొన్నలు, గోధుమ పిండి పంపిణీని అటకెక్కించింది. ఇక కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బియ్యం నాణ్యతకు పాతరేసింది. ఇప్పుడు పండగ వేళ ప్రజలను మభ్యపెట్టేందుకు పాత పంపిణీలనే కొత్తగా చేస్తున్నట్టు కలరింగ్ ఇస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలో తొలిసారిగా ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని పంపిణీ చేయగా... అధికారంలోకి వచ్చాక దానిని చంద్రబాబు కక్షపూరితంగా నిలిపివేసి... ఏడాదిన్నర తర్వాత రేటు పెంచి మళ్లీ పంపిణీ ప్రారంభిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

కిలోకి రూ.4 చొప్పున పెంచేసి...

వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రాగులు, జొన్నల పంపిణీతోపాటు ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని అందించారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి బియ్యానికి బదులుగా ఉచితంగా రాగులు, జొన్నలు ఇచ్చేలా ఒప్పించారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎఫ్‌సీఐ నుంచి గోధుమలు సేకరించి వాటిని మరాడించి, ఫోర్టిఫైడ్ చేసి నాణ్యమైన ప్యాకింగ్‌లో కిలో రూ.16కే లబ్ధిదారుల ఇంటి వద్దకే చేర్చారు. కానీ ఏడాదిన్నరగా ఆ గోధుమ పిండి పంపిణీని నిలిపివేసిన చంద్రబాబు ప్రభుత్వం ఈ జనవరి నుంచి కిలో రూ.20కి ఇస్తున్నట్టు ప్రకటించి అభాసుపాలైంది. ఎందుకంటే అప్పట్లో భారత్ బ్రాండ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం స్వయంగా కిలో ప్యాకెట్‌ను రూ.27.50కి వినియోగదారులకు ఇస్తే.. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం కిలో రూ.16కే అందించి ప్రజల మన్ననలు పొందింది. ఇప్పుడు అదే గోధుమ పిండి ప్యాకెట్‌కు ఏకంగా రూ.4 అదనంగా చంద్రబాబు దండుకోవడం విస్తుగొలుపుతోంది.

అరకొర పంపిణీకే హడావిడి

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నెలకు 1,839 టన్నుల గోధుమలను అందిస్తోంది. వాటిని మరాడిస్తే 1,690 టన్నుల పిండి వస్తుంది. ఈ పిండినే కిలో ప్యాకెట్లలో నింపి ప్రజలకు పంపిణీ చేయనున్నారు. వాస్తవానికి ఏపీలో 1.48 కోట్ల రైస్ కార్డులున్నాయి. వీళ్లందరికీ కిలో గోధుమ పిండి అందించాలంటే నెలకు 15 వేల టన్నులు అవసరం. అలాంటిది నెలకు కేవలం 1690 టన్నులు మాత్రమే సరఫరా చేస్తుండడం... అది కూడా జిల్లా కేంద్రాల్లో మాత్రమే ఇస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోంది.

బినామీల కోసమే రేటు పెంచేసి..

చంద్రబాబు ప్రభుత్వంలో ప్రతి స్కీము సరికొత్త స్కామ్‌ను తలపిస్తోంది. ఇందుకు ప్రజా పంపిణీ వ్యవస్థను కూడా వదలట్లేదు. ప్రభుత్వం ఎఫ్‌సీఐ నుంచి కిలో గోధుమలు రూ.6.10కి కొనుగోలు చేస్తోంది. వాటిని మరాడించి... ఆ పిండిని కిలో చొప్పున ప్యాకింగ్ చేసి, ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేర్చి రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు రూ.20కు ఇస్తోంది. వాస్తవానికి నవంబర్ 5న స్వాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కిలో గోధుమ పిండిని రూ.18కి ఇస్తున్నట్టు మీడియా సమక్షంలో ప్రకటించారు. అయితే, ప్రభుత్వం మాత్రం డిసెంబర్ 24 ఇచ్చిన జీవోలో కిలో గోధుమ పిండి రేటును రూ.20గా పేర్కొంది. ఇంతలోనే అంత వ్యత్యాసం రావడం వెనుక బినామీలు చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం రూ.16కు అందించిన గోధుమ పిండి ఇప్పుడు ఏకంగా రూ.20కి చేరుకుంది. అప్పుడు.. ఇప్పుడూ రేషన్ దుకాణ డీలర్ కమిషన్ రూపాయిగానే ఉంది. కానీ ప్రజలపై మాత్రం భారం మోపుతోంది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీకి మిల్లింగ్, ప్యాకింగ్ కాంట్రాక్టు అప్పగించారు. ఆ ఏజెన్సీ తమ దగ్గర ఎంప్యానల్ అయిన కంపెనీలకు మాత్రమే మిల్లింగ్, ప్యాకింగ్ బాధ్యతలు ఇచ్చింది. ఇందులో విచిత్రం ఏమంటే.. చంద్రబాబు బినామీ, మంత్రి వియ్యంకుడికి చెందిన కాకినాడ జిల్లాలోని ఓ కంపెనీకి గోధుమ పిండి మిల్లింగ్, ప్యాకింగ్ కాంట్రాక్టు దక్కింది. సదరు కంపెనీ సరఫరా విధానంలో గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. వాటిని పక్కన పెట్టిన సర్కార్ నోడల్ ఏజెన్సీ ద్వారా అనుకున్నది చేసింది. ఇక్కడ ఎంప్యానల్ చేసిన మిల్లుల కంటే బహిరంగంగా టెండర్ పిలిస్తే పోటీ పెరిగి మిల్లింగ్, ప్యాకింగ్ ధర తగ్గే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

కూలీల కడుపుకొట్టిన బాబు సర్కారు!

- కేంద్రం నోటిఫై చేసిన కూలి ఇవ్వకుండా పేదల ఉపాధికి గండి
- 2024-25లో రోజు కూలి రూ.300.. చెల్లించిందేమో రూ.256
- 17.3 లక్షల కుటుంబాలపై దెబ్బ ఎస్‌బీఐ ఎకనమిక్ రీసెర్చ్ నివేదికలో స్పష్టం

సాక్షి, అమరావతి: కేంద్రం మంజూరు చేసిన సంఖ్య మేర ఉన్న కుటుంబాలకు ఉపాధి కల్పించకుండా గత ఆర్థిక సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం భారీగా ఉపాధి కూలీల పొట్టకొట్టింది. నోటిఫై చేసిన రోజువారీ కూలి కూడా ఇవ్వలేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత, నిర్మాణాత్మక బలహీనతలకు తోడు నిధుల దుర్వినియోగమేనని ఎస్‌బీఐ ఎకనమిక్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది.

2024–25లో ఉపాధి హామీ కింద రాష్ట్రంలో 64.2 లక్షల కుటుంబాల ఉపాధి కల్పనకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. కానీ, చంద్రబాబు సర్కారు 46.9 లక్షల కుటుంబాలకు మాత్రమే ఉపాధి చూపింది. అంటే, 17.3 లక్షల కూలీల కుటుంబాలకు నష్టం వాటిల్లింది.

దేశంలో చాలా రాష్ట్రాలు గత ఆర్థిక సంవత్సరం ఉపాధి కూలీల రోజువారీ వేతనం నోటిఫై (నిర్దేశిత) చేసిన మేరకు చెల్లించినా, ఏపీ దానిని పాటించలేదు. రోజువారీ కూలి రూ.300 నోటిఫై చేయగా రూ.256 చొప్పున మాత్రమే చెల్లించింది. ఒక్కో కూలీకి రూ.44 మేర చూస్తే 46.9 లక్షల కుటుంబాలకు తక్కువ చెల్లించింది.

ఓపక్క కేంద్రం మంజూరు చేసిన మేర ఉపాధి కల్పించకుండా 17.3 లక్షల కుటుంబాలకు నష్టం చేకూర్చిన బాబు సర్కారు మరోపక్క నోటిఫై చేసిన రోజువారీ వేతనం ఇవ్వకుండా కష్టార్జితాన్ని దోపిడీ చేసిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో (2025–26) రోజువారీ ఉపాధి హామీ కూలిని రూ.307గా నోటిఫై చేశారు. డిసెంబర్ 29 వరకు డేటాను విశ్లేషిస్తే ఒక్కో కూలీకి రూ.268 మాత్రమే చెల్లించారు. నిర్దేశిత మొత్తానికి ఇది రూ.39 తక్కువ. దీనివల్ల 41 లక్షల కుటుంబాల శ్రమదోపిడీ చేసినట్లైంది.

ఉపాధి చట్టాల మార్పు జాతీయ నేరం

సీఐటీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్ సేన్

ఏయూక్యాంపస్: కేంద్రం ఉపాధి కూలీల చట్టాలను మార్చి.. ఉపాధి లేకుండా చేసే జీఆర్‌ఎంజీ పథకం తెచ్చి పేదల జీవితాలను ధ్వంసం చేస్తోందని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ అన్నారు. గురువారం విశాఖలో సీఐటీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖలో జరుగుతున్న అఖిల భారత మహాసభల్లో భవిష్యత్ కార్మిక, కర్షక పోరాటాలపై వివిధ రాష్ట్రాల ప్రతినిధులు చర్చిస్తున్నారన్నారు. గురువారం మహాసభల రెండో రోజున ఉపాధి చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 12న జనరల్ సమ్మెకు సిద్ధమయ్యేలా ఏకగ్రీవంగా ఈ తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు.

రాష్ట్రాలపై భారం వేసి..

ఉపాధి పథకానికి నూరుశాతం నిధులు ఇవ్వాల్సిన కేంద్రం 60 శాతమే ఇస్తామనడం.. రాష్ట్రాలది 40 శాతం వాటా అని చెప్పడం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపడమేనన్నారు. దీని వల్ల రాష్ట్రాల వద్ద డబ్బు లేకపోతే పథకం ముందుకు నడవదన్నారు. ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం మన దేశంలో 6 శాతం ఉండే కార్పొరేట్ల గుప్పెట్లో 50 శాతం సంపద ఉండడాన్ని చూస్తే దేశాన్ని వీరు లూటీ చేస్తున్నట్లు, ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ఘోరంగా విఫలమైనట్లు తెలుస్తుందన్నారు.

78 గంటలైనా నా భర్త జాడలేదు

- ఇద్దరు కానిస్టేబుళ్లు తీసుకెళ్లారని తెలిసింది
- టీడీపీ వాళ్లు మా స్వగ్రామం నిమ్మాడకు రానివ్వడంలేదు
- అత్తయ్యకు పింఛను, మామయ్య రేషన్‌కార్డు తీసేశారు..
- మా చుట్టాలంతా బయటకెళ్లి బతుకుతున్నారు
- ఆయనకు ప్రాణహాని ఉంది
- నిమ్మాడకు చెందిన కింజరాపు అప్పన్న భార్య ఎస్పీకి ఫిర్యాదు

తన భర్తతో ఉన్న ఫొటోలో చంద్రకళ (ఇన్‌సెట్‌లో) మీడియాతో మాట్లాడుతున్న చంద్రకళ

శ్రీకాకుళం క్రైమ్ : నిమ్మాడ.. శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర, రాష్ట్ర మంత్రివర్యులైన కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుల స్వగ్రామం. ఇదే గ్రామానికి చెందిన కింజరాపు చంద్రకళ అనే వివాహిత తన భర్త కింజరాపు అప్పన్న ఈనెల 29 నుంచి కనపడటంలేదని, ఇద్దరు కానిస్టేబుళ్లు తీసుకెళ్లినట్లు తెలిసిందని, 78 గంటలైనా తన భర్త జాడలేదని, ఆయన ప్రాణానికి హాని ఉందని మీడియా ముందు కన్నీటిపర్యంతమైంది. ఏడాదిన్నరగా నిమ్మాడలోకి అడుగు పెట్టలేకపోతున్నామని, తెలుగుదేశం పార్టీ వాళ్లు రానీయడంలేదని ఆరోపించారు. ఇదే విషయమై జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆమె గురువారం మీడియాకు వివరించారు.

29 నుంచి కనిపించడంలేదు..

గతనెల 29న మా కన్నవారి గ్రామమైన మెళియాపుట్టి మండలం కొసమాలలో కింజరాపు అప్పన్నను ఉ.8–10 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్లారు. అప్పుడు నేను వైజాగ్‌లో ఉండటంతో తెలీలేదు. సాయంత్రం వచ్చేస్తున్నానని చెప్పేందుకు నా భర్తకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కన్నవారింటికి వచ్చాక బైక్, హెల్మెట్ అయితే ఉందిగానీ భర్త లేడు. ఇదే విషయం అక్కడ కొందరిని అడగ్గా ఎవరో ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్లారని చెప్పారు. ఆ తర్వాత నా భర్తకు చాలాసార్లు ఫోన్ చేశా. స్విచ్ఛాఫ్ రావడంతో అదేరోజు సా.6.30కు మెళియాపుట్టి స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశా. ఎఫ్‌ఐఆర్ రాయమంటే.. 'డైరీలో రాసి రేపు 9 గంటలకు రండి.. ఈలోగా విచారణ చేసి కనుక్కొని చెబుతాం' అని అన్నారు. అయితే, మర్నాడు 'ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చారు. రెండేళ్ల కిందట పనిచేసిన మెళియాపుట్టి కానిస్టేబుల్ చందు, మరొకతను తీసుకెళ్లారు' అని స్థానికులు చెప్పారు. వెంటనే అక్కడి ఎస్‌ఐకు ఫోన్ చేస్తే బిజీగా ఉన్నానని అనడంతో బుధవారం మళ్లీ స్టేషన్‌కు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాను. ఎస్‌ఐను అడిగితే.. తమ వాళ్లయితే తీసుకెళ్లలేదని, చందు ఎవరో తెలీదని, ఎస్పీ దగ్గరకు వెళ్లమన్నారు. దీంతో బుధవారం రాత్రి ఎస్పీని కలవడానికి శ్రీకాకుళం వచ్చా. ఆయన లేకపోవడంతో మళ్లీ గురువారం వచ్చి ఎస్పీని కలిశాను.

టీడీపీ వాళ్లు నిమ్మాడకు రానీయడంలేదు..

'ఏడాదిన్నర నుంచి టీడీపీ వాళ్లు మమ్మల్ని నిమ్మాడ గ్రామంలో మేం అడుగుపెట్టనీయడం లేదు. పొలం ఉన్నా.. సాగుచేయకుండా ఉండిపోయింది. అత్తయ్యకు పింఛను, మామయ్య రేషన్‌కార్డు తీసేశారు. మా చుట్టాలంతా బయటకెళ్లి బతుకుతున్నారు. మేం ఒడిశా వెళ్లిపోయాం. నా భర్తను ఎవరేం చేశారోనని భయంగా ఉంది. ప్రాణహాని ఉందని ఆ ఊరికి వెళ్లడం లేదు. ఇదంతా రాజకీయపరంగా ఎవరో చేస్తున్నారు. నా భర్త ఎవరికీ ఏ అన్యాయం చేయలేదు. ఎవరినీ చంపలేదు, మోసంచేసి డబ్బులు, ఆస్తులు తీసుకోలేదు' అని చంద్రకళ తెలిపింది.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీగా మనీష్‌రాజ్‌గుప్తా

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీగా సెయిల్ డైరెక్టర్ (టెక్నికల్, ప్రాజెక్ట్స్, రా మెటీరియల్స్) మనీష్‌రాజ్ గుప్తా గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు సీఎండీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన అజిత్‌కుమార్ సక్సేనా డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో మనీష్ రాజ్ గుప్తాను నియమిస్తూ ఉక్కు మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భోపాల్ ఎన్ఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పట్టభద్రుడైన మనీష్ మేనేజ్‌మెంట్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా చేశారు. 1991లో దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన ఆయన 2019లో చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు. అనంతరం ఇస్కో స్టీల్‌ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేశారు. సెయిల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు న్యూఢిల్లీలోని సెయిల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈడీ ఇన్‌చార్జ్ (ఆపరేషన్స్)గా పనిచేశారు.

దోపిడీ 'అంచనా'!

రాజధాని జోన్-8 ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ టెండర్లలో అక్రమాలు

లేఅవుట్ అభివృద్ధికి ఎకరానికి సగటున రూ.2 కోట్లు వ్యయం!

దేశ చరిత్రలో ఇంత పెద్దఎత్తున ఖర్చు చేసిన దాఖలాలు లేవు..



సాక్షి, అమరావతి : రాజధాని నిర్మాణానికి సమీకరణ (పూలింగ్) కింద భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన నివాస (రెసిడెన్షియల్), వాణిజ్య (కమర్షియల్) ప్లాట్లు ఇచ్చే మాటేమోగానీ... లే అవుట్ పనుల టెండర్లలో కాంట్రాక్టర్లతో కలిసి ముఖ్య నేత భారీఎత్తున దోచుకుంటున్నారని ఇంజినీరింగ్ నిపుణులు ఆరోపిస్తున్నారు. జోన్–8 (కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి) లేఅవుట్ అభివృద్ధి పనుల అంచనాలను ప్రతిపాదన దశలోనే భారీగా పెంచేయడమే దీనికి నిదర్శనమని చెబుతున్నారు. ఈ లేఅవుట్ అభివృద్ధికి ఎకరానికి సగటున రూ.2 కోట్ల మేర వ్యయం చేస్తున్నారని... దేశ చరిత్రలో ఇది ఎక్కడా లేదని ఎత్తిచూపుతున్నారు.

- రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్, ఇంటర్నెట్ కేబుల్ వంటి వాటికి యుటిలిటీ డక్ట్‌లు, మురుగు శుద్ధి కేంద్రాలు, శుద్ధి చేసిన నీటిని పునర్ వినియోగించేందుకు పైప్‌లైన్, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి పనులకు రూ.1305.39 కోట్ల వ్యయంతో నవంబర్ 14న అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిని 4.03 శాతం అధిక ధర... రూ.1,358 కోట్లకు కోట్ చేసిన మేఘా సంస్థకు అప్పగించడానికి సీఆర్‌డీఏ, కేబినెట్ ఆమోదం తెలిపాయి. ఆ మేరకు ఏడీసీఎల్‌కు అనుమతి ఇస్తూ గురువారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఖజానాపై రూ.52.61 కోట్ల భారం పడనుండగా ఆ మేరకు కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరనుంది. ఇక జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.277.85 కోట్లను రీయింబర్స్ చేస్తామని ఏడీసీఎల్ పేర్కొంది. తద్వారా కాంట్రాక్టు విలువ రూ.1,635.85 కోట్లకు చేరనుంది.

జ్యుడీషియల్ ప్రివ్యూ ఉండి ఉంటే...

రాజధాని జోన్–8 లేఅవుట్ అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రివర్స్ టెండరింగ్ నిర్వహించి ఉంటే కనీసం 5 శాతం తక్కువ ధరకు పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకొచ్చేవారని, ఖజానాకు రూ.వంద కోట్లు ఆదా అయ్యేవని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇక జ్యుడీషియల్ ప్రివ్యూ విధానం అమల్లో ఉండి ఉంటే... టెండర్ నోటిఫికేషన్ జారీకి ముందే అక్రమాలు వెలుగులోకి వచ్చేవని, తద్వారా అంచనా వ్యయం తగ్గేదని చెబుతున్నారు. ప్రజాధనం భారీగా ఆదా అయ్యేదని స్పష్టం చేస్తున్నారు.

మొబిలైజేషన్ అడ్వాన్సులో నీకింత నాకింత

కాంట్రాక్టర్‌కు రూ.1,358 కోట్లకు పనులను అప్పగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చేసింది. ఆ మేరకు ఏడీసీఎల్ ఒప్పందం చేసుకోనుంది. ఆ వెంటనే కాంట్రాక్టు విలువలో పదిశాతం రూ.135.80 కోట్లను మొబిలైజేషన్ అడ్వాన్సు కింద ముట్టజెప్పనుంది. ఇందులో 8 శాతం ముఖ్య నేత తొలి విడత కమీషన్ల రూపంలో వసూలు చేసుకుంటారనే ఆరోపణలు వస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రాజధాని నిర్మాణానికి అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను కాంట్రాక్టర్‌కు దోచిపెట్టి నీకింత నాకింత అంటూ పంచుకుతినడాన్ని ముఖ్య నేత యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని ఇంజినీరింగ్ నిపుణులు, ప్రజాసంఘాలు, మేధావులు ఆరోపిస్తున్నారు.

కొండవీటి వాగు ఎత్తిపోతల్లో రూ.150 కోట్ల అవినీతి వరద

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతికి కొండవీటి వాగు వరద ముప్పు తప్పించేందుకు, ఉండవల్లి వద్ద ఆ వాగు నుంచి 8,400 క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీలోకి మళ్లించేలా ప్రభుత్వం చేపట్టిన ఎత్తిపోతల పనుల్లో భారీ అవినీతి చోటుచేసుకుంది. ఈ ఎత్తిపోతల పనులకు రూ.423.64 కోట్ల విలువతో నవంబర్ 14న అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో కాంట్రాక్టు విలువ కంటే రూ.4.75 శాతం అధిక ధర... రూ.443.76 కోట్లకు కోట్ చేసిన మేఘా సంస్థకు పనులను అప్పగించేందుకు సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ), రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం తెలిపాయి. ఈ మేరకు పనులను మేఘాకు అప్పగిస్తూ గురువారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కాంట్రాక్టు విలువ కంటే అధిక ధరకు పనుల కేటాయింపుతో ఖజానాపై రూ.20.12 కోట్ల భారం పడింది. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.79.42 కోట్లను కాంట్రాక్టర్‌కు రీయింబర్స్ చేస్తామని ఏడీసీఎల్ పేర్కొంది. అంటే, కాంట్రాక్టు విలువ రూ.523.18 కోట్లకు చేరుకుంది.

5 వేల క్యూసెక్కుల ఎత్తిపోతకు రూ.222.44 కోట్లు

కొండవీటి వాగు నుంచి రోజుకు 5 వేల క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీలోకి మళ్లించేందుకు ఉండవల్లి వద్ద 2017–18లో రూ.222.44 కోట్లతో ప్రభుత్వం ఎత్తిపోతలను పూర్తి చేసింది. వీటిని మేఘా సంస్థనే చేపట్టింది. నాటితో పోల్చితే ఎత్తిపోతల పనుల్లో వినియోగించే స్టీల్, సిమెంటు, పంప్‌లు, మోటార్లు, విద్యుత్ ఉపకరణాలు తదితరాల ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేదు. కానీ, ప్రస్తుతం 8,400 క్యూసెక్కులను ఎత్తిపోసే పనులను రూ.523.18 కోట్లకు మేఘా సంస్థకే ప్రభుత్వం కట్టబెట్టింది. కాగా, దీని వ్యయం రూ.360 కోట్ల నుంచి రూ.380 కోట్లకు మించే అవకాశం లేదని, అంచనాల దశలోనే రూ.100 కోట్ల నుంచి రూ.130 కోట్ల మేర భారీగా అక్రమాలు జరిగాయని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. కాంట్రాక్టు విలువ కంటే అధిక ధరకు కట్టబెట్టడం వల్ల కాంట్రాక్టర్‌కు ప్రయోజనం చేకూర్చారని.. ఆ మేరకు ఖజానాకు నష్టం కలిగిందంటున్నారు.

జ్యుడీషియల్ ప్రివ్యూ-రివర్స్ టెండరింగ్ ఉండి ఉంటే..!

జ్యుడీషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ విధానంతో టెండర్ల వ్యవస్థకు 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసింది. చంద్రబాబు సర్కార్ వచ్చిన వెంటనే వీటిని రద్దు చేసింది. 2014–19 తరహాలోనే టెండర్ల వ్యవస్థను నీరుగార్చింది. మొబిలైజేషన్ అడ్వాన్సు పద్ధతిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రద్దు చేస్తే చంద్రబాబు సర్కార్ పునరుద్ధరించింది. ఒకవేళ జ్యుడీషియల్ ప్రివ్యూ ఇప్పుడు అమల్లో ఉన్నట్లైతే... టెండర్ నోటిఫికేషన్‌కు ముందే ఆ ప్రతిపాదనలోని తప్పులను ఇంజినీరింగ్ నిపుణులు, మేధావులు నుంచి సాధారణ ప్రజల వరకు ఎత్తిచూపే అవకాశం ఉండేది. వాటిని పరిగణనలోకి తీసుకుని అంచనా వ్యయాన్ని సరి చేయాలని ఏడీసీఎల్ అధికారులను జ్యుడీషియల్ ప్రివ్యూ జడ్జి ఆదేశించి ఉండేవారు అని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

- రివర్స్ టెండరింగ్ నిర్వహించి ఉంటే కాంట్రాక్టు విలువ కంటే 5 శాతం తక్కువకే పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకొచ్చేవారని, ఖజానాకు కనీసం రూ.20 కోట్లు ఆదా అయ్యేదని నిపుణులు వివరిస్తున్నారు. వీటిని లెక్కలోకి తీసుకుంటే ఎత్తిపోతల పనుల్లో రూ.150 కోట్ల మేర అవినీతి చోటుచేసుకుందని, దాన్ని కాంట్రాక్టర్‌తో కలిసి ముఖ్య నేత నీకింత, నాకింత అంటూ పంచుకు తినేందుకు సిద్ధమయ్యారని ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా...

గిరిజన ప్రాంతాల్లో బస్సు డిపోలు పెట్టాలి

సాక్షి, అమరావతి: కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలోని రంపచోడవరం, చింతూరుతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులో ఆర్టీసీ బస్సు డిపోలు ఏర్పాటు చేసి, బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో ఒక్క ఆర్టీసీ డిపో కూడా లేకపోవడం శోచనీయమన్నారు. గిరిజనుల పట్ల వివక్ష చూపకుండా బస్సు సౌకర్యాలను పెంచడంతోపాటు డిపోలు ఏర్పాటు చేయాలని శ్రీనివాసరావు కోరారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గిస్తున్నాం

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాక్షి, అమరావతి: ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లను నియంత్రించడం వల్లే ప్రజలపై చార్జీల భారం తగ్గించగల్గుతున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ట్రూ అప్ పేరుతో రూ.32,166 కోట్ల భారాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలపై మోపిందని ఆయన ఆరోపించారు. 2019 వరకు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఏపీని, వైఎస్సార్‌సీపీ పాలనలో అంధకారంలోకి నెట్టేశారని, 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు మరింత తగ్గించేలా స్పష్టమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు.

'అమరావతి చిత్రకళ వీధి'కి రూ.33.37 లక్షల ఖర్చు

సాక్షి, అమరావతి : రాజమహేంద్రవరంలో నిర్వహించిన 'అమరావతి చిత్రకళ వీధి' ఉత్సవానికి ప్రభుత్వం ఏకంగా రూ.33.37 లక్షలు ఖర్చు చేసింది. అమరావతి పేరుతో రాజమహేంద్రవరంలో గత ఏడాది ఏప్రిల్ 4న ఒక్క రోజు కార్యక్రమం ఖర్చులకు సంబంధించి తాజాగా నిధులను విడుదల చేసింది. దృశ్య కళలు, సాంస్కృతిక పర్యాటకం ప్రోత్సాహకంలో భాగంగా కల్చరల్ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వీధి ఫెస్టివల్‌లో 500 ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. ఇందుకోసం ఏకంగా రూ.18 లక్షల ఖర్చు చూపించింది. కళాకారుల వసతి సేవలకు మరో రూ.8.27 లక్షలు, శాలువాలు, మెమెంటోలు, ఫ్లెక్సీ ప్రింటింగ్, ఇతర ఖర్చులకు రూ.7.10 లక్షలు లెక్క తేల్చింది. వీటన్నింటికీ కలిపి రూ.33.37 లక్షలు చెల్లింపునకు పరిపాలనా అనుమతులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పోలీసుల జులుం

- న్యూఇయర్ కేక్ కటింగ్‌ను అడ్డుకునేందుకు టీడీపీ నేతల కుట్రలు
- ఆపై పచ్చ నేతల ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నేతలపై రెచ్చిపోయిన పోలీసులు
- కాకినాడ జిల్లా తుని మండలంలో దారుణం

పోలీసులు కొట్టడంతో దొరబాబు శరీరంపై గాయాలు

తుని రూరల్: నూతన సంవత్సరం వేడుకలు చేసుకుంటున్న తమను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆరోపించారు. బాధితులు అంకంరెడ్డి దొరబాబు (పార్టీ మండల ప్రధాన కార్యదర్శి), అంకంరెడ్డి శివ (సోషల్ మీడియా), సుర్ల జానకీ నాయుడు, కొరుప్రోలు గిరినాయుడు, కొరుప్రోలు స్వామి, బలపాటి సోమరాజు (వీవర్స్ వింగ్ మండల అధ్యక్షుడు), బైలపూడి స్వామి, బర్ల ప్రసాద్, అంకంరెడ్డి వెంకట రమణ మాట్లాడుతూ పోలీసులు లాఠీలతో ఇష్టానుసారం కొట్టారని వాపోయారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్‌కు ఏర్పాట్లు చేసుకుంటే.. కొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు కావాలనే అడ్డుతగిలి అలజడి సృష్టించారన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ చెన్నకేశవరావు, రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి సిబ్బందితో వచ్చి కనీసం ఏమి జరిగిందో తెలుసుకోకుండా పచ్చనేతల ఆదేశాలతో తమను లాఠీలతో ఇష్టారీతిన కొట్టారన్నారు. చేతులు, కాళ్లు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయని వాపోయారు. జరిగిన ఘటనపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఘటనపై రూరల్ ఎస్ఐ కృష్ణమాచారిని వివరణ కోరగా.. రెండు వర్గాలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయని, ఘర్షణలు జరగకుండా ఇరు వర్గాలనూ చెదరగొట్టామని తెలిపారు.

How to Score 100 Marks in Social Studies

Examination Strategy



Understanding the Syllabus:
- Study the **entire syllabus** with proper planning and understanding.
- All questions are **strictly based on the textbook,** though they may not be asked directly.
- Every answer is **available in the textbook,** either directly or indirectly.
- Conceptual clarity is more important than memorisation.

Importance of Textbook Reading:
- Read the **textbook thoroughly** with comprehension.
- Focus on **key terms, definitions, headings, and conclusions.**
- Active participation in **class discussions and project work** improves understanding.
- Presentation skills help in writing better answers.

Answer Writing Strategy:
- Answers can be written in **your own words** using textbook ideas.
- Always write answers **point-wise** to score full marks.
- In Social Studies, **each point usually carries one mark as per POV given the SSC Board.**

Mark-wise Writing Rule:
- **1 Mark** ⟶ Write **one word or one point** only.
- **2 Marks** ⟶ Write **two clear points or sentences only**.
- **4 Marks** ⟶ Write **four brief points or sentences only.**
- **8 Marks** ⟶ Write **eight well-structured points / sentences.**

Section-wise Question Pattern

Section - I (1 Mark Questions - from 1-12) It Includes:
- Fill in the blanks
- Definitions
- Expansions
- Multiple Choice Questions
- True or False
- Odd one out
- Pair relationships
- Sequencing countries

Answers must be written directly in
- One word.
- One point or sentence
- Bullet form.

Section - II
(2 Mark Questions - from 13-20)
- Write **only two points or sentences.**
- Points must be **clear, simple, and readable.**
- Avoid unnecessary explanations.

Section - III
(4 Mark Questions - from 21-28)
- Write **only four points**.
- Each point should be **short and relevant**.
- No extra information is required.

Section - IV
(8 Mark Questions - from 29-33)
- **Write exactly eight points.**
- Only this section has **internal choice.**
- Present points neatly with proper spacing.

Time Management
- **15 minutes** are given for reading the question paper.
- **3 hours** are allotted for writing answers.
- Total exam duration: **3 hours 15 minutes.**
- There is **no separate bit paper.**

Always:
- Plan answers during reading time.
- Keep track of time while writing.

Map Work Guidelines
- Map work is given as **Question No. 33.**
- In India map (Q.No. 33rd A) 1-4 or 5-8 have to answer.
- In the World map (Q.No. 33rd B) 1-4 or 5-8 have to answer.



You must mark:
- **4 points on the India map (either 1-4 or 5-8)**
- **4 points on the World map (either 1-4 or 5-8)**

Important Instructions:
- Choose **either Group A or Group B** (only one).
- If space is insufficient, draw an arrow and write the name clearly.
- Use **only blue or black pen** (don't use pencil).
- Two different sections may be marked using **two different pen colours.**

Practice Maps, Tables, and Graphs
- Practice **all maps** given in the textbook.
- Learn **tables, diagrams, and graphs** carefully.
- Accuracy is more important than decoration.

Presentation and Neatness
- Improve your **handwriting** regularly.
- Write the **question number clearly inside the margin.**
- Draw a line **after completing each answer.**
- Write **point numbers outside the margin** in the answer area.
- Avoid cancellations, overwriting, or corrections.

Key Examination Tips
- A question may look new, but the **answer is always familiar.**
- Practice **multiple questions on the same concept.**
- Stick to the **required number of points.**
- Do not write extra or irrelevant matter.
- The answer sheet has **24 pages only.**
- No additional sheets will be provided.

SSC PUBLIC EXAMINATIONS – MARCH 2026
SOCIAL STUDIES - MARKS DIVISION

TIME : 3.15 Hrs — Max Marks :100

Text Book	1 Mark		2 Marks		4 Marks		8 Marks		Map
	Question	Marks	Question	Marks	Question	Marks	Question	Marks	
Geography	3	3	2	4	2	8	1	8	8 Marks
History	3	3	2	4	2	8	1	8	
Polity	3	3	2	4	2	8	1	8	
Economics	3	3	2	4	2	8	1	8	
	12	12	8	16	8	32	4	32	8

Note:
1. *Questions No 33 is Unique from all Four Parts*
2. *In Section - IV each Question has internal Choice from the Same Part.*
3. *Total No. of Question are 33.*

Important Update in This Year's Blueprint - New Topics

This year's blueprint includes **two new topics: Evolution and Creation.**

- These topics are **newly introduced** in the examination pattern.
- Students must give **special attention** to these chapters.
- **Evolution** carries **10 marks**
- **Creation** also carries **10 marks.**
- Questions from Evolution and Creation may be **analytical and conceptual.**
- Similar questions were **not asked in previous examinations.**
- Therefore, students may find them **slightly challenging.**

Examples: EVALUATION

1. "India is a secular state". - Justify.
2. "Caste alone can not decide elections". - Justify.
3. "Women representation in legislature is very low in India".- Justify.
4. "Salt march is an effective symbol of resistance", - Justify.
5. "Print culture assisted the growth of nationalism". - Justify.

Examples: CREATION

1. Write a news report on unification of Germany.
2. Write a diary entry on Garibaldi's role.
3. Propose 4 ways to make India a developed country.
4. You were a Journalist. Write on unification of Germany.
5. Imagine you were a citizen living under Napoleon's rule. Make a diary entry on the changes introduced by Napoleon.

Final Advice

- Be confident and calm.
- Read questions carefully before answering.
- Neat presentation + correct points = **full marks.**
- Smart writing is the key to scoring **100/100 in Social Studies.**

WEIGHTAGE FOR OBJECTIVES

OBJECTIVE	WEIGHTAGE	MARKS
I (Knowledge)	20%	20
II (Understanding)	25%	25
III (Application)	20%	20
IV (Analysis)	15%	15
V (Evaluation)	10%	10
VI (Creation)	10%	10
	TOTAL: 100%	100 MARKS

The symbol to be used in the maps

Rivers	
Mountains / hills	
Plateaus, Plains	
Countries, States	
Capital Cities, Cities	●

BLUEPRINT - SSC PUBLIC EXAMINATIONS MARCH-2026

GEOGRAPHY

		1M	2M	4M	8M	MAP	TOTAL QUESTIONS	TOTAL MARKS
1	RESOURCES AND DEVELOPMENT	2				1	3	3
2	FOREST AND WILDLIFE			1			1	4
3	WATER RESOURCES				1		1	8
4	AGRICULTURE				1(IC)		1(IC)	(8)
5	MINERALS AND ENERGY			1			1	4
6	MANUFACTUTURING INDUSTRIES	1	1			1	3	4
7	LIFELINES OF NATIONAL ECONOMY		1			2(IC)	1 + 2(IC)	2 + (2)
	TOTAL QUESTIONS	3	2	2	1+1(IC)	2 + 2(IC)	10 +(3)	-
	TOTAL MARKS	3	4	8	8 + (8)	2 + (2)	-	25

HISTORY

		1M	2M	4M	8M	MAP	TOTAL QUESTIONS	TOTAL MARKS
1	RISE OF NATIONALISM INEUROPE	1		1			2	5
2	NATIONALISM IN INDIA				1		1	8
3	THE MAKING OF GLOBAL WORLD	2	1			2 (IC)	3 + 2 (IC)	4 + (2)
4	THE AGE OF INDUSTRIALISATION			1			1	4
5	PRINT CULTURE AND THE MODERN		1		1(IC)	2	3 + (1 IC)	4 + (8)
	TOTAL QUESTIONS	3	2	2	1+1(I C)	2+2(IC)	10 +(3)	-
	TOTAL MARKS	3	4	8	8 + (8)	2 + (2)	-	25

CIVICS

		1M	2M	4M	8M	MAP	TOTAL QUESTIONS	TOTAL MARKS
1	POWER -SHARING				1		1	8
2	FEDERALISM	2	1				3	4
3	GENDER,RELIGION AND CASTE		1	1			2	6
4	POLITICAL PARTIES	1			1(IC)	2+1(IC)	3+2(IC)	3+(1+8)
5	OUTCOMS OF DEMOCRACY			1		1 (IC)	1+1(IC)	4
	TOTAL QUESTIONS	3	2	2	1+1(IC)	2 + 2(IC)	10 +(3)	-
	TOTAL MARKS	3	4	8	8 + (8)	2 + (2)	-	25

ECONOMICS

	LESSONS	1M	2M	4M	8M	MAP	TOTAL QUESTIONS	TOTAL MARKS
1	DEVELOPMENT	1		1			2	5
2	SECTORS OF THE INDIAN ECONOMY				1		1	8
3	MONEY AND CREDIT				1(IC)	2+2(IC)	2 + 3(IC)	2+(8+2)
4	GLOBALISATION AND THE INDIAN	2	1				3	4
5	CONSUMER RIGHTS		1	1			2	6
	TOTAL QUESTIONS	3	2	2	1+1(IC)	2 + 2(IC)	10 +(3)	-
	TOTAL MARKS	3	4	8	8 + (8)	2 + (2)	-	25

SECTION WISE QUESTIONS & MARKS:

SECTION	Question No	Marks
I	01-12	12 X 1 = 12 M
II	13 - 20	8 X 2 = 16 M
III	21 - 28	8 X 4 = 32 M
IV	29 – 33 (IC)	5 (IC) X 8 = 40 M
	Total: 33	100 marks

Prepared by
K. Suresh, Subject Expert

Daily Quiz

Quiz-2

1. There used to be a great monument, ... Add a suitable question tag.
   a) didn't it b) wasn't it
   c) wasn't there d) was there
2. Choose the correct meaning of the phrasal verb "take after".
   a) To run away b) To resemble
   c) To look after d) To remove
3. Can I have some milk before I .... to bed tomorrow? Choose the appropriate form of the verb to fill in the blank.
   a) went b) going
   c) go d) will go
4. Despite his lugubrious demeanor, he managed to captivate the audience with his storytelling. The word "lugubrious" is a/an __.
   a) Conjunction b) Noun
   c) Adjective d) Adverb
5. Her kitchen was immaculate. The opposite of the word "immaculate" is:
   a) Clean b) Spotless
   c) Dirty d) Polished

సాక్షి బిజినెస్

శుక్రవారం
2-1-2026

స్టాక్ మార్కెట్లు

(ప్రపంచ మార్కెట్లకు సెలవు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
32	17
85,189	26,147

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,242	▽	177
డోజోన్స్	48,063	▽	304
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,931	▽	9
డాక్స్	24,490	▽	139
షాంఘై	3,969	△	4
నికాయ్	50,339	▽	187

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.50	90.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.60	122.54
€	యూరో	ఎస్‌బీఐ	104.20	107.02
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.69	58.07
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.89	61.20
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.62	71.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.09	24.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.60	24.86
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.99	13.81

జోరుగా జీఎస్‌టీ వసూళ్లు

- డిసెంబర్‌లో 6 శాతం అధికం
- రూ.1.74 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: నిత్యావసరాలపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) 2025 డిసెంబర్ నెలకు రూ.1.74 లక్షల కోట్లు వసూలైంది. 2024 డిసెంబర్‌లో ఆదాయం రూ.1.64 లక్షల కోట్లు కంటే 6 శాతం పెరిగింది. గత ఏడాది సెప్టెంబర్ 22 నుంచి 375 వస్తువులపై జీఎస్‌టీ రేటు తగ్గించడం తెలిసిందే. 12, 28 శాతం శ్లాబులు ఎత్తివేయడం ఫలితంగా వాటి రేట్లు దిగొచ్చాయి. అయినప్పటికీ జీఎస్‌టీ ఆదాయం మెరుగ్గా నమోదవుతుండడం గమనార్హం. దేశీ ఉత్పత్తులపై ఆదాయం 1.2 శాతం పెరిగి రూ.1.22 లక్షల కోట్లుగా ఉంటే, దిగుమతి అయిన వస్తువులపై జీఎస్‌టీ రూపంలో ఆదాయం 19.7 శాతం **పెరిగి** రూ.51,977 కోట్లకు **చేరింది.** రిఫండ్‌లు సైతం 31 **శాతం** పెరిగి రూ.28,890 **కోట్లుగా** ఉన్నాయి. డిసెంబర్ నెలకు నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.45 లక్షల కోట్లుగా నమోదైంది. 2024 డిసెంబర్ నెల కంటే 2.2 శాతం పెరిగింది. సెస్సు రూపంలో ఆదాయం రూ.4,238 కోట్లకు పరిమితమైంది. 2024 డిసెంబర్‌లో రూ.12,003 కోట్ల సెస్సు వసూలు కావడం గమనించొచ్చు. సెప్టెంబర్ 22 నుంచి సెస్సు అన్నది కేవలం పొగాకు, వాటి ఉత్పత్తులకే పరిమితం చేయగా, లగ్జరీ వస్తువులపై తొలగించడం తెలిసిందే.

పొగాకుమీద పన్నుల మోత

- హెల్త్ సెస్సుతో ప్రభుత్వ కొరడా
- ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ
- గుట్కా, పాన్ మసాలాపై సెస్సు
- ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ, గుట్కా, పాన్ మసాలాపై హెల్త్ సెస్సు .. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫై చేసింది. ఈ ఉత్పత్తులపై 40 శాతం జీఎస్‌టీ రేటుకి అదనంగా జాతీయ భద్రత సెస్సు, హెల్త్ సెస్సు, ఎక్సైజ్ డ్యూటీ ఉండనున్నాయి. బీడీలపై 18 శాతం జీఎస్‌టీకి అదనంగా ఇవి ఉంటాయి. గుట్కాపై అదనంగా 91 శాతం, నమిలే పొగాకుపై 82 శాతం, జర్దా సెంటెడ్ పొగాకుపై 82 శాతం మేర అదనంగా ఎక్సైజ్ డ్యూటీ విధించనున్నారు. ఇక పొడవు, ఫిల్టర్‌ను బట్టి ప్రతి 1,000 సిగరెట్లకు రూ. 2,050–రూ. 8,500 వరకు సుంకాలు ఉంటాయి. ప్యాకేజీపై ముద్రించిన రిటైల్ ధర ప్రాతిపదికన జీఎస్‌టీ విలువను మదింపు చేసే విధంగా కొత్త ఎంఆర్‌పీ ఆధారిత వేల్యుయేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎక్సైజ్ డ్యూటీ ద్వారా వచ్చే నిధులను ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రాలకు పంపిణీ చేయనున్నారు.

నోటిఫికేషన్ ప్రకారం పొగాకు, గుట్కా తదితర ఉత్పత్తుల తయారీ సంస్థలు తమ దగ్గరున్న ప్యాకింగ్ మెషీన్ల సంఖ్య, వాటి సామర్థ్యాల గురించి ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలి. ప్యాకింగ్ మెషీన్లన్నీ కనిపించేలా సీసీటీవీ సిస్టమ్‌లను ఇన్‌స్టాల్ చేయాలి. అలాగే ఫుటేజీని కనీసం 24 నెలల పాటు భద్రపర్చాలి. ప్రస్తుతం పాన్ మసాలా, సిగరెట్లు, సిగార్లు, హుక్కా, జర్దా మొదలైన పొగాకు ఉత్పత్తులపై 28 శాతం జీఎస్‌టీతో పాటు వివిధ స్థాయిల్లో కాంపెన్సేషన్ సెస్సు విధిస్తున్నారు. 2017 జూలై 1న జీఎస్‌టీని ప్రవేశపెట్టినప్పుడు, రాష్ట్రాలకు వాటిల్లే ఆదాయ నష్టాన్ని భర్తీ చేసేందుకు 2022 జూన్ 30 వరకు అయిదేళ్ల పాటు కాంపెన్సేషన్ సెస్సు విధానాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. తర్వాత దీన్ని 2026 మార్చి 31 వరకు (నాలుగేళ్లు) పొడిగించింది. కోవిడ్ సమయంలో రాష్ట్రాలకు పరిహారం ఇచ్చేందుకు తీసుకున్న రూ. 2.69 లక్షల కోట్ల రుణాలను 2026 జనవరి 31 నాటికి తీర్చివేశాక కాంపెన్సేషన్ సెస్సు విధించడం నిల్చిపోతుంది. ఈ నేపథ్యంలో తాజా సెస్సుల ప్రతిపాదనలను డిసెంబరులో పార్లమెంటు ఆమోదించింది.

టొబాకో షేర్లు డౌన్ ..

అదనపు ఎక్సైజ్ డ్యూటీ నోటిఫికేషన్‌తో టొబాకో కంపెనీల షేర్లలో గురువారం భారీగా అమ్మకాలు వెల్లువెత్తాయి. ఐటీసీ షేరు దాదాపు 10 శాతం క్షీణించి సుమారు రూ. 364కి తగ్గింది. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా షేరు ఏకంగా 17 శాతం తగ్గి దాదాపు రూ. 2,290 వద్ద క్లోజయ్యింది. ఇంట్రాడేలో 19 శాతం క్షీణించి రూ. 2,230 స్థాయిని కూడా తాకింది. అటు వీఎస్‌టీ ఇండస్ట్రీస్ 0.60 శాతం క్షీణించి రూ. 255.15 వద్ద ముగిసింది.

వొడాఫోన్‌కి కొత్త షాక్

రూ.638 కోట్ల జీఎస్‌టీ పెనాల్టీ ఆర్డరు

న్యూఢిల్లీ: ఏజీఆర్ బకాయిల విషయంలో కాస్త ఊరట లభించిన మర్నాడే టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియాకి (వీఐఎల్) షాక్ తగిలింది. అహ్మదాబాద్‌లోని కేంద్రీయ గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ అదనపు కమిషనర్ కార్యాలయం రూ. 638 కోట్ల మేర జీఎస్‌టీ పెనాల్టీ ఆర్డరును జారీ చేసింది. కట్టాల్సిన దానికన్నా తక్కువగా పన్ను కట్టడంతో పాటు అధిక స్థాయిలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసిందనే ఆరోపణలపై ప్రభుత్వం దీన్ని జారీ చేసినట్లు కంపెనీ తెలిపింది. దీనిపై చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

సెన్సెక్స్‌కు నష్టం, నిఫ్టీకి లాభం

2026 తొలిరోజున స్తబ్దుగా ట్రేడింగ్

ముంబై: కొత్త ఏడాది(2026) తొలి రోజున దేశీయ స్టాక్ మార్కెట్ ఫ్లాటుగా ముగిసింది. ఎఫ్‌ఎంసీజీ షేర్లలో భారీ అమ్మకాలు, డాలర్ మారకంలో రూపాయి క్షీణత సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 32 పాయింట్లు నష్టపోయి 85,189 వద్ద స్థిరపడింది. నిఫ్టీ స్వల్పంగా 17 పాయింట్లు పెరిగి 26,147 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 351 పాయింట్ల పరిధిలో 85,102 వద్ద కనిష్టాన్ని, 85,452 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 26,113 – 26,198 శ్రేణిలో ట్రేడైంది. డిసెంబర్‌లో వాహన విక్రయాలు మెప్పించినట్లు గణాంకాల వెల్లడితో ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ షేర్లలో వాల్యూ బైయింగ్ కనిపించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

కార్ల విక్రయాలు అదుర్స్	పెరిగిన వాణిజ్య ఎల్‌పీజీ ధర

బిలియన్ల బిడ్ వార్

- ఏఐ,క్లౌడ్‌పై ఆధిపత్యం కోసం ఐటీ దిగ్గజాల పోటీ
- కొత్త టెక్నాలజీ కంపెనీలే టార్గెట్‌గా షాపింగ్
- రూ. 38,700 కోట్ల పెట్టుబడులు

సాధారణంగా సాఫ్ట్‌వేర్ సర్వీసుల రంగ దిగ్గజాలు కార్యకలాపాల ద్వారా భారీగా నగదు ఆర్జిస్తుంటాయి. దీంతో వాటాదారులకు అత్యధిక స్థాయిలో డివిడెండ్లు చెల్లిస్తుంటాయి. వీటితోపాటు కొన్ని సందర్భాలలో సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కు సైతం తెరతీస్తుంటాయి. నికర లాభాలను వాటాదారులకు పంచే కంపెనీ విధానాలే దీనికికారణంకాగా.. నగదు నిల్వలను ఇతర కంపెనీల కొనుగోళ్లకూ వెచ్చిస్తుంటాయి. అయితే ఈ ఏడాది(2025–26) కొనుగోళ్లు, విలీనాల(ఎంఅండ్ఏ)కు ప్రాధాన్యత పెరిగింది. దీంతో టాప్–10 టెక్ దిగ్గజాలు ఉమ్మడిగా 4.3 బిలియన్ డాలర్ల(రూ. 38,700 కోట్లు) వెచ్చించాయి. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), క్లౌడ్ టెక్నాలజీలలో అధిక కొనుగోళ్లకు ఈ ఏడాది తెరలేచింది. గతేడాది(2024–25) డివిడెండ్లకు టాప్–10 ఐటీ కంపెనీలు 10.8 బిలియన్ డాలర్లు(రూ. 96,557 కోట్లు) కేటాయించగా.. ఈక్విటీ బైబ్యాక్‌లకు 1.5 బిలియన్ డాలర్లు(రూ. 14,000 కోట్లు) వెచ్చించాయి. ఇక ఇతర సంస్థల కొనుగోళ్లకు రూ. 27,000 కోట్లు వినియోగించాయి.

కారణాలున్నాయ్

ఈ ఏడాది కొత్త టెక్నాలజీలు, కంపెనీలపై ఐటీ దిగ్గజాలు బాగా దృష్టి పెట్టాయి. ఇందుకు ఐటీ రంగంలో ఆదాయ సంబంధ మందగమనంతోపాటు.. ఐటీ సేవలకు అతిపెద్ద మార్కెట్ యూఎస్ నుంచి హెచ్1బీ తదితర అనుకోని సవాళ్లు ఎదురుకావడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. దీంతో ఆదాయ వనరులను పెంచుకునేందుకు సరికొత్త టెక్నాలజీల అభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు తెర తీస్తున్న ఇతర కంపెనీల కొనుగోళ్లు తదితరాలపై అధిక పెట్టుబడులను వెచ్చిస్తున్నట్లు తెలియజేశాయి. ప్రస్తుతం అన్ని రంగాలలోనూ ఏఐ, క్లౌడ్ వినియోగం పెరుగుతుండటంతో విభిన్న వర్టికల్స్, డొమైన్లలో వేగంగా విస్తరిస్తున్న కంపెనీలపై ఐటీ దిగ్గజాలు కన్నేస్తున్నట్లు పేర్కొన్నాయి.

ప్రస్తుతం ఇదీ తీరు

ఆదాయం, ఆర్డర్‌బుక్‌ను పటిష్టపరచుకునే బాటలో ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ ఇతర కంపెనీలకు సొంతం చేసుకుంటున్నాయి. లిస్టయిన 2004 తదుపరి టీసీఎస్ డజను కంపెనీలను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఈ బాటలో తాజాగా మిడ్ క్యాప్ ఐటీ కంపెనీలు కోఫోర్జ్, హెక్సావేర్ టెక్నాలజీస్ మరో అడుగు ముందుకేశాయి. వెరసి నగదు ఆర్జనలో అధిక శాతాన్ని వాటాదారులకు పంచడం కంటే ఇతర కంపెనీల కొనుగోళ్లకే కేటాయిస్తున్నాయి. డివిడెండ్లు, ఈక్విటీ బైబ్యాక్‌లను మించుతూ కొత్త టెక్నాలజీ కంపెనీలపట్ల ఆసక్తి చూపుతున్నాయి.

కొనుగోళ్ల జోరు

దేశీ ఐటీ కంపెనీల చరిత్రలోనే భారీ డీల్‌కు తెరతీస్తూ గత వారం మిడ్‌టైర్ కంపెనీ కోఫోర్జ్ 2.39 బిలియన్ డాలర్ల విలువైన కొనుగోలుని ప్రకటించింది. యూఎస్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఎన్‌కోరాను సొంతం చేసుకునేందుకు షేర్ల జారీ ద్వారా డీల్ కుదుర్చుకుంది. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకూ కోఫోర్జ్ ఇతర కంపెనీల కొనుగోళ్లపై రూ. 21,450 కోట్లు వెచ్చించింది. ఇదే కాలంలో వాటాదారులకు కేవలం రూ. 260 కోట్లు డివిడెండ్‌గా చెల్లించింది. మరో మధ్యస్థాయి ఐటీ కంపెనీ హెక్సావేర్(జనవరి–డిసెంబర్ ఆర్థిక సంవత్సరం) సైతం ఇతర సంస్థలను సొంతం చేసుకునేందుకు రూ. 1,614 కోట్లు వెచ్చించింది. సెప్టెంబర్ చివరివరకూ వాటాదారులకు డివిడెండ్ రూపేణా రూ. 349 కోట్లు కేటాయించింది. ఇక దిగ్గజాలు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో ఉమ్మడిగా 7 కంపెనీల కొనుగోళ్లకు 1.03 బిలియన్ డాలర్లు వినియోగించాయి. వీటిలో డేటా అనలిటిక్స్, డిజైన్ ఇంజినీరింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రస్తావించదగ్గ అంశం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

పెన్షన్ ఫండ్ ఏర్పాటుకు బ్యాంక్‌లకు అనుమతి

ఎన్‌పీఎస్‌పై పీఎఫ్‌ఆర్‌డీఏ నిర్ణయం

న్యూఢిల్లీ: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) కింద పెన్షన్ ఫండ్స్ ఏర్పాటుకు బ్యాంక్‌లను అనుమతిస్తూ పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి మండలి (పీఎఫ్‌ఆర్‌డీఏ) నిర్ణయం తీసుకుంది. పెన్షన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం, చందాదారుల ప్రయోజనాలను కాపాడడంతోపాటు, పోటీని పెంచేందుకు ఈ నిర్ణయానికి వచ్చినట్లు పీఎఫ్‌ఆర్‌డీఏ ప్రకటించింది. పెన్షన్ ఫండ్స్ అన్నవి ఎన్‌పీఎస్ చందాదారుల పెట్టుబడులను ఇన్వెస్ట్ చేస్తూ, రాబడులను పంచే బాధ్యతను చూస్తుంటాయి. బ్యాంకుల నెట్‌వర్త్ ఆధారంగా వాటిని అనుమతించేందుకు, పూర్తి కార్యాచరణ, మార్గదర్శకాలను తర్వాత నోటిఫై చేయనున్నట్లు పీఎఫ్‌ఆర్‌డీఏ తెలిపింది. ప్రస్తుతం ఎన్‌పీఎస్ కింద 10 పెన్షన్ ఫండ్స్ సేవలు అందిస్తున్నాయి. మరోవైపు ఎన్‌పీఎస్ ట్రస్ట్‌లో ముగ్గురిని నియమిస్తూ పీఎఫ్‌ఆర్‌డీఏ నిర్ణయం తీసుకుంది.

సాక్షి స్పోర్ట్స్

'యాషెస్' చివరి టెస్టుకు మార్పుల్లేని ఆసీస్ జట్టు

సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్ చివరి టెస్టు కోసం ఆస్ట్రేలియా జట్టులో ఏ మార్పు చేయలేదు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే ఆసీస్ 3–1తో సొంతం చేసుకోగా... ఆఖరిదైన ఐదో టెస్టు ఆదివారం సిడ్నీ వేదికగా ప్రారంభం కానుంది. దీని కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) గురువారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. గత మ్యాచ్‌లో ఓడినప్పటికీ అదే జట్టును కొనసాగిస్తోంది. స్టీవ్ స్మిత్ జట్టుకు సారథ్యం వహించనుండగా... ఆసీస్ బృందం గురువారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో సంపూర్ణ ఆధిపత్యంతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసి సిరీస్ నిలబెట్టుకున్న ఆతిథ్య ఆసీస్... నాలుగో టెస్టులో పరాజయం పాలైంది. దీంతో ఇంగ్లండ్ జట్టు పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు మ్యాచ్ నెగ్గింది. పూర్తిగా పేసర్లకు సహకరించిన మెల్‌బోర్న్ టెస్టు కేవలం రెండు రోజుల్లోనే ముగియడంతో... నాలుగో టెస్టుకు ఎలాంటి పిచ్ సిద్ధం చేస్తారనేది ఆసక్తికరం.

మిచెల్ మార్ష్ సారథ్యంలో..

టి20 ప్రపంచకప్‌నకు ఆస్ట్రేలియా జట్టు



మెల్‌బోర్న్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ప్రపంచకప్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. వచ్చే నెలలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న ఈ మెగాటోర్నీలో బరిలోకి దిగే ఆసీస్ బృందానికి మిచెల్ మార్ష్ సారథ్యం వహించనున్నాడు. ఉపఖండంలో వరల్డ్‌కప్ జరగనున్న నేపథ్యంలో... జట్టు ఎంపికలో స్పిన్నర్లకు పెద్దపీట వేశారు. గాయాలతో ఇబ్బంది పడుతున్న ప్యాట్ కమిన్స్, జోష్ హాజల్‌వుడ్, టిమ్ డేవిడ్‌లు ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. వరల్డ్‌కప్ సమయానికి వీరు ఫిట్‌నెస్ సాధిస్తారని చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఆరు టి20 ప్రపంచ కప్‌లలో కేవలం ఒక్క టోర్నీలో మాత్రమే ఆడని స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ టి20లకు వీడ్కోలు పలకడంతో... కూపర్ కొనొల్లీకి జట్టులో చోటు దక్కింది. ఆసీస్ ఆడిన గత 12 టి20 మ్యాచ్‌ల్లో ఆడని కొనొల్లీ ఎంపిక ఒక్కటే ఆశ్చర్య పరిచే నిర్ణయం! గ్రీన్, స్టొయినిస్, టిమ్ డేవిడ్, మ్యాక్స్‌వెల్ రూపంలో నాణ్యమైన ఆల్‌రౌండర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. ఈ జట్టులో మార్పు చేర్పులకు ఈ నెల 31 వరకు ఐసీసీ అవకాశం కల్పించింది. ఐర్లాండ్, ఒమాన్, శ్రీలంక, జింబాబ్వేలతో కలిసి ఆస్ట్రేలియా గ్రూప్ 'బి'లో పోటీ పడనుంది. వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 11న ఐర్లాండ్‌తో ఆసీస్ తొలి మ్యాచ్ఆడనుంది. ఆ తర్వాత 13న జింబాబ్వేతో, 16న శ్రీలంకతో, 20న ఒమాన్‌తో తలపడుతుంది. ఇప్పటి వరకు తొమ్మిది టి20 ప్రపంచ కప్‌లు జరగగా... అందులో భారత్, వెస్టిండీస్, ఇంగ్లండ్ రెండేసి సార్లు ట్రోఫీ దక్కించుకున్నాయి. పాకిస్తాన్, శ్రీలంక, ఆస్ట్రేలియా ఒక్కోసారి విజేతగా నిలిచాయి. వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందు పాకిస్తాన్‌తో ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ ఆడనుంది.

ఆస్ట్రేలియా జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), హెడ్, ఇన్‌గ్లిస్, జేవియర్, కూపర్ కొనొల్లీ, కమిన్స్, టిమ్ డేవిడ్, గ్రీన్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, నాథన్ ఎలీస్, హాజల్‌వుడ్, కునేమన్, షార్ట్, జంపా.

టాప్స్‌లో జ్యోతి సురేఖ

ఏపీ ఆర్చర్ రాటుదేలేందుకు పథకం తోడ్పాటు • ఇకపై కాంపౌండ్ ఆర్చర్లకు చేయూత
'టాప్స్' నుంచి డోపీ రితిక అవుట్ • 'టాగ్'లోకి గోల్ఫర్లు

న్యూఢిల్లీ: టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్)లో కొత్తగా కాంపౌండ్ ఆర్చర్లను చేర్చారు. దీంతో ఎన్నో ఏళ్లుగా అంతర్జాతీయ ఆర్చరీ పోటీల్లో భారత్‌కు పతకాలు తెచ్చిపెడుతున్న తెలుగుతేజం, ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖకు ఇది కొత్త ఉత్సాహం ఇవ్వనుంది. భారత్ నుంచి ఒలింపిక్ పతక విజేతలను తయారు చేయడమే లక్ష్యంగా కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ 'టాప్స్' ద్వారా చేయూత ఇస్తోంది. అయితే ఇన్నాళ్లు ఒలింపిక్ క్రీడాంశాలకే 'టాప్స్'ను అమలు చేస్తూ వచ్చారు. దీంతో ఒలింపిక్స్‌లో లేని కాంపౌండ్ కేటగిరీకి 'టాప్స్'ను ఇవ్వడం లేదు. దీనివల్ల ప్రపంచ ఆర్చరీ పోటీల్లో దేశానికి, రాష్ట్రానికి పతక ప్రతిష్టలు తెస్తున్న జ్యోతి సురేఖ, పర్‌నీత్ కౌర్, అభిషేక్ వర్మలాంటి వారు దూరమయ్యారు. తాజాగా క్రీడా మంత్రిత్వ శాఖ నిర్ణయంతో ఒలింపిక్ ఈవెంట్‌తో సంబంధం లేకపోయినా 8 మంది కాంపౌండ్ ఆర్చర్లకు లబ్ధి చేకూరనుంది. మరో తెలుగుతేజం రికర్వ్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర ఇప్పటికే ఈ పథకంలో ఉన్నాడు. డోపింగ్‌లో పట్టుబడిన మహిళా రెజ్లర్ రితిక హుడాను 'టాప్స్' నుంచి తొలగించారు. 2024–పారిస్ ఒలింపిక్స్ కోసం 179 మందికి 'టాప్స్'ను అమలు చేశారు. ప్రదర్శన, వైఫల్యం, డోపింగ్ కారణాలతో గతేడాది నాటికి 179 జాబితా కాస్తా 94 మందికి పడిపోయింది. ఈ ఏడాది మొదలవుతుండగానే 'టాప్స్' కోర్ గ్రూప్ జాబితాను 118 మందికి పెంచారు. ఇందులో 57 మంది అథ్లెట్లు కాగా, మరో 61 మంది పారాథ్లెట్లు ఉన్నారు. క్రీడాశాఖ ప్రత్యేక డెవలప్‌మెంట్ గ్రూప్ జాబితాలో అథ్లెట్లు అనిమేశ్ కుజుర్ (200 మీ. పరుగు), తేజస్విన్ శంకర్ (డెకథ్లాన్), 4–400 మీ. రిలే జట్టు సభ్యులు విశాల్, జయ్ కుమార్, రాజేశ్ రమేశ్, అమోజ్ జాకబ్, మొహమ్మద్ అజ్మల్, సంతోష్ కుమార్‌లు ఉన్నారు. ఈ గ్రూప్‌లోనే టేబుల్ టెన్నిస్ ప్లేయర్లు మానుశ్ షా, మానవ్ ఠక్కర్, దియా చిటాలేలకు చోటుదక్కింది.

'టాగ్'లో కొత్తగా గోల్ఫ్, సర్ఫింగ్

టార్గెట్ ఆసియా క్రీడల గ్రూప్ (టీఏజీజీ–టాగ్)లో కొత్తగా లబ్ధిపొందే క్రీడాంశాలను పెంచారు. 'టాప్స్'లో లేని గోల్ఫ్, సర్ఫింగ్, టెన్నిస్ క్రీడాకారులకు 'టాగ్' కింద చేయూత అందిస్తారు. ఈ ఏడాది జపాన్‌లో ఏషియాడ్ జరగనుంది. ఈ ఆసియా క్రీడల్లో పతకాలు తేవాలనే ఉద్దేశంతో గోల్ఫర్లు శుభాంకర్ శర్మ, దీక్ష డాగర్, టెన్నిస్ ప్లేయర్లు సుమిత్ నగాల్, యూకీ బాంబ్రీ, మాయ రాజేశ్వరన్ సహా 48 మందిని 'టాగ్' పథకం కింద ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటికే ఈక్వెస్ట్రియన్స్ (గుర్రపుస్వారీ) ఫౌద్ మీర్జా, అనుశ్ అగర్‌వాలా, ఫెన్సర్ భవానీ దేవి, జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ తదితరులు ఉన్నారు. 'టాప్స్', 'టాగ్' పథకాల కింద కోచింగ్, ఇతరాత్ర ఖర్చుల కింద నెలకు రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తారు. అవసరమైతే మరో రూ. 25 వేలు పాకెట్ అలవెన్స్‌గా అందజేస్తారు. అలాగే విదేశీ శిక్షణలో ఉన్నన్ని రోజులు రోజుకు రూ. 2250 (25 డాలర్లు) అదనంగా ఇస్తారు. అయితే విదేశీ శిక్షణకు ముందుగా ఆమోదం పొందాల్సివుంటుంది.

షూటౌట్‌లో బెంగాల్ విజయం

రాంచీ: మహిళల హాకీ ఇండియా లీగ్‌లో ష్రాచి బెంగాల్ టైగర్స్ జట్టు రెండో విజయం ఖాతాలో వేసుకుంది. గురువారం హోరాహోరీగా సాగిన పోరులో బెంగాల్ టైగర్స్ షూటౌట్‌లో 4–3 గోల్స్ తేడాతో ఎస్‌జీ పైపర్స్‌పై గెలుపొందింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 3–3 గోల్స్‌తో సమంగా నిలవడంతో... విజేతను నిర్ణయించేందుకు షూటౌట్ అనివార్యం కాగా... అందులో ఒత్తిడిని అధిగమించిన బెంగాల్ టైగర్స్ విజయం సాధించింది. నిర్ణీత సమయంలో బెంగాల్ తరఫున అగస్టినా (6వ, 18వ నిమిషాల్లో) డబుల్ గోల్స్ సాధించగా... లాల్‌రెమ్‌సియామి (11వ నిమిషంలో) ఒక గోల్ చేసింది. ఎస్‌జీ పైపర్స్ తరఫున లొలా రైరా (10వ, 60వ నిమిషాల్లో) రెండు గోల్స్ బాదగా... సునెలితా టప్పో (59వ నిమిషంలో) ఒక గోల్ చేసింది. మ్యాచ్ ఆరంభంలో బెంగాల్ విజృంభించగా... రెండు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా పైపర్స్ రెండు గోల్స్‌తో స్కోరు సమం చేసింది.

అమన్, అంతిమ్‌పై నజర్

- రేపు ప్రొ రెజ్లింగ్ లీగ్ వేలం

అమన్

అంతిమ్

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్లు అమన్ సెహ్రావత్, అంతిమ్ పంఘల్... ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. అమన్ పురుషుల విభాగంలో రూ. 18 లక్షల ప్రాథమిక ధరతో వేలంలోకి రానుండగా... మహిళల విభాగంలో అంతిమ్ రూ. 10 లక్షలు 'బేస్ ప్రైస్'గా నిర్ణయించుకుంది. ఈ నెల 15 నుంచి ఈ లీగ్ ప్రారంభం కానుండగా... శనివారం వేలం నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తం ఆరు ఫ్రాంచైజీలు హరియాణ థండర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, పంజాబ్ రాయల్స్, మహారాష్ట్ర కేసరి, ఢిల్లీ దంగల్ వారియర్స్, యూపీ డామినేటర్స్ పాల్గొంటున్నాయి. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, 21 ఏళ్ల అమన్ సెహ్రావత్ అత్యధిక ప్రాథమిక ధరతో వేలంలో అందుబాటులో ఉండగా... కామన్వెల్త్ గేమ్స్ పతక విజేత దీపక్ పూనియా, నవీన్ రూ. 10 లక్షల 'బేస్ ప్రైస్'తో వేలంలోకి రానున్నారు. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న సుజీత్ కల్‌కల్ తన ప్రాథమిక ధరను రూ. 7 లక్షలుగా నిర్ణయించుకున్నాడు. విదేశీ రెజ్లర్ల కేటగిరీల్లో రష్యాకు చెందిన ప్రపంచ మాజీ చాంపియన్ మగోమ్‌డోవ్‌తో పాటు అర్మాన్ (అర్మేనియా), ఇస్మాయిల్ (హంగేరి), అర్సెన్ (అర్మేనియా), ఉస్మానోవ్ అహ్మద్ (రష్యా) రూ. 10 లక్షల ప్రాథమిక ధరతో వేలంలోకి రానున్నారు. మహిళల విభాగంలో భారత స్టార్ అంతిమ్ పంఘల్ రూ. 10 లక్షల 'బేస్ ప్రైస్'తో వేలంలోకి రానుంది.

నేటి నుంచి ప్రపంచ యూత్ టీటీ టోర్నీ

వడోదర: ప్రపంచ టేబుల్ టెన్నిస్ యూత్ కంటెండర్ టోర్నీ, ప్రపంచ ఫీడర్ సిరీస్‌లకు రంగం సిద్ధమైంది. ఇక్కడి సామ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. నేటి నుంచి 5వ తేదీ వరకు కంటెండర్ పోటీలు, 7 నుంచి 11వ తేదీ వరకు ఫీడర్ సిరీస్ పోటీలు జరుగుతాయి. ఈ రెండు టోర్నీల్లో పది దేశాలకు చెందిన 334 టేబుల్ టెన్నిస్ ప్లేయర్లు పాల్గొనేందుకు భారత్‌కు వచ్చారు. అత్యధికంగా యూత్ కంటెండర్‌లో 226 మంది, ఫీడర్ సిరీస్‌లో 108 మంది బరిలోకి దిగుతున్నారు. శుక్రవారం కంటెండర్ టోర్నీలో అండర్–13, 17 సింగిల్స్ పోటీలు జరుగుతాయి. గత యూత్ కంటెండర్ టోర్నీలో భారత ప్యాడ్లర్లు ఆధిపత్యం చాటుకున్నారు. అంకుర్ భట్టాచార్య, సిండ్రెలా దాస్ అండర్–19 బాల, బాలికల టైటిళ్లను గెలుచుకున్నారు.

క్లుప్తంగా...

ఫిబ్రవరిలో పారా మెడికల్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, అమరావతి: పారా మెడికల్ కోర్సుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు వచ్చే నెల ఫిబ్రవరిలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్టు గురువారం ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సెల్ (పారా మెడికల్) కార్యదర్శి బి.సుమైలా ప్రకటించారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో పరీక్షలు ఉంటాయన్నారు. రెండేళ్ల వ్యవధి కలిగిన పారా మెడికల్ కోర్సు (డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియాలజీ తదితర)ల్లో ప్రవేశాలు పొంది ఫెయిల్ అయిన వారు తిరిగి వార్షిక పరీక్షల్లోనే ఉత్తీర్ణత సాధించాల్సి వస్తోందన్నారు. అలాకాకుండా 2025–26 విద్యా సంవత్సరం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరపనున్నట్టు పేర్కొన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇంటర్ బైపీసీ/ఎంపీసీ అర్హతతో ఏటా సుమారు 20 వేల మంది విద్యార్థులు వీటిల్లో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు.

అప్పుల బాధతో గిరిజన రైతు ఆత్మహత్య

వెంకటేష్ నాయక్ (ఫైల్)

వజ్రకరూరు: అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఎన్ఎన్‌పీ తండాలో అప్పుల బాధ తాళలేక ఓ గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. తండాకు చెందిన ఎం.వెంకటేష్ నాయక్ (55) తనకు ఉన్న రెండు ఎకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయ పనుల కోసం కొన్ని నెలల క్రితం ప్రైవేటు ఫైనాన్స్‌లో ట్రాక్టర్ కూడా కొనుగోలు చేశాడు. పంట పెట్టుబడులు, ట్రాక్టర్ కొనుగోలు కోసం రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. పంట దిగుబడి పూర్తిగా తగ్గడం, ప్రభుత్వం నుంచి ఎటువంటి మద్దతు లభించకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం రాత్రి విష గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రమేష్ తెలిపారు.

టీచర్ల సీనియారిటీపై కసరత్తు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయుల సీనియారిటీపై కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ యాజమాన్య ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు తయారు చేసి, వాటి ఆధారంగా బదిలీలు, పదోన్నతులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం(టీఐఎస్)లో ఉపాధ్యాయుల వివరాలను కచ్చితత్వంతో నింపాలని సూచించింది. 2025 మే, జూన్ నెలల్లో ఆన్‌లైన్ విధానంలో బదిలీలు, పదోన్నతులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే వాటిలో కొంతమంది ఉపాధ్యాయుల వివరాలను తప్పుగా, అసంపూర్తిగా నమోదు చేసినట్టు గుర్తించారు. దీంతో బదిలీ ప్రక్రియలో కొన్ని సమస్యలు తలెత్తాయి. దీంతో ఈ ఏడాది చేపట్టే బదిలీలు, పదోన్నతుల్లో సమస్యలు పునరావృతం కాకుండా టీఐఎస్‌లో వివరాలను అప్‌డేట్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఉపాధ్యా యులు ఈనెల 9వ తేదీ లోగా తమ వివరా లను పరిశీలించి నవీకరించాలని ఆదేశించారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్)లో డేటా ఆధారంగా మాత్రమే బదిలీలు, పదోన్నతులు ఉంటాయని ప్రకటించింది.

టీఐఎస్‌లో సమస్యలు పరిష్కరించండి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్)లో వివరాలు నింపేటప్పుడు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. సర్వర్ వేగం పెంచాలని, అన్ని టైల్స్ అప్‌డేట్ చేయకున్నా, మార్పు చేయాల్సిన టైల్ మాత్రమే కనిపించేలా చూడాలన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షల గెజిట్ నంబర్లు నమోదు చేయడంలో ఉన్న ఇబ్బందులను సవరించాలని, ప్రతి విషయం ప్రింట్ ప్రివ్యూలో కనిపించేలా చూడాలని కోరారు.

స్కూళ్ల మూసివేత ప్రక్రియను ఉపసంహరించుకోవాలి

సాక్షి, అమరావతి: విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో పాఠశాలలను మూసివేతకు ప్రభుత్వం పూనుకోవడం శోచనీయమని, వెంటనే ఈ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ తీరు గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేలా ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరపు జాలిరెడ్డి, షేక్ జంషీద్ గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సింగిల్ టీచర్ పాఠశాలలతో ప్రాథమిక విద్య పతనావస్థకు చేరుకుందన్నారు. ప్రతి పేద విద్యార్థికీ విద్యను అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ చంద్రబాబు ప్రభుత్వం ఈ బాధ్యతను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం పాఠశాలలను మూసివేస్తే వేలాది ఉపాధ్యాయ పోస్టులు కూడా రద్దు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోందని, దీనిపై ఉపాధ్యాయులు ఉద్యమిస్తారని హెచ్చరించారు.

అదుపు తప్పి 'నోళ్ల'కు క్యాన్సర్!



- వ్యసనాలతో ప్రాణ సంకటం
- దేశంలో 62 శాతం నోటి క్యాన్సర్ కేసులకు పొగాకు, మద్యపానమే ప్రధాన కారణం
- అలవాట్లు మితంగా ఉన్నా ప్రమాదమే
- ప్రతి 10 మంది వ్యసనపరుల్లో ఆరుగురికి నోటి క్యాన్సర్
- టాటా మెమోరియల్ ట్రస్ట్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి

క్యాన్సర్ మహమ్మారి ఏటా దేశంలో లక్షలాది మందిని కబళిస్తోంది. రోజురోజుకూ జబ్బు విజృంభణ పెరుగుతూనే ఉంది. పలు క్యాన్సర్ల వ్యాప్తికి ప్రజల జీవనశైలే ప్రధాన కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అతి ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధుల్లో నోటి క్యాన్సర్ ఒకటి. దేశంలో 62 శాతం నోటి క్యాన్సర్ కేసులకు ప్రధాన కారణం మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగమే అని తెలుస్తోంది. ఈ అంశాన్ని ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) క్యాన్సర్ ఎపిడమాలజీ విభాగం శాస్త్రవేత్తలు ఇటీవల ఈ విషయం వెల్లడించారు. 2010–2021 మధ్య 1,803 మంది నోటి క్యాన్సర్ బాధితులు, 1,903 మంది ఆరోగ్యవంతులపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. అధ్యయనంలోని అంశాలు ఇటీవల బీఎంజీ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురించారు.

ఆ కాంబినేషన్ యమా డేంజర్

మద్యపానం, ధూమపానం, గుట్కా, ఖైనీ, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ప్రతి 10 మంది భారతీయుల్లో ఆరుగురు నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు వెల్లడైంది. మితమైన చెడు అలవాట్లు ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపవనే భావనను ఈ అధ్యయనం పూర్తిగా కొట్టిపడేసింది. ఆరోగ్యకరమైన స్థాయిలో మద్యపానం అపోహేనని తోసిపుచ్చారు. వ్యసనాలు అత్యంత మితంగా ఉన్నా.. క్యాన్సర్ ముప్పు మాత్రం అధికంగానే ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. రోజుకు 11.4 ఎంఎల్ మద్యం సేవించినా నోటి క్యాన్సర్ బారినపడే అవకాశం 50 శాతం పెరుగుతుందని స్పష్టం చేశారు. రోజూ బీర్ తాగేవారికి నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తేల్చారు. మద్యం సేవించని వారితో పోలిస్తే, సేవించే వారిలో జబ్బు బారిన పడే ముప్పు 68 శాతం ఎక్కువేనని గుర్తించారు. మద్యపానంతోపాటు, పొగాకు ఉత్పత్తులను వినియోగించే వారిలో మహమ్మారి ముప్పు అత్యధికంగా ఉంటుందని తేల్చారు. ఆల్కహాల్‌లోని ఇథనాల్ నోటి లోపలి పొరను పల్చబరుస్తుందని, పొగాకు వినియోగించే వారిలో క్యాన్సర్ కారకాలు సులభంగా కణాల్లోకి చొచ్చుకుని పోతాయని వివరించారు. మద్యం, పొగాకు కాంబినేషన్ ఆరోగ్యాన్ని త్వరగా క్షీణింపజేయడంతోపాటు, క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుందన్నారు. దేశంలో సుమారు 11.3 శాతం నోటి క్యాన్సర్ కేసులకు ఆల్కహాల్ ప్రధాన కారణమని అధ్యయనం తేల్చింది.

కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకారం దేశంలో ఏటా నమోదవుతున్న క్యాన్సర్ కేసులు (అంచనా)

సంవత్సరం	కేసులు
2022	14.61 లక్షలు
2023	14.96 లక్షలు
2024	15.33 లక్షలు
2025	15.62 లక్షలు

'పోలవరం-నల్లమలసాగర్'

డీపీఆర్ టెండర్‌కు ఆమోదం

- రూ.7.67 కోట్లకు ఐఐసీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగింత
- కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు తెచ్చేందుకూ సాంకేతిక సహకారం అందించాలి
- పనులు చేపట్టడానికి అవసరమైన అన్ని రకాల పరీక్షలూ చేయాలని షరతు

సాక్షి, అమరావతి : పోలవరం–బనకచర్ల అనుసంధానం (లింక్) ప్రాజెక్టును చేపట్టడానికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ టెండర్లను ప్రభుత్వం ఆమోదించింది. రూ.7.67 కోట్లకు ఐఐసీ టెక్నాలజీస్‌కు అప్పగించింది. పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టును నల్లమలసాగర్ వరకే పరిమితం చేస్తూ.. ఆ లింక్ ప్రాజెక్టు చేపట్టడానికి డీపీఆర్ తయారీతోపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి అన్ని రకాల అనుమతులు తెచ్చేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించే పనులకు నవంబరు 27న జలవనరుల శాఖ టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో ఏడాదిలోగా ఈ పనులు పూర్తిచేయాలని నిర్దేశించింది. ఈ టెండర్‌లో రూ.7,67,56,539లకు కోట్‌చేసి ఐఐసీ టెక్నాలజీస్ ఎల్–1గా నిలిచింది. దీంతో ఆ సంస్థకే పనులు అప్పగించడానికి అనుమతివ్వాలని గుంటూరు జిల్లా ఎస్ఈ పంపిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. డీపీఆర్ తయారీలో భాగంగా లైడార్ సర్వే చేయాలని నిర్దేశించింది. ఈ లింక్ ప్రాజెక్టును మూడు భాగాలుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోలవరం నుంచి కృష్ణా నదిలోకి గోదావరి జలాల మళ్లింపు.. రెండో దశలో కృష్ణా నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు మళ్లింపు.. మూడో దశలో బొల్లాపల్లి నుంచి నల్లమలసాగర్‌కు తరలించేలా పనులు చేపట్టాలని నిర్ణయించింది. లైడార్ సర్వేలో ఈ మూడు భాగాల్లో అలైన్‌మెంట్‌ను ఖరారు చేసి.. గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను ఏర్పాటుచేయాలని.. పనులు చేపట్టడానికి అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేయాలని టెండర్లలో షరతు విధించింది.

అక్టోబరు 7న పిలిచిన టెండర్లు రద్దు..

ఇక సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారీ, అవసరమైన పరిశోధనలు, కేంద్రం నుంచి చట్టపరమైన అనుమతులు పొందడానికి సహకారం అందించే పనులకు జలవనరుల శాఖ అక్టోబరు 7న టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పనులకు కాంట్రాక్టు విలువను రూ.9.20 కోట్లుగా నిర్ణయించింది. టెండర్‌లో బిడ్‌ల దాఖలు గడువు గత అక్టోబరు 22తో ముగిసింది. కానీ, ఎవరూ బిడ్లు దాఖలు చేయకపోవడంతో ఆ టెండర్‌ను రద్దుచేసింది. ఆ లింక్ ప్రాజెక్టును పోలవరం–నల్లమలసాగర్‌కే పరిమితం చేసి డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచింది. ఇకపోతే.. పోలవరం నుంచి బనకచర్లకు 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించే ప్రాజెక్టుకు అనుమతి కోసం సీడబ్ల్యూసీకి గత ఏడాది మే 22న పీఎఫ్ఆర్ (ప్రీ ఫీజిబులిటీ రిపోర్టు)ను రాష్ట్ర జలవనరుల శాఖ సమర్పించింది. దీనిపై సీడబ్ల్యూసీ బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలు.. గోదావరి, కృష్ణా బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అభిప్రాయాలను కోరింది. ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి కోసం దరఖాస్తు చేయడానికి పర్యావరణ ప్రభావ అంచనా (ఈఏఐ)పై అధ్యయనం చేయడానికి నియమ, నిబంధనల (టీఓఆర్–టెరమ్స్ ఆఫ్ రిఫరెన్స్) రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఈఏసీ (ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ) జూన్ 30న తోసిపుచ్చింది. గోదావరి నదిలో వరద జలాల లభ్యత.. అంతర్రాష్ట్ర అనుమతి తీసుకున్న తర్వాతే టీఓఆర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు పనుల నిమిత్తం పర్యావరణ, వైల్డ్‌లైఫ్ (వన్యప్రాణులు), అటవీ అనుమతుల కోసం అవసరమైన నివేదికల తయారీ పనులను గతేడాది జనవరి 26న రూ.1.77 కోట్లకు ఎస్వీ ఎన్విరో ల్యాబ్స్ అండ్ కన్సల్టెంట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.

నేటి నుంచి విజయవాడలో బుక్ ఫెస్టివల్

12వ తేదీ వరకూ కొనసాగనున్న పుస్తక మహోత్సవం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 12వ తేదీ వరకూ విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.మనోహర్‌నాయుడు, కె.లక్ష్మయ్య గురువారం విలేకరుల సమావేశంలో చెప్పారు. శుక్రవారం సాయంత్రం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఏ నరసింహ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ పుస్తక ప్రదర్శనలో భారీగా ప్రచురణకర్తలు, సాహిత్య సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ప్రభుత్వ సంస్థల స్టాళ్లు తమ శాఖల సమాచారాన్ని ప్రదర్శిస్తాయన్నారు.

పుస్తక మహోత్సవం ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

6న పుస్తక ప్రియుల పాదయాత్రను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ సభ్యుడు ఎమెస్కో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బామ్మగారు @ 108

కారంచేడు: బాపట్ల జిల్లా కారంచేడు మండల కేంద్రంలో నక్కల సుబ్బులు 108వ పుట్టినరోజును ఆమె కుటుంబసభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. 1917 జనవరి 1న ఆమె జన్మించారు. సుబ్బులుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అలాగే, 20 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. వీరందరూ ఆమెతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

22ఎ జాబితా నుంచి ఐదు రకాల భూముల తొలగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 22ఎ జాబితాలో ఉన్న ఐదు రకాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మాజీ, ప్రస్తుత సైనికోద్యోగులకు, స్వాతంత్ర్య సమర యోధులకు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు, 1954 జూన్ 18వ తేదీకి ముందు అసైన్ చేసిన భూములు, ప్రైవేట్ పట్టా భూములు వీటిలో ఉన్నాయి. ఒక సర్వే నంబర్‌లో కొంత భాగం మాత్రమే వివాదాస్పదమైతే, ఆ భాగాన్ని సబ్‌డివిజన్ చేసి దానిని మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచి, మిగిలిన భూమిని తొలగించినట్లు మంత్రి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మంత్రుల బృందం సమావేశంలో చర్చించిన తరువాత మరో నాలుగు రకాల భూములపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. షరతులు గల పట్టా భూములు, సర్వీసు ఇనామ్ భూములు, గతంలో నిషేధిత జాబితా నుంచి తొలగించినప్పటికీ రీ సర్వే సమయంలో మళ్లీ 22ఎలో చేర్చిన చుక్కల భూములు, గతంలో 22ఎ జాబితా నుంచి తొలగించని చుక్కల భూములు వీటిలో ఉన్నాయి. ఐదు రకాల భూములకు సంబంధించి దాదాపు ఎనిమిది రకాల పత్రాల్లో ఏ ఒక్క పత్రమున్నా 22ఎ జాబితా నుంచి తొలగించాలని మంత్రి సూచించారు. ఫ్రీహోల్డ్ భూములపై రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వార్డు సచివాలయాలు, గ్రామ సచివాలయాల్లోని అదనపు ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు ఒక కమిటీ నియమించినట్లు మంత్రి చెప్పారు.

కగార్ డెడ్‌లైన్‌కు ముందే !

- గత ఏడాదంతా ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు
- తాజాగా ఆయుధగారాలపై బలగాల దాడులు
- నిర్బంధంతో చెల్లాచెదురైన మావోయిస్టులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వామపక్ష ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో 2024 అక్టోబర్ 7న ఢిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్ర హోం మంత్రి కీలక ప్రకటన చేశారు. 2026 మార్చి 31నాటికి దేశంలో మావోయిస్టుల సాయుధ పోరాటాన్ని అంతం చేస్తామని అమిత్‌షా చెప్పారు. అయితే ఈ గడువు కంటే ముందే మావోయిస్టు పార్టీ ఉనికి ప్రమాదంలో పడింది. బీజాపూర్ జిల్లాలో 2025 జనవరి 6న మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఏకంగా పది మంది జవాన్లు చనిపోయారు. దీంతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు మావోయిస్టులు సవాల్ విసిరినట్టయింది. కానీ పది రోజుల వ్యవధిలోనే పుంజుకున్న భద్రతాదళాలు మావోయిస్టుల కంచుకోట కర్రె గుట్టలు లక్ష్యంగా జనవరి 16న మొదటిసారి దాడులు చేసి పాక్షిక విజయం సాధించాయి. వారం వ్యవధిలోనే ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మృతి చెందారు. అప్పుడు మొదలైన అగ్రనాయకుల వేట డిసెంబర్ 25న పాక హనుమంతు అలియాస్ గణేశ్ ఉయికే మరణం వరకు కొనసాగుతూనే ఉంది. గతేడాది మొత్తంగా 11మంది కేంద్ర కమిటీ సభ్యులు నేలకొరిగారు. వీరిలో పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావుతో పాటు ప్రజాదరణ కలిగిన మడ్వి హిడ్మా వంటి వారు ఉన్నారు. మరో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోయారు. ప్రస్తుతం పార్టీ అగ్రనేతగా ఉన్న దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి ఒంటరి పోరాటం చేయాల్సిన స్థితిలో ఉన్నారు.

పార్టీకి దూరమైన కేడర్

2024లో మొదలైన లొంగుబాట్ల పరంపర 2025లో పతాక స్థాయికి చేరింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్న మల్లోజుల వేణుగోపాల్, తక్కళ్లపల్లి వాసుదేవ రావు ఆయుధాలు, కేడర్‌తో సహా 2025 సెప్టెంబర్‌లో ప్రభుత్వం ముందు లొంగిపోవడం పార్టీ వెన్ను విరిచినంత పనైంది. క్షేత్రస్థాయిలో కేడర్ మనోస్థైర్యం దెబ్బతీసింది. ఆ వెంటనే హిడ్మా మరణం మరింత ప్రభావం చూపింది. దీంతో మావోయిస్టుల ప్రభావం ఉన్న ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల పరిధిలో ఏకంగా 2,500 మంది వరకు మావోయిస్టులు లొంగిపోగా, సుమారు 1,000 మంది అరెస్ట్ అయ్యారు.

ఆయుధాలపై దృష్టి

నిన్నామొన్నటి వరకు అగ్రనాయకులే లక్ష్యంగా జరిగిన భద్రతా దళాల దాడులు ఇప్పుడు మావోయిస్టుల ఆయుధాగారాలను లక్ష్యంగా చేసుకున్నాయి. అడవులను జల్లెడ పడుతూ గుట్టలు, సొరంగాలు, బంకర్లలో భద్రంగా దాచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఆయుధాల తయారీకి ఉపయోగించే మిషన్లను స్వాధీనం చేసుకుంటున్నాయి. 2025లో మావోలకు చెందిన 645 ఆయుధాలు, 875 ఐఈడీ బాంబులు భద్రతా దళాలకు చిక్కాయి. భవిష్యత్‌లో తిరుగుబాటు స్వభావం కలిగిన వారు విప్లవబాట పట్టినా ఆయుధ సంపత్తి అందుబాటులోకి రాకుండా బలగాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

కిలకిలా రావాలా..

పక్షుల భూతల స్వర్గంలో ఫ్లెమింగో ఫెస్టివల్ షురూ

- పులికాట్, పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లు
- ఈ నెల 10, 11న నిర్వహణకు సన్నాహాలు
- విదేశీ వలస విహంగాల వీక్షణకు తరలిరానున్న ప్రకృతి ప్రేమికులు

సూళ్లూరుపేట : కిలకిలా రావాల సవ్వడికి వేళైంది. ప్రకృతి ప్రేమికుల హృదయాలను పులకింపజేసే ఫ్లెమింగో ఫెస్టివల్‌కు పులికాట్ సిద్ధమైంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి సైబీరియా, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చే శీతాకాల అతిథులు ఇప్పటికే కనువిందు చేస్తున్నాయి. ఆంధ్రా – తమిళనాడు సరిహద్దుల్లో సుమారు 620 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన పులికాట్ సరస్సును ఆహార కేంద్రంగా, నేలపట్టు చెరువును సంతానోత్పత్తి కేంద్రంగా ఉపయోగించుకుంటూ తమ జీవనశైలిని ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగిస్తున్నాయి. ఈ జీవ వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు 2001లో ప్రారంభమైన ఫ్లెమింగో ఫెస్టివల్ ఈ ఏడాది జనవరి 10, 11న నిర్వహించనున్నారు. గతంలో సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాలు కేంద్రాలుగా ఈ వేడుక నిర్వహించేవారు. ఈ ఏడాది అదనంగా ఇరకం ఐల్యాండ్, శ్రీసిటీ, ఉబ్బలమడుగు జలపాతంతో కలిపి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ పండగను రెండు రోజులకు కుదించేయడంతో ప్రకృతి ప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

శీతాకాలంలో విదేశీ విహంగాల సందడి

పులికాట్ సరస్సు జలకళ సంతరించుకోగానే సుమారు 150 నుంచి 160 రకాల పక్షులు ఇక్కడకు వచ్చి సందడి చేస్తుంటాయి. ముఖ్యంగా పులికాట్ సరస్సులో లక్షలాది పక్షులు ఆహారవేటలో చేసే విన్యాసాలు పర్యాటకులకు కనులవిందు చేస్తుంటాయి. ఫ్లెమింగోలు (సముద్ర రామ చిలుక), పెలికాన్ (గూడబాతులు), పెయింటెడ్‌స్టార్క్స్ (ఎర్రకాళ్లకొంగలు) ఓపెన్‌బిల్ స్టార్క్స్ (నల్లకాళ్లకొంగ) సీగల్ (సముద్రపు పావురాళ్లు), నారాయణపక్షి, నల్లబాతులు, తెల్లబాతులు, పరజలు, తెడ్డుముక్కు కొంగ, నీటికాకులు, చింతవక్క, నత్తగుల్లకొంగ, చుక్కమూతి బాతులు, సూదిమొన బాతులు, నీటికాకులు, స్వాతికొంగలు లాంటి అనేక విదేశీ, స్వదేశీ పక్షులు ఇక్కడ దర్శనమిస్తుంటాయి. అందుకే పక్షుల భూతల స్వర్గమని ఈ ప్రాంతం పేరుపొందింది. ముఖ్యంగా సైబీరియా, నైజీరియా, ఆస్ట్రేలియా, పాకిస్తాన్, రష్యా, ఆఫ్ఘనిస్తాన్, ఉజ్బెకిస్థాన్ లాంటి దేశాల నుంచి పక్షులు వస్తున్నాయని గుర్తించారు. ఈ క్రమంలో 2001లో నెల్లూరు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ చొరవతో ఆరంభమైన వేడుకను 2013లో టూరిజం క్యాలెండర్‌లో చేర్చారు. 2016లో రాష్ట్ర స్థాయి పండగగా గుర్తించి పర్యాటక శాఖ నుంచి నిధులు కేటాయిస్తున్నారు.

రెండు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు

ప్రపంచంలోనే రెండో అతి పెద్ద సరస్సుగా, జీవ వైవిధ్య సరస్సుగా గుర్తింపు పొందిన పులికాట్ విదేశీ వలస పక్షులకు ఆతిథ్యమిచ్చి ఆహారం అందిస్తోంది. పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో సుమారు పది వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోంది. ఇక్కడ ఈ ఏడాది రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, పులికాట్ సరస్సు పరిరక్షణపై పర్యావరణవేత్తలతో సెమినార్లు నిర్వహించనున్నారు. తడ, భీములవారిపాళెం పడవల రేవు వద్ద బోట్ షికార్ ఏర్పాటు చేస్తున్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉద్యాన శాఖ, షార్ ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్ స్టాల్స్ ఆకర్షణగా నిలవనున్నాయి. మరోవైపు శ్రీసిటీ సెజ్‌లో కంపెనీలు, ఇరకం ఐల్యాండ్‌లో బోట్ షికార్, ఉబ్బల మడుగులో జలపాతం సందర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

విరి విలాపం

కాకరపర్రులో పూలు కోయకపోవటంతో విరబూసిన బంతి తోట

కాకరపర్రులో పూలుకోత లేని చామంతి తోట

పూలు.. ఎంత అందమైనవో.. ఎంత సుకుమారమైనవో.. అంత సున్నితమైనవి. పాపం పూలు.. ఉదయిస్తూనే స్వామి సేవకో.. దేవి కొప్పులోకో చేరి జన్మను సార్థకం చేయమని వేనోళ్ల ప్రార్థిస్తాయి. రేయి గడిస్తే వసి వాడిపోయి.. సుగంధాలు వీడిపోయి.. కళావిహీనమై చెత్తపాలవుతాయి. నాటి జంధ్యాల పాపయ్య శాస్త్రి ఖండకావ్యం పుష్ప విలాపంలో 'మా కుత్తుకలు కోసి మా ప్రాణం తీయవద్దని ప్రార్థించిన పూలు.. నేడు మమ్మల్ని చరితార్థులను చేయమని దేవుని అభ్యర్థిస్తున్నాయి. మమ్ములనే నమ్ముకుని జీవిస్తున్న వనమాలి జీవితాన్ని మూడు పువ్వులు ఆరు రూకలుగా వర్ధిల్లజేయమని వినమ్రంగా అర్థిస్తున్నాయి. వనంలో మేము.. వ్యాపారంలో మాలి ఎవరూ లాభపడక ఏం ఉపయోగమని ప్రశ్నిస్తున్నాయి. మాకిచ్చిన అల్పాయువును తోటమాలికి పోసి వారి జీవితాన్ని వికసింపజేయమని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాయి.

- విరివిగా పూసినా సిరులు అంతంతే
- ధరలు లేక మందగించిన వ్యాపారాలు
- గగ్గోలు పెడుతున్న రైతులు
- పనులు లేక కూలీలు.. ఉపాధి దొరక్క పనివారు విలవిల
- తూర్పు గోదావరిలో 4897 ఎకరాల్లో పూల సాగు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 15వేల మందిపై ప్రభావం

పెరవలి: మార్కెట్‌లో పూల ధరలు పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది మూఢం ముందే రావడంతో శుభ ముహూర్తాలు లేక వినియోగం తగ్గడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీని వల్ల రైతులకు నష్టం వస్తుండే పూలతోటలపై ఆధారపడిన కూలీలకు పనులు లేక ఉపాధి కరువై విలవిలలాడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు తలమానికంగా ఉన్న కడియం, కాకరపర్రు పూల మార్కెట్లు నేడు కొనుగోలుదారులు లేక కళావిహీనంగా కనిపిస్తున్నాయి. వ్యాపారాలు లేక విక్రయాలు లేక.. దిగుబడి బాగున్నా గిట్టుబాటు ధర లేక.. కూలీలకు ఉపాధి దొరకక.. రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం శుభ ముహూర్తాలు, పండుగలు లేకపోవటం వలన పూల వినియోగం తక్కువగా ఉందని వ్యాపారులు చెప్పుతున్నారు. 20 రోజుల క్రితం చామంతి కిలో రూ.300, కాగడాలు కిలో రూ.900, కనకాంబరాలు రూ.1200 పలికితే నేడు పూల రకాలు, నాణ్యతను బట్టి కిలో రూ.20 నుంచి రూ.150కి కొనుగోలు చేస్తున్నారని రైతులు చెప్తున్నారు. రైతులు మార్కెట్‌కు పట్టుకువచ్చిన పూలు రెండు మూడు రోజుల వరకు విక్రయాలు జరగకపోవడంతో వ్యాపారుల దగ్గరే రెండు నుంచి మూడు రోజులు నిల్వ ఉండిపోతున్నాయి. నాలుగు రోజులు దాటితో పూలు వసి వాడిపోయి రోడ్డు పక్కన పాడేయాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాపారులు వాపోతున్నారు. వాతావరణం అనుకూలించడంతో పూల దిగుబడి చాలా బాగుందని, మార్కెట్‌లో పూల ధరలు లేకపోవటం వల్ల వారానికి రెండు కోతలు కోయాల్సిన పూలు నేడు ఒక్కకోతే కోస్తున్నామని రైతులు చెప్పున్నారు. తీరా కోసిన తరువాత కనీసం కూలీల ఖర్చులు కూడా రావడం లేదని, దీంతో కోయకుండానే నష్టపోతున్నామని రైతులు చెప్పున్నారు. పూల రైతులు గ్రామాల బాట బట్టి కిలో పూలు సమయాన్ని బట్టి రూ.30 నుంచి రూ.50కి విక్రయిస్తున్నారు. మార్కెట్లకు పూలను తీసుకువెళ్తుంటే వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని.. దీంతో మళ్లీ తామే తమ గ్రామాలకు తీసుకెళ్లి వచ్చిన కాడికి విక్రయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పూలసాగు ఇలా..

జిల్లాలో 4897 ఎకరాల్లో పూల సాగు చేస్తుంటే దీనిపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను 15 వేల మంది ఉపాధి పొందుతున్నారు. పూలకు మార్కెట్‌లో ధరలు పలకకపోవడం వల్ల సగానికి సగం మందికి ఉపాధి కరువయ్యిందని రైతులు అంటున్నారు. చిరు వ్యాపారులు సైతం తమకు కనీసం కూలి ఖర్చులు రావడం లేదని వాపోతున్నారు.

నాడు కళకళ నేడు వెలవెల

రైతులు, వ్యాపారులతో కళకళలాడే కాకరపర్రు పూల మార్కెట్ నేడు వెలవెలబోతోంది. శుభ మూర్తాలు, పండగలు లేకపోవడంతో పూల వినియోగం భారీగా తగ్గిపోయింది. దీనితో పూల ధరలు హఠాత్తుగా తగ్గిపోయి రైతులు విలవిలలాడుతున్నారు.

పనులు లేక ఇబ్బంది

పూల కోతలు, పూల తోటలకు ఎరువులు, పురుగు మందులు కొట్టే కూలీలకు, దండలు కట్టే కూలీలకు, చిరు వ్యాపారులు చేసే సైకిల్ వ్యాపారులకు పని అంతంతమాత్రంగా లభించడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. నిత్యం పూలు కోసే కూలీలకు వారానికి ఒక్కరోజు మాత్రమే పనులు లభిస్తుంటే, పూల దండలు కట్టే మహిళలు పనులు లేక అల్లాడిపోతున్నారు.

ధరలు తగ్గటానికి కారణాలు

ఈ ఏడాది ఊహించని విధంగా ముందుగానే మూఢం రావడంతో శుభ ముహూర్తాలు లేకపోవటం వల్ల ధరలు పతనమయ్యాయి. ఏటా సంక్రాంతి వెళ్లిన తరువాత మార్చి వరకు ముహూర్తాలు ఉండేవి కావు. కానీ డిసెంబర్‌లోనే మూఢం రావల్ల వలన ధరలు తగ్గాయి. అదే సమయంలో పండగలు లేకపోవడం పూల వినియోగం హఠాత్తుగా పడిపోయింది.

అమ్మకానికి నోచుకోక నేలపాలైన పూలు

కాకరపర్రులో లిల్లీ పూల తోట

తోటలోనే మగ్గిపోతున్న పూలు

పూలధరలు తగ్గడంతో వాటిని కోయకుండా రైతులు చేలల్లోనే వదలేస్తున్నారు. ఎందుకంటే కోయిస్తే కనీసం కూలీ ఖర్చులు కూడా రావటం లేదని, దీనితో పూల కోసేకంటే వదిలేయడమే మేలని చెప్తున్నారు. నిత్యం పదిమందితో పూలు కోయించే రైతులు నేడు వారానికి ఒక్కసారి మాత్రమే కోయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు బంతి పూలు ఒక్క కోతకు 10 కూలీలు అవసరం వస్తే వీరికి రోజుకు రూ.350 కూలి ఇవ్వాలి. మార్కెట్‌లో కిలో పూలు రూ.20 పలుకుతున్నాయి. ఒక్క కోతకు సుమారు 100 కిలోలు కోయిస్తే కూలీలకు రూ.3500, కాఫీ, టిఫిన్లు, సంచులు, రవాణా కలిపి రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. దీనితో పూలకు మార్కెట్‌లో వంద కిలోలకు రూ.రెండు వేలు వస్తే ఖర్చు రూ.4500 అవుతోందని రైతులు చెప్తున్నారు. అందుకే పూలను కోయకుండా వదలివేస్తున్నామని వాపోతున్నారు. అన్ని రకాల పూల సాగు పరిస్థితి ఇలానే ఉందని రైతులు అంటున్నారు.

అన్నవరప్పాడులో ఆటోలో పూలు అమ్ముతున్న రైతు

వచ్చింది కూలీలకే సరిపోతోంది

ఒక ఎకరంలో కాగడాలు తోట వేశాను. 20 రోజుల క్రితం వరకు కిలో రూ.900కు విక్రయించగా నేడు రూ.400కు పడిపోయింది. కాగడాల కోతకు 10 మంది కూలీలు అవసరం. 10 కిలోలు పూలు కోస్తున్నారు. మార్కెట్‌కు తీసుకువెళ్తే రూ.4 వేలు వస్తోంది, వచ్చిన సొమ్ము కూలీలకే సరిపోతోంది.

– మానేపల్లి శ్రీనివాస్, పూల రైతు, కాకరపర్రు

కోయకపోతే చేను.. కోస్తే నేను నష్టపోతాం

ఒక ఎకరంలో చామంతి తోట వేశాను. పూల దిగుబడి బాగుంది. రోజు విడిచి రోజు కోత కోసే వాడిని కానీ ధరలు పతనం కావడంతో వచ్చిన సొమ్ము కోత ఖర్చులకు కూడ రావటం లేదు. పూలు కోయకపోతే చేను పాడైపోతుంది, కోస్తే జేబులో సొమ్ములు ఇవ్వాల్సి వస్తోంది. ఏం చేయాలో తెలియడం లేదు.

– ఇంటి నారాయుడు, చామంతి రైతు, కాకరపర్రు

అదనపు పెట్టుబడి వృథా

ఈ ఏడాది పూల దిగుబడి చాలా బాగుంది. నాలుగు రూపాయలు వస్తాయనుకున్నాను. కానీ మార్కెట్‌లో ధర పతనం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. ఆదాయం రావాల్సిన సమయంలో అదనపు పెట్టుబడి పెట్టి నష్టాల పాలవుతున్నాం.

– గుడాల వెంకటేశ్వరరావు, పూల రైతు కాకరపర్రు

గంధం చంద్రుడుకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సీఈవోగా కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇచ్చింది. ఈ మేరకు కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు గురువారం ఉత్తర్వులిచ్చారు.

సీఎస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం రాష్ట్ర సచివాలయంలో పలువురు అఖిల భారత సర్వీసుల ఉన్నతాధికారులు, వివిధ శాఖాధిపతులు, సచివాలయం, ఇతర విభాగాల అధికారులు ఉద్యోగులు, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, జె.శ్యామల రావు, జయలక్ష్మి తదితర ముఖ్య కార్యదర్శులు, కలెక్టర్లు, జేసీలు, వివిధ శాఖాధిపతులు, సచివాలయ ఉద్యోగుల సంఘం, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. అలాగే, విజయానంద్ దంపతులకు సీఎస్ క్యాంపు కార్యాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు ఆశీర్వచనం చేసి, టీటీడీ క్యాలెండర్, డైరీతో పాటు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నూతన సాంకేతికతను ఉద్యోగులు అలవర్చుకోవాలి: విశ్వనాథన్

ఆధునిక సాంకేతికతతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ఆ శాఖ కమిషనరేట్‌లో విశ్వనాథన్ ఉద్యోగులతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలంతోపాటు ఉద్యోగులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలైన కృత్రిమ మేథ (ఏఐ), చాట్ జీపీటీ, గూగుల్ జెమిని వంటి వాటిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పి.కిరణ్ కుమార్, ఐ.సూర్యచంద్రరావు, సీఐఈ ఒ.మధుసూధన, ఆర్ఐఈ డాక్టర్.టి.నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు బి.పూర్ణచంద్ర రావు, పి.వెంకట్రాజ్ గౌడ్, డి.రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు పి.రాజశేఖర్, ఏఎస్ వీరభద్రరావు, కె.నారాయణ రెడ్డి, కె.తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా.. గుప్పుమంటూ..!

యర్రగొండపాలెం : కందిపంటలో పెంచుతున్న గంజాయి మొక్కలు (ఫైల్)

నల్లమలలో గంజాయి గుప్పుమంటోంది. అభయారణ్యానికి సమీప గ్రామాల్లో రహస్యంగా దీనిని సాగు చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. గంజాయి సాగు పట్టుబడిన గాంధీనగర్, జమ్మి దోర్నాల ప్రాంతాలు రెండూ కూడా నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాలు కావడం గమనార్హం. ఒకవైపున యథేచ్ఛగా రైళ్లలో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ముఠాలు కళాశాలలు, హైస్కూళ్లను లక్ష్యంగా చేసుకొని వ్యాపారం చేస్తున్నాయి. గంజాయి రవాణాకు అడ్డంకులు ఏర్పడినా సరే విక్రయాలు ఆగిపోకుండా ఏకంగా సాగుకు తెగబడ్డాయి. ఎవరికీ అనుమానం రాకుండా పంట పొలాల్లో దీనిని సాగు చేస్తున్నారు. గంజాయిని కట్టడి చేశామని ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

- ప్రకాశం జిల్లా దోర్నాల, యర్రగొండపాలెంలో గంజాయి పంటలు వెలుగులోకి
- కంది, మిరప పంటల మధ్యలో గంజాయి సాగు
- అక్రమ రవాణా నుంచి ఏకంగా సాగు వైపునకు ముఠాలు
- నగరానికి మాత్రమే పరిమితమైన టాస్క్‌ఫోర్స్

నల్లమల అటవీ ప్రాంతంలో గంజాయి సాగు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో గంజాయి సాగును పూర్తిస్థాయిలో కట్టడి చేశామని 2025 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ల శిక్షణ తరగతులను ప్రారంభించడానికి ప్రకాశం జిల్లాకు వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. అక్కడికి 24 గంటలు కూడా గడవకముందే యర్రగొండపాలెంలో గంజాయి సాగు వెలుగుచూసింది. యర్రగొండపాలెం మండలంలోని గాంధీనగర్ గ్రామ శివారులో పిక్కిలి చిన సుబ్బయ్యకు చెందిన మామిడి తోటలో అంతర్‌పంటగా కందిని సాగు చేస్తున్నాడు. ఎవరికీ అనుమానం కలగకుండా కందిపంటతోపాటుగా గంజాయి కూడా సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసు అధికారులు దాడులు చేసి రూ.10 లక్షల విలువ చేసే 40 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడం సంచలనం సృష్టించింది. సరిగ్గా అంతకు నెలరోజుల ముందుగా అంటే నవంబర్లో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని దోర్నాల మండలంలోని జమ్మిదోర్నాల గ్రామ శివారులో ఒక వ్యక్తి మిర్చి పొలంలో గుట్టుగా గంజాయి సాగు చేస్తుండగా అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.

అటవీ ప్రాంతాలకు సమీపంలో...

జిల్లాలో గంజాయి సాగు పట్టుబడిన గాంధీనగర్, జమ్మి దోర్నాల ప్రాంతాలు రెండూ కూడా నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలోని గ్రామాలు కావడం గమనార్హం. పశ్చిమ ప్రకాశంలో నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న అనేక గ్రామాల్లో రహస్యంగా గంజాయి సాగు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పుల్లల చెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తే మరింత సాగు దొరికే అవకాశం ఉందని స్థానికులు కొందరు చెబుతున్నారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులోని గ్రామాలకు దగ్గరగా ఉన్న పొలాలు, పాలుట్ల పరిసర ప్రాంతాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలకు సమీపంలోని పొలాలను, అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తే భారీ మొత్తంలో సాగు లభ్యమవుతుందంటున్నారు.

అధికార పార్టీ నాయకులకు తెలుసా...

యర్రగొండపాలెం మండలంలోని గాంధీ నగర్ పొలాల్లో లభ్యమైన గంజాయి సాగు గురించి పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ పిక్కిలి చిన సుబ్బయ్య తోటకు చుట్టు పక్కల అంతా తెలుగుదేశం పార్టీ నాయకులకు చెందిన పొలాలు ఉన్నాయి. వీరికి తెలియకుండా గంజాయి సాగు చేసే అవకాశం లేదని కొందరు వాదిస్తున్నారు. పోలీసు అధికారులు ఆ దిశగా విచారణ జరిపితే నిజనిజాలు బయటకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రొహిబిషన్ అధికారులు ఏం చేస్తున్నారు..

జిల్లాలో పెద్ద మొత్తంలో గంజాయి సాగు చేస్తున్నప్పటికీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. నవంబరులో దోర్నాల మండలంలో గంజాయి సాగును పట్టుకున్న తరువాత అయినా పశ్చిమ ప్రకాశంలో గంజాయి సాగు గురించి నిఘా పెట్టలేకపోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు తాజాగా గాంధీనగర్‌లో గంజాయి సాగును అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ రెండు దాడుల్లో కూడా ఎక్సైజ్ శాఖ అధికారుల పాత్ర ఏ మాత్రం లేదన్న మాట వినిపిస్తోంది. మద్యం షాపులు, బెల్టు షాపుల నుంచి లక్షలాది రూపాయల మామూళ్ల వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ గంజాయి సాగు మీద లేదని పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలు మండిపడుతున్నారు.

హైస్కూలు విద్యార్థులకు కౌన్సెలింగ్

ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కొందరికి ఇటీవల ఒంగోలు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. గంజాయి, వైట్నర్‌లకు అలవాటు పడిన సదరు విద్యార్థులు స్కూలుకు వచ్చి గందరగోళం చేస్తున్నట్లు తెలిసింది. మొదట్లో వారికి మంచి మాటలు చెప్పి దారిలోకి తీసుకొని రావాలని ఉపాధ్యాయులు ప్రయత్నించి విఫలమైనట్లు సమాచారం. సదరు గంజాయి బ్యాచ్ విద్యార్థుల పోడు పడలేక పోలీసులకు ఫిర్యాదు చేయగా విద్యార్థులతో పాటుగా వారి తల్లితండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలుసింది. పెడదారి పట్టిన విద్యార్థులకు తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చి పంపించినట్లు సమాచారం. ఇటీవల టాస్క్‌ఫోర్స్ జరిపిన దాడుల్లో ఒంగోలు నగరంలోని ఇంటర్మీడియెట్ విద్యార్థులు, బైపాస్‌లోని డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు కొందరు పట్టుబడడంతో విస్తుపోవడం పోలీసుల వంతయింది.

జైలుకు పోయివచ్చినా మారని తీరు...

గతంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చిన ఒక పాత నిందితుడు యర్రగొండపాలెం పరిసర ప్రాంతాల్లో కేవలం రూ.150 కే గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. తక్కువ ధరకు గంజాయి అందుబాటులో ఉండడంతో కొంత మంది విద్యార్థులు, యువకులు గంజాయి తాగుతున్నట్లు తెలిసింది. పాత నేరస్థుల మీద తగినంత నిఘా పెట్టడంలో ఎక్సైజ్ శాఖ, పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పశ్చిమ ప్రకాశంలో గంజాయి విక్రయాలు ఎక్కువైనట్లు సమాచారం. గిద్దలూరులో ఒకరిని, శ్రీశైలం ఘాట్ రోడ్డులో ముగ్గురిని గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు.

అభయారణ్యం.. స్వేచ్ఛా విహారం

- లక్ష ఎకరాల్లో పాపికొండల అభయారణ్యం
- పులులు, చిరుతలు, అడవి దున్నల సంచారం
- పోలవరం ముంపు గ్రామాల తరలింపుతో మరింత స్వేచ్ఛగా..
- 235 రకాలకుపైగా పక్షి జాతుల గుర్తింపు
- వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి

ట్రాప్ కెమెరాకు చిక్కిన నెమలి

బుట్టాయగూడెం: పాపికొండల అభయారణ్యంలో పెద్ద పులులు, చిరుతల గాండ్రిపులతో, పక్షుల కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో అభయారణ్యం పరిధిలోకి వచ్చే 23 గ్రామాలు ఖాళీ చేసి ఆయా గ్రామాల్లో ఉండే నిర్వాసితులను ప్రభుత్వం పునరావాసం కాలనీలకు తరలించడంతో వన్యప్రాణుల స్వేచ్ఛా జీవనానికి అవకాశం కలిగింది. గోదావరి ఒడ్డున ఉండే గ్రామాలు ఖాళీ కాగా జనసంచారం లేకపోవడంతో పాపికొండల్లో వన్యప్రాణులు మరింత స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం ఏర్పడింది. ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం 2008లో పాపికొండల అభయారణ్యంగా ప్రకటించింది. దీనితో అప్పటివరకు రాష్ట్ర పరిధిలో ఉన్న పాపికొండలు కేంద్రం పరిధిలోకి మారింది. ఫారెస్టు, వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వన్యప్రాణులు సంరక్షణకు కృషి చేస్తున్నారు.

1012 చ.కిలోమీటర్ల పరిధిలో..

పాపికొండల అభయారణ్యం ఏలూరు జిల్లా పరిధిలోని బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతో పాటు రంపచోడవరం నియోజకవర్గంలోని దేవీపట్నం, వీఆర్‌పురం, చింతూరు, మండలాల పరిధిలో సుమారు 1,012.85 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది.

నాలుగేళ్లకోసారి గణన

పాపికొండల అభయారణ్యంలో ప్రతి నాలుగేళ్లకోసారి అధికారులు జంతుగణన నిర్వహించి అడవుల్లో ఉండే వన్యప్రాణులను గుర్తించే ప్రక్రియ చేపడతారు. 2018, 2022లో జంతుగణన నిర్వహించారు. ఆ సమయంలో 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి సర్వే చేశారు. సింహాలు, ఏనుగులు తప్ప అన్నిరకాల జంతువులు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి.

నేటి నుంచి పులుల జాడ కోసం..

పాపికొండల అభయారణ్యంలో పులుల జాడ కోసం అటవీ శాఖ అధికారులు శుక్రవారం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు 130 ప్రాంతాల్లో 300కు పైగా కెమెరాలు ఏర్పాటు చేస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. గతనెల 1న జాతీయ పులుల గణన, వన్యప్రాణుల లెక్కింపు కార్యక్రమం సుమారు 8 రోజులపాటు నిర్వహించారు. ఇందుకోసం అటవీశాఖ అధికారులు ట్రయిల్‌రన్‌ను కూడా నిర్వహించారు. అయితే పులుల జాడ కోసం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రిప్రజెంటేటివ్‌ల ఆధ్వర్యంలో పులుల జాడపై ట్రాప్ కెమెరాల ద్వారా సర్వే చేయనున్నారు.

గోదావరి తీరం.. స్వేచ్ఛా విహారం

గోదావరి పరీవాహక ప్రాంతంలో నది ఒడ్డున ఉన్న తెల్లదిబ్బలు, సిరివాక, కొరుటూరు, శివగిరి, చీడూరు, టేకూరు, తూటిగుంట, ఎర్రవరం, సరుగుడు, పల్లపూరు, పైడాకులమామిడి, వాడపల్లి, కోండ్రుకోట, మాదాపురం, ములగలగూడెం, గాజులగొంది, తల్లవరం, కొత్తూరు, కొత్తమామిడిగొంది, చేగొండపల్లి తదితర గ్రామాలను పోలవరం ప్రాజెక్టులో ముంపు గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఆయా గ్రామాల నిర్వాసితులను బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలకు తరలించారు. దీంతో ప్రస్తుతం ఆయా గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. జనసంచారం కూడా లేకపోవడంతో ఆయా గ్రామాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరుగుతూ నీటి కోసం గోదావరి తీరానికి వస్తున్నాయి. పాపికొండల విహార యాత్రకు వెళ్లే పర్యాటకులు నెమళ్లు, అడవి దున్నలు, దుప్పిలు కనిపించినట్టు చెబుతున్నారు.

ఎలుగుబంటి

చిరుత పులులు



గొర్రె గేదెలు



కొండ గొర్రెలు

బిజినెస్ రీల్

ఆషికా గ్రూప్‌నకు మ్యూచువల్ ఫండ్స్ లైసెన్స్

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌ను ప్రారంభించేందుకు సెబీ నుంచి సూత్రప్రాయ అనుమతి లభించినట్లు ఆషికా గ్రూప్ ప్రకటించింది. దీంతో అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)ని ఏర్పాటు చేసి, మ్యూచువల్ ఫండ్స్‌ను ప్రారంభించేందుకు కంపెనీకి అవకాశం లభించినట్లయింది. అయితే, తుది అనుమతి అన్నది సెబీ నిబంధనలను అనుసరించడంపై ఆధారపడి ఉంటుందని కంపెనీ తెలిపింది. ఆషికా గ్రూప్ ఇప్పటికే క్యాపిటల్ మార్కెట్లు, రిటైల్, ఇనిస్టిట్యూషనల్ బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, రీసెర్చ్ అడ్వైజరీ, ఆల్టర్నేటివ్ అస్సెట్ మేనేజ్‌మెంట్, ప్రైవేటు ఈక్విటీ కార్యకలాపాలు నిర్వహిస్తుండడం గమనార్హం.

తాజ్ జీవీకే నుంచి ఐహెచ్‌సీఎల్ నిష్క్రమణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో తమకున్న మొత్తం 25.52 శాతం వాటాలను విక్రయించినట్లు ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్‌సీఎల్) వెల్లడించింది. 1.6 కోట్ల షేర్లను ఒక్కో షేరుకి రూ. 370 రేటు చొప్పున షాలిని భూపాల్‌కి విక్రయించినట్లు తెలిపింది. అ ప్రస్తుతం అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారం తాజ్ జీవీకేకి చెందిన హోటళ్లను యథాప్రకారం నిర్వహించడం కొనసాగుతుందని పేర్కొంది. మరోవైపు తాజా పరిణామంతో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ బోర్డు నుంచి ఐహెచ్‌సీఎల్ నామినేట్ చేసిన డైరెక్టర్లు తప్పుకున్నారు.

పెరిగిన వాణిజ్య ఎల్‌పీజీ ధర

దిగొచ్చిన ఏటీఎఫ్ ధర

న్యూఢిల్లీ: విమాన యాన ఇంధనం (ఏటీఎఫ్) ధర ను 7.3% తగ్గిస్తూ ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలు గురువారం నిర్ణ యం తీసుకున్నాయి. వా ణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.111 పెంచాయి. ఢిల్లీ మార్కెట్లో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర తగ్గింపు అనంతరం రూ.7,353.75కు దిగొచ్చింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఏటీఎఫ్ ధర 9.7 శాతం మేర పెరగ్గా.. ఇప్పుడు అందులో మూడింట రెండొంతులు తగ్గించారు. మరోవైపు 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండ్ ధర ఢిల్లీ మార్కెట్లో రూ.111 పెరిగి రూ.1,691.50కు చేరింది. ఇక గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-1-2026

విశాఖ	635-00
చిత్తూరు	703-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	625-00
విజయవాడ	660-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	630-00
వరంగల్	632-00
రిటైల్ ధర	7.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	9,585.00	2.59
SHRIRAMFIN	1,020.00	2.39
NTPC	336.1	1.99
ETERNAL	283.55	1.98
WIPRO	267.3	1.52

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	363.95	-9.69
TATACONSUM	1,173.30	-1.57
DRREDDY	1,252.00	-1.53
BAJFINANCE	975.6	-1.13
ONGC	237.9	-1.03

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,237
ఎన్ఎస్ఈ	80,223
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	93,411
ఎఫ్ఐఐ	- 3,269
డీఐఐ	+ 1,526

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	57.42	$	57.95
బ్రెంట్	60.91	$	61.33

కార్ల విక్రయాలు అదుర్స్

- 2025లో 45.5 లక్షల ప్యాసింజర్ వాహన అమ్మకాలు
- జీఎస్‌టీ 2.0తో పరిశ్రమకు ఉత్సాహం
- కొనసాగిన ఎస్‌యూవీల హవా

న్యూఢిల్లీ: 2025లో సంవత్సరంలో దేశీయంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు రికార్డు స్థాయిలో 45.5 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. అంతకు ముందు 2024 ఏడాదిలో అమ్ముడైన 43.05 వాహనాలతో పోలిస్తే ఈ సంఖ్య దాదాపు 6% అధికంగా ఉంది. ఏడాది ప్రథమార్ధంలో మందగమనం కనిపించినా, సెప్టెంబర్ 21 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన 'జీఎస్టీ 2.0' పరిశ్రమలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. దేశీయ దిగ్గజ ఆటో కంపెనీలైన మారుతీ సుజుకీ, మహీంద్రాఅండ్‌మహీంద్రా(ఎంఅండ్ఎం), టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్(టీఎంపీవీ), టయోటా కిర్లోస్కర్ మోటార్, స్కోడా ఆటోలు గతంలో ఎన్నడూ చేయని అధిక స్థాయిలో వార్షిక విక్రయాలు నమోదు చేశాయి.

■ ఎంఅండ్ఎం, ఎంఅండ్ఎం 2025లో వాల్యూమ్ పరంగా రెండో స్థానంలో ఉన్న హ్యుందాయ్ మోటార్ ఇండియా(హెచ్ఎంఐఎల్)ను దాటి వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. దీంతో హెచ్ఎంఐఎల్ స్థానానికి పరిమితమైంది.

■ కస్టమర్లకు ఎస్‌యూవీలపై ఆసక్తి మరింత పెరిగింది. 2024లో మొత్తం ప్యాసింజర్ అమ్మకాల్లో 53.8% ఉన్న ఎస్‌యూవీల వాటా, 2025లో 55.8 శాతానికి పెరిగింది. అలాగే జీఎస్‌టీ 2.0 అమలుతో చిన్న కార్ల విక్రయాలు కూడా పెరిగాయి.

■ మారుతీ సుజుకీ ఇండియా 2025లో 18.44 లక్షల వాహనాలు విక్రయించింది. గతేడాది 2024లో 17.90 లక్షల యూనిట్ల అమ్మకాల రికార్డు తుడిపెట్టుకుపోయింది. ''జీఎస్‌టీ తగ్గింపు, రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు అంశాలు 2025లో ఆటో పరిశ్రమ పనితీరును మెరుగుపరిచాయి'' అని సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ వెల్లడించారు.

■ గత క్యాలెండర్ ఏడాదిలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 2025లో మొత్తం 5,87,218 యూనిట్లు విక్రయించగా, ఇందులో 81,125 ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. ఇది వరుసగా ఐదో ఏడాది రికార్డు స్థాయి వార్షిక అమ్మకాలుగా సంస్థ పేర్కొంది. ఎస్‌యూవీలపై పెరుగుతున్న ఆసక్తి, పర్యావరణ అనుకూల వాహనాలను ఆదరణ లభించడంతో 2025లో ఆటో పరిశ్రమ స్థిరమైన వృద్ధిని సాధించిందని టీఎంపీవీ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర తెలిపారు.

■ టయోటా కిర్లోస్కర్ మోటార్(టీకేఎం) 2025లో 3,88,801 యూనిట్లు విక్రయించింది. 2024లోని 3,26,329 యూనిట్లతో పోలిస్తే 19 శాతం వృద్ధి నమోదైంది. ప్రభుత్వ జీఎస్‌టీ సంస్కరణలు, వ్యూహాత్మక ఉత్పత్తి పెంపు, కొత్త మోడల్ వేరియంట్ల ఆవిష్కరణలతో ఈ స్థిరమైన ప్రగతి సాధ్యమైందని టీకేఎం వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా తెలిపారు.

■ స్కోడా ఆటో ఇండియా 2025లో 72,665 యూనిట్లతో కంపెనీ చరిత్రలోనే అత్యుత్తమ విక్రయాలను నమోదు చేసింది. ఇది 2024లోని 35,166 యూనిట్లతో పోలిస్తే అమ్మకాలు రెట్టింపు స్థాయికి చేరాయి.

డిసెంబర్‌లో కంపెనీల వాహన విక్రయాలు (ఎగుమతులు కలుపుకొని)

కంపెనీ	2025	2024	వృద్ధి /క్షీణత (%ల్లో)
మారుతీ	2,17,854	1,78,248	22
హ్యుందాయ్	58,702	55,702	7
ఎంఅండ్ఎం	86,090	69768	23
టీఎంపీవీ	50,519	44,289	14
టయోటా	39,333	29,529	33
స్కోడా ఆటో	72,665	35,166	107
కియా ఇండియా	18,659	8,957	108
ఎంజీ మోటార్	70,554	6,500	19
హోండా కార్స్	5,807	5,603	3.6
అశోక్ లేలాండ్	21,533	16,957	27
హీరో మోటో	4,56,479	3,24,906	40
టీవీఎస్	4,81,389	3,21,687	50

హెచ్ఎంఐఎల్ ఎండీ, సీఈవోగా తరుణ్ గార్గ్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా(హెచ్ఎంఐఎల్) చీఫ్ ఎగ్జిక్యూటివ్, మేనేజింగ్ డైరెక్టర్‌గా తరుణ్ గార్గ్ గురువారం(జనవరి 1న) బాధ్యతలు స్వీకరించారు. హెచ్ఎంఐఎల్ 29 ఏళ్ల చరిత్రలో తొలిసారి ఒక భారతీయుడు నాయకత్వం వహించడం విశేషం. ఇప్పటి వరకు ఎండీ, సీఈవోగా సేవలు అందించిన ఉన్సూ కిమ్ దక్షిణ కొరియాలోని హ్యుందాయ్ మాతృసంస్థలో వ్యూహాత్మక బాధ్యతలు చేపట్టేందుకు తిరిగి వెళ్లారు. ''భారతీయ నాయకత్వ సామర్థ్యంపై ప్రగాఢ నమ్మకమే తరుణ్ గార్గ్ నియామకం. సంస్థ తదుపరి దశ వృద్ధికి నేతృత్వం వహించే అనుభవం, నైపుణ్యాలు ఆయనకున్నాయి. ఈ వ్యూహాత్మక నిర్ణయంతో ప్రపంచ ఆటోమొబైల్ మార్కెట్లో భారత్ స్థానం మరింత పటిష్టం అవుతుంది'' అని హెచ్ఎంఐఎల్ తెలిపింది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా కొత్త ఎండీ, సీఈవో మాట్లాడుతూ.. ''హ్యుందాయ్ వారసత్వాన్ని బలోపేతం చేస్తూ.., కస్టమర్లకు అత్యుత్తమ మొబిలిటీ సొల్యూషన్స్ అందించడమే తన ముందున్న లక్ష్యం'' అన్నారు.

అంచనాల్లో 62 శాతానికి ద్రవ్యలోటు

రూ.9.76 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) ద్రవ్యలోటు నవంబర్ చివరికి రూ.9.76 లక్షల కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతంగా (రూ.15.69 లక్షల కోట్లు) ఉంటుందని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఈ అంచనాల్లో నవంబర్ చివరికే 62.3 శాతం మేర ద్రవ్యలోటు నమోదైంది. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ చివరికి ప్రభుత్వం రూ.19.49 లక్షల కోట్ల ఆదాయాన్ని అందుకుంది. ఇందులో రూ.13,93,946 కోట్లు పన్నుల రూపంలో, రూ.5,16,366 కోట్లు పన్నేతర ఆదాయంగా, రూ.38,927 కోట్లు రుణేతర నిధుల రూపంలో సమకూరింది. వ్యయాలు నవంబర్ చివరికి రూ.29.26 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో రూ.22,67,700 కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా, రూ.6,58,210 కోట్లను మూలధన వ్యయాలు కింద సర్కారు ఖర్చు చేసింది. రెవెన్యూ వ్యయాల్లో రూ.7.45 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు పోగా, రూ.2.88 లక్షల కోట్లు సబ్సిడీలకు వెచ్చించింది. ఈ డేటాపై ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ స్పందిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల పన్నుల ఆదాయంలో రూ.1.5 లక్షల కోట్లు తగ్గుదల ఉండొచ్చని పేర్కొన్నారు. అదే సమయంలో ద్రవ్యలోటు అదుపు తప్పకపోవచ్చన్నారు.

బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు 100 కోట్లు

51 కోట్ల కస్టమర్లతో జియో టాప్

న్యూఢిల్లీ: బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య నవంబర్‌లో 100 కోట్ల మార్క్‌ను దాటింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ (ట్రాయ్) తాజా గణాంకాల ప్రకారం అక్టోబర్ చివరికి బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు 99.98 కోట్లుగా ఉంటే, నవంబర్ చివరికి 100 కోట్ల మార్క్‌ను అధిగమించింది. 51 కోట్ల చందాదారులతో జియో నెట్‌వర్క్ నంబర్ 1 స్థానంలో ఉంది. ఇందులో 49.69 కోట్ల మంది వైర్‌లెస్ చందాదారులు కాగా, 1.35 కోట్ల మంది ఫిక్స్‌డ్ లైన్ బ్రాడ్ బ్యాండ్ చందాదారులు ఉన్నారు. ఆ తర్వాత భారతీ ఎయిర్‌టెల్ 31.42 కోట్ల చందాదారులను కలిగి ఉంది. వొడాఫోన్ ఐడియా వైర్‌లెస్ చందాదారులు 12.77 కోట్లు కాగా, బీఎస్ఎన్ఎల్‌కు 2.94 కోట్ల మంది వైర్‌లెస్, 44.5 ఫిక్స్‌డ్ లైన్ బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు ఉన్నారు. 2015 నవంబర్ చివరికి దేశంలో బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు కేవలం 13.15 కోట్ల మందే ఉన్నారు. పదేళ్లలో ఏడు రెట్లు పెరగడం గమనార్హం. ఇక నవంబర్ చివరికి మొత్తం టెలికం చందాదారులు 123.45 కోట్లకు పెరిగారు. ఇందులో 118.74 కోట్లు వైర్‌లెస్ కాగా, 4.7 కోట్లు వైర్‌లెన్ కనెక్షన్లు ఉన్నాయి.

జియో నెట్‌వర్క్ కిందకు 13.88 లక్షలు

జియో నెట్‌వర్క్ కిందకు నవంబర్‌లో 13.88 లక్షల మంది కొత్త మొబైల్ చందాదారులు వచ్చి చేరారు. దీంతో మొత్తం మొబైల్ చందాదారుల సంఖ్య 48.6 కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్ 12.15 లక్షల మందిని ఆకర్షించింది. ఆ తర్వాత బీఎస్ఎన్ఎల్ కిందకు 4.21 లక్షల మంది కొత్తగా వచ్చి చేరారు. వొడాఫోన్ ఐడియా 10.11 లక్షల మంది కస్టమర్లను కోల్పోయింది.

రీసైక్లింగ్ టెక్నాలజీలతో ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్

పాలీసైకిల్ సీఈవో అమిత్ టాండన్ వెల్లడి

న్యూఢిల్లీ: అధునాతన రసాయినిక రీసైక్లింగ్ టెక్నాలజీలను ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను పరిష్కరించవచ్చని పాలీసైకిల్ వ్యవస్థాపకుడు, సీఈవో అమిత్ టాండన్ తెలిపారు. భారీ స్థాయిలో నాఫ్తా దిగుమతులను కూడా తగ్గించుకోవచ్చని వివరించారు. ఇందుకు సంబంధించి తాము రూపొందించిన కొంటిఫ్లో క్రాకర్ జనరేషన్ సిక్స్ సాంకేతికత, సంక్లిష్టమైన పదార్థాలను అధిక విలువ పలికే ఉత్పత్తులుగా రీసైకిల్ చేయగలదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు దేశీయంగా ఏటా 93 లక్షల టన్నుల స్థాయిలో ఉంటున్నాయి. వీటిలో మెకానికల్ రీసైక్లింగ్ విధానంలో సమర్థవంతంగా రీసైకిల్ చేయలేని పాలిథీన్ బ్యాగ్‌లు, పౌచ్‌ల్లాంటి పాలియోలెఫిన్‌లు ఎక్కువగా ఉంటున్నట్లు టాండన్ చెప్పారు. సుమారు 57–59 లక్షల టన్నుల పాలీయోలెఫిన్ ప్యాకేజింగ్ రీసైక్లింగ్‌తో 4 మిలియన్ టన్నుల పైరోలిసిస్ ఆయిల్ తయారు చేయొచ్చని.. పెట్రోకెమికల్ ప్లాంట్లలో నాఫ్తాకు ప్రత్యామ్నాయంగా దీన్ని ఉపయోగించవచ్చని వివరించారు. తద్వారా నాఫ్తా దిగుమతులను తగ్గించుకోవచ్చని టాండన్ వివరించారు. దేశీయంగా నాఫ్తా వినియోగం 1.2 కోట్ల టన్నుల స్థాయిలో ఉండగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత్ 30 లక్షల టన్నుల నాఫ్తాను దిగుమతి చేసుకుంది.

ఎగుమతిదారులకు రూ.4,531 కోట్ల ప్రోత్సాహకం

ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: దేశ ఎగుమతిదారులు అంతర్జాతీయ మార్కెట్లో మరిన్ని అవకాశాలను సొంతం చేసుకునేందుకు వీలుగా కేంద్ర సర్కారు రూ.4,531 కోట్లతో 'మార్కెట్ యాక్సెస్ సపోర్ట్' పథకాన్ని ప్రారంభించింది. అంతర్జాతీయ వాణిజ్య సదస్సులు, ప్రదర్శనల్లో దేశీ ఎగుమతిదారులు పాల్గొనేందుకు వీలుగా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందించనుంది. భారత ఎగుమతిదారుల పోటీతత్వాన్ని పెంచే లక్ష్యంలో భాగంగా కేంద్ర వాణిజ్య శాఖ రూ.25,060 కోట్లతో ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ చేపట్టడం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ పథకాన్ని అమలు చేయనుంది. 2025–31 కాలానికి రూ.4,531 కోట్లను కేటాయించింది. ఇందులో రూ.500 కోట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సాయం కింద ఎగుమతిదారులకు అందించనుంది.

అనిశ్చితుల మధ్య అధిక వృద్ధి

- బలమైన వినియోగం, పెట్టుబడులు సానుకూలం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, అధిక వృద్ధిని నమోదు చేస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అంతర్జాతీయంగా అస్థిరతలతో కూ డిన ప్రతికూల వాతావరణంలోనూ దేశీయంగా బలమైన వినియోగం, పెట్టుబడులు వృద్ధికి అండగా నిలుస్తున్నట్టు తెలిపారు. ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి దిగిరావడంతోపాటు.. కంపెనీల బ్యాలన్స్ షీట్లు ఆరోగ్యంగా ఉన్నట్టు చెప్పారు. ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూ, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతమ ప్రాధాన్యతగా ఆర్‌బీఐ ఆర్థిక స్థిరత్వ నివేదికలో పేర్కొన్నారు. ఆర్థిక స్థిరత్వం అంతిమ లక్ష్యం కాదని ఆర్థిక నియంత్రణ సంస్థలు గుర్తించాయంటూ.. ఆవిష్కరణలు, వృద్ధిని ప్రోత్సహించడం, వినియోగదారులను కాపాడడం, నియంత్రణలు, పర్యవేక్షణ విషయంలో ఆచరణాత్మక విధానాన్ని అనుసరించ డం ద్వారా ఆర్థిక వ్యవస్థలో సామర్థ్యం పెంచడం కూ డా అంతే ముఖ్యమన్నారు. బలమైన, షాక్‌లను తట్టు కోగల, ఆర్థిక సేవలు అందించే, ఆవిష్కరణల ను ప్రో త్సహించే విధంగా ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించ డం విధాన నిర్ణేతల ముఖ్యమైన తోడ్పాటు కావాలన్నారు.

స్వల్పకాలానికి రిస్కులు..

వాణిజ్య బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు బలమైన మూలధన నిధులు, మిగులు నిల్వలతో పటిష్టంగా ఉన్నట్టు ఆర్‌బీఐ ద్రవ్య స్థిరత్వ నివేదిక తెలిపింది. రుణ ఆస్తుల నాణ్యత, లాభదాయకత సైతం మెరుగుపడినట్టు పేర్కొంది. ''దేశీ ఆర్థిక వ్యవస్థ బలంగా, చెక్కుచెదరకుండా ఉంది. కంపెనీల బలమైన బ్యాలన్స్ షీట్లు, సులభతర ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక అస్థిరతలు తక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ స్వల్పకాలంలో భౌగోళిక రాజకీయ, వాణిజ్య పరమైన అనిశ్చితులు రిస్కులుగా ఉన్నాయి'' అని పేర్కొంది.

బ్లూకాలర్ ఉద్యోగాలకు ఏఐ దన్ను

మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వెల్లడి

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)తో ఫ్యాక్టరీ టెక్నీషియన్లు, మెషినిస్టుల్లాంటి బ్లూకాలర్ ఉద్యోగులకు ముప్పేమీ ఉండదని, ప్రాక్టికల్ నైపుణ్యాలను వినియోగించి వారు మరింత ఆదాయం ఆర్జించేందుకు తోడ్పడే యాక్సిలరేటరుగా ఇది ఉపయోగపడుతుందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వెల్లడించారు. ఇంటెలిజెంట్ సిస్టమ్‌లు రొటీన్ పనులను నిర్వహించడం వల్ల ప్రాక్టికల్ నైపుణ్యాలకు మరింత ప్రాధాన్యం పెరుగుతుందని ఉద్యోగులకు పంపిన నూతన సంవత్సర సందేశంలో ఆయన పేర్కొన్నారు. ఏఐ గురించి ఆందోళన చెందకుండా టెక్నీషియన్లు దానితో ధీమాగా కలిసి పని చేసే విధంగా మార్పులు వస్తాయని వివరించారు. దీన్ని తాము ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఏఐపరమైన పరిణామాలతో బ్లూకాలర్ ఉద్యోగాలు కాస్తా ఆకర్షణీయమైన గోల్డ్–కాలర్ ఉద్యోగాలుగా మారతాయని తెలిపారు. మారుతున్న టెక్నాలజీ, భౌగోళిక-రాజకీయపరమైన పరిణామాలతో నూతన సంవత్సరంలో సర్వత్రా అనిశ్చితి నెలకొనవచ్చని మహీంద్రా చెప్పారు. అయితే అనిశ్చితిని శత్రువుగా పరిగణించకుండా, మన సత్తా నిరూపించుకునే అవకాశంగా భావించాలని సూచించారు. 2025లో ఎస్‌యూవీలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు, మహీంద్రా ఫైనాన్స్ తదితర వ్యాపార విభాగాల్లో గ్రూప్ గణనీయ విజయాలు సాధించిందని ఆనంద్ మహీంద్రా చెప్పారు.

30 బిలియన్ డాలర్ల పరిహారం ఇవ్వాలి

కేజీ–డీ6 విషయంలో రిలయన్స్, బీపీపై కేంద్రం క్లెయిమ్

న్యూఢిల్లీ: కేజీ–డీ6 క్షేత్రానికి సంబంధించి ఆపరేటర్లయిన రిలయన్స్ ఇండస్ట్రీస్, బీపీ .. 30 బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని కోరుతూ త్రిసభ్య ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ముందు కేంద్రం వాదనలు వినిపించింది. అవసరమైన దానికంటే ఎక్కువగా మౌలిక సదుపాయాలు నిర్మించడం, సహజ వాయువు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో విఫలం కావడం ఇందుకు కారణాలుగా పేర్కొంది. ఇన్‌స్టాలేషన్లు, ఇంధన మార్కెటింగ్, వడ్డీ కింద అదనంగా అయిన వ్యయాలతో పాటు ఉత్పత్తి చేయని గ్యాస్‌కి కూడా లెక్క గట్టి మొత్తం 30 బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని వివరించింది. అత్యధికంగా నష్టపోయే వర్గం, వీటిని సుప్రీం కోర్టులో సవాలు చేయొచ్చని వివరించాయి. అయితే, ప్రభుత్వం తమ దగ్గర్నుంచి 30 బిలియన్ డాలర్ల పరిహారాన్ని క్లెయిమ్ చేసిందనడం వాస్తవంగా సరికాదని రిలయన్స్ ఒక ప్రకటనలో పేర్కొంది.

క్విక్‌కామర్స్ ఐపీవోలకు చెక్

- నష్టాల కంపెనీల దరఖాస్తులను నిలిపేయండి
- సెబీకి ఎఫ్ఎంసీజీ పంపిణీ దారుల విన్నపం

న్యూఢిల్లీ: నష్టాలలో ఉన్న క్విక్‌కామర్స్ కంపెనీల ఐపీవోలకు అనుమతులను తాత్కాలికంగా నిలిపివేయవలసిందిగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి అభ్యర్ధనలు అందాయి. వీటి ఐపీవో దరఖాస్తుల తాత్కాలిక నిలిపివేతసహా ఇతర చర్యలను చేపట్టవలసిందిగా ఎఫ్ఎంసీజీ పంపిణీదారుల దేశీ సమాఖ్య ఏఐసీపీడీఎఫ్ ప్రతినిధులు సెబీని అభ్యర్థించారు. క్విక్‌కామర్స్‌తోపాటు.. సంబంధిత ఈకామర్స్ కంపెనీల ఐపీవో అనుమతులకు ప్రస్తుతానికి చెక్ పెట్టవలసిందిగా కోరాయి. ప్రస్తుతం కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) పరిశీలనలో ఉన్నం దున వెను వెంటనే తగిన చర్యలు తీసుకోవలసిందిగా సెబీని వేడుకున్నాయి. వీటితో రిటైల్(చిన్న) ఇన్వెస్టర్లు, దేశీ రిటైల్ వ్యాపార వ్యవస్థకు ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో 4.5 లక్షల మంది దేశవ్యాప్త పంపిణీదారులు, 1.3 కోట్ల కిరాణా, రిటైల్ ఔట్‌లెట్ల తరఫున సెబీని అభ్యర్థిస్తున్నట్లు తెలియజేశాయి. వెరసి నష్టాలలో ఉన్న క్విక్, ఈకామర్స్ సంస్థల ఐపీవో ప్రాస్పెక్టస్‌లపై అనుమతులను తాత్కాలికంగా నిలిపివేయవలసిందిగా కోరాయి. నిజానికి ఈ సంస్థలు భారీ నష్టాలతో నడుస్తున్నాయని, నిర్వహణ నష్టాలు నమోదు చేస్తున్నాయని, యూనిట్‌స్థాయిలో లాభదాయకతపై రుజువులులేవని, ప్రధానంగా ప్రయివేట్ పెట్టుబడుల ద్వారానే వీటి బిజినెస్ మోడళ్లు కొనసాగుతున్నాయని ఏఐసీపీడీఎఫ్ సెబీకి చేసిన అభ్యర్థనలో పేర్కొంది.

దిగివచ్చిన పసిడి, వెండి ధరలు

- రూ.1,300 తగ్గిన బంగారం
- 2,000 దిగివచ్చిన సిల్వర్

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు 2025 ఏడాది చివరి రోజున స్వల్పంగా తగ్గాయి. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం 10 గ్రాముల ధర రూ.1,300 తగ్గి రూ.1,37,700కి దిగివచ్చింది. గతేడాది మొత్తంగా బంగారం ధర 73.45% ర్యాలీ చేసింది. 2025 జనవరి 1 నుంచి 10 గ్రాముల ధర రూ.79,390 నుంచి డిసెంబర్ 31 వరకు మొత్తం రూ.58,310 పెరిగింది. 40 ఏళ్లలో ఒక ఏడాదిలో ఈ స్థాయిలో ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ గోల్డ్ ధర 30.59 డాలర్లు తగ్గి 4,308.30 డాలర్లకు చేరుకుంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్లలో 62% (1,651 డాలర్లు) పెరిగింది.

- మరోవైపు వెండి ధరలు సైతం రికార్డు స్థాయి నుంచి దిగివచ్చాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో సిల్వర్ రేటు రూ. 2,000 తగ్గి రూ. 2.39 లక్షలకు చేరింది. గతేడాది మొత్తంగా 164%(రూ.1,48,500) ర్యాలీ చేసింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ సిల్వర్ ఫ్యూచర్స్ రేటు 6.04% తగ్గి 71.67 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

రిఫ్రిజిరేటర్లు, ఏసీల ధరలకు రెక్కలు!

- 10 శాతం వరకు పెరిగే అవకాశం
- జనవరి 1 నుంచి కొత్త స్టార్ రేటింగ్ నిబంధనలు

న్యూఢిల్లీ: కూలింగ్ ఉత్పత్తులైన ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు జనవరి 1 నుంచి 5–10 శాతం మధ్య పెరగనున్నాయి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బీఈఈ) సవరించిన స్టార్ రేటింగ్ నిబంధనలు అమల్లోకి రానుండడంతో ఈ పరిణామం చోటుచేసుకోనుంది. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సెప్టెంబర్ 22 నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు 10 శాతం వరకు తగ్గగా.. ఇప్పుడు స్టార్ రేటింగ్ ప్రమాణాల కారణంగా ఆ ప్రయోజనం మొత్తం కనుమరుగు కానుంది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణించడం, కాపర్ ధరలు పెరిగిన కారణంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్ల తయారీ సంస్థలు వ్యయ భారాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో ధరలు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడినట్టు చెబుతున్నాయి. అయితే ఈ చర్య కర్బన ఉద్గారాల తగ్గింపునకు మేలు చేస్తుందని వోల్టాస్, డైకిన్, బ్లూస్టార్, గోద్రేజ్ అప్లయెన్సెస్ పేర్కొన్నాయి.

కరెంటు ఆదా..

సవరించిన బీఈఈ నిబంధనల కింద.. కొత్త 5 స్టార్ రేటింగ్ ఏసీలు 10 శాతం మరింద ఇంధనాన్ని ఆదా చేయనున్నాయని, అదే సమయంలో ఉత్పత్తుల ధరలు 10 శాతం పెరగనున్నాయని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు. కొత్త 5 స్టార్ అన్నది ప్రస్తుత ఉత్పత్తుల కోణంలో నుంచి చూస్తే 6–7 స్టార్ ఇంధన సామర్థ్యానికి సమానంగా ఉంటుందన్నారు. ఇప్పుడున్న 5 స్టార్ ఏసీ, రిఫ్రిజిటేటర్ జనవరి 1 తర్వాత 4 స్టార్‌కు తగ్గిపోనున్నాయి. ఇలా ప్రస్తుత ప్రమాణాల ప్రకారం తయారైన ప్రతీ ఉత్పత్తికి సంబంధించి స్టార్ రేటింగ్ ఒక మెట్టు కిందకు వెళ్లిపోనుంది. ఇంధన రేటింగ్ మార్పు కారణంగా ఏసీల ధరలు 5–7 శాతం మేర, రిఫ్రిజిరేటర్ల ధరలు 3–5 శాతం మేర పెరుగుతాయని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ బిజినెస్ హెడ్ కమల్ నంది తెలిపారు. కరెన్సీ విలువ క్షీణత, కమోడిటీ ధరల పెరుగుదలతో వ్యయాల భారాన్ని కంపెనీలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. కొత్త ఇంధన ప్రమాణాలు అమల్లోకి రానుండడంతో డిమాండ్ ఊపందుకుంటుందని వోల్టాస్ సీనియర్ బిజినెస్ లీడర్ జయంత్ బలాన్ అంచనా వేశారు. ధరల పెరుగుదలకు ముందుగానే డీలర్లు, వినియోగదారులు ఆర్డర్లు పెట్టేందుకు ఆసక్తి చూపించొచ్చన్నారు.

ఇతర ఉత్పత్తులకూ కొత్త ప్రమాణాలు

ఏసీలు, రిఫ్రిజిరేటర్లతోపాటు.. టెలివిజన్లు, ఎల్‌పీజీ గ్యాస్ స్టవ్‌లు, కూలింగ్ టవర్లు, చిల్లర్లకు సైతం కొత్త బీఈఈ స్టార్ రేటింగ్ ప్రమాణాలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

విరి విలాపం

పూలు.. ఎంత అందమైనవో.. ఎంత సుకుమారమైనవో.. అంత సున్నితమైనవి. పాపం పూలు.. ఉదయిస్తూనే స్వామి సేవకో.. దేవి కొప్పులోకో చేరి, జన్మను సార్థకం చేయమని వేనోళ్ల ప్రార్థిస్తాయి. రేయి గడిస్తే వసి వాడిపోయి.. సుగంధాలు వీడిపోయి.. కళావిహీనమై చెత్తపాలవుతాయి. నాటి జంధ్యాల పాపయ్య శాస్త్రి ఖండకావ్యం పుష్ప విలాపంలో 'మా కుత్తుకలు కోసి మా ప్రాణం తీయవద్దని ప్రార్థించిన పూలు.. నేడు మమ్మల్ని వరితార్థులను చేయమని దేవుని అభ్యర్థిస్తున్నాయి. మమ్ములనే నమ్ముకుని జీవిస్తున్న వనమాలి జీవితాన్ని మూడు పువ్వులు ఆరు రూకలుగా వర్ధిల్లజేయమని వినమ్రంగా అర్థిస్తున్నాయి. వనంలో మేము.. వ్యాపారంలో మాలి ఎవరూ లాభపడక ఏం ఉపయోగమని ప్రశ్నిస్తున్నాయి. మాకిచ్చిన అల్పాయువును తోటమాలికి పోసి వారి జీవితాన్ని వికసింపజేయమని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాయి.

కాకరపర్రులో పూలు కోయకపోవటంతో విరబూసిన బంతి తోట

కాకరపర్రులో పూలకోత లేని చామంతి తోట

అమ్మకానికి నోచుకోక నేలపాలైన పూలు

కాకరపర్రులో లిల్లీ పూల తోట

విరివిగా పూసినా సిరులు అంతంతే

ధరలు లేక మందగించిన వ్యాపారాలు

గగ్గోలు పెడుతున్న రైతులు

పనులు లేక కూలీలు.. ఉపాధి దొరక్క పనివారు విలవిల

తూర్పు గోదావరిలో 4897 ఎకరాల్లో పూల సాగు

ప్రత్యక్షంగా, పరోక్షంగా 15వేల మందిపై ప్రభావం

పెరవలి: మార్కెట్‌లో పూల ధరలు పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది మూఢం ముందే రావడంతో శుభ ముహూర్తాలు లేక వినియోగం తగ్గడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీని వల్ల రైతులకు నష్టం వస్తుంటే పూలతోటలపై ఆధారపడిన కూలీలకు పనులు లేక ఉపాధి కరువై విలవిలలాడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు తలమానికంగా ఉన్న కడియం, కాకరపర్రు పూల మార్కెట్లు నేడు కొనుగోలుదారులు లేక కళావిహీనంగా కనిపిస్తున్నాయి. వ్యాపారాలు విక్రయాలు లేక.. దిగుబడి బాగున్నా గిట్టుబాటు ధర లేక.. కూలీలకు ఉపాధి దొరకక.. రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం శుభ ముహూర్తాలు, పండుగలు లేకపోవటం వలన పూల వినియోగం తక్కువగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు. 20 రోజుల క్రితం చామంతి కిలో రూ.300, కాగడాలు కిలో రూ.900, కనకాంబరాలు రూ.1200 పలికితే నేడు పూల రకాలు, నాణ్యతను బట్టి కిలో రూ.20 నుంచి రూ.150కి కొనుగోలు చేస్తున్నారని రైతులు చెప్పున్నారు. రైతులు మార్కెట్‌కు పట్టుకువచ్చిన పూలు రెండు మూడు రోజుల వరకు విక్రయాలు జరుగకపోవడంతో వ్యాపారుల దగ్గరే రెండు నుంచి మూడు రోజులు నిల్వ ఉండిపోతున్నాయి. నాలుగు రోజులు దాటితే పూలు వసి వాడిపోయి రోడ్డు పక్కన పాడేయాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాపారులు వాపోతున్నారు. వాతావరణం అనుకూలించడంతో పూల దిగుబడి చాలా బాగుంది. మార్కెట్‌లో పూల ధరలు లేకపోవటం వల్ల వారానికి రెండు కోతలు కోయాల్సిన పూలు నేడు ఒక్కకోతే కోస్తున్నామని రైతులు చెప్పున్నారు. తీరా కోసిన తరువాత కనీసం కూలీల ఖర్చులు కూడా రావడం లేదని, దీంతో కోయకుండానే నష్టపోతున్నామని రైతులు చెప్పున్నారు. పూల రైతులు గ్రామాల బాట బట్టి కిలో పూలు సమయాన్ని బట్టి రూ.30 నుంచి రూ.50కి విక్రయిస్తున్నారు. మార్కెట్లకు పూలను తీసుకువెళ్తుంటే వ్యాపారులు కూడా కొనుగోలు చేయడం లేదని.. దీంతో మళ్లీ తామే తమ గ్రామాలకు తీసుకువెళ్లి వచ్చిన కాడికి విక్రయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పూలసాగు ఇలా..

జిల్లాలో 4897 ఎకరాల్లో పూల సాగు చేస్తుంటే దీనిపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను 15 వేల మంది ఉపాధి పొందుతున్నారు. పూలకు మార్కెట్‌లో ధరలు పలకకపోవడం వల్ల సగానికి సగం మందికి ఉపాధి కరువయ్యిందని రైతులు అంటున్నారు. చిరు వ్యాపారులు సైతం తమకు కనీసం కూలి ఖర్చులు రావడం లేదని వాపోతున్నారు.

నాడు కళకళ నేడు వెలవెల

రైతులు, వ్యాపారులతో కళకళలాడే కాకరపర్రు పూల మార్కెట్ నేడు వెలవెలబోతోంది. శుభ మూర్తాలు, పండగలు లేకపోవడంతో పూల వినియోగం భారీగా తగ్గిపోయింది. దీనితో పూల ధరలు హఠాత్తుగా తగ్గిపోయి రైతులు విలవిలలాడుతున్నారు.

పనులు లేక ఇబ్బంది

పూల కోతలు, పూల తోటలకు ఎరువులు, పురుగు మందులు కొట్టే కూలీలకు, దండలు కట్టే కూలీలకు, చిరు వ్యాపారులు చేసే సైకిల్ వ్యాపారులకు పని అంతంతమాత్రంగా లభించడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. నిత్యం పూలు కోసే కూలీలకు వారానికి ఒక్కరోజు మాత్రమే పనులు లభిస్తుంటే, పూల దండలు కట్టే మహిళలకు పనులు లేక అల్లాడిపోతున్నారు.

ధరలు తగ్గటానికి కారణాలు

ఈ ఏడాది ఊహించని విధంగా ముందుగానే మూఢం రావడంతో శుభ ముహూర్తాలు లేకపోవటం వల్ల ధరలు పతనమయ్యాయి. ఏటా సంక్రాంతి వెళ్లిన తరువాత మార్చి వరకు ముహూర్తాలు ఉండేవి కావు. కానీ డిసెంబర్‌లోనే మూఢం రావల్ల వలన ధరలు తగ్గాయి. అదే సమయంలో పండగలు లేకపోవడం పూల వినియోగం హఠాత్తుగా పడిపోయింది.

తోటలోనే మగ్గిపోతున్న పూలు

పూలధరలు తగ్గడంతో వాటిని కోయకుండా రైతులు చేలల్లోనే వదలేస్తున్నారు. ఎందుకంటే కోయిస్తే కనీసం కూలి ఖర్చులు కూడా రావటం లేదని, దీనితో పూల కోసేకంటే వదిలేయడమే మేలని చెప్తున్నారు. నిత్యం పదిమందితో పూలు కోయించే రైతులు నేడు వారానికి ఒక్కసారి మాత్రమే కోయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు బంతి పూలు ఒక్క కోతకు 10 కూలీలు అవసరం వస్తే వీరికి రోజుకు రూ.350 కూలి ఇవ్వాలి. మార్కెట్‌లో కిలో పూలు రూ.20 పలుకుతున్నాయి. ఒక్క కోతకు సుమారు 100 కిలోలు కోయిస్తే కూలీలకు రూ.3500, కాఫీ, టిఫిన్లు, సంచులు, రవాణా కలిపి రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. దీనితో పూలకు మార్కెట్‌లో వంద కిలోలకు రూ.రెండు వేలు వస్తే ఖర్చు రూ.4500 అవుతోందని రైతులు చెప్తున్నారు. అందుకే పూలను కోయకుండా వదిలేస్తున్నామని వాపోతున్నారు. అన్ని రకాల పూల సాగు పరిస్థితి ఇలానే ఉందని రైతులు అంటున్నారు.

అన్నవరప్పాడులో ఆటోలో పూలు అమ్ముతున్న రైతు

వచ్చింది కూలీలకే సరిపోతోంది

ఒక ఎకరంలో కాగడాలు తోట వేశాను. 20 రోజుల క్రితం వరకు కిలో రూ.900కు విక్రయించగా నేడు రూ.400కు పడిపోయింది. కాగడాల కోతకు 10 మంది కూలీలు అవసరం. 10 కిలోలు పూలు కోస్తున్నారు. మర్కెట్‌కు తీసుకువెళ్తే రూ.4 వేలు వస్తోంది, వచ్చిన సొమ్ము కూలీలకే సరిపోతోంది.

– మానేపల్లి శ్రీనివాస్, పూల రైతు, కాకరపర్రు

కోయకపోతే చేను.. కోస్తే నేను నష్టపోతాం

ఒక ఎకరంలో చామంతి తోట వేశాను. పూల దిగుబడి బాగుంది. రోజు విడిచి రోజు కోత కోసే వాడిని కానీ ధరలు పతనం కావడంతో వచ్చిన సొమ్ము కోత ఖర్చులకు కూడ రావటం లేదు. పూలు కోయకపోతే చేను పాడైపోతుంది, కోస్తే జేబులో సొమ్ములు ఇవ్వాల్సి వస్తోంది. ఏం చేయాలో తెలియడం లేదు.

– ఇంటి నారాయుడు, చామంతి రైతు, కాకరపర్రు

అదనపు పెట్టుబడి వృథా

ఈ ఏడాది పూల దిగుబడి చాలా బాగుంది. నాలుగు రూపాయలు వస్తాయనుకున్నాను. కానీ మార్కెట్‌లో ధర పతనం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. ఆదాయం రావాల్సిన సమయంలో అదనపు పెట్టుబడి పెట్టి నష్టాల పాలవుతున్నాం.

– గుదాల వెంకటేశ్వరరావు, పూల రైతు కాకరపర్రు

గంధం చంద్రుడుకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సీఈవోగా కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) ఇచ్చింది. ఈ మేరకు కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు గురువారం ఉత్తర్వులిచ్చారు.

సీఎస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం రాష్ట్ర సచివాలయంలో పలువురు అఖిల భారత సర్వీసుల ఉన్నతాధికారులు, వివిధ శాఖాధిపతులు, సచివాలయం, ఇతర విభాగాల అధికారులు ఉద్యోగులు, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, జె.శ్యామల రావు, జయలక్ష్మి తదితర ముఖ్య కార్యదర్శులు, కలెక్టర్లు, జేసీలు, వివిధ శాఖాధిపతులు, సచివాలయ ఉద్యోగుల సంఘం, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. అలాగే, విజయానంద్ దంపతులకు సీఎస్ క్యాంపు కార్యాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు ఆశీర్వచనం చేసి, టీటీడీ క్యాలెండర్, డైరీతో పాటు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నూతన సాంకేతికతను ఉద్యోగులు అలవర్చుకోవాలి: విశ్వనాథన్

ఆధునిక సాంకేతికతతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ఆ శాఖ కమిషనరేట్‌లో విశ్వనాథన్ ఉద్యోగులతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలంతోపాటు ఉద్యోగులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలైన కృత్రిమ మేథ (ఏఐ), చాట్ జీపీటీ, గూగుల్ జెమిని వంటి వాటిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పి.కిరణ్ కుమార్, ఐ.సూర్యచంద్రరావు, సీఐఈ ఒ.మధుసూధన, ఆర్‌ఐఈ డాక్టర్.టి.నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు బి.పూర్ణచంద్ర రావు, పి.వెంకట్రాజ్ గౌడ్, డి.రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు పి.రాజశేఖర్, ఏఎస్ వీరభద్రరావు, కె.నారాయణ రెడ్డి, కె.తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా.. గుప్పుమంటూ..!

యర్రగొండపాలెం : కందిపంటలో పెంచుతున్న గంజాయి మొక్కలు (ఫైల్)

నల్లమలలో గంజాయి గుప్పుమంటోంది. అభయారణ్యానికి సమీప గ్రామాల్లో రహస్యంగా దీనిని సాగు చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. గంజాయి సాగు పట్టుబడిన గాంధీనగర్, జమ్మి దోర్నాల ప్రాంతాలు రెండూ కూడా నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాలు కావడం గమనార్హం. ఒకవైపున యథేచ్ఛగా రైళ్లలో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ముఠాలు కళాశాలలు, హైస్కూళ్లను లక్ష్యంగా చేసుకొని వ్యాపారం చేస్తున్నాయి. గంజాయి రవాణాకు అడ్డంకులు ఏర్పడినా సరే విక్రయాలు ఆగిపోకుండా ఏకంగా సాగుకు తెగబడ్డాయి. ఎవరికీ అనుమానం రాకుండా పంట పొలాల్లో దీనిని సాగు చేస్తున్నారు. గంజాయిని కట్టడి చేశామని ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

ప్రకాశం జిల్లా దోర్నాల, యర్రగొండపాలెంలో గంజాయి పంటలు వెలుగులోకి

కంది, మిరప పంటల మధ్యలో గంజాయి సాగు

అక్రమ రవాణా నుంచి ఏకంగా సాగు వైపునకు ముఠాలు

నగరానికి మాత్రమే పరిమితమైన టాస్క్‌ఫోర్స్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో గంజాయి సాగును పూర్తిస్థాయిలో కట్టడి చేశామని 2025 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ల శిక్షణ తరగతులను ప్రారంభించడానికి ప్రకాశం జిల్లాకు వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. అక్కడికి 24 గంటలు కూడా గడవకముందే యర్రగొండపాలెంలో గంజాయి సాగు వెలుగుచూసింది. యర్రగొండపాలెం మండలంలోని గాంధీనగర్ గ్రామ శివారులో పిక్కిలి చిన సుబ్బయ్యకు చెందిన మామిడి తోటలో అంతర్‌పంటగా కందిని సాగు చేస్తున్నాడు. ఎవరికీ అనుమానం కలగకుండా కందిపంటతోపాటుగా గంజాయి కూడా సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసు అధికారులు దాడులు చేసి రూ.10 లక్షల విలువ చేసే 40 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడం సంచలనం సృష్టించింది. సరిగ్గా అంతకు నెలరోజుల ముందుగా అంటే నవంబర్లో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని దోర్నాల మండలంలోని జమ్మిదోర్నాల గ్రామ శివారులో ఒక వ్యక్తి మిర్చి పొలంలో గుట్టుగా గంజాయి సాగు చేస్తుండగా అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.

అటవీ ప్రాంతాలకు సమీపంలో...

జిల్లాలో గంజాయి సాగు పట్టుబడిన గాంధీనగర్, జమ్మి దోర్నాల ప్రాంతాలు రెండూ కూడా నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలోని గ్రామాలు కావడం గమనార్హం. పశ్చిమ ప్రకాశంలో నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న అనేక గ్రామాల్లో రహస్యంగా

నల్లమల అటవీ ప్రాంతంలో గంజాయి సాగు

గంజాయి సాగు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పుల్లల చెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తే మరింత సాగు దొరికే అవకాశం ఉందని స్థానికులు కొందరు చెబుతున్నారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులోని గ్రామాలకు దగ్గరగా ఉన్న పొలాలు, పాలుట్ల పరిసర ప్రాంతాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలకు సమీపంలోని పొలాలను, అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తే భారీ మొత్తంలో సాగు లభ్యమవుతుందంటున్నారు.

అధికార పార్టీ నాయకులకు తెలుసా...

యర్రగొండపాలెం మండలంలోని గాంధీ నగర్ పొలాల్లో లభ్యమైన గంజాయి సాగు గురించి పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ పిక్కిలి చిన సుబ్బయ్య తోటకు చుట్టు పక్కల అంతా తెలుగుదేశం పార్టీ నాయకులకు చెందిన పొలాలు ఉన్నాయి. వీరికి తెలియకుండా గంజాయి సాగు చేసే అవకాశం లేదని కొందరు వాదిస్తున్నారు. పోలీసు అధికారులు ఆ దిశగా విచారణ జరిపితే నిజనిజాలు బయటకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రొహిబిషన్ అధికారులు ఏం చేస్తున్నారు..

జిల్లాలో పెద్ద మొత్తంలో గంజాయి సాగు చేస్తున్నప్పటికీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. నవంబరులో దోర్నాల మండలంలో గంజాయి సాగును పట్టుకున్న తరువాత అయినా పశ్చిమ ప్రకాశంలో గంజాయి సాగు గురించి నిఘా పెట్టలేకపోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు తాజాగా గాంధీనగర్‌లో గంజాయి సాగును అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ రెండు దాడుల్లో కూడా ఎక్సైజ్ శాఖ అధికారుల పాత్ర ఏ మాత్రం లేదన్న మాట వినిపిస్తోంది. మద్యం షాపులు, బెల్టు షాపుల నుంచి లక్షలాది రూపాయల మామూళ్లు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ గంజాయి సాగు మీద లేదని పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలు మండిపడుతున్నారు.

హైస్కూలు విద్యార్థులకు కౌన్సెలింగ్

ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కొందరికి ఇటీవల ఒంగోలు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. గంజాయి, వైట్నర్‌లకు అలవాటు పడిన సదరు విద్యార్థులు స్కూలుకు వచ్చి గందరగోళం చేస్తున్నట్లు తెలిసింది. మొదట్లో వారికి మంచి మాటలు చెప్పి దారిలోకి తీసుకొని రావాలని ఉపాధ్యాయులు ప్రయత్నించి విఫలమైనట్లు సమాచారం. సదరు గంజాయి బ్యాచ్ విద్యార్థుల పోడు పడలేక పోలీసులకు ఫిర్యాదు చేయగా విద్యార్థులతోపాటుగా వారి తల్లితండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలుసింది. పెడదారి పట్టిన విద్యార్థులకు తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చి పంపించినట్లు సమాచారం. ఇటీవల టాస్క్‌ఫోర్స్ జరిపిన దాడుల్లో ఒంగోలు నగరంలోని ఇంటర్మీడియెట్ విద్యార్థులు, బైపాస్‌లోని డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు కొందరు పట్టుబడడంతో విస్తుపోవడం పోలీసుల వంతయింది.

జైలుకు పోయివచ్చినా మారని తీరు...

గతంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చిన ఒక పాత నిందితుడు యర్రగొండపాలెం పరిసర ప్రాంతాల్లో కేవలం రూ.150 కే గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. తక్కువ ధరకు గంజాయి అందుబాటులో ఉండడంతో కొంత మంది విద్యార్థులు, యువకులు గంజాయి తాగుతున్నట్లు తెలిసింది. పాత నేరస్థుల మీద తగినంత నిఘా పెట్టడంలో ఎక్సైజ్ శాఖ, పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పశ్చిమ ప్రకాశంలో గంజాయి విక్రయాలు ఎక్కువైనట్లు సమాచారం. గిద్దలూరులో ఒకరిని, శ్రీశైలం ఘాట్ రోడ్డులో ముగ్గురిని గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు.

అభయారణ్యం.. స్వేచ్ఛా విహారం

లక్ష ఎకరాల్లో పాపికొండల అభయారణ్యం

పులులు, చిరుతలు, అడవి దున్నల సంచారం

పోలవరం ముంపు గ్రామాల తరలింపుతో మరింత స్వేచ్ఛగా..

235 రకాలకుపైగా పక్షి జాతుల గుర్తింపు

వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి

ట్రాప్ కెమెరాకు చిక్కిన నెమలి

ఎలుగుబంటి

చిరుత పులులు

గొర్ర గేదెలు

కొండ గొర్రెలు

బుట్టాయగూడెం: పాపికొండల అభయారణ్యంలో పెద్ద పులులు, చిరుతల గాండ్రిపులతో, పక్షుల కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో అభయారణ్యం పరిధిలోకి వచ్చే 23 గ్రామాలు ఖాళీ చేసి ఆయా గ్రామాల్లో ఉండే నిర్వాసితులను ప్రభుత్వం పునరావాసం కాలనీలకు తరలించడంతో వన్యప్రాణుల స్వేచ్ఛా జీవనానికి అవకాశం కలిగింది. గోదావరి ఒడ్డున ఉండే గ్రామాలు ఖాళీ కాగా జనసంచారం లేకపోవడంతో పాపికొండల్లో వన్యప్రాణులు మరింత స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం ఏర్పడింది. ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం 2008లో పాపికొండల అభయారణ్యంగా ప్రకటించింది. దీనితో అప్పటివరకు రాష్ట్ర పరిధిలో ఉన్న పాపికొండలు కేంద్రం పరిధిలోకి మారింది. ఫారెస్టు, వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వన్యప్రాణులు సంరక్షణకు కృషి చేస్తున్నారు.

1012 చ.కిలోమీటర్ల పరిధిలో..

పాపికొండల అభయారణ్యం ఏలూరు జిల్లా పరిధిలోని బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతో పాటు రంపచోడవరం నియోజకవర్గంలోని దేవీపట్నం, వీఆర్‌పురం, చింతూరు, మండలాల పరిధిలో సుమారు 1,012.85 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది.

నాలుగేళ్లకోసారి గణన

పాపికొండల అభయారణ్యంలో ప్రతి నాలుగేళ్లకోసారి అధికారులు జంతుగణన నిర్వహించి అడవుల్లో ఉండే వన్యప్రాణులను గుర్తించే ప్రక్రియ చేపడతారు. 2018, 2022లో జంతుగణన నిర్వహించారు. ఆ సమయంలో 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి సర్వే చేశారు. సింహాలు, ఏనుగులు తప్ప అన్నిరకాల జంతువులు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి.

నేటి నుంచి పులుల జాడ కోసం..

పాపికొండల అభయారణ్యంలో పులుల జాడ కోసం అటవీ శాఖ అధికారులు శుక్రవారం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు 130 ప్రాంతాల్లో 300కు పైగా కెమెరాలు ఏర్పాటు చేస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. గతనెల 1న జాతీయ పులుల గణన, వన్యప్రాణుల లెక్కింపు కార్యక్రమం సుమారు 8 రోజులపాటు నిర్వహించారు. ఇందుకోసం అటవీశాఖ అధికారులు ట్రయిల్‌రన్‌ను కూడా నిర్వహించారు. అయితే పులుల జాడ కోసం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రిప్రజెంటేటివ్‌ల ఆధ్వర్యంలో పులుల జాడపై ట్రాప్ కెమెరాల ద్వారా సర్వే చేయనున్నారు.

గోదావరి తీరం.. స్వేచ్ఛా విహారం

గోదావరి పరీవాహక ప్రాంతంలో నది ఒడ్డున ఉన్న తెల్లదిబ్బలు, సిరివాక, కొరుటూరు, శివగిరి, చీడూరు, టేకూరు, తూటిగుంట, ఎర్రవరం, సరుగుడు, పల్లపూరు, పైడాకులమామిడి, వాడపల్లి, కోండ్రుకోట, మాదాపురం, ములగలగూడెం, గాజులగొంది, తల్లవరం, కొత్తూరు, కొత్తమామిడిగొంది, చేగొండపల్లి తదితర గ్రామాలను పోలవరం ప్రాజెక్టులో ముంపు గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఆయా గ్రామాల నిర్వాసితులను బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలకు తరలించారు. దీంతో ప్రస్తుతం ఆయా గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. జనసంచారం కూడా లేకపోవడంతో ఆయా గ్రామాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరుగుతూ నీటి కోసం గోదావరి తీరానికి వస్తున్నాయి. పాపికొండల విహార యాత్రకు వెళ్లే పర్యాటకులు నెమళ్లు, అడవి దున్నలు, దుప్పిలు కనిపించినట్టు చెబుతున్నారు.

బిజినెస్ రీల్

ఆషికా గ్రూప్‌నకు మ్యూచువల్ ఫండ్స్ లైసెన్స్

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌ను ప్రారంభించేందుకు సెబీ నుంచి సూత్రప్రాయ అనుమతి లభించినట్టు ఆషికా గ్రూప్ ప్రకటించింది. దీంతో అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)ని ఏర్పాటు చేసి, మ్యూచువల్ ఫండ్స్‌ను ప్రారంభించేందుకు కంపెనీకి అవకాశం లభించినట్టయింది. అయితే, తుది అనుమతి అన్నది సెబీ నిబంధనలను అనుసరించడంపై ఆధారపడి ఉంటుందని కంపెనీ తెలిపింది. ఆషికా గ్రూప్ ఇప్పటికే క్యాపిటల్ మార్కెట్లు, రిటైల్, ఇనిస్టిట్యూషనల్ బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, రీసెర్చ్ అడ్వైజరీ, ఆల్టర్నేటివ్ అస్సెట్ మేనేజ్‌మెంట్, ప్రైవేటు ఈక్విటీ కార్యకలాపాలు నిర్వహిస్తుండడం గమనార్హం.

తాజ్ జీవీకే నుంచి ఐహెచ్‌సీఎల్ నిష్క్రమణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో తమకున్న మొత్తం 25.52 శాతం వాటాలను విక్రయించినట్లు ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్‌సీఎల్) వెల్లడించింది. 1.6 కోట్ల షేర్లను ఒక్కో షేరుకి రూ. 370 రేటు చొప్పున షాలిని భూపాల్‌కి విక్రయించినట్లు తెలిపింది. అ ప్రస్తుతం అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారం తాజ్ జీవీకేకి చెందిన హోటళ్లను యథాప్రకారం నిర్వహించడం కొనసాగుతుందని పేర్కొంది. మరోవైపు తాజా పరిణామంతో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ బోర్డు నుంచి ఐహెచ్‌సీఎల్ నామినేట్ చేసిన డైరెక్టర్లు తప్పుకున్నారు.

పెరిగిన వాణిజ్య ఎల్‌పీజీ ధర

దిగొచ్చిన ఏటీఎఫ్ ధర

న్యూఢిల్లీ: విమాన యాన ఇంధనం (ఏటీఎఫ్) ధర ను 7.3% తగ్గిస్తూ ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలు గురువారం నిర్ణ యం తీసుకున్నాయి. వా ణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.111 పెంచాయి. ఢిల్లీ మార్కెట్లో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర తగ్గింపు అనంతరం రూ.7,353.75కు దిగొచ్చింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఏటీఎఫ్ ధర 9.7 శాతం మేర పెరగ్గా.. ఇప్పుడు అందులో మూడింట రెండొంతులు తగ్గించారు. మరోవైపు 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండ్ ధర ఢిల్లీ మార్కెట్లో రూ.111 పెరిగి రూ.1,691.50కు చేరింది. ఇక గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-1-2026

విశాఖ	635-00
చిత్తూరు	703-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	625-00
విజయవాడ	660-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	630-00
వరంగల్	632-00
రిటైల్ ధర	7.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	9,585.00	2.59
SHRIRAMFIN	1,020.00	2.39
NTPC	336.1	1.99
ETERNAL	283.55	1.98
WIPRO	267.3	1.52

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	363.95	-9.69
TATACONSUM	1,173.30	-1.57
DRREDDY	1,252.00	-1.53
BAJFINANCE	975.6	-1.13
ONGC	237.9	-1.03

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,237
ఎన్‌ఎస్‌ఈ	80,223
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	93,411
ఎఫ్‌ఐఐ	- 3,269
డీఐఐ	+ 1,526

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	57.42	$	57.95
బ్రెంట్	60.91	$	61.33

కార్ల విక్రయాలు అదుర్స్

- 2025లో 45.5 లక్షల ప్యాసింజర్ వాహన అమ్మకాలు
- జీఎస్‌టీ 2.0తో పరిశ్రమకు ఉత్సాహం
- కొనసాగిన ఎస్‌యూవీల హవా

న్యూఢిల్లీ: 2025లో సంవత్సరంలో దేశీయంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు రికార్డు స్థాయిలో 45.5 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. అంతకుముందు 2024 ఏడాదిలో అమ్ముడైన 43.05 వాహనాలతో పోలిస్తే ఈ సంఖ్య దాదాపు 6% అధికంగా ఉంది. ఏడాది ప్రథమార్థంలో మందగమనం కనిపించినా, సెప్టెంబర్ 21 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన 'జీఎస్టీ 2.0' పరిశ్రమలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. దేశీయ దిగ్గజ ఆటో కంపెనీలైన మారుతీ సుజుకీ, మహీంద్రాఅండ్‌మహీంద్రా(ఎం అండ్‌ఎం), టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్(టీఎంపీవీ), టయోటా కిర్లోస్కర్ మోటార్, స్కోడా ఆటోలు గతంలో ఎన్నడూ చేయని అధిక స్థాయిలో వార్షిక విక్రయాలు నమోదు చేశాయి.

■ ఎంఅండ్‌ఎం, ఎంఅండ్‌ఎం 2025లో వాల్యూమ్ పరంగా రెండో స్థానంలో ఉన్న హ్యుందాయ్ మోటార్ ఇండియా(హెచ్‌ఎంఐఎల్)ను దాటి వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. దీంతో హెచ్‌ఎంఐఎల్ స్థానానికి పరిమితమైంది.

■ కస్టమర్లకు ఎస్‌యూవీలపై ఆసక్తి మరింత పెరిగింది. 2024లో మొత్తం ప్యాసింజర్ అమ్మకాల్లో 53.8% ఉన్న ఎస్‌యూవీల వాటా, 2025లో 55.8 శాతానికి పెరిగింది. అలాగే జీఎస్‌టీ 2.0 అమలుతో చిన్న కార్ల విక్రయాలు కూడా పెరిగాయి.

■ మారుతీ సుజుకీ ఇండియా 2025లో 18.44 లక్షల వాహనాలు విక్రయించింది. గతేడాది 2024లో 17.90 లక్షల యూనిట్ల అమ్మకాల రికార్డు తుడిపెట్టుకుపోయింది. ''జీఎస్‌టీ తగ్గింపు, రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు అంశాలు 2025లో ఆటో పరిశ్రమ పనితీరును మెరుగుపరిచాయి'' అని సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ వెల్లడించారు.

■ గత క్యాలెండర్ ఏడాదిలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 2025లో మొత్తం 5,87,218 యూనిట్లు విక్రయించగా, ఇందులో 81,125 ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. ఇది వరుసగా ఐదో ఏడాది రికార్డు స్థాయి వార్షిక అమ్మకాలుగా సంస్థ పేర్కొంది. ఎస్‌యూవీలపై పెరుగుతున్న ఆసక్తి, పర్యావరణ అనుకూల వాహనాలను ఆదరణ లభించడంతో 2025లో ఆటో పరిశ్రమ స్థిరమైన వృద్ధిని సాధించిందని టీఎంపీవీ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర తెలిపారు.

■ టయోటా కిర్లోస్కర్ మోటార్(టీకేఎం) 2025లో 3,88,801 యూనిట్లు విక్రయించింది. 2024లోని 3,26,329 యూనిట్లతో పోలిస్తే 19 శాతం వృద్ధి నమోదైంది. ప్రభుత్వ జీఎస్‌టీ సంస్కరణలు, వ్యూహాత్మక ఉత్పత్తి పెంపు, కొత్త మోడల్ వేరియంట్ల ఆవిష్కరణలతో ఈ స్థిరమైన ప్రగతి సాధ్యమైందని టీకేఎం వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా తెలిపారు.

■ స్కోడా ఆటో ఇండియా 2025లో 72,665 యూనిట్లతో కంపెనీ చరిత్రలోనే అత్యుత్తమ విక్రయాలను నమోదు చేసింది. ఇది 2024లోని 35,166 యూనిట్లతో పోలిస్తే అమ్మకాలు రెట్టింపు స్థాయికి చేరాయి.

డిసెంబర్‌లో కంపెనీల వాహన విక్రయాలు (ఎగుమతులు కలుపుకొని)

కంపెనీ	2025	2024	వృద్ధి /క్షీణత (%లో)
మారుతీ	2,17,854	1,78,248	22
హ్యుందాయ్	58,702	55,702	7
ఎంఅండ్‌ఎం	86,090	69768	23
టీఎంపీవీ	50,519	44,289	14
టయోటా	39,333	29,529	33
స్కోడా ఆటో	72,665	35,166	107
కియా ఇండియా	18,659	8,957	108
ఎంజీ మోటార్	70,554	6,500	19
హోండా కార్స్	5,807	5,603	3.6
అశోక్ లేలాండ్	21,533	16,957	27
హీరో మోటో	4,56,479	3,24,906	40
టీవీఎస్	4,81,389	3,21,687	50

హెచ్‌ఎంఐఎల్ ఎండీ, సీఈవోగా తరుణ్ గార్గ్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా(హెచ్‌ఎంఐఎల్) చీఫ్ ఎగ్జిక్యూటివ్, మేనేజింగ్ డైరెక్టర్‌గా తరుణ్ గార్గ్ గురువారం(జనవరి 1న) బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌ఎంఐఎల్ 29 ఏళ్ల చరిత్రలో తొలిసారి ఒక భారతీయుడు నాయకత్వం వహించడం విశేషం. ఇప్పటి వరకు ఎండీ, సీఈవోగా సేవలు అందించిన ఉన్సూ కిమ్ దక్షిణ కొరియాలోని హ్యుందాయ్ మాతృసంస్థలో వ్యూహాత్మక బాధ్యతలు చేపట్టేందుకు తిరిగి వెళ్లారు. ''భారతీయ నాయకత్వ సామర్థ్యంపై ప్రగాఢ నమ్మకమే తరుణ్ గార్గ్ నియామకం. సంస్థ తదుపరి దశ వృద్ధికి నేతృత్వం వహించే అనుభవం, నైపుణాలు ఆయనకున్నాయి. ఈ వ్యూహాత్మక నిర్ణయంతో ప్రపంచ ఆటోమొబైల్ మార్కెట్లో భారత్ స్థానం మరింత పటిష్టం అవుతుంది'' అని హెచ్‌ఎంఐఎల్ తెలిపింది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా కొత్త ఎండీ, సీఈవో మాట్లాడుతూ.. ''హ్యుందాయ్ వారసత్వాన్ని బలోపేతం చేస్తూ.., కస్టమర్లకు అత్యుత్తమ మొబిలిటీ సొల్యూషన్స్ అందించడమే తన ముందున్న లక్ష్యం'' అన్నారు.

అంచనాల్లో 62 శాతానికి ద్రవ్యలోటు

రూ.9.76 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) ద్రవ్యలోటు నవంబర్ చివరికి రూ.9.76 లక్షల కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతంగా (రూ.15.69 లక్షల కోట్లు) ఉంటుందని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఈ అంచనాల్లో నవంబర్ చివరికే 62.3 శాతం మేర ద్రవ్యలోటు నమోదైంది. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ చివరికి ప్రభుత్వం రూ.19.49 లక్షల కోట్ల ఆదాయాన్ని అందుకుంది. ఇందులో రూ.13,93,946 కోట్లు పన్నుల రూపంలో, రూ.5,16,366 కోట్లు పన్నేతర ఆదాయంగా, రూ.38,927 కోట్లు రుణేతర నిధుల రూపంలో సమకూరింది. వ్యయాలు నవంబర్ చివరికి రూ.29.26 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో రూ.22,67,700 కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా, రూ.6,58,210 కోట్లను మూలధన వ్యయాలు కింద సర్కారు ఖర్చు చేసింది. రెవెన్యూ వ్యయాల్లో రూ.7.45 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు పోగా, రూ.2.88 లక్షల కోట్లు సబ్సిడీలకు వెచ్చించింది. ఈ డేటాపై ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ స్పందిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల పన్నుల ఆదాయంలో రూ.1.5 లక్షల కోట్లు తగ్గుదల ఉండొచ్చని పేర్కొన్నారు. అదే సమయంలో ద్రవ్యలోటు అదుపు తప్పకపోవచ్చన్నారు.

ఎగుమతిదారులకు రూ.4,531 కోట్ల ప్రోత్సాహకం

ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: దేశ ఎగుమతిదారులు అంతర్జాతీయ మార్కెట్లో మరిన్ని అవకాశాలను సొంతం చేసుకునేందుకు వీలుగా కేంద్ర సర్కారు రూ.4,531 కోట్లతో 'మార్కెట్ యాక్సెస్ సపోర్ట్' పథకాన్ని ప్రారంభించింది. అంతర్జాతీయ వాణిజ్య సదస్సులు, ప్రదర్శనల్లో దేశీ ఎగుమతిదారులు పాల్గొనేందుకు వీలుగా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందించనుంది. భారత ఎగుమతిదారుల పోటీతత్వాన్ని పెంచే లక్ష్యంలో భాగంగా కేంద్ర వాణిజ్య శాఖ రూ.25,060 కోట్లతో ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ చేపట్టడం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ పథకాన్ని అమలు చేయనుంది. 2025-31 కాలానికి రూ.4,531 కోట్లను కేటాయించింది. ఇందులో రూ.500 కోట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సాయం కింద ఎగుమతిదారులకు అందించనుంది.

అనిశ్చితుల మధ్య అధిక వృద్ధి

- బలమైన వినియోగం, పెట్టుబడులు సానుకూలం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, అధిక వృద్ధిని నమోదు చేస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అంతర్జాతీయంగా అస్థిరతలతో కూ డిన ప్రతికూల వాతావరణంలోనూ దేశీయంగా బలమైన వినియోగం, పెట్టుబడులు వృద్ధికి అండగా నిలుస్తున్నట్టు తెలిపారు. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి దిగిరావడంతోపాటు.. కంపెనీల బ్యాలన్స్ షీట్లు ఆరోగ్యంగా ఉన్నట్టు చెప్పారు. ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూ, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతమ ప్రాధాన్యతగా ఆర్‌బీఐ ఆర్థిక స్థిరత్వ నివేదికలో పేర్కొన్నారు. ఆర్థిక స్థిరత్వం అంతిమ లక్ష్యం కాదని ఆర్థిక నియంత్రణ సంస్థలు గుర్తించాయంటూ.. ఆవిష్కరణలు, వృద్ధిని ప్రోత్సహించడం, వినియోగదారులను కాపాడడం, నియంత్రణలు, పర్యవేక్షణ విషయంలో ఆచరణాత్మక విధానాన్ని అనుసరించ డం ద్వారా ఆర్థిక వ్యవస్థలో సామర్థ్యం పెంచడం కూ డా అంతే ముఖ్యమన్నారు. బలమైన, షాక్‌లను తట్టు కోగల, ఆర్థిక సేవలు అందించే, ఆవిష్కరణల ను ప్రో త్సహించే విధంగా ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించ డం విధాన నిర్ణేతల ముఖ్యమైన తోడ్పాటు కావాలన్నారు.

స్వల్పకాలానికి రిస్కులు..

వాణిజ్య బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు బలమైన మూలధన నిధులు, మిగులు నిల్వలతో పటిష్టంగా ఉన్నట్టు ఆర్‌బీఐ ద్రవ్య స్థిరత్వ నివేదిక తెలిపింది. రుణ ఆస్తుల నాణ్యత, లాభదాయకత సైతం మెరుగుపడినట్టు పేర్కొంది. ''దేశీ ఆర్థిక వ్యవస్థ బలంగా, చెక్కుచెదరకుండా ఉంది. కంపెనీల బలమైన బ్యాలన్స్ షీట్లు, సులభతర ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక అస్థిరతలు తక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ స్వల్పకాలంలో భౌగోళిక రాజకీయ, వాణిజ్య పరమైన అనిశ్చితులు రిస్కులుగా ఉన్నాయి'' అని పేర్కొంది.

క్విక్‌కామర్స్ ఐపీవోలకు చెక్

- నష్టాల కంపెనీల దరఖాస్తులను నిలిపేయండి
- సెబీకి ఎఫ్‌ఎంసీజీ పంపిణీ దారుల విన్నపం

న్యూఢిల్లీ: నష్టాలలో ఉన్న క్విక్‌కామర్స్ కంపెనీల ఐపీవోలకు అనుమతులను తాత్కాలికంగా నిలిపివేయవలసిందిగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి అభ్యర్థనలు అందాయి. వీటి ఐపీవో దరఖాస్తుల తాత్కాలిక నిలిపివేతసహా ఇతర చర్యలను చేపట్టవలసిందిగా ఎఫ్‌ఎంసీజీ పంపిణీదారుల దేశీ సమాఖ్య ఏఐసీపీడీఎఫ్ ప్రతినిధులు సెబీని అభ్యర్థించారు. క్విక్‌కామర్స్‌తోపాటు.. సంబంధిత ఈకామర్స్ కంపెనీల ఐపీవో అనుమతులకు ప్రస్తుతానికి చెక్ పెట్టవలసిందిగా కోరాయి. ప్రస్తుతం కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) పరిశీలనలో ఉన్నం దున వెను

వెంటనే తగిన చర్యలు

తీసుకోవలసిందిగా సెబీని వేడుకున్నాయి. వీటితో రిటైల్(చిన్న) ఇన్వెస్టర్లు, దేశీ రిటైల్ వ్యాపార వ్యవస్థకు ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో 4.5 లక్షల మంది దేశవ్యాప్త పంపిణీదారులు, 1.3 కోట్ల కిరాణా, రిటైల్ ఔట్‌లెట్ల తరపున సెబీని అభ్యర్థిస్తున్నట్లు తెలియజేశాయి. వెరసి నష్టాలలో ఉన్న క్విక్, ఈకామర్స్ సంస్థల ఐపీవో ప్రాస్పెక్టస్‌లపై అనుమతులను తాత్కాలికంగా నిలిపివేయవలసిందిగా కోరాయి. నిజానికి ఈ సంస్థలు భారీ నష్టాలతో నడుస్తున్నాయని, నిర్వహణ నష్టాలు నమోదు చేస్తున్నాయని, యూనిట్‌స్థాయిలో లాభదాయకతపై రుజువులులేవని, ప్రధానంగా ప్రయివేట్ పెట్టుబడుల ద్వారానే వీటి బిజినెస్ మోడళ్లు కొనసాగుతున్నాయని ఏఐసీపీడీఎఫ్ సెబీకి చేసిన అభ్యర్థనలో పేర్కొంది.

దిగివచ్చిన పసిడి, వెండి ధరలు

- రూ.1,300 తగ్గిన బంగారం
- 2,000 దిగివచ్చిన సిల్వర్

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు 2025 ఏడాది చివరి రోజున స్వల్పంగా తగ్గాయి. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం 10 గ్రాముల ధర రూ.1,300 తగ్గి రూ.1,37,700కి దిగివచ్చింది. గతేడాది మొత్తంగా బంగారం ధర 73.45% ర్యాలీ చేసింది. 2025 జనవరి 1 నుంచి 10 గ్రాముల ధర రూ.79,390 నుంచి డిసెంబర్ 31 వరకు మొత్తం రూ.58,310 పెరిగింది. 40 ఏళ్లలో ఒక ఏడాదిలో ఈ స్థాయిలో ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ గోల్డ్ ధర 30.59 డాలర్లు తగ్గి 4,308.30 డాలర్లకు చేరుకుంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్లలో 62% (1,651 డాలర్లు) పెరిగింది.

- మరోవైపు వెండి ధరలు సైతం రికార్డు స్థాయి నుంచి దిగివచ్చాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో సిల్వర్ రేటు రూ. 2,000 తగ్గి రూ. 2.39 లక్షలకు చేరింది. గతేడాది మొత్తంగా 164%(రూ.1,48,500) ర్యాలీ చేసింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ సిల్వర్ ఫ్యూచర్స్ రేటు 6.04% తగ్గి 71.67 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

బ్రాడ్ బ్యాండ్ చందాదారులు 100 కోట్లు

51 కోట్ల కస్టమర్లతో జియో టాప్



న్యూఢిల్లీ: బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య నవంబర్‌లో 100 కోట్ల మార్క్‌ను దాటింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ (ట్రాయ్) తాజా గణాంకాల ప్రకారం అక్టోబర్ చివరికి బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు 99.98 కోట్లుగా ఉంటే, నవంబర్ చివరికి 100 కోట్ల మార్క్‌ను అధిగమించింది. 51 కోట్ల చందాదారులతో జియో నెట్‌వర్క్ నంబర్ 1 స్థానంలో ఉంది. ఇందులో 49.69 కోట్ల మంది వైర్‌లెస్ చందాదారులు కాగా, 1.35 కోట్ల మంది ఫిక్స్‌డ్ లైన్ బ్రాడ్ బ్యాండ్ చందాదారులు ఉన్నారు. ఆ తర్వాత భారతీ ఎయిర్‌టెల్ 31.42 కోట్ల చందాదారులను కలిగి ఉంది. వొడాఫోన్ ఐడియా వైర్‌లెస్ చందాదారులు 12.77 కోట్లు కాగా, బీఎస్‌ఎన్‌ఎల్‌కు 2.94 కోట్ల మంది వైర్‌లెస్, 44.5 ఫిక్స్‌డ్ లైన్ బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు ఉన్నారు. 2015 నవంబర్ చివరికి దేశంలో బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు కేవలం 13.15 కోట్ల మందే ఉన్నారు. పదేళ్లలో ఏడు రెట్లు పెరగడం గమనార్హం. ఇక నవంబర్ చివరికి మొత్తం టెలికం చందాదారులు 123.45 కోట్లకు పెరిగారు. ఇందులో 118.74 కోట్లు వైర్‌లెస్ కాగా, 4.7 కోట్లు వైర్‌లెన్ కనెక్షన్లు ఉన్నాయి.

జియో నెట్‌వర్క్ కిందకు 13.88 లక్షలు

జియో నెట్‌వర్క్ కిందకు నవంబర్‌లో 13.88 లక్షల మంది కొత్త మొబైల్ చందాదారులు వచ్చి చేరారు. దీంతో మొత్తం మొబైల్ చందాదారుల సంఖ్య 48.6 కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్ 12.15 లక్షల మందిని ఆకర్షించింది. ఆ తర్వాత బీఎస్‌ఎన్‌ఎల్ కిందకు 4.21 లక్షల మంది కొత్తగా వచ్చి చేరారు. వొడాఫోన్ ఐడియా 10.11 లక్షల మంది కస్టమర్లను కోల్పోయింది.

బ్లూకాలర్ ఉద్యోగాలకు ఏఐ దన్ను

మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వెల్లడి

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)తో ఫ్యాక్టరీ టెక్నీషియన్లు, మెషినిస్టుల్లాంటి బ్లూకాలర్ ఉద్యోగులకు ముప్పేమీ ఉండదని, ప్రాక్టికల్ నైపుణ్యాలను వినియోగించి వారు మరింత ఆదాయం ఆర్జించేందుకు తోడ్పడే యాక్సిలరేటరుగా ఇది ఉపయోగపడుతుందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వెల్లడించారు. ఇంటెలిజెంట్ సిస్టమ్‌లు రొటీన్ పనులను నిర్వహించడం వల్ల ప్రాక్టికల్ నైపుణ్యాలకు మరింత ప్రాధాన్యం పెరుగుతుందని ఉద్యోగులకు పంపిన నూతన సంవత్సర సందేశంలో ఆయన పేర్కొన్నారు. ఏఐ గురించి ఆందోళన చెందకుండా టెక్నీషియన్లు దానితో ధీమాగా కలిసి పని చేసే విధంగా మార్పులు వస్తాయని వివరించారు. దీన్ని తాము ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఏఐపరమైన పరిణామాలతో బ్లూకాలర్ ఉద్యోగాలు కాస్తా ఆకర్షణీయమైన గోల్డ్-కాలర్ ఉద్యోగాలుగా మారతాయని తెలిపారు. మారుతున్న టెక్నాలజీ, భౌగోళిక-రాజకీయపరమైన పరిణామాలతో నూతన సంవత్సరంలో సర్వత్రా అనిశ్చితి నెలకొనవచ్చని మహీంద్రా చెప్పారు. అయితే అనిశ్చితిని శత్రువుగా పరిగణించకుండా, మన సత్తా నిరూపించుకునే అవకాశంగా భావించాలని సూచించారు. 2025లో ఎస్‌యూవీలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు, మహీంద్రా ఫైనాన్స్ తదితర వ్యాపార విభాగాల్లో గ్రూప్ గణనీయ విజయాలు సాధించిందని ఆనంద్ మహీంద్రా చెప్పారు.

రీసైక్లింగ్ టెక్నాలజీలతో ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్

పాలీసైకిల్ సీఈవో అమిత్ టాండన్ వెల్లడి

న్యూఢిల్లీ: అధునాతన రసాయనిక రీసైక్లింగ్ టెక్నాలజీలను ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను పరిష్కరించవచ్చని పాలీసైకిల్ వ్యవస్థాపకుడు, సీఈవో అమిత్ టాండన్ తెలిపారు. భారీ స్థాయిలో నాఫ్తా దిగుమతులను కూడా తగ్గించుకోవచ్చని వివరించారు. ఇందుకు సంబంధించి తాము రూపొందించిన కోంటిఫ్లో క్రాకర్ జనరేషన్ సిక్స్ సాంకేతికత, సంక్లిష్టమైన పదార్థాలను అధిక విలువ పలికే ఉత్పత్తులుగా రీసైకిల్ చేయగలదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు దేశీయంగా ఏటా 93 లక్షల టన్నుల స్థాయిలో ఉంటున్నాయి. వీటిలో మెకానికల్ రీసైక్లింగ్ విధానంలో సమర్థవంతంగా రీసైకిల్ చేయలేని పాలీథీన్ బ్యాగ్‌లు, పౌచ్‌ల్లాంటి పాలియోలెఫిన్‌లు ఎక్కువగా ఉంటున్నట్లు టాండన్ చెప్పారు. సుమారు 57-59 లక్షల టన్నుల పాలీయోలెఫిన్ ప్యాకేజింగ్ రీసైక్లింగ్‌తో 4 మిలియన్ టన్నుల పైరోలిసిస్ ఆయిల్ తయారు చేయొచ్చని.. పెట్రోకెమికల్ ప్లాంట్లలో నాఫ్తాకు ప్రత్యామ్నాయంగా దీన్ని ఉపయోగించవచ్చని వివరించారు. తద్వారా నాఫ్తా దిగుమతులను తగ్గించుకోవచ్చని టాండన్ వివరించారు. దేశీయంగా నాఫ్తా వినియోగం 1.2 కోట్ల టన్నుల స్థాయిలో ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ 30 లక్షల టన్నుల నాఫ్తాను దిగుమతి చేసుకుంది.

30 బిలియన్ డాలర్ల పరిహారం ఇవ్వాలి

కేజీ-డీ6 విషయంలో రిలయన్స్, బీపీపై కేంద్రం క్లెయిమ్

న్యూఢిల్లీ: కేజీ-డీ6 క్షేత్రానికి సంబంధించి ఆపరేటర్లయిన రిలయన్స్ ఇండస్ట్రీస్, బీపీ .. 30 బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని కోరుతూ త్రిసభ్య ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ముందు కేంద్రం వాదనలు వినిపించింది. అవసరమైన దానికంటే ఎక్కువగా మౌలిక సదుపాయాలు నిర్మించడం, సహజ వాయువు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో విఫలం కావడం ఇందుకు కారణాలుగా పేర్కొంది. ఇన్‌స్టాలేషన్లు, ఇంధన మార్కెటింగ్, వడ్డీ కింద అదనంగా అయిన వ్యయాలతో పాటు ఉత్పత్తి చేయని గ్యాస్‌కి కూడా లెక్క గట్టి మొత్తం 30 బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని వివరించింది. అత్యధికంగా నష్టపోయే వర్గం, వీటిని సుప్రీం కోర్టులో సవాలు చేయొచ్చని వివరించాయి. అయితే, ప్రభుత్వం తమ దగ్గర్నుంచి 30 బిలియన్ డాలర్ల పరిహారాన్ని క్లెయిమ్ చేసిందనడం వాస్తవంగా సరికాదని రిలయన్స్ ఒక ప్రకటనలో పేర్కొంది.

రిఫ్రిజిరేటర్లు, ఏసీల ధరలకు రెక్కలు!

- 10 శాతం వరకు పెరిగే అవకాశం
- జనవరి 1 నుంచి కొత్త స్టార్ రేటింగ్ నిబంధనలు

న్యూఢిల్లీ: కూలింగ్ ఉత్పత్తులైన ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు జనవరి 1 నుంచి 5-10 శాతం మధ్య పెరగనున్నాయి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సవరించిన స్టార్ రేటింగ్ నిబంధనలు అమల్లోకి రానుండడంతో ఈ పరిణామం చోటుచేసుకోనుంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో సెప్టెంబర్ 22 నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు 10 శాతం వరకు తగ్గగా.. ఇప్పుడు స్టార్ రేటింగ్ ప్రమాణాల కారణంగా ఆ ప్రయోజనం మొత్తం కనుమరుగు కానుంది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణించడం, కాపర్ ధరలు పెరిగిన కారణంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్ల తయారీ సంస్థలు వ్యయ భారాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో ధరలు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడినట్టు చెబుతున్నాయి. అయితే ఈ చర్య కర్బన ఉద్గారాల తగ్గింపునకు మేలు చేస్తుందని వోల్టాస్, డైకిన్, బ్లూస్టార్, గోద్రేజ్ అప్లయెన్సెస్ పేర్కొన్నాయి.

కరెంటు ఆదా..

సవరించిన బీఈఈ నిబంధనల కింద.. కొత్త 5 స్టార్ రేటింగ్ ఏసీలు 10 శాతం మరింద ఇంధనాన్ని ఆదా చేయనున్నాయని, అదే సమయంలో ఉత్పత్తుల ధరలు 10 శాతం పెరగనున్నాయని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు. కొత్త 5 స్టార్ అన్నది ప్రస్తుత ఉత్పత్తుల కోణంలో నుంచి చూస్తే 6-7 స్టార్ ఇంధన సామర్థ్యానికి సమానంగా ఉంటుందన్నారు. ఇప్పుడున్న 5 స్టార్ ఏసీ, రిఫ్రిజిటేటర్ జనవరి 1 తర్వాత 4 స్టార్‌కు తగ్గిపోనున్నాయి. ఇలా ప్రస్తుత ప్రమాణాల ప్రకారం తయారైన ప్రతీ ఉత్పత్తికి సంబంధించి స్టార్ రేటింగ్ ఒక మెట్టు కిందకు వెళ్లిపోనుంది. ఇంధన రేటింగ్ మార్పు కారణంగా ఏసీల ధరలు 5-7 శాతం మేర, రిఫ్రిజిరేటర్ల ధరలు 3-5 శాతం మేర పెరుగుతాయని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ బిజినెస్ హెడ్ కమల్ నంది తెలిపారు. కరెన్సీ విలువ క్షీణత, కమోడిటీ ధరల పెరుగుదలతో వ్యయాల భారాన్ని కంపెనీలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. కొత్త ఇంధన ప్రమాణాలు అమల్లోకి రానుండడంతో డిమాండ్ ఊపందుకుంటుందని వోల్టాస్ సీనియర్ బిజినెస్ లీడర్ జయంత్ బలాన్ అంచనా వేశారు. ధరల పెరుగుదలకు ముందుగానే డీలర్లు, వినియోగదారులు ఆర్డర్లు పెట్టేందుకు ఆసక్తి చూపించొచ్చన్నారు.

ఇతర ఉత్పత్తులకూ కొత్త ప్రమాణాలు

ఏసీలు, రిఫ్రిజిరేటర్లతోపాటు.. టెలివిజన్లు, ఎల్‌పీజీ గ్యాస్ స్టవ్‌లు, కూలింగ్ టవర్లు, చిల్లర్లకు సైతం కొత్త బీఈఈ స్టార్ రేటింగ్ ప్రమాణాలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

అమెరికాలోని వాషింగ్టన్ మాన్యుమెంట్ వద్ద న్యూ ఇయర్ వేడుకలు

డాలస్‌లోని రియూనియన్ టవర్ వద్ద..

దుబాయ్‌లో ప్రపంచంలోనే ఎత్తైన బుర్జ్ ఖలీఫా..

పట్టపగలుగా మారిన సెంట్రల్ లండన్..

పెన్సిల్వేనియాలోని నాస్‌విల్లేలో..

స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరోలో..

స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో...

దుష్ట శక్తులకు తల వంచేది లేదు

టీఎంసీ వ్యవస్థాపక దినం సందర్భంగా మమతా బెనర్జీ స్పష్టీకరణ

కోల్‌కతా: ప్రజల కోసం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పోరాటం కొనసాగిస్తుందని ఆ పార్టీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. ఈ విషయంలో దుష్ట శక్తుల ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. టీఎంసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం ఎక్స్‌లో ఈ మేరకు పలు పోస్టులు చేశారు. మా, మాతి, మనుష్(తల్లి, భూమి, ప్రజలు)లకు సేవే లక్ష్యంగా టీఎంసీ 1998 జనవరి ఒకటో తేదీన ఆవిర్భవించిందని ఆమె గుర్తు చేశారు. ఇప్పటికీ ప్రతి కార్యకర్త, ప్రతి మద్దతుదారు ఈ లక్ష్య సాధనకే కట్టుబడి పనిచేస్తున్నారని చెప్పారు. పార్టీ కోసం త్యాగాలు చేసిన కార్యకర్తలకు ఆమె నివాళులర్పించారు. అసంఖ్యాక ప్రజల ప్రేమ, ఆశీర్వాదాలే పార్టీకి రక్షగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల మద్దతే తమకు జీవనాధారమని, దేశంలోని ప్రతి వ్యక్తి కోసం జరిగే పోరాటంలో వెనకడుగు వేయదని బెనర్జీ స్పష్టం చేశారు. 'మేం ఏ దుష్ట శక్తులకూ తలవంచబోం. అన్ని రకాల ప్రతీకారాలను పక్కన పెట్టి, సామాన్య ప్రజల కోసం జీవితాంతం పోరాటం కొనసాగిస్తాం' అని మమత ప్రకటించారు. పార్టీపై ప్రేమాదరాలను కురిపించే ప్రతి ఒక్కరికీ టీఎంసీ ఎక్స్‌లో ధన్యవాదాలు తెలిపింది. ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాటాన్ని ఇకపైనా కొనసాగిస్తామని స్పష్టం చేసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను మట్టి కరిపిస్తామని ప్రతినబూనింది. కాంగ్రెస్‌ను వీడిన మమతా బెనర్జీ 1998లో టీఎంసీని స్థాపించారు. బెంగాల్‌లో దశాబ్దాల వామపక్ష పాలనకు గట్టి సవాల్‌గా నిలిచారు. సీపీఎం 34 ఏళ్ల పాలనను అంతం చేసి, మమతా బెనర్జీ 2011లో సీఎం పీఠాన్ని అధిరోహించారు. అప్పటి నుంచి ఏకధాటిగా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. బెంగాల్‌లో పరిణామాలు వేగంగా మారుతున్న వేళ..మరికొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికలు టీఎంసీకి నిర్ణాయకంగా మారనున్నాయి.

డీఆర్‌డీఓ పనితీరు ప్రశంసనీయం

- 'సుదర్శన్ చక్ర' తయారీలో సంస్థ పాత్ర కీలకం
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలు ఆపరేషన్ సిందూర్‌లో నిర్ణయాత్మక పాత్ర పోషించాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడే విషయంలో డీఆర్‌డీఓ అంకితభావం, వృత్తి నిబద్ధతకు ఇదొక ప్రతీక అని ఉద్ఘాటించారు. డీఆర్‌డీఓ 68వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ గురువారం ఢిల్లీలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ భద్రతా కవచమైన 'సుదర్శన చక్ర' తయారీ వెనుక డీఆర్‌డీఓ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. సుదర్శన చక్ర మిషన్ పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు. త్వరలోనే ఈ రక్షణ కవచం మనకు అందుబాటులోకి వస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. 2025లో ఎర్రకోట నుంచి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'మిషన్ సుదర్శన్ చక్ర'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మిషన్‌లో భాగంగా గగనతల రక్షణ కోసం బలమైన వ్యవస్థను డీఆర్‌డీఓ అభివృద్ధి చేస్తోంది. ఆధునిక యుద్ధాల్లో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ చాలా కీలకమన్న సంగతిని ఆపరేషన్ సిందూర్ సమయంలో అందరూ గుర్తించినట్లు రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

డీఆర్‌డీఓను 1958లో ఏర్పాటు చేశారు. అప్పటికే పనిచేస్తున్న టీడీఈలు, డీటీడీపీ, డీఎస్‌ఓను కలిపేసి ఒకే సంస్థగా నెలకొల్పారు. మొదటి 10 ల్యాబ్‌లో ప్రారంభమైన డీఆర్‌డీఓ క్రమంగా ఇంతింతై అన్నట్లుగా ఎదిగింది. ప్రపంచంలో అతిపెద్ద రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థల్లో ఒకటిగా పేరుగాంచింది. భారత సైన్యానికి అవసరమైన ఆయుధాలను అభివృద్ధి చేస్తోంది. కాలానుగుణంగా అత్యాధునిక ఆయుధాలను అందిస్తోంది. వేగంగా మారిపోతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ముందుకెళ్లాలని డీఆర్‌డీఓకు రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. నవీన ఆవిష్కరణలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని కోరారు. అదే సమయంలో రక్షణ పరిశోధనల్లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

సైంటిస్టులు, సిబ్బందికి శుభాకాంక్షలు

డీఆర్‌డీఓ తయారు చేసిన ఆయుధాలు ఆపరేషన్ సిందూర్‌లో అద్భుతంగా పనిచేశాయని, సైనికుల ఆత్మస్థైర్యం పెంచాయని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ఆధునిక టెక్నాలజీ, ఆయుధాలతో సైన్యానికి స్వదేశీ శక్తిని సమకూరుస్తోందని చెప్పారు. డీఆర్‌డీఓ విశ్వసనీయ సంస్థగా మారిందన్నారు. స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలతో కలిసి పనిచేయాలని సూచించారు. డీఆర్‌డీఓ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ ఆర్‌అండ్‌డీ కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్ తదితరులు పాల్గొన్నారు. 2025లో సంస్థ సాధించిన విజయాలు, ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమాల గురించి అధికారులు రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. అనంతరం డీఆర్‌డీఓ సైంటిస్టులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్'కు వారు చేయూత ఇస్తున్నారని, అంకితభావంతో పని చేస్తున్నారని ఉద్ఘాటించారు.

నిమిషానికి 1,336 బిర్యానీలు..

ఆర్డర్లలో నూతన సంవత్సర వేడుక రికార్డు

న్యూఢిల్లీ: దేశంలోని చిన్నాపెద్దా నగరాలు, పట్టణాలు, గ్రామాలు కూడా కొత్త సంవత్సర వేడుకల్లో మునిగిపోయాయి. ఇదంతా ప్రతి సంవత్సరం ఉండేదే. కానీ, ఈసారి మరో రికార్డు నమోదైంది. డిసెంబర్ 31న దేశంలో ప్రజలు నిమిషానికి 1,336 బిర్యానీలు ఆర్డర్ చేశారు. ఆరోజు సాయంత్రం నుంచే ఆర్డర్లు మొదలవ్వగా.. రాత్రి 7:30 గంటల సమయానికే 2,18,993 బిర్యానీలు ఆర్డర్ చేశారు. రాత్రి 8 గంటల సమయానికి నిమిషానికి 1,336 ఆర్డర్లు నమోదయ్యాయి. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ఈ డేటాను ప్రకటించింది. ఇక భువనేశ్వర్‌కు చెందిన ఒక పార్టీ నిర్వాహకుడు ఏకంగా 16 కిలోల బిర్యానీని ఒకే ఆర్డర్ చేశారని వెల్లడించింది. 2025 ఏడాది పొడవునా 930 లక్షల బిర్యానీలు ఆర్డర్ చేశారని, సగటున ప్రతి సెకనుకు 3.25 ఆర్డర్లు నమోదయ్యాయని స్విగ్గీ తెలిపింది. ఒడిసెంబర్ 31తోపాటు సంవత్సరం మొత్తం ఆర్డర్ల లెక్కలు చూస్తే.. భారతీయులకు బిర్యానీపై అంటే ఎంతిష్టమో తెలిసిపోతోంది. ప్రధాన వంటకాల్లో బిర్యానీ ఏకఛత్రాధిపత్యం కొనసాగించగా.. ఆధునిక వంటకాల్లో పిజ్జా, బర్గర్లు పోటీ పడ్డాయి. 31న రాత్రి 8:30 గంటలకల్లా 2.18 లక్షలకు పైగా పిజ్జాలు, 2.16 లక్షలకు పైగా బర్గర్ల ఆర్డర్లు నమోదయ్యాయి. రాత్రయ్యే కొద్దీ.. డెజర్ట్స్ వైపు మొగ్గు చూపారు. రసమలై, క్యారెట్ హల్వా, గులాబ్ జామున్‌లు రాత్రి 10:30 గంటల సమయంలో టాప్ ఫైవ్ ఆర్డర్లలో ఉన్నాయి. బెంగళూరుకు చెందిన ఒక కస్టమర్ ఒకే ఆర్డర్‌లో 100 బర్గర్లను ఆర్డర్ చేశారు. ఇక నాగ్‌పూర్‌కు చెందిన ఒక కస్టమర్ థర్టీ ఫస్ట్‌రోజు ఒక్కరోజే 93 సార్లు ఫుడ్ ఆర్డర్ ఇచ్చారు. సూరత్‌కు చెందిన మరో ఫుడీ.. 22 వేర్వేరు రెస్టారెంట్ల నుంచి ఆర్డర్ చేశారంటే మనోళ్లు ఎంత వెరైటీ కోరుకుంటున్నారో అర్థమవుతోంది.

2025లో దేశంలో 166 పులులు మృతి

గతేడాది కంటే నలభై ఎక్కువ • మధ్యప్రదేశ్‌లోనే 55 మరణాలు

భోపాల్: దేశంలో గతేడాది 166 పులులు మరణించాయి. 2024కంటే పులుల మరణాల సంఖ్య నలభై పెరిగింది. ఇక పులుల రాష్ట్రంగా పిలుచుకునే మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 55 మరణాలు నమోదయ్యాయని, మహారాష్ట్రలో 38, కేరళలో 13, అస్సాంలో 12 పులులు మరణించాయి. మరణించిన ఈ 166 పులులలో 31 పులి పిల్లలే కావడం గమనార్హం. జాతీయ పులుల సంరక్షణ అథారిటీ గణాంకాలను గురువారం వెలువరించింది. ప్రాంతంకోసం పులుల మధ్య జరిగిన పోరాటాలే మరణాలకు ప్రధాన కారణమని నిపుణులు భావిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో2014 నుంచి ఇప్పటివరకూ పులులు 60శాతం పెరిగాయి. ఇది భూభాగం పరంగా గమనిస్తే ఈ పెరుగుదల పెద్దది. జనాభా పెరగడంతో స్థలాల కోసం పోరాడుతూ పులులు చనిపోతున్నాయని చెబుతున్నారు. ప్రపంచంలో మనదేశంలోనే అత్యధిక పులుల జనాభా ఉన్నది. గణాంకాల ప్రకారం ప్రపంచంలోని పులుల జనాభాలో దాదాపు 75 శాతం భారత్‌లోనే ఉన్నాయి. పులుల సంఖ్య 2018లో 2,967 ఉండగా, 2022లో 3,682కి పెరిగింది.

పర్యాటకంతో కొత్త ఏడాదికి స్వాగతం

- పర్యాటక ప్రదేశాల్లో నూతన సంవత్సరాన్ని జరుపుకున్న భారతీయులు
- ప్రార్థనా స్థలాల్లోనూ పోటెత్తిన భక్తులు
- మాల్స్, రిసార్టలలోనూ ఊహించనంత సందడి

న్యూఢిల్లీ: కొంగొత్త ఆశలను మోసుకొచ్చే నూతన ఏడాదికి భారతీయులు తమదైన శైలికి స్వాగతం పలికారు. పలు రకాల సాంస్కృతిక, విభిన్న కార్యక్రమాలతో సర్వాంగ సుందరంగా సిద్ధమైన రిసార్ట్‌లు, మాల్స్‌లో నృత్యాలు చేసి లక్షలాది మంది స్వాగతం పలికితే కోట్లాది మంది తమ ఇష్ట దైవాన్ని ప్రార్థించేందుకు ఆలయాల వద్ద బారులుతీరారు. కొత్త ప్రదేశంలో సరికొత్తగా న్యూఇయర్‌కు స్వాగతం పలికాలనే ఉద్దేశంతో చాలా మంది పర్యాటక ప్రదేశాలకు పాలోమంటూ వెళ్లారు. దీంతో దేశవ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలన్నీ కిక్కిరిసిపోయాయి.

నేతల శుభాకాంక్షలు..

కొత్త ఏడాదిని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ''ప్రతి ఒక్కరికీ 2026 ఏడాది అద్భుతంగా గడవాలి. అందరికీ మంచి ఆయురారోగ్యాలు ప్రాప్తించాలి. లక్ష్యాల సాధనకు మీరు చేసే కృషి ఫలించాలి. సమాజంలో శాంతి సంతోషాలు వెల్లివిరియాలని ప్రార్థిస్తున్నా'' అని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. ''ఆనందాల నూతన సంవత్సరంలో అందరికీ నా హృదయపూర్వక కొత్త ఏడాది శుభాకాంక్షలు. దేశ,విదేశాల్లోని భారతీయులందరికీ ఈ ఏడాది శుభం కలగాలి'' అని రాష్ట్రపతి ముర్ము 'ఎక్స్'లో పేర్కొన్నారు. ''కొత్త ఏడాది వేళ జనులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. గౌరవప్రదంగా జీవించేందుకు, పనిచేసేందుకు, ఓటేసేందుకు అనువైన సమాజం కోసం ఉద్యమించాల్సిన తరుణమిది'' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు.

వేడుకల్లోనూ రాజధానే

దేశరాజధానిగానే కాదు వేడుకలకూ ఢిల్లీ గురువారం రాజధానిగా మారింది. నగరంలోని ప్రతి ఒక్క పర్యాటక ప్రాంతంలో జనం లెక్కలుమిక్కిలి చేరుకుని సరదాగా గడిపారు. వేగంగా గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఢిల్లీ మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో స్టేషన్ల లోపల నుంచి బయటి దాకా చాలా దూరం వరకు క్యూ లైన్లు దర్శనమిచ్చాయి. ఇండియా గేట్, సమీప ప్రాంతాలను చుట్టేసేందుకు వచ్చిన జనంతో సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్‌లో ఇసకేస్తే రాలనంత జనం పోగయ్యారు.

గోవాలో గోలగోల

సాధారణంగానే పర్యాటకానికి చిరునామాగా నిలిచే గోవా ఈసారి సైతం నూతన సంవత్సర సంబరాలకు సరికొత్తగా ముస్తాబైంది. దీంతో పలు రాష్ట్రాల జనం జనం పెద్దసంఖ్యలో గోవాకు చేరుకుని ఆనందంగా గడిపారు. బీచ్‌లు, రెస్టారెంట్‌లు, పబ్‌లు, బార్‌లు, నైట్‌క్లబ్‌లు, రోడ్ల మీద ఎక్కడ చూసినా జనమే కన్పించారు. మ్యూజిక్‌నైట్ పార్టీలు, బాణసంచా వెలుగులు, సంగీత విభావరులు, డ్యాన్స్ కార్యక్రమాలతో ఉత్తర గోవా హోరెత్తిపోయింది.

అన్ని రాష్ట్రాల్లో అందటా సందడే..

క్రైస్తవులు అత్యధికంగా ఉండే మిజోరంలో ప్రజలు చర్చిల్లో ప్రార్థనలతో నూతన ఏడాదికి స్వాగతం పలికారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. న్యూఇయర్ వేడుకలను ఈ రాష్ట్రంలో రెండ్రోజులపాటు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం ఉదయం వర్షం ముంబై వాసులకు కొత్త ఏడాదిలోకి వెల్‌కమ్ చెప్పింది. ఉత్తరప్రదేశ్‌లో ఆలయాల్లో భక్తుల రద్దీ మునుపెన్నడూ లేనంతగా కన్పించింది. ప్రయాగ్‌రాజ్‌లో భక్తులు తెల్లవారుజామునే గజగజ వణికించే చలిలోనూ త్రివేణి సంగమ స్థలిలో పుణ్యస్నానాలు చేసి ఆలయాలను దర్శించుకున్నారు. అయోధ్యలోని బాలరామాలయం భక్తులతో కిటకిటలాడింది. వీఐపీ దర్శన పాస్‌లు హాట్‌కేకులుగా మారాయి. అనూహ్య రద్దీతో ఆలయ కమిటీ స్థానిక భక్తులను మరోరోజు దర్శనానికి రావాలని బ్రతిమాలింది. సుదూరాల నుంచి వచ్చిన భిన్న రాష్ట్రాల భక్తులకు దర్శనభాగ్యం దక్కే అవకాశం ఇవ్వాలని కోరింది. ఒడిశాలో పూరీ జగన్నాథస్వామి ఆలయంలోనూ ఇదే పరిస్థితి కన్పించింది. బిహార్, రాజస్థాన్‌లోనూ ఇవే దృశ్యాలు పునరావృతమయ్యాయి.

బెంగాల్‌లో భిన్నంగా..

బెంగాల్‌లో పర్యాటక ప్రదేశాలు సందర్శకులతో నిండిపోయాయి. అలిపోర్ జూ, ఎకో పార్క్, ఇక్కో పార్క్, విక్టోరియా మెమోరియల్ సహా కోల్‌కతాలోని ప్రతి ప్రాంతంలో జనం గుమిగూడి కొత్త సంవత్సరాన్ని వేడుకలా ఆరంభించారు.

మధ్య, దక్షిణ భారతావనిలో వర్షాలు

జనవరి–మార్చి కాలానికి ఐఎండీ అంచనా

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) విభిన్నమైన అంచనాలను వెలువరించింది. ఈ మూడు నెలల్లో దక్షిణాది రాష్ట్రాలతో పాటు మధ్య భారతంలో వర్షాలు పడతాయని తెలిపింది. పంజాబ్, హరియాణాల్లో మాత్రం చెదురుమదురుగా జల్లులు పడతాయంది. రబీ పంటలపై ఇవి ప్రభావం చూపించే అవకాశం లేదని స్పష్టం చేసింది. ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర గురువారం మీడియా సమా వేశంలో ఈ వివరాలను వెల్లడించారు. బిహార్, విదర్భ ప్రాంతాల్లో మాత్రం ఈ సమయంలో అదనంగా మరో మూడు రోజులపాటు చలి వాతావరణం కొనసాగ నుండగా రాజస్తాన్‌లో మాత్రం చలి ప్రభా వం తగ్గుతుందని పేర్కొన్నారు. దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో జనవరిలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. ఇదే సమయంలో, ఈశాన్య, వాయవ్య, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం సాధారణానికి మించి ఉష్ణోగ్రతలుంటాయని చెప్పారు.

తైవాన్ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటాం

అధ్యక్షుడు లై చింగ్ టె

తైపీ: దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని తైవాన్ అధ్యక్షుడు లై చింగ్–టె స్పష్టం చేశారు. ఆ దేశం చుట్టూ చైనా ఇటీవల లైవ్–ఫైర్ సైనిక కసరత్తులు చేపట్టిన నేపథ్యంలో గురువారం కొత్త సంవత్సర ప్రసంగం సందర్భంగా ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. చైనా విస్తరణవాద కాంక్షనేపథ్యంలో, తైవాన్ ప్రజలకు తమను తాము రక్షించుకునే శక్తి ఉందో, లేదోనని అంతర్జాతీయ సమాజం చూస్తోందన్నారు. జాతీయ రక్షణ, సమాజాన్ని కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సమగ్రమైన రక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంపై అధ్యక్షుడిగా తన వైఖరి స్పష్టమన్నారు. ఒకప్పుడు జపాన్ కాలనీగా ఉన్న తైవాన్ 1949లో చైనాతో జరిగిన అంతర్యుద్ధంలో ఓడిపోవడంతో స్వతంత్ర పాలనలో ఉంది. అయితే చైనా మాత్రం తైవాన్‌ను తన సొంత భూభాగంగా చూస్తుంది. అవసరమైతే దానిని బలవంతంగా స్వాధీనం చేసుకుంటామని పదేపదే బెదిరిస్తుంది. ఈ నేపథ్యంలో లై వ్యాఖ్యలపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు లై, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులు ఎన్ని చెప్పినా, ఏం చేసినా... తైవాన్ చైనాలో భాగమనే వాస్తవాన్ని వారు మార్చలేరని తెలిపింది. తైవాన్‌పై చైనా దాడి చేస్తే టోక్యో జోక్యం చేసుకుంటుందని జపాన్ చేసిన వ్యాఖ్యలు, యూఎస్ ఆయుధ విక్రయాలపై చైనా కొత్త నాయకుడి వ్యాఖ్యలపై బీజింగ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తైవాన్ విలీనాన్ని ఎవ్వరూ ఆపలేరని తాజాగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా వ్యాఖ్యానించారు.

ప్రపంచమంతా శాంతి నెలకొనాలి: పోప్ లియో

రోమ్: నూతన పోప్ లియో 15.. 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మొట్టమొదటి ప్రసంగం చేశారు. ప్రపంచమంతా శాంతి వెల్లివిరియాలని, ముఖ్యంగా సంఘర్షణలతో నిండిన దేశాలతో హింసతో ప్రభావితమైన కుటుంబాల్లో శాంతి నెలకొనాలని ఆయన ప్రార్థించారు. సెయింట్ పీర్స్ బిసిలికాలో కొత్త సంవత్సర ప్రారంభ ప్రార్థన నిర్వహించిన ఆయన.. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. జనవరి 1వ తేదీని చర్చి ప్రపంచ శాంతి దినోత్సవంగా పాటిస్తుందని పేర్కొన్నారు. క్రిస్టమస్ పండుగ ముగియడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈనెల 6న జరగనున్న ఎపిఫనీ పండుగకు ఆయన హాజరుకానున్నారు. ప్రతి 25 సంవత్సరాలకోసారి జరిగే ఈ పండుగకు లక్షలాది మంది రోమ్‌కు తరలివస్తారు. అనంతరం చర్చి సంప్రదింపుల సంప్రదాయాన్ని పునరుద్ధరింపజేసే కాలేజ్ ఆఫ్ కార్డినల్స్‌తో జరిగే రెండు రోజుల సమావేశానికి పోప్ నాయకత్వ వహించనున్నారు.

150 ఏళ్ల నాటి చర్చిలో మంటలు

ఆమ్‌స్టర్‌డామ్: నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్ డామ్‌లోని ఓ పురాతన చర్చిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వొండెల్‌కెర్క్ ప్రాంతంలోని 'అవర్ లేడీ ఆఫ్ రోజరీ చర్చి'లో గురువారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో చర్చి తీవ్రంగా దెబ్బతింది. 1872లో నిర్మితమైన ఈ చర్చి 19వ శతాబ్దపు వాస్తుకళకు నిదర్శనంగా, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. నూతన సంవత్సర వేడుకల సమయంలో కాల్చిన బాణసంచా చర్చి పైకప్పుపై పడటంతో మంటలు చెలరేగినట్లుగా భావిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించి 164 అడుగుల ఎత్తున్న గోపురం కూలిపోయింది. లోపలి భాగం పూర్తిగా ధ్వంసమైంది. చెక్క నిర్మాణం కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఇలా ఉండగా, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మునుపెన్నడూ లేనంతగా పోలీసులు, అత్యవసర సేవల సిబ్బందిపై దాడులు జరిగాయని అధికారులు తెలిపారు. బాణ సంచా, పేలుడు పదార్థాలను పోలీసులపై విసిరి ఘటనలు పెద్ద సంఖ్యలో చోటుచేసుకున్నాయన్నారు. వివిధ ఘటనల్లో ఇద్దరు చనిపోగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రొటర్‌డ్యామ్ ఆస్పత్రిలో కళ్లకు గాయాలతో 10 మంది మైనర్లు సహా 14 మంది చేరారు. బాణసంచా, పేలుడు పదార్థాల వాడకం పెరగడంతో ఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని కొన్ని ప్రాంతాలను అధికారులు ఫైర్‌వర్క్ ఫ్రీ జోన్లుగా ప్రకటించారు. అయినప్పటికీ, జనం ఏమాత్రం జంకలేదని, దిహేగ్‌లో వేకువజాము 3 గంటల వరకు బాణసంచా పేలుళ్లు వినిపించాయని మీడియా పేర్కొంది.

చంపేస్తామని బెదిరించారు

ఫరీదాబాద్‌లో గ్యాంగ్‌రేప్ ఘటనలో కొత్త విషయాలు వెలుగులోకి

ఫరీదాబాద్: హరియాణాలో చోటుచేసుకున్న నిర్భయ తరహా సామూహిక అత్యాచారం ఘటనలో కొత్త విషయాలు వెలుగుచూశాయి. ఫరీదాబాద్‌లో మంగళవారం తెల్లవారుజామున లిఫ్ట్ ఇస్తామని చెప్పి వ్యానులో ఎక్కించుకున్న ఇద్దరు డ్రైవర్లు పాతికేళ్ల యువతిని గ్యాంగ్‌రేప్ చేసి రోడ్డు మీద పడేసిన విషయంతెల్సిందే. రోడ్డు మీద పడేయడానికి ముందు ఆమెను వీలైతే ఆమెను చంపేసేందుకు ప్రయత్నించారని, చంపేస్తామని బాధితురాలిని బెదిరించారన్న కొత్త విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. వివరాలను బాధితురాలి సోదరి గురువారం మీడియాకు వెల్లడించారు. ''అమ్మతో గొడవయ్యాక మా సోదరి.. స్నేహితురాలి ఇంటికెళ్లింది. తిరిగొచ్చేటప్పుడు ఆటో దొరక్క తప్పని పరిస్థితుల్లో వీళ్ల వ్యాన్ ఎక్కింది. మేముండే కళ్యాణ్‌పురిలో దిగబెట్టకుండా గురుగ్రామ్ వెళ్లే రోడ్డులో మూడు గంటలపాటు తిప్పుతూ వ్యాన్‌లో దారుణంగా రేప్‌చేశారు. ఫరీదాబాద్–గురుగ్రామ్ రోడ్డులో హనుమాన్ టెంపుల్ దాటిన తర్వాత వేరే రోడ్డులో పోనిచ్చి ఒకతను పూర్తిగా డ్రైవింగ్ చేయగా మరొకడు రేప్ చేశాడు. ఈ సందర్భంగా చంపేస్తామని బెదిరించారు. మూడింటప్పుడు వేగంగా దూసుకెళ్తున్న వ్యాను నుంచి రోడ్డు మీదకు విసిరేశాక 3.30 గంటలప్పుడు నిద్రిస్తున్న నాకు సోదరి నుంచి ఫోన్ వచ్చింది. అటు నుంచి నిశ్శబ్దం. తర్వాత ఫోన్‌కాల్ కట్ అయింది. వెంటనే తిరిగి ఫోన్ చేశా. వాళ్లతో పోరాడి అలసిపోయిన గొంతుతో ఏడుస్తూ మాట్లాడింది. మూలుగుతున్న శబ్దాలు వినిపించాయి. వెంటనే జాడ పట్టుకుని మా కుటుంబం మొత్తం అక్కడికెళ్లి వెతకడం మొదలెట్టాం. ఎట్టకేలకు ఆమె జాడ కన్పించింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాం. ఆమె అప్పుడు స్పృహలో లేదు. దీంతో డాక్టర్లు ఢిల్లీకి తీసుకెళ్లండని సలహా ఇచ్చారు. సమయంలేక వేరే ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాం'' అని సోదరి ఏడుస్తూ చెప్పారు. ఆమె కాస్తంత స్పృహలో ఉన్నప్పుడే పోలీసులు బాధితురాలి వాంగ్మూలాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, నిందితుల్లో ఒకరిది మధ్యప్రదేశ్‌లోని ఝాన్సీ పట్టణంకాగా, మరొకరిది ఉత్తర ప్రదేశ్‌లోని మథుర పట్టణం. హరియాణా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రావ్‌నరేంద్ర సింగ్ గురువారం ఫరీదాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితురాలిని కలిశారు. ఆమెను పరామర్శించారు. ''ఆమె స్పృహలో లేదు. మాట్లాడే స్థితిలో లేదు. ముఖానికి తీవ్రమైన గాయాలయ్యాయి. హరియాణాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు.

పాక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

యూనివర్సిటీ విద్యార్థులు సహా 15 మంది మృతి

లాహోర్: పాకిస్తాన్‌లో పంజాబ్ ప్రావిన్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఝంగ్ జిల్లా ఫైసలాబాద్ రహదారిపై అడ్డా ఫకీర్ ది కుల్లి ప్రాంతంలో బుధవారం ఈ ఘటన జరిగింది. వెటరినరీ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు బస్సులో లాహోర్‌లో జరిగే ఆటల పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్నారు. వీరి బస్సును ఓ ఇరుకైన మలుపులో ఎదురుగా వేగంగా వస్తున్న వ్యాను ఢీకొట్టింది. ఆ తీవ్రతకు రెండు వాహనాలు నుజ్జయ్యాయి. వర్సిటీ విద్యార్థులు సహా 15 మంది చనిపోయారు. మరో 25 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ట్రాక్టర్ ట్రాలీని ఓవర్ టేక్ చేసే క్రమంలో వ్యాను అదుపు తప్పి బస్సును ఢీకొట్టిందన్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని చెప్పారు.

కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

గుప్త సామ్రాజ్యం

గుప్తుల సమాచారం అనేక సాహిత్య, పురావస్తు ఆధారాల ద్వారా లభిస్తోంది. వీరి కాలంలోని అనేక మంది కవులు గుప్తులకు సంబంధించిన సమాచారాన్ని తమ గ్రంథాల ద్వారా అందించారు. సాహిత్యాధారాలతోపాటు గుప్తులు 42 శాసనాలను జారీ చేశారు. వీటిలో కొన్ని రాజ ప్రశస్తులు కాగా మిగిలినవి దాన శాసనాలు. మొదట కుషాణులకు సామంతులుగా ఉన్న గుప్తులు వారి రాజ్య పతనం తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు.

మౌర్య సామ్రాజ్యం అంతమైన తర్వాత మళ్లీ ఉత్తర భారత దేశాన్ని ఏకం చేసి పాలించిన రాజులు గుప్తులు. కుషాణ రాజ్య శిథిలాలపై క్రీ.శ. 4వ శతాబ్దంలో ఆవిర్భవించిన ఈ రాజ్యం 6వ శతాబ్దం వరకూ కొనసాగింది.

గుప్తుల రాజకీయ చరిత్ర

శ్రీగుప్తుడు

ఇతడు కుషాణుల సామంతుడిగానే పరిపాలన సాగించినట్లు తెలుస్తోంది. అందుకే నాటి సామంత రాజులు, భూస్వాములు ధరించే 'మహారాజ' అనే సాధారణ బిరుదును శ్రీగుప్తుడు ధరించాడు. ఇత్సింగ్ ప్రకారం.. మృగశిఖవనం వద్ద చైనాకు చెందిన బౌద్ధ సన్యాసుల ప్రయోజనార్థం శ్రీగుప్తుడు ఒక దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతేగాక దాని నిర్వహణకు 20 గ్రామాలను కూడా అతడు దానం చేశాడు.

ఘటోత్కచ గుప్తుడు

ఇతడు క్రీ.శ.300 ప్రాంతంలో రాజ్యానికి వచ్చాడు. ఘటోత్కచుడు కూడా తన తండ్రి శ్రీగుప్తుడిలాగే ఒక సామంతరాజుగానే పరిపాలించాడు. ఇతడు తన కుమారుడైన మొదటి చంద్రగుప్తుడికి లిచ్ఛవీల రాకుమార్తె కుమారదేవితో వివాహం జరిపించాడు. తద్వారా గుప్త రాజ్య పటిష్టతకు కృషి చేశాడు.

మొదటి చంద్రగుప్తుడు

ఇతడు తన తాత, తండ్రిలా 'మహారాజ' అనే బిరుదుతో కాకుండా 'మహారాజాధి రాజు'గా ప్రసిద్ధుడయ్యాడు. గుప్తవంశంలో తొలి స్వతంత్ర రాజుగా ఇతడిని భావించాలి. మొదటి చంద్రగుప్తుడు క్రీ.శ.320లో గుప్త శకాన్ని ప్రారంభించాడు. తన భార్య తరపు నుంచి మగధ రాజ్యాన్ని పొందాడు. అందుకే తన నాణేలన్నింటిపై తన భార్య



కుమారదేవి చిత్రంతో పాటు లిచ్ఛవీ వంశస్తుల పేర్లనూ ముద్రించాడు. గుప్త సామ్రాజ్య విస్తరణను చంద్రగుప్తుడే ప్రారంభించాడు.

సముద్ర గుప్తుడు

సముద్ర గుప్తుడు రాజ్యానికి రాకముందు..'కచ' అనే మరో గుప్త రాకుమారుడు ఈ రాజ్యాన్ని పాలించినట్లు కొన్ని నాణేల ద్వారా తెలుస్తోంది. సముద్రగుప్తుడు ఈ వంశంలో అందరి కంటే గొప్పరాజు. గుప్తుల జైత్రయాత్రను ఆసేతు హిమాచలం కొనసాగించాడు. సముద్రగుప్తుడి విజయాలపై ఇతడి ఆస్థాన కవి హరిసేనుడు ప్రయాగ ప్రశస్తి (అలహాబాద్ ప్రశస్తి)ని జారీ చేశాడు. దక్షిణాపథాన్ని పాలించే 12మంది రాజులను సముద్రగుప్తుడు జయించాడు. తర్వాత వారినే తన సామంతులుగా నియమించుకున్నాడు. ఆర్యావర్తాన్ని పాలించే 8 మంది రాజులను ఓడించి వారి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత నేపాల్, బెంగాల్, అస్సాం మొదలైన సరిహద్దు రాజ్యాలను జయించాడు. అనేక ఆటవిక రాజ్యాలూ సముద్ర గుప్తుడికి దాసోహమన్నాయి. ఆ తర్వాత దైవపుత్ర షహానుషాహీలు, శక మురుండులు,సింహళీయులూ ఇతడి సార్వభౌమత్వాన్ని స్వచ్ఛందంగా అంగీకరించారు. సముద్రగుప్తుడిలో సైనిక సామర్థ్యంతో పాటు,కవితా గుణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇతడికి 'కవిరాజు' అనే బిరుదు ఉంది. తన విజయాలకు గుర్తుగా సముద్ర గుప్తుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. పులిని వేటాడుతున్నట్లు, వీణను సాధన చేస్తున్నట్లు ఉండే చిహ్నాలతో పలు నాణేలు జారీ చేశాడు. అప్రతిరథ, సర్వరాజాచ్ఛేత, అశ్వమేధ పరాక్రమ, వ్యాఘ్ర పరాక్రమ.. తదితర బిరుదులు ఇతడికి ఉన్నాయి.

రెండో చంద్రగుప్తుడు

ఇతడికి విక్రమాదిత్య, నరేంద్రచంద్ర, సింహచంద్ర, సింహ విక్రమ.. తదితర బిరుదులున్నాయి. విశాఖదత్తుని 'దేవీచంద్రగుప్తం' అనే గ్రంథం ప్రకారం.. రెండో చంద్రగుప్తుడు తన అన్న రామగుప్తుడిని వధించి సింహాసనాన్ని ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఇతడు సౌరాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలను తన సామ్రాజ్యంలో విలీనం చేశాడు. దీంతో పశ్చిమాసియాతో పెద్ద ఎత్తున వ్యాపార-వాణిజ్యాలు నిర్వహించే అవకాశం కలిగింది. రెండో చంద్రగుప్తుడు.. తన కుమార్తె ప్రభావతీ గుప్తను వాకాటక రెండో రుద్రసేనుడికిచ్చి వివాహం చేశాడు. ఇతడు తన సైనిక విజయాలను చంద్ర అనే పేరుతో మెహ్రౌలీ ఇనుప స్తంభ శాసనాన్ని జారీచేశాడు. తన తండ్రి సముద్రగుప్తుడిలాగే రెండో చంద్రగుప్తుడు కూడా అనేక బంగారు నాణేలు జారీ చేశాడు. సింహాన్ని వధిస్తున్నట్లుగా, చేతిలో పుష్పాన్ని ధరించినట్లుండే చిహ్నాలతో ఇతడు బంగారు నాణేలు జారీ చేశాడు. ఇతడు ఉజ్జయినీని తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులున్నట్లు ప్రతీతి.

కుమార గుప్తుడు

తన సోదరుడు గోవింద గుప్తుడితో వారసత్వ తగాదాల అనంతరం ఇతడు రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ.415 నుంచి క్రీ.శ.455 వరకు దాదాపు 40 ఏళ్ల పాటు ఇతడు గుప్త సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కుమారగుప్తుడు జారీచేసిన 1,400 నాణేలు మహారాష్ట్రలోని సామంద్ అనే ప్రాంతంలో బయటపడ్డాయి. తాను నిర్వహించిన అశ్వమేధ యాగానికి గుర్తుగా.. సముద్రగుప్తుడిలాగే ఇతడు కూడా అశ్వమేధ నాణేలు జారీ చేశాడు. కుమారు గుప్తుడు.. మహేంద్రాదిత్య, అశ్వమేధ మహేంద్ర అనే బిరుదులతో నాణేలు జారీ చేశాడు. మయూర వాహనంపై కార్తికేయుడి చిత్రంతో బంగారు నాణేలు ముద్రించాడు.

స్కంద గుప్తుడు

ఇతడు విక్రమాదిత్యుడు అనే బిరుదును ధరించాడు. వారసత్వ యుద్ధాల్లో పురు గుప్తుడిని ఓడించి రాజ్యానికి వచ్చాడు. జునాగఢ్, భిటారి ప్రశస్తుల్లో.. స్కందగుప్తుడు తన శత్రువుల గురించి పేర్కొన్నాడు. హూణులపై ఇతడు సాధించిన విజయాల వల్ల 50 ఏళ్లపాటు గుప్త సామ్రాజ్యానికి హూణుల నుంచి ప్రమాదం తొలగిపోయింది.

బుధ గుప్తుడు

బుధ గుప్తుడి కాలంలో గుప్తసామ్రాజ్య పతనం ప్రారంభమైంది. ఇతడి తర్వాత భానుగుప్తుడు, నరసింహ గుప్త, బాలాదిత్యుడు, 3వ కుమారగుప్తుడు, విష్ణుగుప్తుడు పాలించారు. గుప్తవంశ పాలన క్రీ.శ. 550లో అంతమైంది.

మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య మంజుశ్రీ మూలకల్ప' గ్రంథం ప్రకారం బౌద్ధులను హింసించిన గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు బి) కచ గుప్తుడు
సి) నరసింహ బాలాదిత్యుడు
డి) విష్ణు గుప్తుడు
2. భూమిపై ఉన్న సమస్త రాజులను ఓడించినట్లు ఎరాన్ ప్రశస్తిలో పేర్కొన్న రాజు?
ఎ) మొదటి చంద్రగుప్తుడు
బి) రెండో చంద్రగుప్తుడు
సి) సముద్రగుప్తుడు డి) స్కంద గుప్తుడు
3. గుప్తుల అధికారిక చిహ్నం?
ఎ) పులి బి) గరుడ
సి) వీణ డి) సింహం
4. కామరూపలో సముద్రగుప్తుడి ప్రతినిధిగా నియమితుడైన రాజు?
ఎ) భాస్కర వర్మన్ బి) సూర్య వర్మన్
సి) పుష్య వర్మన్ డి) గృహ వర్మన్
5. సముద్రగుప్తుడికి కానుకలు పంపిన గాంధార రాజు?
ఎ) కిదార బి) చిరాతదత్త
సి) సిద్ధార్థ డి) నరసింహన్
6. రోమ్‌కు రాయబార బృందాన్ని పంపిన గుప్తరాజు?
ఎ) పురు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) కుమార గుప్తుడు డి) బుధ గుప్తుడు
7. బోధ్‌గయలో సింహళ విహారాన్ని నిర్మించిన శ్రీలంక రాజు?
ఎ) శ్రీ మార విజయోత్తుంగ వర్మ
బి) శ్రీ మేఘవర్మ సి) విజయబాహు
డి) కుమార బాహు
8. తాను వీణ వాయిస్తున్నట్లుగా బంగారు నాణేలను జారీ చేసిన రాజు..?
ఎ) కుమార గుప్తుడు
బి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
సి) సముద్ర గుప్తుడు డి) శ్రీ గుప్తుడు
9. కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు
బి) నరసింహ గుప్తుడు
సి) మొదటి చంద్రగుప్తుడు
డి) రెండో చంద్రగుప్తుడు
10. అశ్వమేధ నాణేలు జారీ చేసిన గుప్తరాజు?
ఎ) విష్ణు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) కుమార గుప్తుడు డి) బి, సి
11. సముద్ర గుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్' అని పిలిచినవారు ?
ఎ) సర్ విలియం జోన్స్
బి) వి.ఎ.స్మిత్ సి) హెచ్.సి. రామచౌదరి
డి) కె.పి. జయస్వాల్
12. రెండో చంద్రగుప్తుడి చేతిలో హతుడైన శకరాజు?
ఎ) రెండో రుద్రసేనుడు
బి) మూడో రుద్రసేనుడు
సి) రెండో రుద్రసింహుడు
డి) మూడో రుద్రసింహుడు
13. సాహసాంక, శకారి అనే బిరుదులున్న గుప్త రాజు?
ఎ) మొదటి చంద్రగుప్తుడు
బి) రెండో చంద్రగుప్తుడు
సి) సముద్ర గుప్తుడు డి) కుమార గుప్తుడు
14. నవ రత్నాలు ఏ రాజు ఆస్థాన కవులు?
ఎ) సముద్రగుప్తుడు బి) కచ గుప్తుడు
సి) రెండో చంద్రగుప్తుడు డి) బుధ గుప్తుడు
15. రెండో చంద్రగుప్తుడి కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు?
ఎ) ఇత్సింగ్ బి) పాన్‌చావో
సి) హుయాన్‌చాంగ్ డి) ఫాహియాన్
16. ఖడ్గమృగాన్ని సంహరిస్తున్నట్లుగా నాణేలు జారీ చేసింది?
ఎ) కుమార గుప్తుడు బి) 2వ చంద్రగుప్తుడు
సి) సముద్రగుప్తుడు
డి) మొదటి చంద్రగుప్తుడు
17. సుదర్శన తటాకానికి మరమ్మతులు నిర్వహించినట్లు శాసనం జారీ చేసింది?
ఎ) స్కంద గుప్తుడు బి) కుమార గుప్తుడు
సి) పురు గుప్తుడు డి) బుధ గుప్తుడు
18. హూణుల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్న గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు బి) నరసింహ గుప్తుడు
సి) స్కంద గుప్తుడు డి) బి, సి
19. వంద రాజులకు అధిపతిగా ప్రశస్తుడైన గుప్త రాజు?
ఎ) స్కంద గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) మొదటి చంద్రగుప్తుడు
డి) రెండో చంద్రగుప్తుడు
20. సముద్రగుప్తుడి పాలనలో హరిసేనుడు అధిష్ఠించిన పదవి?
ఎ) మహాదండ నాయకుడు
బి) కుమారామాత్యుడు
సి) సంధి విగ్రాహకుడు
డి) పైవన్నీ
21. గుప్తుల కాలంలో రాష్ట్ర పాలకులను ఎలా పిలిచేవారు?
ఎ) విషయపతి బి) ఉపారిక
సి) కుమారామాత్య
డి) అమాత్యా
22. గుప్తుల కాలంలో భూమి శిస్తు ఎంత?
ఎ) 1/6వ వంతు
బి) 1/4వ వంతు
సి) 1/4 నుంచి 1/6వ వంతు
డి) 1/8వ వంతు
23. గుప్తుల కాలంనాటి అధికారులను సరిగా జతపరచండి?

A) టిలుపతి	1) గజదళ అధ్యక్షుడు
B) పుష్టపాల	2) భూ విక్రయాల రికార్డులు
C) దివిర	3) లేఖకుడు
D) శౌల్కిక	4) సుంకాల వసూలు అధికారి

	A)	B)	C)	D)
ఎ)	1	2	3	4
బి)	2	1	4	3
సి)	4	3	2	1
డి)	3	4	1	2

24. గుప్తుల కాలంలో ఉపారికార, హిరణ్య అనేవి?
ఎ) పన్నులు బి) అధికారులు
సి) భూమి కొలబద్ధలు డి) నాణేలు
25. గుప్తుల కాలంలో గుజరాత్ నుంచి మాందసోర్‌కు వలస వెళ్లిన వ్యాపార సంఘం ఏ వృత్తికి సంబంధించింది?
ఎ) కుండల తయారీ
బి) సిల్క్ తయారీ
సి) దంతపు వస్తువుల తయారీ
డి) ఇనుప వస్తువుల తయారీ

సమాధానాలు

1) బి; 2) సి; 3) బి; 4) సి; 5) ఎ; 6) బి; 7) బి; 8) సి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) బి; 14) సి; 15) డి; 16) ఎ; 17) బి; 18) డి; 19) ఎ; 20) డి; 21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) బి.

సూర్యుడి వయసు సుమారుగా?

సౌర కుటుంబం - భూమి

సౌర కుటుంబంలో సూర్యుడు, ఎనిమిది గ్రహాలు, ఉపగ్రహాలు, లఘు గ్రహాలు ఉంటాయి. సూర్యుడు మనకు అతి దగ్గరలో ఉన్న నక్షత్రం. ఎనిమిది గ్రహాల్లో భూమి ఒకటి. సూర్యగోళం భూమి కంటే 1.3 మిలియన్ రెట్లు పెద్దది. సూర్యుడి ఉపరితలంపై 6000°c, కేంద్రంలో 1,000,000°c ఉష్ణోగ్రత ఉంటుంది.

నక్షత్రాలు స్వయం ప్రకాశకాలు. కొన్ని కోట్ల నక్షత్రాల సముదాయాన్ని 'పాలపుంత' అంటారు. దీన్నే పాలవెల్లి, ఆకాశగంగ అని కూడా అంటారు.

మొత్తం గ్రహాల సంఖ్య - 8. గ్రహాల్లో బుధుడు సూర్యుడికి అతి చేరువలో ఉంటాడు. తర్వాత వరుసగా శుక్రుడు, భూమి, కుజుడు, గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలున్నాయి. **గ్రహాలను రెండు భాగాలుగా విభజించారు. అవి..**

1) అంతర్ గ్రహాలు 2) బాహ్య గ్రహాలు

అంతర గ్రహాలు: బుధుడు, శుక్రుడు, భూమి, కుజుడు.

బాహ్య గ్రహాలు: గురుడు,శని, యురేనస్, నెప్ట్యూన్.

గమనిక: 2006లో ప్రేగ్‌లో జరిగిన అంతర్జాతీయ ఖగోళ శాస్త్రవేత్తల సదస్సులో ప్లూటోను గ్రహాల జాబితా నుంచి తొలగించి డ్వార్ఫ్ (మరుగుజ్జు) గ్రహంగా ప్రకటించారు.

భూమి.. సూర్యుడి నుంచి 149.5 మిలియన్ కి.మీ. దూరంలో ఉంది. సూర్యకాంతి భూమిని చేరడానికి 8 నిమిషాల సమయం పడుతుంది. భూమి ఉపగ్రహం చంద్రుడు. భూమికి, చంద్రుడికి మధ్య దూరం సుమారు 3,84,365 కి.మీ.లు. సౌర కుటుంబం పుట్టుక గురించి అనేక ప్రతిపాదనలు ఉన్నాయి. అవి:

సిద్ధాంతకర్త	సిద్ధాంతం
చాంబర్లీన్,	గ్రహాల పరికల్పన
మౌల్టన్‌లు	సిద్ధాంతం
కాంట్	గ్యాసియస్ మాస్ థియరీ
లాప్లేస్	నెబ్యులార్ థియరీ
జీన్స్, జెఫ్రీ	టైడల్ సిద్ధాంతం
రస్సెల్, లిటిల్‌టన్	బైనరీ స్టార్ హైపోథీసిస్

భూచలనాలు - వాటి ఫలితాలు

భూమికి రెండు చలనాలున్నాయి. ఒకటి భూభ్రమణం, రెండోది భూపరిభ్రమణం. భూమి తన అక్షంపై తన చుట్టూ తాను పశ్చిమం వైపు నుంచి తూర్పునకు గంటకు 1610 కి.మీ. వేగంతో తిరుగుతుంది. భూమి తన చుట్టూ తాను తిరగడాన్ని భూభ్రమణం అంటారు.

భూమి తన చుట్టూ తాను తిరిగేటప్పుడు ఉత్తరాన ఒక బిందువు, దక్షిణాన ఒక బిందువు స్థిరంగా ఉంటాయి. ఉత్తరాన ఉన్న స్థిర బిందువును ఉత్తర ధ్రువమని, దక్షిణాన ఉన్న స్థిర బిందువును దక్షిణ ధ్రువమని అంటారు. భూభ్రమణం వల్ల రాత్రి, పగలు ఏర్పడతాయి.

ఉత్తర,దక్షిణ ధ్రువాలను కలుపుతూ భూ నాభి ద్వారా గీసిన ఊహారేఖను'అక్షం'అంటారు. భూమి తన అక్షంపై తాను తిరిగేటప్పుడు సూర్యుడికి ఎదురుగా ఉన్న అర్ధగోళంపై సూర్యకాంతి పడి పగలు, మిగిలిన అర్ధ గోళంలో రాత్రి ఏర్పడుతుంది.

భూమి ఒకసారి తన చుట్టూ తాను తిరిగి రావడానికి 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్లు అంటే 24 గంటలు లేదా ఒక రోజు పడుతుంది. భూభ్రమణం వల్ల రేయింబవళ్లు ఏర్పడడమే కాకుండా పవనాలు, సముద్ర ప్రవాహాల మార్గాల్లో మార్పులు సంభవిస్తాయి. సముద్రంలో రోజుకి రెండుసార్లు పోటుపాట్లు కలగడానికి భూభ్రమణమే కారణం.

భూమి తన అక్షంపై తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరిగి రావడాన్ని 'భూ పరిభ్రమణం' అంటారు. భూమి సూర్యుడి చుట్టూ తిరిగే నిర్ణీత మార్గాన్ని 'కక్ష్య' అంటారు. ఈ కక్ష్య దీర్ఘ వృత్తాకారంలో ఉంది. దీని పొడవు 965 కి.మీ. భూ పరిభ్రమణానికి ఒక సంవత్సర కాలం అంటే 365 1/4 రోజుల సమయం పడుతుంది.

సాధారణంగా సంవత్సరంలో 365 రోజులుంటాయి. అయితే మిగిలిన 1/4 రోజును (6 గం॥లను) నాలుగు సంవత్సరాలకు ఒకసారి కలిపి 366 రోజులుగా లెక్కిస్తారు. ఈ సంవత్సరాన్ని 'లీపు సంవత్సరం' అంటారు. అందువల్ల లీపు సంవత్సరంలో 366 రోజులుంటాయి. భూ పరిభ్రమణం వల్ల పగలు, రాత్రి వేళలో తేడాలు ఉంటాయి. రుతువులు ఏర్పడతాయి.

సూర్యుడి నుంచి అతి తక్కువ దూరంలో ఉండే భూమి స్థానాన్ని పరిహేళి అంటారు. సూర్యుడి నుంచి భూమికి కనిష్ట దూరం 147 మిలియన్ కి.మీ. ఈ పరిహేళి జనవరి 3న సంభవిస్తుంది.

సూర్యుడి నుంచి ఎక్కువ దూరంలో ఉండే భూమి స్థానాన్ని 'అపహేళి' అంటారు.ఈ అపహేళి జూలై 4న సంభవిస్తుంది. సూర్యుడి నుంచి భూమికి గరిష్ట దూరం 152 మిలియన్ కి.మీ. భూమి అక్షం వంగి ఉండడం, భూమధ్యరేఖ నుంచి ధ్రువాల వైపు వెళ్లే కొద్దీ అక్షాంశాల నిడివి తగ్గడం వంటి కారణాలతో రాత్రింబవళ్లలో వ్యత్యాసం ఏర్పడుతుంది. భూమి అక్షం భూకక్ష్య మీది క్షితిజ లంబం నుంచి $23\ ^1/_2$°లు వంగి ధ్రువ నక్షత్రానికి ఎదురుగా ఉంటుంది.

భూమి తన చుట్టూ తాను పడమర నుంచి తూర్పునకు తిరగడం వల్ల సూర్యుడు తూర్పున ఉదయించి పడమర అస్తమిస్తాడు. అదేవిధంగా ధ్రువాల వద్ద భూభ్రమణ వేగం – 0. భూమి అక్షం $23\ ^1/_2$° వంగి ఉండడంతోపాటు భూమి.. సూర్యుడి చుట్టూ పరిభ్రమించడం వల్ల రుతువులు ఏర్పడతాయి. భూమి అక్షం వంగి ఉండక నిటారుగా ఉన్నట్లయితే సూర్యుడు ఎప్పుడూ భూమధ్య రేఖకు లంబంగానే ఉండేవాడు. దీనివల్ల భూమిపై ప్రాంతాలన్నీ సంవత్సరం పొడవునా ఒకే రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉండేవి. ఇప్పటిలాగా రుతువులు ఏర్పడేవి కాదు.

సూర్యుడు మకరరేఖ నుంచి ఉత్తరానికి పయనించడం ప్రారంభిస్తే ఉత్తరాయనమని, సూర్యుడు కర్కటరేఖ నుంచి దక్షిణాభిముఖంగా పయనించడం ప్రారంభించినప్పటి నుంచి దక్షిణాయనమని అంటారు.

చంద్రుడు తన చుట్టూ తాను తిరగడానికి, భూమి చుట్టూ తిరగడానికి ఒకే సమయం తీసుకుంటున్నందువల్ల మనం చంద్రుడిని ఒకే వైపు చూడగలుగుతున్నాం. చంద్రుడు తన చుట్టూ తాను తిరగ



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్-కంటెంట్ (ఎస్ఏ)/ఎస్‌జీటీ

డానికి, భూమి చుట్టూ తిరగడానికి 27 1/3 రోజులు సమయం పడుతుంది.

గ్రహణాలు

సూర్యుడి చుట్టూ భూమి, భూమి చుట్టూ చంద్రుడు తిరిగేటప్పుడు.. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖ మీదకు వచ్చినప్పుడు గ్రహణాలు ఏర్పడతాయి. ఈ గ్రహణ కాలంలో సూర్యుడిపైన, చంద్రుడిపైన నీడ పడినట్లు కనిపిస్తుంది. సూర్యుడి కిరణాలు చంద్రుడి మీద పడకుండా భూమి అడ్డు వచ్చినప్పుడు 'చంద్రగ్రహణం' ఏర్పడుతుంది.

భూమి ఎప్పుడూ సూర్యుడి ఎదురుగా ఉండి మిగతా సగం సూర్యకిరణాలు పడక చీకటిగా ఉంటుంది. అంటే భూమి మిగతా సగం తన నీడ భాగం. ఈ నీడ భాగాన్ని 'ప్రచ్ఛాయ'అని, నీడ చుట్టూ ఉన్న భాగాన్ని 'పాక్షిక ఛాయ' అని అంటారు.

చంద్రుడు ప్రచ్ఛాయలోకి వచ్చినప్పుడు 'చంద్ర గ్రహణం' ఏర్పడుతుంది. ఇది పౌర్ణమి రోజు వస్తుంది. చంద్రుడి కక్ష్యతలం భూ కక్ష్య తలానికి 5°9 నిమిషాల కోణంలో ఉన్నందువల్ల భూ కక్ష్య తలానికి బాగా పైన లేదా కింద ఉన్నప్పుడు అన్ని పౌర్ణమి దినాల్లో చంద్రగ్రహణం ఏర్పడుతుంది.

సూర్యుడు కనిపించకుండా భూమికి చంద్రుడు అడ్డు వస్తే అప్పుడు 'సూర్యగ్రహణం' ఏర్పడుతుంది. సూర్యగ్రహణం అమావాస్య రోజుల్లో వస్తుంది. సూర్యుడు, చంద్రుడు, భూమి ఒకే సరళ రేఖ మీద ఉన్నప్పుడు చంద్రబింబం సూర్యకాంతి ఆవరణాన్ని కప్పినట్లు కనిపిస్తుంది. అప్పుడు నేరుగా చంద్రుడి నీడలో ఉన్న భూ భాగంలో 'సంపూర్ణ సూర్య గ్రహణం' ఏర్పడుతుంది.

అక్షాంశాలు - రేఖాంశాలు

ఉత్తర, దక్షిణ ధ్రువాలకు సమాన దూరంలో, భూమి మధ్య, భూమి చుట్టూ గీసిన ఊహారేఖను 'భూమధ్యరేఖ' అంటారు. ఇది భూమిని రెండు గోళాలుగా విభజిస్తుంది. భూమధ్యరేఖకు ఉత్తరాన ఉండే గోళాన్ని 'ఉత్తరార్ధ గోళమని', దక్షిణాన ఉండే గోళాన్ని 'దక్షిణార్ధ గోళమని' అంటారు.

భూమి చుట్టూ ఉత్తర, దక్షిణ ధ్రువాల వరకు గీసిన ఊహారేఖలను 'అక్షాంశాలు' అని అంటారు. ఇవి వృత్త రేఖలు. భూమిని మొత్తం 1° అంతరంతో మొత్తం 180 అక్షాంశాలుగా విభజించారు. భూమధ్యరేఖను కలుపుకుంటే మొత్తం 181. భూమధ్య రేఖ 0°ల అక్షాంశం కాగా, ఉత్తర ధ్రువం 90° ఉత్తర అక్షాంశం, దక్షిణ ధ్రువం 90° దక్షిణ అక్షాంశం. భూమధ్యరేఖనే 'గ్రేట్ సర్కిల్' అంటారు.

అక్షాంశాలని 'సమాంతర రేఖలు' అని కూడా అంటారు. వీటిలో పెద్ద అక్షాంశం భూమధ్యరేఖ. అక్షాంశాల వల్ల ఒక ప్రదేశం శీతోష్ణస్థితిని తెలుసుకోవచ్చు. అక్షాంశాలు ధ్రువాల వద్ద బిందువులుగా ఉంటాయి. అక్షాంశాలన్నీ ఊహారేఖలే. అక్షాంశాలన్నీ తూర్పు, పడమరలుగా వ్యాపించి ఉన్నాయి. అంటే అడ్డంగా సమాంతరంగా ఉన్నాయి. ఒక అక్షాంశం 111 కి.మీ.లకు సమానం. అదేవిధంగా రెండు వరుస అక్షాంశాల మధ్య దూరం 111 కి.మీ.

$23^1/_2$°ల ఉత్తర అక్షాంశరేఖను కర్కటరేఖ అని, $23^1/_2$°ల దక్షిణ అక్షాంశ రేఖను మకర రేఖ అని అంటారు. $66^1/_2$° ఉత్తర అక్షాంశాన్ని 'ఉత్తర ధ్రువ వలయం' అని, $66^1/_2$° దక్షిణ అక్షాంశాన్ని 'దక్షిణ ధ్రువ వలయం' అని అంటారు.

సూర్య కిరణాలు భూమిపై $23^1/_2$° ఉత్తర అక్షాంశం, $23^1/_2$° దక్షిణ అక్షాంశ రేఖల మధ్య ఉండే ప్రదేశాల మీద లంబంగా పడతాయి. ఈ రెండు రేఖలకు బయటి ప్రదేశాల్లో ఎప్పుడూ లంబంగా పడవు. ఈ రెండు అక్షాంశ రేఖలనే ఇతర రేఖాంశాలను గుర్తించేందుకు సూచికగా పరిగణిస్తారు. దీన్నే '0°' లేదా 'గ్రీనిచ్ మెరిడియన్' అంటారు.

భూమధ్యరేఖను ఖండిస్తూ ధ్రువాలను కలుపుతూ భూమి చుట్టూ లంబంగా గీసిన వృత్తాలను 'రేఖాంశాలు' అంటారు. వీటిని 'అర్ధ వృత్తాలు, మధ్యాహ్న రేఖలు' అని పిలుస్తారు. రేఖాంశాల వల్ల వివిధ ప్రదేశాల్లోని కాలంలో తేడాలను గుర్తించవచ్చు. రేఖాంశాలు ధ్రువాల వద్ద కేంద్రీకృతం అవుతాయి. రేఖాంశాలన్నీ కూడా ఊహారేఖలే.

రేఖాంశాలన్నీ ఉత్తర, దక్షిణాలుగా వ్యాపించి ఉన్నాయి. అంటే నిలువుగా లంబంగా ఉన్నాయి. రేఖాంశాలు మొత్తం 360. గ్రీనిచ్ రేఖకు తూర్పుగా 180° వరకు 180 తూర్పు రేఖాంశాలు, పశ్చిమంగా 180°వరకు 180 పశ్చిమ రేఖాంశాలు ఉన్నాయి.

రేఖాంశంపై ఉన్న అన్ని ప్రదేశాల్లోనూ ఒకేసారి 'మధ్యాహ్నం' అవుతుంది. కాబట్టి రేఖాంశాలను 'మధ్యాహ్న రేఖలు' అంటారు. భూమధ్య రేఖ నుంచి ధ్రువాల వైపునకు పోయే కొద్దీ రేఖాంశాల మధ్య దూరం తగ్గుతుంది. ధ్రువాల వద్ద రేఖాంశాలన్నీ కలుస్తాయి. అక్కడ వాటి మధ్య దూరం '0' అవుతుంది.

లండన్ సమీపంలోని గ్రీనిచ్ ఖగోళ పరిశోధన కేంద్రం మీదుగా వెళ్లే రేఖాంశాన్ని 'ప్రామాణిక రేఖాంశం'గా తీసుకున్నారు.

గ్రీనిచ్ రేఖకు, 180° తూర్పు రేఖాంశానికి మధ్య ఉన్న భూభాగాన్ని 'పూర్వార్ధ గోళం' అని, గ్రీనిచ్ రేఖకు, 180°ల పశ్చిమ రేఖాంశానికి మధ్య ఉన్న భూభాగాన్ని 'పశ్చిమార్ధ గోళం' అని అంటారు. భూమి 1° రేఖాంశం తిరగడానికి 4 నిమిషాల సమయం పడుతుంది. భూమిపై ఒక ప్రాంత ఉనికిని తెలుసుకోవడానికి అక్షాంశాలు, రేఖాంశాలు ఉపయోగపడతాయి. 180°ల తూర్పు రేఖాంశం, 180° పశ్చిమ రేఖాంశం ఒకటే రేఖాంశం అవుతుంది.ఈ రేఖాంశాన్నే'అంతర్జాతీయ దినరేఖ' అంటారు. ఇది పసిఫిక్ సముద్రం ద్వారా పోతుంది.

రేఖాంశంపై పగలు సూర్యుడు నడినెత్తిన ప్రకాశించినప్పుడు 12 గంటలుగా తీసుకొని నిర్ణయించిన కాలాన్ని 'స్థానిక కాలం' అంటారు. ఒక ప్రాంతానికి, ఒక దేశానికి ప్రామాణిక రేఖాంశాన్ని నిర్ణయించి దీనిపై ఉన్న స్థానిక కాలాన్ని ఆ ప్రాంత 'ప్రామాణిక కాలం' అంటారు. గ్రీనిచ్ స్థానిక కాలాన్నే 'ప్రపంచ ప్రామాణిక కాలం'గా పరిగణిస్తున్నారు. సముద్రయానం చేసేవారి నౌక ఏ రేఖాంశంపై ఉందో తెలుసుకోవడానికి 'క్రోనోమీటర్' అనే పరికరాన్ని ఉపయోగిస్తారు.

సూర్యుడు ఉత్తరార్ధ గోళంలో ఉండే ఆరు నెలల కాలంలో ఉత్తర ధ్రువ వలయం అంటే $66^1/_2$°ల ఉత్తర అక్షాంశంపైన ఉన్న భూభాగంలో 24 గంటలు పగలు ఉంటుంది. అదే సమయంలో దక్షిణ ధ్రువ వలయం అంటే $66^1/_2$°ల దక్షిణ అక్షాంశంపైన ఉన్న భూభాగంలో 24 గంటలు రాత్రి ఉంటుంది. సూర్యుడు దక్షిణార్ధ గోళంలో ఆరు నెలల కాలంలో ఉత్తర ధ్రువ వలయం 24 గంటలు చీకటిలో ఉంటే, దక్షిణ ధ్రువ వలయం 24 గంటలు వెలుతురులో ఉంటుంది.

$82^1/_2$°ల తూర్పు రేఖాంశాన్ని ప్రమాణంగా తీసుకొని భారత్ ప్రామాణిక కాలాన్ని నిర్ణయిస్తారు. ఈ రేఖాంశం అలహాబాద్ ద్వారా వెళ్తుంది. మన రాష్ట్రంలో కాకినాడ ద్వారా పోతుంది. గ్రీనిచ్ ప్రామాణిక కాలం కంటే మనదేశ ప్రామాణిక కాలం $5\ ^1/_2$ గంటల ముందు ఉంటుంది.

అత్యధిక కాల మండలాలు కలిగిన దేశం రష్యా. సూర్యుడు ఉత్తరార్ధ గోళంలో ఉన్నప్పుడు, ఉత్తర ధ్రువ ప్రాంతంలో జూన్‌లో కొన్ని రోజులు సూర్యుడు రోజుకీ 20 గంటలకు పైగా కనిపించడాన్ని 'అర్ధరాత్రి సూర్యుడు' అంటారు. నార్వేను 'ల్యాండ్ ఆఫ్ మిడ్‌నైట్ సన్'గా పేర్కొంటారు. సూర్యుడు అన్ని దేశాల కంటే ముందుగా జపాన్‌లో ఉదయిస్తాడు. అందుకే జపాన్‌ని 'ల్యాండ్ ఆఫ్ రైజింగ్ సన్' అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. సూర్యుడి ఆకర్షణ శక్తి.. భూమి ఆకర్షణ శక్తికి ఎన్నిరెట్లు అధికంగా ఉంటుంది?
1) 32 2) 28 3) 22 4) 36
2. సూర్యుడి వయసు సుమారుగా?
1) 3 మిలియన్ సంవత్సరాలు
2) 8 మిలియన్ సంవత్సరాలు
3) 5 బిలియన్ సంవత్సరాలు
4) 10 బిలియన్ సంవత్సరాలు
3. అత్యల్ప సాంద్రత గల గ్రహం?
1) గురుడు 2) శుక్రుడు
3) బుధుడు 4) శని
4. అత్యధిక పరిభ్రమణ కాలం గల గ్రహం?
1) శుక్రుడు 2) శని
3) నెప్ట్యూన్ 4) యురేనస్
5. ఏ గ్రహాలకు ఉపగ్రహాలు లేవు?
1) బుధుడు, శుక్రుడు
2) శుక్రుడు, కుజుడు
3) కుజుడు, గురుడు
4) నెప్ట్యూన్, బుధుడు
6. పవనాల మార్గాలు, సముద్ర ప్రవాహ మార్గాల్లో మార్పులు వేటివల్ల సంభవిస్తాయి?
1) రుతువులు 2) భూ పరిభ్రమణం
2) భూ భ్రమణం 4) గ్రహణాలు
7. భూభ్రమణం గంటకు ఎంత వేగం?
1) 1610 కి.మీ. 2) 1016 కి.మీ.
3) 1601 కి.మీ 4) 1616 కి.మీ.
8. భూకక్ష్య పొడవు?
1) 695 కి.మీ. 2) 956 కి.మీ
3) 965 కి.మీ. 4) 659 కి.మీ.
9. పరిహేళి ఎప్పుడు సంభవిస్తుంది?
1) జూలై 4 2) జనవరి 4
3) జనవరి 3 4) జూలై 3
10. చంద్రుడి కక్ష్యతలం.. భూమి కక్ష్యతలానికి ఎన్ని డిగ్రీల కోణంలో ఉంది?
1) 9°ల 5 నిమిషాలు 2) 8°ల 9 నిమిషాలు
3) 5°ల 9 నిమిషాలు
4) 9°ల 4 నిమిషాలు
11. పరిహేళి దశలో భూమి, సూర్యుడికి —— మి.కి.మీ. దూరంలో ఉంటుంది?
1) 152 2) 150 3) 147 4) 137
12. సూర్యుడికి.. భూమి అతి దగ్గరగా ఏ రోజు వస్తుంది?
1) జనవరి – 3 2) జూలై 4
3) మార్చి – 21 4) సెప్టెంబర్ – 23
13. అక్షాంశ – రేఖాంశాలను ఆధారం చేసుకొని మానవ చరిత్ర రచనకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన శాస్త్రవేత్త?
1) అరిస్టాటిల్ 2) హోమర్
3) స్ట్రాబ్ 4) టాలమీ
14. అంతర్జాతీయ దినరేఖ ఏ జలసంధి ద్వారా వెళ్తుంది?
1) బేరింగ్ 2) పాక్
3) పనామా 4) సూయజ్ కాలువ
15. కర్కటరేఖ మనదేశంలోని ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళ్తుంది?
1) 3 2) 5 3) 8 4) 9
16. భూమిని మూడు పొరలుగా విభజించిన శాస్త్రవేత్త?
1) సుయెస్ 2) వెజ్‌నర్
3) వాండర్‌గ్రాచ్ 4) ఎవాన్స్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 1; 6) 3; 7) 1; 8) 3; 9) 3; 10) 3; 11)3 ; 12) 1; 13) 4; 14) 1; 15) 3; 16) 1.

రాజ్యం తలరాతను మార్చిన సంస్కరణల వరదాత

సాలార్‌జంగ్ సంస్కరణలు

సాలార్‌జంగ్ ఆర్థిక సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించి రాజ్యం ఆర్థిక పరిస్థితి చక్కదిద్దాడు. సాలార్‌జంగ్ ప్రధాని కావడానికి ముందు పన్ను వసూళ్లను వేలం పద్ధతిలో గుత్తేదారులకు అప్పగించేవారు. వీరు ప్రజల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేసేవారు. వారిని నిర్దాక్షిణ్యంగా దోచుకునేవారు. గుత్తేదారులు ప్రభుత్వ అధికారులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని ప్రభుత్వ ఖజానాకు పన్నులు కట్టేవారు కాదు. సాలార్‌జంగ్ ఈ పద్ధతులను రద్దు చేశాడు. మొదటగా పన్ను వసూళ్లపై అదుపు కలిగిన దఫ్తాదార్‌ల అధికారాలు తగ్గించాడు. పన్ను వసూలు చేసే గుత్తేదారుల స్థానంలో నెల జీతంపై పనిచేసే తాలుకాదారులను నియమించాడు. ఈ రెండు విధానాల వల్ల రాజ్యానికి ఆదాయం పెరిగింది. దీంతో తనఖా పెట్టిన రాష్ట్ర ప్రభుత్వ ఆభరణాలను సాలార్‌జంగ్ విడిపించాడు.

సాలార్‌జంగ్ తక్కువ వడ్డీతో కొత్త రుణాలు సేకరించి రాజ్య రుణభారాన్ని తగ్గించాడు. నాణేల సంస్కరణల్లో భాగంగా హైదరాబాద్‌లో కేంద్ర ద్రవ్య ముద్రణాలయాన్ని స్థాపించాడు. గద్వాల, నారాయణపేటలోని జిల్లా ద్రవ్య ముద్రణాలయాలను దీని పరిధిలోకి తీసుకువచ్చాడు. 1854లో 'హాలిసిక్కా' అనే నూతన నాణేన్ని ప్రవేశపెట్టాడు. ఈ నాణెం విలువ బ్రిటిష్ రూపాయి కంటే 15 రెట్లు ఎక్కువ.

పాలనా సంస్కరణలు

సాలార్‌జంగ్ కంటే ముందు పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని సుబాలుగా విభజించారు. సుబాలను సర్కారులుగా, వాటిని తాలుకాలుగా వర్గీకరించారు. సుబాలో సుబేదార్, తాలుకాలో తాలుకాదార్ అనే అధికారులు పాలనా వ్యవహారాలను నిర్వహించేవారు. తాలుకాదార్ బ్రిటిష్ ఇండియాలోని కలెక్టర్‌తో సమానం. తాలుకాలో పన్ను వసూలు చేసే అధికారాన్ని ప్రభుత్వం తాలుకాదారులకు ఇచ్చింది. వీరికి ఎలాంటి జీత భత్యాలు ఉండేవి కాదు. రైతుల నుంచి పన్ను వసూలు చేసి అందులో కమీషన్ తీసుకునేవారు. పై అధికారులకు నజరానా(లంచం) చెల్లించి కొంతమంది తాలుకాదార్ పదవి పొందేవారు. ఈ విధంగా పదవి పొందినవారు పన్ను వసూలు కోసం 'నాయిబ్' (డిప్యూటీ తాలుకాదార్) అనే అధికారులను నియమించుకునేవారు. తాలుకాదారులు మాత్రం హైదరాబాద్ నగరంలో ఉండేవారు. ఈ విధానంలో లోపాలు ఉండటంతో హైదరాబాద్‌లోని బ్రిటిష్ రాజ ప్రతినిధి చార్లెస్ మెట్‌కాఫ్ తాలుకాదారులను పర్యవేక్షించడానికి బ్రిటిష్ అధికారులను నియమించాడు. అతడు హైదరాబాద్ నుంచి వెళ్లిన తర్వాత బ్రిటిష్ అధికారుల స్థానంలో 'అమిన్' అనే స్థానికాధికారులను నియమించారు.

- ✶ సాలార్‌జంగ్ పన్ను వసూలు కోసం 1855లో తాలుకాదారులను నియమించాడు.

నాలుగో అసఫ్ జా 'నసీరుద్దౌలా' 1853 మే 31న 'తురాబ్ అలీఖాన్'ను హైదరాబాద్ రాజ్య ప్రధాన మంత్రిగా నియమించాడు. ఇతడికి 'సాలార్‌జంగ్' అనే బిరుదు ప్రదానం చేశాడు. సాలార్‌జంగ్.. రాజ్యంలో అనేక సామాజిక, ఆర్థిక, న్యాయపాలనా సంస్కరణలుప్రవేశపెట్టి రాజ్యాన్ని అభివృద్ధి పథంలో నడిపాడు. 1883లో మరణించే వరకూ ప్రధాని పదవిలో కొనసాగాడు. నసీరుద్దౌలా (1829–57), అఫ్జల్ ఉద్దౌలా (1857–69), మీర్ మహబూబ్ అలీఖాన్ (1869–1911)ల కొలువులో పనిచేశాడు. హైదరాబాద్ ప్రధానుల్లోకెల్లా అత్యంత సమర్థుడిగా పేరు గడించాడు.

- ✶ 1865లో జిలాబందీ విధానాన్ని ప్రవేశపెట్టి రాజ్యాన్ని 17 జిల్లాలుగా విభజించాడు. ప్రతి జిల్లాలో పాలనా బాధ్యతలను నిర్వహించడానికి సాలార్‌జంగ్ 'అవల్ తాలుకాదార్'ను నియమించాడు. ఇతడికి బ్రిటిష్ ఇండియాలోని జిల్లా కలెక్టర్‌తో సమాన విధులు ఉండేవి. అవల్ తాలుకాదార్‌కు సహాయంగా 'దోయం తాలుకాదార్' (సబ్ కలెక్టర్)లను నియమించాడు. వీరికి తోడ్పడటానికి సోయం తాలుకాదార్ అనే మూడో తరగతి ఉద్యోగులు కూడా ఉండేవారు. వీరికి బ్రిటిష్ ఇండియాలోని తహశీల్దార్లతో సమాన అధికారాలు ఉండేవి.
- ✶ హైదరాబాద్ రాజ్యంలోని జిల్లాలను కలిపి అయిదు ప్రాంతీయ విభాగాలుగా ఏర్పాటు చేశారు. ప్రతి ప్రాంతీయ విభాగాన్ని పాలించడానికి ఒక సదర్ తాలుకాదార్‌ను నియమించారు. ఇతడికి బ్రిటిష్ ఇండియాలోని రెవెన్యూ కమిషనర్‌తో సమాన అధికారాలు ఉండేవి.

భూమిశిస్తు: రాజ్యంలో ప్రధాన ఆదాయ వనరు భూమిశిస్తు. తర్వాతి స్థానాల్లో ఆబ్కారీ పన్నులు, వాణిజ్య పన్నులు ఉండేవి. వీటితోపాటు స్థానిక జమీందారులు, రాజులు చెల్లించే పేష్కష్ ఇతర ఆదాయ వనరుగా ఉండేది. పేష్కష్ అంటే స్థానిక రాజులు లేదా సామంతరాజులు చెల్లించే కప్పం.

రాజ్యమంతటా రైత్వారీ విధానం అమల్లో ఉండేది. మునగాల, అమరచింత, గద్వాల లాంటి జమీందారీ సంస్థానాలు కూడా చాలా ఉండేవి. ప్రతి గ్రామంలో పటేల్ అనే అధికారి ఉండేవాడు. వీరు వంశపారంపర్యంగా అధికారం చెలాయించేవారు. గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడటానికి 'పౌజుదారీ పటేల్' అనే ఉద్యోగి ఉండేవాడు. గ్రామంలో లెక్కలు చేసే వ్యక్తిని పట్వారీ లేదా పాండే అని పిలిచేవారు. దేశ్‌ముఖ్, దేశ్‌పాండేల నాయకత్వంలో గ్రామాలను కొన్ని సర్కిళ్లుగా విభజించారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

- ✶ సాలార్‌జంగ్ ప్రజలకు సమర్థమైన న్యాయ పాలన అందించడానికి న్యాయస్థానాలను సంస్కరించాడు. జిల్లాల్లో ఉన్న న్యాయస్థానాల్లో మున్సిఫ్, మీర్ ఆదిల్ అనే న్యాయాధికారుల్ని నియమించాడు. వీరిపై హైదరాబాద్‌లోని హైకోర్టు (మహ్‌కాయ–ఇ– సదర్)కు అధికారం ఉండేది.
- ✶ హైకోర్టుకు పైన అప్పీలు చేయడానికి 'మజ్లిస్–ఇ–మురఫా' పేరుతో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశాడు.
- ✶ హైదరాబాద్‌లో బుజుంగ్ దివానీ అదాలత్, కుర్ద్ దివానీ అదాలత్ అనే రెండు సివిల్ కోర్టులు స్థాపించాడు. పౌజుదారీ అదాలత్ అనే క్రిమినల్ కోర్టును కూడా ఏర్పాటు చేశాడు.
- ✶ ముస్లిం చట్టం 'షరియత్' ఆధారంగా ప్రధాన న్యాయమూర్తి 'నాజిమ్' తీర్పు చెప్పేవాడు.
- ✶ వివిధ కోర్టుల కార్యక్రమాలను సమన్వయపరచడానికి ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

పోలీసు వ్యవస్థ

1865కు ముందు హైదరాబాద్ రాష్ట్రంలో సరైన పోలీసు వ్యవస్థ లేదు. కొత్వాల్ అనే నగర పోలీసు కమిషనర్ ఉండేవాడు. కాలక్రమంలో రెవెన్యూ అధికారులే పోలీసు విధులను నిర్వహించారు. గ్రామాల్లో వంశ పారంపర్యంగా వచ్చే గ్రామ కాపాలాదార్ల పద్ధతి ఉండేది.

- ✶ సాలార్‌జంగ్ పోలీసు సంస్కరణల్లో భాగంగా 'మహ్‌కామ–ఇ–కొత్వాలి' అనే పోలీసు డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. నిజామత్ అనే పేరుతో పోలీసు దళాన్ని కూడా ఏర్పాటు చేశాడు.
- ✶ పోలీసు సూపరింటెండెంట్‌ను మహ్‌తామీన్‌గా, ఇన్‌స్పెక్టర్‌ను 'అమీన్'గా వ్యవహరించేవారు. పోలీసు స్టేషన్లను 'చౌకీ'లు అని పిలిచేవారు.
- ✶ 1867లో సాలార్‌జంగ్ పోలీసు, రెవెన్యూ శాఖలను వేరు చేశాడు.

ఇతర సంస్కరణలు

- ✶ హైదరాబాద్ రాజ్యంలో సతీ సహగమనాన్ని నిషేధించాడు.
- ✶ 1856లో హైదరాబాద్‌లో మొదటిసారిగా పారిశ్రామిక వస్తు ప్రదర్శన(నుమాయిష్) ఏర్పాటు చేశాడు.
- ✶ 1862లో పోస్టల్ శాఖను స్థాపించి హైదరాబాద్ నుంచి బొంబాయికి టెలిగ్రాఫ్ లైన్‌ను వేయించాడు.
- ✶ సాలార్‌జంగ్ అనేక మంది స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పించాడు. ఉత్తర భారతదేశానికి చెందిన చాలామంది ముస్లింలు, కాయస్థులు హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారు. వీరిలో సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామి, సయ్యద్ అలీ బిల్ గ్రామి, మోహిబ్ హుస్సేన్, సయ్యద్ మహ్మద్ అలీ, మొహిన్ ముల్క్ తదితరులు పరిపాలనలో సాలార్‌జంగ్‌కు సహకరించారు.
- ✶ చాలా మంది స్థానికేతరులను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడం వల్ల తర్వాతి కాలంలో స్థానికులు, స్థానికేతరుల మధ్య వివాదాలు తలెత్తాయి. ఇది ముల్కీ ఉద్యమానికి దారితీసింది.

1857లో సిపాయిల తిరుగుబాటు సమయంలో బ్రిటిష్ ప్రతినిధి కల్నల్ డేవిడ్‌సన్‌కు సాలార్‌జంగ్ సహాయం చేశాడు. తుర్రేబాజ్‌ఖాన్‌ను, మౌల్వీ అల్లాఉద్దీన్‌లను అరెస్ట్ చేసి హైదరాబాద్ రాజ్యంలో 1857 సిపాయిల తిరుగుబాటును అణచివేశాడు. సాలార్‌జంగ్ నిర్విరామ కృషి వల్ల 1860లో ధారాశివ్, రాయచూర్ జిల్లాలు తిరిగి నిజాంకు దక్కాయి. బీరారు ప్రాంతాన్ని కూడా తిరిగి దక్కించుకునేందుకు కృషి చేశాడు. బీరారును తిరిగి పొందడం కోసం బ్రిటిష్ రాణితో చర్చలు జరపడానికి ఇంగ్లండ్ వెళ్లాడు. దీంతో బ్రిటిష్ ఇండియాలోని గవర్నర్‌లు ఇతడి పట్ల శత్రుత్వం వహించారు. వికార్–ఉల్–ఉమార్‌ను మహబూబ్ అలీఖాన్‌కు సహరాజ ప్రతినిధిగా నియమించారు. బీరారును తిరిగి పొందడానికి సాలార్‌జంగ్ చేసిన ప్రయత్నాలు లార్డ్ లిట్టన్‌ను ఇబ్బంది పెట్టాయి. సిపాయిల తిరుగుబాటులో సహాయం చేసినందుకు హైదరాబాద్ నిజాం అఫ్జల్ ఉద్దౌలాకు బ్రిటిషర్లు 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదును ఇచ్చారు. హైదరాబాద్ రాజ్యం ఈస్ట్ ఇండియా కంపెనీకి బాకీపడ్డ రూ. 50 లక్షల అప్పును రద్దు చేశారు.

1883 ఫిబ్రవరి 8న సాలార్‌జంగ్ మరణించాడు. అతడి మరణానంతరం రాజ్య పాలన అస్తవ్యస్తమైంది. ముల్కీ, నాన్ ముల్కీ వివాదాలు తలెత్తాయి. దీనివల్ల పరిపాలనలో పూర్తిగా స్తబ్ధత ఏర్పడింది. బ్రిటిష్ ప్రభుత్వం సాలార్‌జంగ్ కుమారుడైన మీర్ లాయక్ అలీఖాన్‌ను, రాజా నరేంద్ర బహదూర్‌ను రాష్ట్రానికి సంయుక్త పాలకులుగా నియమించింది.

సాలార్‌జంగ్ కుమారుడైన మీర్ లాయక్ అలీఖాన్.. ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్‌తో కలిసి చదువుకున్నాడు. ఇతడే 1884లో రెండో సాలార్‌జంగ్ బిరుదుతో హైదరాబాద్ రాజ్యానికి ప్రధానమంత్రి అయ్యాడు.

విద్యా సంస్కరణలు

- ❖ పరిపాలనలో సహాయం చేయడం కోసం సుశిక్షితులైన ఉద్యోగులను నియమించేందుకు అనుగుణంగా విద్యా విధానంలో అనేక మార్పులు ప్రవేశపెట్టాడు.
- ❖ 1855లో దార్–ఉల్–ఉలూమ్ అనే ఉన్నత పాఠశాలను రాజ్యంలో ఏర్పాటు చేశాడు. ఈ పాఠశాల స్థాపన పాశ్చాత్య విద్యాబోధనలో తొలిమెట్టుగా చెప్పొచ్చు. ఈ పాఠశాలలో పర్షియన్, ఉర్దూ భాషల్లోనే కాకుండా ఆంగ్ల భాషలోనూ బోధించేవారు.
- ❖ 1869లో సాలార్‌జంగ్, మీర్ మహబూబ్ అలీఖాన్‌కు సహ రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. ఆంగ్ల భాషా బోధన, పాశ్చాత్య విద్యావ్యాప్తికి అనేక పాఠశాలలు నెలకొల్పాడు.
- ❖ 1870లో హైదరాబాద్‌లో నగర ఉన్నత పాఠశాల, 1872లో చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలను స్థాపించాడు. ప్రజా పనుల శాఖలో పనిచేయడానికి కావాల్సిన సాంకేతిక సిబ్బంది శిక్షణ కోసం 1870లో ఇంజనీరింగ్ పాఠశాల నెలకొల్పాడు.
- ❖ పాలకుల పిల్లల కోసం 1873లో 'మదరసా–ఇ–అలియా' స్థాపించాడు.
- ❖ రాజ కుటుంబంలోని పిల్లలు చదుకోవడం కోసం కోసం 1878లో మదరసా–ఇ–ఐజాను ప్రారంభించాడు.
- ❖ అలీఘర్‌లో విద్యాసంస్థల్ని స్థాపించడానికి సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్‌కు ఆర్థిక సహాయం అందజేశాడు. హైదరాబాద్‌కు చెందిన వికార్–ఉల్–ముల్క్, మొహసిక్–ఉల్–ముల్క్ అనే ఇద్దరు అధికారులు అలీఘర్ కాలేజీ ఏర్పాటులో చురుగ్గా పాల్గొన్నారు.
- ❖ 1881లో గ్లోరియా గర్ల్స్ హైస్కూల్‌ను ఏర్పాటు చేశాడు.
- ❖ సాలార్‌జంగ్ మరణించాక 1887లో చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలను 'మదరసా–ఇ–అలియా'లో విలీనం చేసి నిజాం కాలేజీని ఏర్పాటు చేశారు.

రవాణా సంస్కరణలు

- ✶ 1863లో హైదరాబాద్ నుంచి షోలాపూర్ వరకు గ్రాండ్ ట్రంక్ రోడ్డు నిర్మించాడు.
- ✶ బ్రిటిషర్లు మద్రాసు – బొంబాయి మధ్య రైల్వే లైన్‌ను హైదరాబాద్ రాజ్య భాగాలైన గుల్బర్గా, వాడి ద్వారా పోయేవిధంగా నిర్మించారు.
- ✶ 1874లో హైదరాబాద్, వాడి మధ్య రైల్వే నిర్మాణం ప్రారంభించి 1878లో పూర్తి చేశాడు. దీంతో రాజ్యంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడ్డాయి.
- ✶ పరిపాలనా భారం విపరీతంగా పెరగడంతో సాలార్‌జంగ్ 'సదర్–ఉల్–మహామ్' అనే నలుగురు మంత్రులను నియమించాడు. వీరిలో ముగ్గురు మంత్రులకు కొత్తగా ఏర్పాటు చేసిన పోలీసు, రెవెన్యూ, న్యాయశాఖలను అప్పగించాడు. విద్య, ఆరోగ్య శాఖలకు ఉమ్మడిగా నాలుగో మంత్రిని నియమించాడు. వీరందరూ ప్రధానమంత్రి (దివాను) నేతృత్వంలో పనిచేసేవారు.

The telephone is an example of..

BANK EXAMS

COMPUTER KNOWLEDGE

1. What is the responsibility of the logical unit in the CPU of a computer?
   a) Producing result
   b) Comparing numbers
   c) Controlling flow of information
   d) Performing mathematical operations
   e) Controlling flow of data
2. Abacus was the first ___
   a) Electronic computer
   b) Mechanical computer
   c) Electronic calculator
   d) Mechanical calculator
   e) Electronic chip
3. If in a computer, 16 bits are used to specify address in a RAM, the number of addresses will be ___
   a) 216 b) 65,536
   c) 64K d) 128K
   e) 135K
4. Instructions and memory address are represented by ___
   a) Character code
   b) Binary codec) Binary word
   d) Parity bit e) Bite code
5. The terminal device that functions as a cash register, computer terminal and OCR reader is:
   a) Data collection terminal
   b) OCR register terminal
   c) Video Display terminal
   d) POS terminal
   e) None of the above
6. A set of flip flops integrated together is called ____
   a) Counter b) Adder
   c) Register d) Flip flop
   e) All of the above
7. People often call ______ as the brain of computer system.
   a) Control Unit
   b) Arithmetic Logic Unit
   c) Central Processing Unit
   d) Storage Unit e) Store data
8. Which of the following is used for manufacturing chips?
   a) Bus b) Control unit
   c) Semiconductors
   d) a and b only
   e) None of the above
9. The value of each bead in heaven is ____
   a) 1 b) 3 c) 5 d) 7 e) 8
10. The first computer introduced in Nepal was ___
    a) IBM 1400 b) IBM 1401
    c) IBM 1402 d) IBM 1406
    e) IBM 1405
11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
    a) 30 feet b) 30 yards
    c) 30 miles d) 300 miles
    e) 3000 miles
12. The telephone is an example of a(n)____ signal.
    a) analog b) digital
    c) modulated d) demodulated
    e) compiler
13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is:
    a) Internal modem
    b) External modem
    c) PC Card modem
    d) Wireless modem
    e) Wired modem
14. A modem that is contained within the system unit is called:
    a) External b) Internal
    c) Wireless d) Wi-Fi
    e) Bluetooth
15. A modem that doesn't need to be connected to a telephone line is the ___ modem.
    a) external b) internal
    c) wireless d) DSL e) NSL
16. A special high-speed line used by large corporations to support digital communications is known as:
    a) satellite/air connection service lines
    b) cable modems
    c) digital subscriber lines
    d) T1, T2, T3 and T4 lines
    e) None of the above
17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
    a) ISDN b) microwave
    c) cable modem
    d) DSL e) ALU
18. The capacity of a communication channel is measured in ___
    a) Bandwidth b) Bit capacity
    c) Baud rate d) Data flow
    e) Store data
19. A relatively new technology that allows wireless connectivity:
    a) Bluetooth b) Black tooth
    c) Blue band d) Broadband
    e) Wi- fi
20. In MS-DOS 5.0, which is the number that acts as a code to uniquely identify the software product?
    a) MS b) DOS
    c) MS DOS d) 5.0 e) 4.2.0
21. A page fault:
    a) Is an error in a specific page
    b) Occurs when a program accesses a page of memory
    c) Is an access to a page not currently in memory
    d) None of the above
    e) All of the above
22. The process of transferring data intended for a peripheral device into a disk or intermediate store so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ___.
    a) Multiprogramming
    b) Spooling c) Caching
    d) Virtual programming
    e) Code programming
23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling:
    a) Procedure b) Macro
    c) Label d) Literal
    e) External
24. Banker's algorithm for resource allocation deals with:
    a) Deadlock prevention
    b) Deadlock avoidance
    c) Deadlock recovery
    d) Mutual exclusion
    e) Data recovery
25. The state of a process after it encounters an I/O instruction is ____.
    a) Ready b) Blocked/ Waiting
    c) Idle d) Running e) Compiling
26. The number of processes compl-eted per unit time is known as__.
    a) Output b) Throughput
    c) Efficiency d) Capacity
    e) Input
27. Which of the following file name extension suggests that the file is Backup copy of another file?
    a) TXT b) COM
    c) BAS d) BAK e) BAT

KEY:

1) b; 2) d; 3) b; 4) b; 5) d; 6) c; 7) c; 8) c; 9) c; 10) b 11) a; 12) a; 13) c; 14) b; 15) c; 16) d; 17) d; 18) a; 19) a; 20) d; 21) c; 22) b; 23) b; 24) b; 25) b; 26) b; 27) d.

Types of Computer

On the basis of working principle there are three types of computers.

a) Analog Computer

An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical or hydraulic quantities to model the problem being solved.

1. Thermometer
2. Speedometer
3. Petrol Pump Indicator
4. Multi meter

b) Digital Computer

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.

c) Hybrid Computer (Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

On the basis of Size..

a) Super Computer

It is the fastest computer. Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations and nuclear energy research and petroleum exploration.

The major difference between a supercomputer and a mainframe is that a supercomputer channels all its power into executing a few programs as fast as possible, whereas a mainframe uses its power to execute many programs concurrently.

b) Mainframe Computer

A very large and expensive computer capable of supporting hundreds and even thousands of users simultaneously. In the hierarchy that starts with a simple microprocessor (**Eg:** in watches) at the bottom and moves to supercomputers at the top, mainframes are just below supercomputers. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. But supercomputers can execute a single program faster than a mainframe.

c) Mini Computer

In size and power, minicomputers lie between workstations and mainframes. In the past decade, the distinction between large minicomputers and small mainframes has blurred, however, as has the distinction between small minicomputers and workstations. But in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.

d) Micro Computer

i. Desktop Computer: A personal or micro-mini computer sufficient to fit on a desk.

ii. Laptop Computer: A portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.

iii. Palmtop Computer/ Digital Diary/ Notebook / PDAs: A hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.

e) Workstations

It is a terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a "server" or "mainframe."

Major brands of the computer:

a) IBM/ IBM Compatible Computers
b) Apple/ Macintosh.